# నాల్నాలుగుల పదహారు

నలుగురు కథకుల పదహారు కథలు


కన్నెగంటి అనసూయ
సమ్మెట ఉమాదేవి
వడలి రాధాకృష్ణ
అరిపిరాల సత్యప్రసాద్




# నాల్నాలుగుల పదహారు

(నలుగురు రచయితల పదహారు కథలు)

**కన్నెగంటి అనసూయ**

**సమ్మెట ఉమాదేవి**

**వడలి రాధాకృష్ణ**

**అరిపిరాల సత్యప్రసాద్**

**మిత్ర ప్రచురణలు**

హైదరాబాద్

2013

నాల్నాలుగుల పదహారు – నలుగురు రచయితల పదహారు కథలు
కన్నెగంటి అనసూయ, సమ్మెట ఉమాదేవి, వడలి రాధాకృష్ణ, అరిపిరాల సత్యప్రసాద్

Naalnalugula Padahaaru - A collection of stories by Kanneganti Anasuya,
Sammeta Umadevi, Vadali Radhakrishan & Aripirala Satyaprasad

ప్రథమ ముద్రణ : డిసెంబర్, 2013

ప్రతులకు :
Kanneganti Anasuya
Flat No. 406, Vindhya-4
Jaybharathi Gardens
Y. Junction, Kukatpally,
Hyderabad - 500018

అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు

e–పుస్తకాలకు : www.kinige.com

కవర్ డిజైన్ : మహి బెజవాడ, కావలి
ఫోన్ : 9440012373

డిటీపి & ప్రింటింగ్ :
శ్రీలక్ష్మి ప్రెస్, అరండల్‌పేట, గుంటూరు
ఫోన్ : 0863–2230643

వెల : రూ. 150/–

©రచయితలవి

కన్నెగంటి అనసూయ : 9246541249
సమ్మెట ఉమాదేవి : 9849406722
వడలి రాధాకృష్ణ : 9985336444
అరిపిరాల సత్యప్రసాద్ : 9966907771

# మా మాట

తెలుగు కథ నూరేళ్ల మైలురాయిని దాటి మరో శతాబ్దంలోకి మలి అడుగులు వేసిన సంవత్సరం ఇది. ఈ వందేళ్ళ కాలంలో తెలుగు కథ అనేక కొత్త పుంతలు తొక్కింది. ఎన్నో కొత్త పోకడలు పోయింది. వస్తుపరంగా చూసినా, శైలీ శిల్పాలను చూసినా తెలుగు కథా ప్రవాహం ఎప్పటికప్పుడు కొత్తదారులు వెతుకుతూనే వుంది. ఇది కేవలం రచయితల కృషి వల్లనే సాధ్యమయ్యేది కాదు. ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని ఆదరించే పాఠకుల అభిరుచి కూడా ఇందుకు మూలకారణం. అయితే పాఠకులు క్రమంగా పుస్తకానికి, మరీ ముఖ్యంగా కాల్పనిక సాహిత్యానికి దూరం అవుతున్నారని ఈ మధ్య తరచుగా ప్రచారం జరుగుతోంది. ఇది నిజమేనా? ఈ ప్రశ్న ఓ నలుగురు రచయితలను కలిసి మాట్లాడుకునేలా చేసింది.

రచయితలుగా మేము తెలుగు సాహిత్యంలో అనేక రకాల సాహితీ ప్రక్రియలలో కృషిచేసి వున్నాము. కథలు, కవితలు, నవలలు, వ్యాసాలు, విమర్శలు, సినిమా రచన, బాల సాహిత్యం ఇలా అనేక ప్రక్రియలలో సాహితీసృజన చేసిన అనుభవం నలుగురికీ వుంది. మా చర్చలలో తేలిన విషయం ఏమిటంటే – ఏ కాలమైనా, ఎలాంటి మార్పులు జరిగినా తెలుగు పాఠకుడు తప్పక ఆదరించే కాల్పనిక సాహితీ ప్రక్రియ కథేనని, పంచతంత్ర కథల నుండి పసలపూడి కథల దాకా మంచి కథలు వచ్చిన ప్రతిసారీ తెలుగు పాఠకులు చదివి ఆదరించిన విషయాన్ని ఉదహరించుకున్నాము. ఇదే సంవత్సరం తెలుగు కథకుడు పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారికి కేంద్ర సాహితీ ఎకాడమీ పురస్కారం రావడం, అంతర్జాతీయంగా కథకురాలు ఎలీస్ మ్నుఓకి సాహిత్య నోబుల్ రావడం కథలపైన మాకున్న నమ్మకాన్ని మరింత పెంచింది. మంచి కథలకు ఆదరణ ఎప్పుడూ తగ్గలేదని అర్థం చేసుకున్నాము. ఇదీ స్థూలంగా ఈ పుస్తకం వెనుక కథ.

నలుగురు రచయితల కథలను కలిసి ఒక పుస్తకంగా వెయ్యాలన్న ఆలోచన తరువాత మొదలైంది. ఇందుకు కారణం కేవలం ఆర్థికం మాత్రమే కాదు. ప్రచురణ వ్యయం పెరిగిపోయి, రచయితలే ప్రచురణకర్తలుగా మారుతున్న ఈ సందర్భంలో ఇలాంటి ప్రయత్నం ఆర్థికంగా రచయితలకు కాస్త వెసులుబాటు ఇచ్చే మాట వాస్తవమే. అయితే మేము కోరుకున్నది వేరే. మేము నలుగురం విడివిడిగా కథా సంకలనాలను వెలువరించాము. ఆ కథలను కూడా పాఠకులు ఆదరించి అభినందించారు. కానీ అవన్నీ ఒకే పూల గుచ్ఛాల వంటివి. ఇప్పుడు మేము చేస్తున్న ప్రయత్నం రకరకాల పూలను కూర్చి ఒక మాలగా అల్లడం. రెండింటిలో పఠనానుభూతి వేరుగా వుంటుందన్న నమ్మకమే ఈ పుస్తకం

వెయ్యడానికి మూల కారణం. ఆ విధంగా నలుగురు రచయితల నాలుగేసి కథలతో అల్లిన నాల్నాలుగుల పదహారు ఇప్పుడు మీ చేతిలో వుంది.

ఇద్దరు తెలుగువాళ్ళు వున్న చోట మూడు సంఘాలు ఏర్పడతాయని ఒక జోక్. అలాంటిది నలుగురు రచయితలు కలిసి ఒకే పుస్తకాన్ని వెలువరించడం అరుదనే చెప్పాలి. పైగా ఈ పుస్తకంగా వున్న కథలు ఒకే రకమైన భావజాలంతోనో, వాదంతోనో రాసినవి కావు. ఇందులో ప్రతి కథ ప్రత్యేకం. ప్రతి రచయిత ప్రత్యేకం. అందువల్ల ఏదో ఒక భావజాల వ్యాప్తి కోసమో, మరో ప్రతిఫలాపేక్షతోనే ఈ సంకలనం చెయ్యలేదు. కేవలం కథ మీద వున్న మమకారంతో, మంచి రచనకు పాఠకుల ఆదరణ వుంటుందన్న నమ్మకంతో మాత్రమే ఈ పుస్తకం తీసుకురావటం జరిగింది. గతంలో ఇలాంటి ప్రయత్నాలు అనేకం జరిగాయి. అలాంటి ప్రయోగాలకు ఈ పుస్తకం మరో కొనసాగింపుగా భావించవచ్చు. ఈ ప్రయత్నాన్ని ఇలాగే కొనసాగించాలన్న మా ఆశకు మీ ఆదరణ తోడౌతుందనే నమ్ముతున్నాము.

ఈ కథా సంకలనం తయారు చేయడంలో సహకరించిన మిత్రులకు, కుటుంబసభ్యులకు, ఈ కథలను ప్రచురించి ప్రోత్సహించిన పత్రికా సంపాదకులకు మేము కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము.

మేము నలుగురం కలిసి నాలుగు రకాల పూలతో చేసిన ఈ పూమాలను తెలుగు కథా సరస్వతికి ఆభరణంగా అంకితమిస్తున్నాము.

**కన్నెగంటి అనసూయ   సమ్మెట ఉమాదేవి   అరిపిరాల సత్యప్రసాద్   వదలి రాధాకృష్ణ**

# విషయ సూచిక


## కన్నెగంటి అనసూయ

| | | |
|---|---|---|
| 1. | ఎప్పటికీ సజీవంగా .... | 1 |
| 2. | జ్ఞాపకం జీవించినవేళ .... | 11 |
| 3. | కనిపించే దేవుడు | 24 |
| 4. | అమ్మమ్మ కానుక | 37 |

## సమ్మెట ఉమాదేవి

| | | |
|---|---|---|
| 1. | గిరి కాన దీపం | 49 |
| 2. | సర్వేంద్రియానాం లోపం ప్రధానం | 59 |
| 3. | నిన్ను నిన్నుగా ప్రేమించుటకు | 67 |
| 4. | పితృదేవోభవ | 80 |

## వడలి రాధాకృష్ణ

| | | |
|---|---|---|
| 1. | ఇదీ భారతం | 91 |
| 2. | యాదృచ్ఛికం | 99 |
| 3. | తూటిపూల తోట | 114 |
| 4. | బ్రతుకు చిత్రం | 123 |

## అరిపిరాల సత్యప్రసాద్

| | | |
|---|---|---|
| 1. | ఎర్ర అట్ట డైరీలు | 130 |
| 4. | యశోదాకృష్ణ | 140 |
| 3. | తప్పిపోయిన సూర్యుడు | 147 |
| 4. | రామా కనవేమిరా...! | 153 |

# 1
# ఎప్పటికీ సజీవంగా

ఆ ఇంటికి దగ్గరయ్యే కొద్దీ నాలో ఏదో చెప్పలేని ఉద్వేగం. ఆత్రుత.

కారణాలు ఏమైనా గత ఆరేళ్ళుగా ఈ ఊరు గురించే నా ఆలోచన. అలా ఆలోచించినప్పుడల్లా నా ఆలోచనల్లో లీలగా కదిలే ఈ ఇల్లూ వాకిలీ, ఈ ఇంటి ఇల్లాలూ, ఇంగువ పులిహోరా, కమ్మటి పెరుగుతో చేసిన దద్దోజనం ఏదో క్షణంలో తటిల్లతలా మెరిసి మాయమైపోతూండేవి.

ఆరేళ్లకి మెరుపు నిలకడగా నిలబడ్డ వేళ...

ఇంటిముందాగి ఒక్క క్షణం ఆ ఇంటివేపు పరికించి చూశాను.

వణకుతున్న వృద్ధాప్యంలా ఏ క్షణంలో కూలిపోతుందో అన్నట్టుందా ఇల్లు. ఏళ్ల తరబడి సున్నం వెయ్యలేదేమో నాచు పట్టేసి గోడల పొడుగునా నల్లటి చారికలు, ఒక పక్క సగం కూలిన గోడ, అందులోంచి మొలకెత్తిన ఏవేవో పిచ్చి మొక్కలు.

ఇంటిమీద అక్కడక్కడా చెదిరిపోయిన పెంకులూ, ఒక పక్కకి వంగిన ఇంటి చూరు. నాకు మనసంతా దేవినట్టయ్యింది.

ఆ ఇంట్లో నాకెన్ని మధుర జ్ఞాపకాలో–

స్కూలున్నప్పుడు తప్ప. మిగతా టైములో ట్యూషన్‌కి వెళ్ళి అక్కడే ఉండేవాళ్ళం. ఎప్పుడూ పిల్లలతో ఆ ఇల్లంతా కళ కళలాడుతూ ఉండేది.

సత్యన్నారాయణ మాష్టారి ట్యూషనంటే చెప్పలేనంత ఇష్టం మాకు. నిత్యం ఎన్నో పుస్తకాలను చదువుతూండేవారేమో... మాకు తెలియని ఎన్నో విషయాలను మాకు చెప్పేవారు. జీవితంలో పైకెదిగిన వాళ్ల గురించి, చిన్న వయసులో వాళ్ల అలవాట్లు చెబుతుంటే ఎంతో వినబుద్ధేసేది.

మాస్టారు గారి భార్య అయితే... కదిలే దేవతే...

మంచి గంధం ముద్ద మీద ఎర్రని కస్తూరీ బొట్టు పెట్టినట్టు నుదిటిన రూపాయి కాసంత ఎర్రని కుంకుమ బొట్టూ, ముక్కుకి రెండు వైపులా బరువుగా వేళ్ళాడే ముక్కు బేసర్లు, దాంతో పోటీయా అన్నట్టుగా చెవులకి చేరడేసి తెల్లరాళ్ల పోగులు... ఆపైన కాళ్లతో పోటీ పడుతూ ముఖమంతా పసుపు... కచ్చా పోసుకునేదేమో... చంకలో తళ తళలాడేట్టుగా తోమిన ఇత్తడి బిందెతో బావి దగ్గర నుంచి నీళ్లు తోడి కూనిరాగం తీస్తూ తెస్తుంటే సాక్షాత్తూ ఆ అమ్మవారే నడిచొస్తున్నారా అన్నట్టు చూడ్డానికి రెండుకళ్ళూ సరిపోయేవి కాదు. రెండు చేతులెత్తి దండం పెట్టాలనిపించేంతటి భక్తిభావం ఉట్టిపడేది ఆమెని చూస్తే.

శుక్రవారం, మంగళవారం అమ్మవారి పూజచేసి మా అందరికీ పులిహోరా దద్ధోజనమో అరిటాకుల్లో ప్రసాదంగా పెట్టేవారు. ఇంగువ బాగా దట్టించేవారేమో కమ్మని వాసనొచ్చేది. తినేదాకా వదిలిపెట్టేవారు కాదు. మరికొంచెం వెయ్యమని అడిగి మరీ వేయించుకునేవాడిని.

ఇంట్లో ఇక్కడి పుల్ల తీసి అక్కడ పెట్టే వాళ్లం కాదుగాని, ట్యూషన్లో అయితే ఆవిడ ఏదన్నా చిన్నా చితకా పని చెప్పిందే తడవు రేసుగుర్రాల్లా పరుగులు పెట్టేవాళ్లం.

మమ్మల్నందరినీ సొంత పిల్లలనుకునే మా మాష్టారి గారి భార్యంటే చచ్చేంత గౌరవం మాకు. ఆ గౌరవం కొద్దీ ఝండా పండగనాడు స్కూల్లో ఝండా ఎగరెయ్యటం అయిపోయాకా, ట్యూషన్‌కి వచ్చి ట్యూషన్లో మా మాస్టారి గారి భార్యతో ఝండాని ఎగరేయించేవాళ్లం.

ఝండా కొయ్యపక్కన నిలబడి ఆవిడలా పైకి చూస్తూ ఝండా ఎగరేస్తుంటే భారతమాతే స్వయంగా ఝండాని ఎగరేస్తుందా అన్నట్టు కన్నుల పండువగా ఉండేది చూడ్డానికి.

ఝండా ఎగరేసాకా ఏదైనా మాట్లాడమని అడిగితే... అడగ్గా... అడగ్గా...

"మీ మేస్టారుండగా... నేనేం మాట్లాడతానర్రా..." అంటూనే...

"చెప్పడానికేముంది గానీ... దేశమంటే... ఒక మ్యాపూ, మూడు రంగులున్న ఝండా కాదర్రా... పిల్లలూ... మనం నిలబడున్న నేల... నేలరా. దీన్ని సస్యశ్యామలం చేసుకోవాలన్నా, ఖండ ఖండాలుగా విభజించుకోవాలన్నా, బాంబులతో బాకులతో ఛిద్రం చేసుకోవాలన్నా అంతా మీకున్న దేశభక్తి మీద ఆధారపడి ఉంటుంది. దేశభక్తి అంటే ఏమిటి? ఏ ఆగష్టు పదిహేను నాడో, గణతంత్ర దినోత్సవం నాడో ఝండా ఎగరేసేసి, చీకటిపడే వేళకి దాన్నితీసి పెట్టెలో పెట్టెయ్యడం దేశభక్తి కాదు. గుర్తుంచు కోండి. నీ చుట్టూ ఉన్నవాళ్లంతా దేశమే. వాళ్ల బాధల్ని పట్టించుకో.

ఎదుటివాడి ఆనందాన్ని, వాడి సంతోషాన్ని వాడ్నే అనుభవించనీ... కాని వాడి కష్టాన్ని మాత్రం నీ కష్టం అనుకో. అదీ దేశ భక్తి. మీ మాస్టారంత బాగా నేను చెప్పలేను గానీ బాగా చదూకోండి. మీరు బాగా వృద్ధిలోకి వస్తే మాకు అంతే చాలంటూ" నవ్వుకుంటూ లోనికి వెళ్ళిపోయేది.

మాట్లాడేవి రెండు ముక్కలే అయినా ఆ మాటల్లో ఎంతో అర్థం కనిపించేది మాకు.

ఇప్పుడెలా ఉన్నారో ఏమో... ఆలోచిస్తూనే–

తలుపు దగ్గరకు వేసి ఉందేమో మధ్య వేలితో మెల్లగా తలుపుమీద తట్టాను. ఎంతసేపున్నా ఎవరూ రాలేదు. మళ్లీ తట్టాను. కాసేపటికి వినిపించింది లోపల్నించి "ఎవరూ...?" అంటూ... ఆ గొంతుని గుర్తు పట్టగలను. అది మా మాస్టారు గారి భార్య గొంతే. ఉండుండి దగ్గరవుతున్న కర్ర చప్పుడు.

తలుపు ఓరగా తెరిచి తల బైటపెట్టి కళ్ళు చికిలించుకుని చూస్తూ

"ఎవర్నాయనా... ఎవరు కావాలి?" అనడిగింది. ఆ గొంతులో వయసు పైబడ్డం వల్ల వచ్చిన సన్నని వణుకు.

"అమ్మా... నమస్కారమమ్మా... నేను... భాస్కరాన్ని...? అన్నాను. నా గొంతులో నాకే తెలియని ఉద్వేగం... ఆపై సన్నని జీర.

"ఏ భాస్కరం నాయనా...గుర్తుండటం లేదయ్యా...ఎంతమంది భాస్కరాలో మీ మేస్టారికి...అందులో ...ఎవరో మరి నువ్వు?"

నాల్నాలుగుల పదహారు

"వల్లభనేనోరి భాస్కరాన్నండి... మీరు వీబీ అని పిలిచేవారు..." అన్నాను వంగి ఆవిడ పాదాలు వినమ్రంగా కళ్లకద్దుకుంటూ...

"నువ్వా...! చల్లగా ఉండు నాయనా..." అని మెల్లగా కర్ర చప్పుడు చేసుకుంటూ వెనక్కెళ్ళి అక్కడున్న మడత మంచం మీద కూర్చుని కర్రని మంచానికి చేరేసి...

"లోపలికి రా... నాయనా..." అంది. చెప్పులు గుమ్మం వద్దే విడచి లోపలికెళ్ళి అక్కడున్న తుప్పు పట్టిపోయిన గా్రడెజ్ కుర్చీని ఆవిడ దగ్గరకంటా లాక్కుని కూర్చున్నాను. నేను తెచ్చిన పండ్ల సంచీని గోడకి చేరేసి.

బాగా వంగిపోయింది. బేసర్లూ, చెవిపోగులు రెండూ లేవు. బోడిగుండు మీదుగా జాకెట్టు లేని భుజాల్ని కప్పుతున్న తెల్లని చీర. కాలం తెచ్చిన మార్పుని ఆమెలో గమనిస్తూ... నాలో ఇప్పటికీ సజీవంగా ఉన్న ఆవిడ ఒకప్పటి రూపాన్ని తలచుకుని మనస్సు వికలమైపోయింది.

విరిగిన కళ్లజోడుని నాలుగైదు వరుసల దారంతో గట్టిగా కట్టడంతో చూపుకి అడ్డం పడుతున్నట్టుంది... తల బాగా పైకెత్తి..."నీళ్ళేమైనా కావాలా?..." అనడిగారు. నా గుండె చెరువైనప్పుడు నాకింక నీళ్ళెందుకు? "వద్దండి..." అన్నాను.

అతికష్టం మీద గొంతు పెగుల్చుకుని "మిమ్మల్ని చూద్దామని వచ్చానండి."

"అట్టాగూ..." అని కాసేపాగి...

"ఆ మధ్యెప్పుడో మీ నాన్న పోయాడని విన్నానే..." అంది గుర్తుచేసు కుంటున్నట్టుగా...

"ఆరేళ్ళయిందండి పోయి...".

మాట్లాడుతున్నంతలో... రాంబాబు వచ్చాడు.

వాడు మా బాబాయ్ గారి అబ్బాయి. వాడీ ఊళ్ళోనే ఉంటాడు. వచ్చీ రావటంతోనే "అన్నయా... అగ్రిమెంటు రెడీ..." అన్నాడు వాడు.

"సరే... పద... వచ్చేస్తాను." అన్నాను.

"ఏదైనా అమ్ముతున్నావా?..." అన్నారావిడ వాడెళ్ళినవైపే చూస్తూ...

ఆ గొంతులో కించిత్తు బాధని గమనించాను.

"అమ్మేసారనే కొంటున్నానండి. ఉన్న భూమికి తోడు కాస్తంత కౌలుకి కూడా తీసుకుని నాన్న వ్యవసాయం బాగానే చేసేవారండి. అయితే కష్టానికి తగ్గ రాబడి రాకపోవటం వల్ల వడ్డీలకి తెచ్చి కౌలు చిత్తు కట్టాల్సొచ్చేసరికి ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఉన్నది కాస్తా అమ్మేసి, అమ్మేసాకా ఊళ్ళో సెంటు భూమన్నా కుర్రాడికి ఉంచలేకపోయాననే అనే బాధతో గుండెపోటు వచ్చి పోయారండి. నాన్న ఆత్మ శాంతించాలంటే... ఎలాగైనా నాన్న పోగొట్టుకున్నవన్నీ తిరిగి సంపాదించాలనే పట్టుదలతో ఈ ఆరేళ్ళూ ఇతర దేశాలు పోయి నానా యాతనలు పడి ఈ మధ్యే ఆర్థికంగా బాగా వెసులుబాటు వచ్చేసరికి, ఏదో పొలం అమ్మకానికి ఉందన్నయ్యా అంటే ఉదయమే వచ్చాను".

"మంచి పని చేస్తున్నావ్...నాయనా..." అని ఒక్కక్షణం మౌనంగా ఉండిపోయి తర్వాత అన్నారు. "నీ పేరేంటన్నావ్...?" "భాస్కరమండి..."

"అందరూ నీలా ఉంటే ఎంత బాగుండునురా భాస్కరం..."

"నీకు తెలుసుగా... మా విష్ణు పుట్టిందే ఆ ఒక్కడు. ఒకటే పేచి... నా దగ్గర కొచ్చెయ్ ఒక్కదానివీ ఇక్కడెందుకని... ఈ మధ్య మరీ ఎక్కువైపోయింది. వాడి సతాయింపు." నేనసలే కాటిక్కాళ్ళు చాపుక్కూర్చున్న దాన్ని. ఒక్కదాన్నీ ఇక్కడుండటం ఇబ్బందే... కానీ మీ మేస్టారి తాత తండ్రులు కట్టిన ఈ ఇల్లూ, ఆయన మసిలిన ఈ వాకిలీ, చివరి రోజుల్లో ఆయన పట్టుకు నడచిన ఈ గోడలు... ఈ జ్ఞాపకాలు. వాడి పిచ్చిగానీ... నా ఒంట్లో ఊపిరి ఉండగా ఈ గడపని దాటగలనట్రా... భాస్కరం. నువ్వే చెప్పు... ఇప్పటి వాళ్లకి ఏం తెలుస్తాయ్ నాయనా వీటి విలువ. ఒఠ్ఠి పేచీలకోరు. వాడి పట్టుదల వాడిదే.

ఎంతకీ రానంటే అప్పుడు చెప్పాడు అసలు సంగతి. మా పక్కనున్న ఆ పాతింటిని బోల్డన్ని డబ్బులుపోసి ఎవరో కొన్నాట్ట. బాగా బలిసినోడు. కుంచెడు స్థలమది. ఇల్లు కట్టుకుంటాట్ట. ఆ వెధవ పీనుక్కి అది సరిపోక ఈ స్థలం మీద

పడింది కన్ను. ఇది కూడా కలిస్తే లంకంత కొంపవుతుందట నా(శ్రాద్ధానికి. చాకిరీ చెయ్యద్దూ... ఇల్లుంటేనే సరా...ఉన్న రేటుకంటే కుసింత ఎక్కువ పడేస్తానని మా వాడిక్కి(రెట్టాడు.

మావాడు మొన్నటిదాకా చెప్పలేదు నాకీ సంగతి. అమ్మా... డిమాండున్నప్పుడే అమ్ముకోవాలి. అతనా మేడ కట్టేసేడంటే మన ఇంటి స్థలం వైపు కన్నెత్తి చూసే వాళ్ళుకూడా ఉండరు. వాడు ఎవర్నీ మనింటివైపు చూడనియ్యడు కూడా. అప్పుడు ఎంతో కొంతకి వాడికే పడెయ్యాలి మనం. చేస్తున్న ఉద్యోగాన్నొదిలి ఎలాగూ నేనిక్కడ ఉండలేను. నువ్వా... మా ఉంటే ఇంకో రెండు మూడేళ్ళు ఉంటావ్. అంతమా(త్రానికి ఎందుకమ్మా ఇంత పట్టుదల. మోజున్నప్పుడే చంకెక్కాలమ్మా... ఇప్పుడైతే కాసిన్ని డబ్బులు ఎక్కువ గుంజొచ్చు అంటాడు.

ఎంతసేపు వాడిమాట వాడిదే గానీ "అమ్మ పెద్దదయిపోయిందే... ఇదే ఇంట్లోకి కాపురానికొచ్చింది... నాన్నిక్కడే పోయారు... అమ్మ ఈ స్థలాన్ని వదల్లేక పోతూంది... అమ్మ జీవితం ఇక్కడే ఎల్లమారి పోవాలని కోరుకుంటుందనీ ఆలోచిస్తేనా పిచ్చి పీనుగ? ఎంత సేపూ డబ్బూ...డబ్బూ. అది తప్ప వేరే ధ్యాసే లేదు ఆ సన్నాసికి..." ఆయాసం వచ్చినట్టుంది చెప్పటం ఆపి పక్కనే స్టూలు మీదున్న గ్లాసులో నీళ్లు కాసిన్ని గొంతులో ఒంపుకున్నారు.

వయోభారంతో చేయి వణుకుతుంటే నోట్లోకి వంపుకున్న నీళ్లల్లో సగం పక్కకే ఒలికిపోయాయి. చీరంతా తడిసి పోగా గ్లాసు పక్కనపెట్టి చెంగుతో మూతి తుడుచుకుని

"ఒరేయ్ అబ్బాయ్... ఈ ఊళ్ళో ఎంతమందికి చదువులు నేర్పిన ఇల్లురా... ఇది. నీకు మా(త్రం తెలియదా... ఎక్కువ డబ్బొస్తుందని వాడి స్థలంలో కలిపేస్తావా? మీ తాత ముత్తాతల కాడ్నించీ వారసత్వంగా వస్తున్న ఈ స్థలాన్ని నా తదనంతరం ఏ (గ్రంథాలయానికో ఇచ్చెయ్. పిల్లలు చదువుకుంటారు. ఊళ్ళో ఇంతమందున్నారు. ఇంటికో పుస్తకం ఖర్చు భరించినా ఊళ్ళోవాళ్లకి బోల్డన్ని పుస్తకాలు. పదిమందీ పదిరకాల పుస్తకాలు చదువుకుని...జీవితంలో ఎదుగుతారు. మీ నాన్న పేరుతో పుస్తకం నిలబడుతుందిరా... సరస్వతమ్మ వారూ సంబరపడతారని చిలక్కి చెప్పినట్లు చెప్పా(నా అబ్బాయి. నచ్చలా నా కొడుక్కి కోపం వచ్చి కల్లు తాగిన కోతిలా

గంతులేసాడు. చివరికి వెళుతూ వెళుతూ "ఏదో ఒకనాడు ఆ పక్కింటోడు వచ్చి నీ పీక పిసుకుతాడు...గొడవ వదిలిపోతుంది అంటూ నానా శాపనార్థాలుపెట్టి మరీ పోయాడు.

అలాగైనా ఇష్టమే. ఎందుకంటే. ఆ పిసికేదేదో ఈ ఇంట్లోనే పిసుకుతాడుగదా... ఆ రకంగానైనా మీ మేస్టారిలో కలిసిపోవచ్చు... ఏమంటావ్?" అన్నారు చెంగుతో కళ్ళొత్తుకుంటూ...

ఆవిణ్ణి అలా చూస్తుంటే... నాకు కళ్ళు చెమ్మగిల్లాయి. ఏమ్మాట్లాడాలో తెలియ లేదు.

"మీ మాస్టారు బతికుంటే ఇంత గొడవుండకపోనురా భాస్కరం... బాగా తిరిగే మనిషే. ఉన్నట్టుండి ఊడిపడిందయ్యా మాయదారి రోగం."

"...బీపీ కాని సుగరు కాని లేదయ్యా... నిక్షేపంలా ఉండేవారు.ఎవరో ఆకతాయి కుర్రాడ్ని కొట్టబోతూ ఎప్పుడో స్కూల్లో బెంచిమీద పడ్డార్ట. నుదుటిమీద బొప్పికట్టి...గోళీ కాయంత సైజులోఅలాగే ఉండిపోయిందది. చూడ్డానికి అసహ్యంగా ఉందని డాక్టర్లకి చూపించి తీయించేస్తానని ఎన్నోసార్లు చెప్పాడయ్యా నా బిడ్డ. ఒప్పుకుంటేనా? అలా ఉంటే దానివల్ల నాకొచ్చిన ఇబ్బందేముందిలేరా... పిల్లల గుర్తురా అది "అంటూ తేలిగ్గా పెడ చెవిని పెట్టేసేవారు... కడాకరు రోజుల్లో అదే ప్రాణం మీదకి తీసుకొచ్చింది."

వింటూనే పిడుగుపాటుకి గురైనంత పనయ్యింది నాకు. అదెలా కారణమైంది? ఎవరూ చెప్పలేదే... కారణమేంటో ఈ వయసులో ఆవిడ్ని అడిగి బాధ పెట్టటం ఎందుకని ఏమ్మాట్లాడలేదు నేను. ఆమెనే చూస్తూ ఉండిపోయాను. ఏం చెప్తారా అని.

కాసేపు మౌనంగా ఉండిపోయి ఆ తర్వాత అతి కష్టం మీద గొంతు పెగుల్చుకుని ఆవిడే అన్నారు...

"మాయదారి బొప్పి. చూడ్డానికి అదేమంత పెద్దది కాదు. గోళీకాయంతే ఉండేదిరా అబ్బాయ్. దానివల్ల ఇబ్బందేవుందిలే అని అశ్రద్ధ చేసారు మీ మేస్టారు. ఉన్నట్టుండి పెద్దది అవటం మొదలెట్టింది. దాంతోపాటు ఒకటే నొప్పి. తట్టుకోలేక

అబ్బాయికి కబురెడితే ఆగమేఘాలమీద వచ్చాడు పాపం. డాక్టరుగారికి చూపిస్తే ముక్క తీసి ఎక్కడికో పంపాలన్నారట. అలా పంపాక మూడ్నేల్లు కూడా లేరయ్యా... మాయదారి కేన్సరు మీ మేస్టార్ని పొట్టనబెట్టుకుంది. ఎంత కష్టపడ్డారో మారాజు. పగవాడికి కూడా వద్దు నాయనా..."

నుదిటిమీద దెబ్బ దగ్గరే అగిపోయాయి నా ఆలోచనలన్నీ. గుండె ఆగినంత పనయ్యింది నాకు... కాళ్లకింద నేల కదులుతున్న భావన...

అంటే... అంటే... స్కూలు రోజుల్లోకెళ్ళిపోయాను.

మాకు సత్యన్నారాయణ మాస్టారంటే... భయంతో కూడిన భక్తి. ఆయన పాఠాలు చెప్పేటప్పుడు ఎంత సీరియస్‌గా ఉంటారో...చెప్పటం అయిపోయాక అంత జోవియల్‌గా ఉండేవారు. ఆయన క్లాసంటే పడి చచ్చేవాళ్లం. ఆయనకి ముక్కుపొడుం వీక్నెస్. పాఠం చెబుతూ మధ్య మధ్యలో రెండు మూడుసార్లు రెండు వేళ్లతో ముక్కుపొడుం తీసుకుని నాసికాపుటాల్లోకి గాఢంగా దట్టించేసేవారు. దట్టిస్తూ ఒకోసారి తుమ్మేవారు కూడా... మాక్కూడా అలా పీలిస్తే ఎలా ఉంటుందో ఒకసారి పీల్చి చూడాలనుండేది. ట్యూషన్లో కాని కుదిరేది కాదు. ధైర్యం చేసి అడిగితే

"చస్త్రా్రా వెధవల్లారా... వేలెడంత లేరు ముక్కుపొడుం కావాలట... ముక్కుపొడుం..." అంటూ లాల్చీ జేబులో వేసేసుకునేవారు.

ఒకసారేమయ్యిందంటే...

మా స్కూలు పక్కనే వినాయకుణ్ని పెట్టారు. వినాయక నిమజ్జనం, చెవులు చిల్లులు పడేలా డప్పులు వాయిస్తూ... కోలాహలంగా డాన్సులూ అవీ చేస్తుంటే మేం క్లాసులో ఎలా ఉండగలం చెప్పండి?

సరిగ్గా అదే టైముకి సత్యన్నారాయణ మాస్టారి క్లాసు. క్లాసు పోగొట్టుకోవటానికి ఆయన ససేమిరా ఒప్పుకునేవారు కాదు. వదిలిపెట్టెయ్యమని ఎంత బ్రతిమాలినా ఆ డప్పుల మోత వినిపించకుండా కిటికీలు వేసేసి మరీ పాఠాలు చెప్పటం మొదలెట్టారు. మా మనసంతా బయటే. ఇంతలో...

అర్జంటుగా ఎందుకో రమ్మని ఆయనకి హెడ్మాస్టర్ నుంచి పిలుపు. హడావిడిగా వెళ్ళిపోయారు మాస్టారు. ఆయనటు వెళ్ళగానే కిటికీ తలుపు తెరిచేసి బయటికి చూస్తూ మాస్టారు వచ్చేస్తారేమోనని వెనక్కి వెనక్కి తిరిగి చూస్తున్నామేమో ఇంతలో టేబుల్ మీదున్న ముక్కుపొడుం డబ్బా నా కంట పడింది. దాన్ని చూడగానే నాకో ఐడియా తట్టి మాస్టారొచ్చేలోపు ఎవరూ చూడకుండా దాన్లోంచి కొంత పొడుం తీసేసి కాగితంలో పొట్లం కట్టి జేబులో దాచేసి ఏమీ ఎరుగనట్టు డబ్బా టేబుల్ మీద పెట్టేసాను.

మాస్టారు సీరియస్‌గా పాఠం చెబుతున్న టైములో మెల్లగా పొట్లాం విప్పి కొంచెం తీసి ముక్కుకి కుడివైపు రంధ్రం దగ్గరగా ఉంచి అచ్చు మాస్టారిలా గట్టిగా ఊపిరి పీల్చాను.

ఇక చూస్కోండి. నా సామి రంగా... ఒకటే తుమ్ములు... ముక్కంతా మంట మండిపోయి ఒకటే గంతులేశాను. అంత ఘాటుగా ఉంటుందని నేనూ ఊహించలేదేమో అలవాటులేని ఆ మంటకి గంగవెర్రులెత్తిపోయాను. విషయం బయట పడిపోయి క్లాసంతా రసాభాస అయిపోయింది. ఒకటనుకుంటే ఇంకొకటి జరిగింది.

మాస్టారికి పిచ్చికోపం వచ్చి విసురుగా నన్ను కొట్టటానికొచ్చారు.

ఇంకొక్క క్షణం ఉంటే చెక్క డస్టరుతో నా తలమీద దెబ్బపడేదే. ఆయన విసురుగా వంగుని నా నెత్తిమీద కొట్టబోవటం, అంతలోనే నేను గబుక్కున కింద కూర్చుండిపోవటం, ఆ వేగానికి ఆయన నా మీదుగా తూలి ముందుకు పడిపోవటం ఆయన తల వెళ్ళి బెంచీ కొసకి కొట్టుకోవటం, నుదుటికి దెబ్బ తగిలి బొప్పి కట్టటం క్షణాల్లో జరిగిపోయాయి.

క్లాసులన్నీ కేన్సిల్. అది జయమో, అపజయమో నాకు తెలియదు కానీ మాకెంతో ఇష్టమైన మా మాస్టారి నుదుటిమీద కట్టిన బొప్పిని చూసినప్పుడల్లా చాలా బాధపడేవాణ్ణి.

అయితే మాస్టారు పోయారని తెలిసింది కాని ఇలా అదే బొప్పిలో కేన్సర్ వచ్చి పోయారని తెలియలేదు.

తన వేళ్లే సంకెళ్ళై కదలలేని స్థితిలో ఉండే చెట్టులా మాస్టారు పోయారని తెలిసినా విదేశాల్లో ఉండటంతో రాలేని పరిస్థితి.

గుండెల్లో చేయిపెట్టి కెలికినట్టయింది నాకు. నిలువునా వణికిపోయాను.

నాకు జన్మనిచ్చిన తండ్రి నా గురించే బెంగతో పోయారు. నాకు విద్యాబుద్ధులు నేర్పి నన్నింత వాణ్ణి చేసిన గురువుగారి మరణానికీ నేనే కారణం. నాకింత కాలం ఈ విషయం తెలియలేదు. ఇప్పటిదాకా తండ్రి ఆత్మ శాంతి గురించే ఆలోచించాను. మరి మాస్టారి సంగతి? ఏం చేస్తే మాస్టారి ఆత్మ శాంతిస్తుంది? ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చాను.

డబ్బుంటే ఆశ లేనిదెవరికి?

నేనిస్తానన్న మొత్తానికి అనతికాలంలోనే మాస్టారి ఇంటిపక్క కుంచెడు స్థలం నాదయింది.

డాక్యుమెంట్లు, ఆ రెండు స్థలాల్లో కలిపి నేను కట్టబోయే లైబ్రరీ బిల్డింగ్ ప్లానూ ఆవిడ చేతిలో పెట్టి "గ్రంథాలయానికి మీరే పేరు పెట్టాలి" అన్నాను మాస్టారి పేరు ఆవిడ నోటితో చెప్పించాలని.

వణుకుతున్న చేతుల్తోనే కాసేపు వాటిని అటూ ఇటూ తిరగేసి తలెత్తి ఆశ్చర్యంగా... ఒకింత సంభ్రమంగా నావైపు చూసారావిడ.

నా వెనగ్గా విష్ణు "అవునమ్మా" అన్నట్టుగా నవ్వుతూ...

అంతటి ఆనందాన్ని ఆ ముసలి ప్రాణం తట్టుకోలేకపోయినట్టుంది పాపం...

"ఎంతపని చేసావురా భాస్కరం... ఇదంతా... నిజ...నిజమేనా..." అంటూ భుజాలు నిమురుతూ నా చేతుల్లోనే ఒరిగిపోయింది.

క్షణాల్లో జరిగిపోయింది.

జీవంలేని ఆ కళ్లల్లో వంద సూర్యుల మెరుపు.

## 2

# జ్ఞాపకం జీవించిన వేళ ...

బ్రాహ్మీ ముహూర్త సమయాన...

పద్మాసనంలో కూర్చుని కళ్ళుమూసుకునే అంతర్నేత్రంతో నాలోకి నేను చూసుకుంటున్న వేళ...

ఆ అరుపు... కలలా, కమ్మని కావ్యంలా... ఒక అలలా, ఉండుండి ఉవ్వెత్తున ఎగసి పడే ఒక కెరటంలా, పౌర్ణమి నాటి రాత్రి సముద్రం మీద వెన్నెల తెరచాపలెత్తినట్టు హృదయపు లోగిలిలో ఒక మధురమైన స్వాంతన కలిగిస్తుంటే...

ఆ స్వరం... ఉద్రిక్తంగా తాకింది నాలో నిక్షిప్తమైపోతున్న ఆ జ్ఞాపకాన్ని...

ఉలిక్కిపడి మధ్యలోనే కళ్ళు తెరిచాను...

అవును. అదే జరిగింది...

తూర్పున వెలుగు రేఖలు ఇంకా విచ్చుకోక ముందే... ఒక చలికాలపు తెల్లవారుఝాము సమయాన, నాకు నేను తప్ప మరెవ్వరూ కనిపించనంతగా సర్వం తానే అన్నట్లు దట్టంగా కమ్మేసిన పొగమంచుని చీల్చుకుంటూ తెరలు తెరలుగా... పదిలంగా గూడుకట్టుకున్న నా జ్ఞాపకాల పొదరిల్లుని తాకుతూ... ఆ నిశ్శబ్ద సమయాన నా ధ్యానాన్ని భగ్నం చేస్తూ "శీతా... పలప్పుళ్ళు... శీతా... పలప్పుళ్ళు..."

అదే గొంతు... అదే సాగతీత... నాకెంతో చిరపరిచితమైన పిలుపు. నా బాల్యంలో నన్నెంతో ఎదురు చూపులకి గురిచేసిన పిలుపు... నన్ను నిద్రపోనివ్వని పిలుపు. ఆ చిరుప్రాయంలో తిండి తప్ప మరోధ్యాస లేని నన్ను కొన్ని కొన్నిసార్లు నిరాశా నిస్పృహలకు గురిచేసిన స్వరంకూడా... కాకపోతే ఇప్పటి ఆ సాగతీతలో సన్నని వణుకు వయసు ప్రభావం కావచ్చు, ఏమో ...!

నాల్నాలుగుల పదహారు

ఎప్పుడో విన్నాను... నా చిన్నప్పుడెప్పుడో. ఆ పిలుపు వినాలని, కేవలం ఆ పిలుపు కోసమే... అంత చలిలో వీధిలో అరుగు మీద గోడకు చేరబడి, చలి తగలకుండా కిందకంటా లాక్కున్న గౌనుని పాదాల కింద తొక్కిపట్టి కూర్చుని చెవులు రిక్కించి మరీ ఎదురుచూసిన గొంతు. ఎలా మర్చిపోగలను . బాల్యంలో నా మనోఫలకంపై బలంగా ముద్రించుకుపోయిన ఆ రూపం, నా కర్ణభేరికి అత్యంత ప్రీతిపాత్రమైన స్పందననిచ్చే ఆ శబ్దం. ఎన్ని రోజులు. ఒకటా... రెండా... ఎన్ని నెలలు? ఎన్ని సంవత్సరాలు? అలా తను పెద్దయ్యేదాకా...

ఆలోచిస్తున్నంతలో...

"సీతా... పలప్పళ్ళు... సీతా... పలప్పళ్ళు"

నా జ్ఞాపకాల అలలను చేదిస్తూ... మళ్ళీ అదే కేక... ఇదెలా సాధ్యం? గడియారం వెనక్కి తిరిగి నా బాల్యం నాకొచ్చేస్తే బాగుండునని ఎన్నోసార్లనుకున్నాను నాలో నేనే... కానీ ఇలా ఎలా అది నిజమవుతుంది? బహుశా కలేమో? కాదు ... కాదు... నిజమేనేమో?

ఒళ్ళు జలదరించింది నాకు. ఇన్నేళ్ల తర్వాత మళ్ళీ ఇంత దూరంలో ఇపుడీ పిలుపు ఎక్కడిది? ఇంతలోనే సందేహం. స్వరాన్ని పోలిన స్వరం ఉండచ్చుకదా.

"ఉంటే ఉండచ్చు... కాని... ఇది మాత్రం అదే. ఆ గొంతు అతనిదే...!

ఎంతదూరంలో ఉన్నా, ఎన్ని సముద్రాల అవతల ఉన్నా ఆ స్వరాన్ని తను పోల్చగలదు. మళ్ళీ అదే కేక. ఈ సారి కాస్త మెల్లగా...

స్వరం దూరమయిపోతున్నట్టనిపించి... ధ్యానాన్ని పక్కన పెట్టి లేచెళ్ళి గబగబా తలుపు తెరిచి ఒక్కంగలో గేటుతీసి బయటికొచ్చి నిలబడ్డాను. ఆ స్వరం మళ్ళీ వినిపిస్తే బాగుండుననుకుంటూ... మా ఇద్దరి మధ్యా ఆ రోజుల్లోలాగే, ఇప్పుడూ దట్టంగా అలుముకున్న అదే పొగమంచు. గుండె చిక్కబట్టుకుని చెవులు రిక్కించాను.

అలా ఎన్ని క్షణాలు ఉద్విగ్నంగా గడిచాయో... పొగమంచు నా చూపుల్ని తనలో చొచ్చుకుపోకుండా వెనక్కితోసేస్తుంటే నాకు వినిపించనంతగా దూరం వెళ్ళిపోయాడేమోనని అంతలోనే నిరాశ. కాసేపటికి వినిపించిందది.

"సీతా... పలప్పళ్ళు... సీతా... పలప్పళ్ళు"

క్షణం ఆలస్యం చేయకుండా... ఏమీ కనిపించకపోయినా కేక వినిపించిన వైపుగా నా దృష్టిని సారిస్తూ... "తాతయ్యా... తాతయ్యా... ఇలాపట్రా... ఇక్కడ... నీ వెనక"

కేక ఆగిపోయింది. కిర్రు చెప్పుల శబ్దం అంతకంతకీ దగ్గరవుతూ మా ఇద్దరి మధ్యా దూరం తగ్గుతున్నట్టు తెలియచేస్తుంటే... పదునైన బాణంతో పొగమంచుని బలంగా చీలుస్తున్నట్టు నా చూపులు సారించాను చప్పుడు వినిపిస్తున్నవైపుగా... మెల్లగా అడుగులు దగ్గరైనాయి. నేను భ్రమపడుతున్నట్టు పొగమంచు లేదనుకుని నేను నించున్న నా పరిధిలోకి వచ్చేసాడతను. మరింత దగ్గరగా... నా చెవులు నన్ను మోసం చేయలేదన్నట్టుగా అతనే...

చాలా సంవత్సరాల తర్వాత చూడ్డం కదా... అతన్ని చూస్తూనే ఉప్పొంగి పోయింది నా మనసు. కానీ చేతిలోని ఊతకర్రతో పోటీయా అన్నట్టు సన్నగా పుల్లల్లా ఉన్న కాళ్ళు, నడవటానికి సహకరించని వృద్ధాప్యం. అయినా తడబడే ఆ అడుగుల్లో, ఆ నడకలో ఏదో సాధించాలనే తపనా, పట్టుదల, అతని సంకల్పానికి ప్రతీకలా తల మీద చిన్న వెదురు బుట్ట... దాన్ని కప్పుతూ పైన మాసిపోయి రంగు మారిన బట్ట.

ఉద్వేగంతో పిలిచాను. "ఇక్కడే ఇలారా..." నా గొంతు విని ఆగిపోయాడు. నా స్వరంలో ఆనవాళ్ళని వెతుకుతున్నట్టుగా... అనిపించి మళ్ళీ ...

"ఇక్కడకు రా. ఇలా ఇటువైపు. అమ్ముతావా వాటిని?" దెబ్బతిన్న పక్షిలా గిలగిలలాడిపోయాడు.

"అమ్మో... లేదమ్మా... అమ్ముతాకి కాదు..." ఇంక ఒక్క క్షణం కూడా అక్కడ ఉండలేనట్టుగా వెనుదిరగబోయాడు వేదనతో. ఆ వెనుతిరగటంలో ఎంత నిరాశో...

"ఆగు వెళ్ళిపోకు. అమ్ముతున్నట్టుగా కేకలేస్తూన్నావుగా. అందుకని అలా అడిగాను?"

"అమ్ముతాకి కాదమ్మా. మా అమ్మాయి గోరికోసం. మా అమ్మాయిగోరు నా కేకని అజకట్టి (గుర్తుపట్టి) ఎక్కడైనా అగుపడతారేమోనని ఎతుకుతున్నాను. అగుపడితే

ఆరికిద్దామని. ఆరికోసమే తెచ్చానియ్యి" మీకోసం కాదన్నట్టు అపురూపంగా ఆ బుట్టని చుట్టిన అతని చేతి స్పర్శలో అన్నేళ్ళుగా దాచిన ప్రేమ...

"ఎవరా అమ్మాయిగారు? నువ్విలా అమ్మేటట్టుగా అరుస్తూ తిరుగుతుంటే అమ్ముతావేమోననే అనుకుంటారు కదా ఎవరైనా. అయినా మీ అమ్మాయి గారికి ఎలా తెలుస్తుంది? నువ్వు తనకోసం వెతుకుతున్నావని?" అన్నాను అతని ఉద్దేశ్యం ఏమిటో మరింత లోతుగా అడిగి తెలుసుకోవటానికి.

"తెలుస్తుందండి. నూటికి నూరుపాళ్ళూ తెలుస్తాదండి. ఆయమ్మ నా గొంతు గురుతుపడతారండి. నాకిస్వాసం ఉందండి. మీకు తెల్దు. ఆరి సిన్నప్పుడు ఆళ్ళూరికి నేను మా ఊర్నించి పొద్దున్నే సీతపలపు కాయలట్టూకెల్లీవోడ్నండి అమ్ముకుంటాకి. ఆరమ్మగోరు ఆ పాపగారికోసం పెతి రోజూ నా దగ్గర సీతాబలక్కాయలు కొనీవోరండి. ఆ ఊర్లో తొౌట్టతొలి నాకాడన ఆరే కొనీవోరండి. ఆరు తట్టలో సెయ్యెడితే సాలు అయ్యాల నా కావిట్లో ఒక్క కాయకూడా మిగలకుంటా అమ్ముడైపోయేవండి. అంత మంచిదండి ఆయమ్మగారి సెయ్యి. సేనా మంచోరు కూడానండి ఆయమ్మగారు. ఆరికి సేనా మంది పిల్లలుండీవోరండి. ఆల్లెవరూ కావిడికాడికి వచ్చీ వోరు కాదుగనీండీ, అందులో ఒక పాపగారు మాత్తరం నాకోసం సూసీవోరండి. నాకేక ఎప్పుడు ఇనిపిత్తాదా అని సలిని కూడా లెక్కసేయక అరుగు మీదే కూకునీవోరండి. నా కేకని ఆ పాపగారు ఇంటే ఇట్టే గురుతుపడతారండి."

ఎంత నమ్మకం? ఇన్నేళ్ళుగా పదిలంగా గుండెల్లో దాచుకున్న ప్రేమపట్ల ఉన్న నమ్మకం. నోట్లో పళ్ళు లేకపోవటంతో బోసినోటితో ముద్ద ముద్దగా మాట్లాడుతున్న అతని మాటలు నన్ను నా పసిప్రాయంలోకి లాక్కెళ్ళిపోయాయి.

నిజమే.సీతాఫలాలంటే నాకు చాలా ఇష్టం. అవి తిని అన్నం మానేసిన రోజులెన్నో. ఇప్పటిక్కూడా అతే. ఇప్పుడంటే ఏ కాలంలో ఎండగా ఉంటుందో, ఎప్పుడు చలిగా ఉంటుందో తెలియటంలేదు గానీ, ఆ రోజుల్లో మాత్రం సీతాఫలాలు ఈ చలికాలం వచ్చేవి.

అక్కా, అన్నయ్యా తమ్ముడూ అందరూ చలికి వణుకుతూ కప్పుకున్న దుప్పటిని మరింతగా చుట్టూ బిగించుకుంటూ... వెచ్చగా పడుకుంటే నేను మాత్రం తెల్లారగట్ట అయిదింటికే లేచి వీధి అరుగుమీద కూర్చునేదాన్ని బుట్టలనిండా సీతాఫలాలున్న కావిడిని మోసుకుంటూ భారంగా నడిచొచ్చే తాత కోసం ఎదురుచూస్తూ. కాసేపటికి అమ్మ చీపురు పట్టుకుని వచ్చేది గుమ్మం ముందు ఊడ్చి ముగ్గెయ్యటానికి.

"నీకసలు భయం పెట్టలేదేమో దేవుడు. తలుపు గడియ తీసుంటే అనుకున్నాను. కాయలోడి కోసం నువ్వు కూర్చునుంటావని" అంటూనే అమ్మ గుమ్మం ముందంతా ఊడ్చేసి పోగెత్తి పెంటకుప్ప మీదపోసి బకెట్టుడు నీళ్ళల్లో పేడ కలిపి కళ్ళాపిచల్లి తాబేలు ముగ్గెట్టేది. సంక్రాంతి రోజుల్లో నెల పెట్టాకా అమ్మ ఎప్పుడూ అదే ముగ్గు పెట్టేది. ఒక్కోసారి చేత్తో పెట్టేది. ఇంట్లో బాగా పనెక్కువగా ఉన్నప్పుడు ముగ్గు కర్రతో బర బరా లాగేసేది.

నేనలా కూర్చునే అమ్మ చెంబుకి చెయ్యి అడ్డంపెట్టి అంతటా కళ్ళాపి ఎలా చల్లేదీ, కొబ్బరి చిప్పలో ఉన్న ఇసుక కలిపిన ముగ్గుని కుడి చేతి రెండు వేళ్ళతో అలవోకగా ఎలా ముగ్గేసేదీ గమనిస్తూ ఉండేదాన్ని. మా ఇంటిముందున్న రావి చెట్టు ఆకుల సందుల్లోంచి చొచ్చుకుని మరీ వచ్చిన వెన్నెల అమ్మ చల్లిన కళ్ళాపి మీద పడి మరింత తళతళలాడేది. చూడ్డానికి ఎంత బాగుండేదో .. అలా ..

ఒకసారిలాగే... చలికి దుప్పటి ముసుగెట్టుకుని తలొక్కటే బయటపెట్టి ముణగదీసుకుని వీధి అరుగుమీద కూర్చుని ఉంటే... తెల్లవారుఝామునే లేచి పాలకావిడి వేసుకుని పొలానికి వెళ్ళబోతూ అరుగుమీదున్న నన్నుచూసిన నాన్న...

"ఏమ్మా... పొద్దునే ఇంత చలిలో ఇక్కడ కూర్చున్నావ్?" అనడిగారు.

"అ ఏముంది... సీతాఫలప్పళ్ళోళ్ళు వస్తే పిలువ్ కొంటాను అని రాత్రి చెప్పాను. అసలే తిండంటే ఇష్టం. సీతాఫలప్పళ్ళంటే మరీను... తెల్లార్లూ నిద్రోయినట్టు లేదు. పొద్దున్నే నాకంటే ముందేలేచి కాపలా కాస్తోంది. వాడెప్పుడొస్తాడా... అని." అమ్మ నవ్వుతూ చెప్పింది నాన్నతో. అంతా విన్నాక ముందు అమ్మతోపాటే నవ్వినా తర్వాత సీరియస్‌గా చూసారు అమ్మవైపు నాన్న.

"పసిదాన్ని ఇంత పొద్దున్నే చలిలో కూర్చోపెట్టకపోతే, నువ్వెలాగూ వాకిలి ఊడ్చి ముగ్గెయ్యటానికి తెల్లవారగట్టే లేస్తావుగదా అప్పుడు వాడ్ని పిలిచి నువ్వే కొంటే పోలా." అంటూ అమ్మమీద కోప్పడి.. మళ్ళీ నావైపు చూసి.

"వెళ్ళి పడుకోమ్మా... బాగా చలిగా ఉంది కదా... జలుబు చేస్తుంది. వాళ్ళొస్తే అమ్మ పిలిచి కొంటుందిలే.." అనేవారు. గారాబంగా నాన్నగారలా అంటున్నా మరింతగా సర్దుకుని అక్కడే కూర్చునేదాన్ని తప్ప లోపలికి వెళ్ళేదాన్ని కాదు. సీతాఫలాలంటే నాకున్న ఇష్టం అలాంటిది మరి. నాన్న... నవ్వుకుంటూ పొలం వెళ్ళిపోయేవారు. నాన్నకి తెలుసు నాకు చిరుతిళ్ళంటే బాగా ఇష్టమని.

అక్కడికీ అమ్మ ఎప్పుడూ ఏదో ఒకటి చేస్తూనే ఉండేది. ఒక్క నాకోసమనే కాదు. అక్క, అన్నయ్య, తమ్ముడూ కూడా ఉన్నారు కదా. వాళ్ళూ తింటారు. కానీ నా అంత కాదు. అమ్మెప్పుడు పెడితే అప్పుడే. వాళ్ళతో పెద్ద ఇబ్బందేం ఉండేది కాదు అమ్మకి. కానీ నేనలా కాదు. ఇరవైనాలుగ్గంటలూ నాకు నోరు ఆడతానే ఉండాలి. అందుకే అమ్మ జంతికలు, కారప్పూస, అరిసెలూ, బెల్లం మిఠాయి ఉండలూ లేదంటే కరకజ్జం అచ్చూ. మిఠాయి కొమ్ములూ, పాకుండలూ లడ్డూలు ఏదో ఒకటి చేసేది. అవి చేసే సమయంలోమా ఇరుగూపొరుగోళ్ళు ఎవరైనా వచ్చి ఏం చేస్తున్నావని అమ్మని అడిగితే "మా చిన్నదానికి ఏదో ఒకటి మిల్లు (అంటే నా నోరు) ఆడతా ఉండాలి. అందుకని నాలుగు సుట్టలు చక్కిడాలు చుడదామని" అనేది వాళ్ళతో. దాంతో అప్పుడప్పుడూ వాళ్ళు వండుకున్నవి కూడా బాక్సులో పెట్టి తెచ్చి ఇస్తూ అమ్మతో అనేవారు "సత్తెమ్మొదినే ... సిన్నది తింటది. ఉంచు" అని.

మితం లేకుండా తినేదాన్నేమో చిన్నప్పుడు బాగా కుక్కిన పిప్పళ్ళ బస్తాలాగా ఉండేదాన్ని చూడ్డానికి. ఒక్కోసారి ధాన్యం వచ్చే రోజుల్లో అటుకులు ఆడించేది. అవైపోయాక డబ్బానిండా వేరుశనక్కాయలు వేయించి పోసి, దానిలో సోలో, గిద్దో ఏదో ఒకటి వేసి దానికో తాళం వేసేది. రోజుకి మూడు సార్లు, స్కూలుకి వెళ్ళేటప్పుడూ, వచ్చాకా, మళ్ళీ సాయంత్రం ఆటల్నుంచి వచ్చేకా వాటితో కొలిచి మా అందరికీ ఒకేసారి సమానంగా పెట్టేది. అమ్మదంతా ఒక పద్ధతి.

ఇంకా సీతాఫలాలంటే చెప్పలేనంత ఇష్టం. ఎక్కువ తింటే జలుబు చేస్తుందని ఒకపక్క అమ్మమ్మ చెబుతానే ఉన్నా వినేదాన్ని కాదు. నాదారి నాదే. బాగా ఎక్కువ సీతాఫలాలు తిన్న రోజున నాకు ఎక్కడ కడుపులో నొప్పి వస్తుందోనని ఆవకాయ పచ్చడిలోంచి ముక్కతీసి కడిగి నన్ను తినమనేవారు అరుగుతాయని.

మా ఊరు చుట్టుపక్కలా ఉండే ఉనగట్ల, చాగల్లు లాంటి కొన్ని ఊళ్ళల్లో గరువు పొలాలు ఎక్కువగా ఉండేవి. గరువు ప్రాంతాల్లో మోటార్లు పడక నీళ్లుండేవి కాదు. రెండేసి, మూడేసి ఎకరాలు ఉన్న చిన్న చిన్న రైతులు సాయంత్రం దాకా పొలంలో పనిచేసుకుని ఇళ్ళకి పోయేముందు చేలగట్ల మీదున్న సీతాఫలాలు కోసుకుని కాసిన్ని తిండిగింజలు దొరుకుతాయని ఇలా పొరుగూళ్ళకు వచ్చి తెల్లారేపాటికి అమ్మేసుకుని ఇట్నించి ఇటే మళ్ళీ పొలం వెళ్ళిపోతారంట.

మా ఇంటిపక్క ఈరమ్మత్తయ్యా, అమ్మా, సత్తెమ్మత్తయ్యా చెప్పుకుంటుంటే విన్నాను.

ఇంకా మంచు విడవని ఆ తెల్లవారుఝామున పెద్దపెద్ద బుట్టల్ని నిండుగా ముగ్గిన సీతాఫలాలతో నింపుకుని బరువుగా ఉన్న ఆ కావిడిని అతికష్టంమీద మోసుకుంటూ అంత దూరం నుంచి నడుచుకుంటూ చాలామందే వచ్చేవారు మా ఊళ్ళో అమ్మటానికి. అవి చేలోంచి ధాన్యం ఇళ్ళకొచ్చే రోజులు.

ఆ సమయంలో మా ఇంటినిండా ధాన్యం కుప్పలు కుప్పలుగా బస్తా సంచుల్లోనూ, గాదెల నిండా ఉండేవి. కొన్నయితే బయట దొడ్లో ఎండకి ఎండుతూ ఉండేవి. ఆ రోజుల్లో కుంచెడు ధాన్యానికి సీతాఫలాలు మరీ పెద్దవైతే పాతిక ఇరవై, అదే ఒక మాదిరి సైజు అయితే ఒక్కోసారి ముప్ఫై నలభై కూడా ఇచ్చేసేవారు. వేకువ ఝామున పొలాలకు వెళ్ళేవాళ్ళ కిర్రు చెప్పుల శబ్దం తప్ప అంతటా నిశ్శబ్దం వ్యాపించి ఉన్న ఆ మంచుపొగలో "సీతాపలప్పళ్ళు ... సీతాపలప్పళ్ళు" అంటూ ఒకలా అరిచే ఆ అరుపు వినిపించేది తప్ప మనిషి కనిపించేవాడు కాదు.

గజగజా వణికించే అంత చలిలో కూడా ఎంతమంది వచ్చేవారో అలా బరువైన కావిళ్ళేసుకుని. ఊరంతా తిరిగి ఒక తూరి కాయలన్నీ అమ్మేసి, ఎక్కడో ఒకచోట

కూర్చుని కూడా తెచ్చుకున్న అన్నాన్ని తినేసి కాసేపు విశ్రాంతి ధాన్యం కోసం మళ్ళీ తిరిగేవారు. శీతాకాలమన్నాళ్ళూ ఇంచుమించుగా రోజు విడిచి రోజు ధాన్యంతో సీతాఫలాలు కొంటూనే ఉండేది అమ్మ. శీతాకాలంలో వచ్చే సంక్రాంతి, అట్లతద్దిలాంటి పండగలకి అమ్మ చేసిన పిండివంటలని.. ధాన్యం కోసం వచ్చినప్పుడు అమ్మ వాళ్ళకి పెట్టేది. కళ్ళకద్దుకుని మరీ తినేవాళ్ళు. వాళ్ళు అవి తినేలోపు.. అమ్మ చేటలో ధాన్యం తెచ్చి కుంచంతో కొలిచి అతని బుట్టలో పోసేసాకా రెండు మూడు దోసిళ్ళ ధాన్యం అదనంగా పోసేది. అలా అని ఎప్పుడైనా బుట్టలో మిగిలిన పళ్ళలో నాలుగైదు పళ్ళు వాళ్ళు చిన్నదాన్నని నాకు ఇవ్వబోతే అస్సలు తీసుకోనిచ్చేది కాదు అమ్మ.

ఒకసారి ఇలాగే, సీతాఫలాలు కొంటే గుజ్జు ఎక్కువగా, గింజలు తక్కువగా ఉండి బాగా తియ్యగా ఉండేసరికి అమ్మ అతనితో చెప్పింది.

“తెచ్చినప్పుడల్లా ముందు మా ఇంటికే రా...”

అదిగో అలా అతను వతనుగా మా ఇంటికి వచ్చి మేము కొనుక్కున్నన్నీ ఇచ్చేసి వెళుతూ ఉండేవాడు. రోజు విడచి రోజు అతనంతట అతనే వచ్చేసి కాయలు ఇచ్చేస్తుంటే తెల్లారగట్ల లేచి వాళ్లకోసం ఎదురుచూసే పని తప్పింది నాకు. క్రమంగా అలవాటైన కొద్దీ ముందు మాకే ఇచ్చేసి “అమ్మగారి బోణి... ఎంత మంచిదో” అనుకుంటూ వెళ్ళిపోయేవాడు.

ఎంత నిద్దర్లో ఉన్నా అతని గొంతు విని నాదస్వరం విన్న పాములాగా చివాల్న లేచి కూర్చునేదాన్ని. అమ్మ ఎంత నవ్వుకునేదో. బుట్టలోంచి సీతాఫలాలు ఏరుతుంటే ఇంచుమించుగా బుట్టని అతుక్కుపోయి కూర్చునేదాన్ని. అమ్మ ఎంత బాగా ఏరేదో సీతాఫలాలు. పెద్దపెద్ద తొక్కలుండి కళ్ళు బాగా విడిచిన కాయలే ఏరేది. అవే తియ్యగా ఉంటాయ్ అనేది. నిజంగానే అలా ఉండేవి అవి. నేనంత పొద్దునే లేవటం, అతనికోసం ఎదురు చూడటం, అమ్మ ఆ టైములో నన్ను మరీ గారాబంగా చూడటంతో అతనిక్కూడా నేనంటే ఇష్టం ఏర్పడినట్టుంది.

ఒకరోజు పెద్దకాయ తీసుకొచ్చాడు నా కోసం. ఎంత పెద్దకాయంటే చెంబు కంటే పెద్దది తపేలా కంటే చిన్నది. అంతకుముందెప్పుడూ అంత పెద్దకాయని నేను

చూళ్ళేదు. చెట్టుని ముగ్గిందట. కోస్తుంటే తొడిమ చెట్టునే ఉండిపోయి కాయ చేతుల్లోకి వచ్చేసిందట. అమ్మతో చెబుతుంటే విన్నాను.

“అమ్మాయిగారికోసమని తెచ్చానండి…” అతనలా అంటున్నప్పుడు అమ్మెంత మురిపెంగా చూసిందో నావైపు.

“ఆ… ఎందుకు? ఉంచాల్సింది. మీ పిల్లలు తినేవాళ్ళు” అంది అమ్మ.

“పర్లేదమ్మగారూ… ఆళ్ళు రోజూ తింటానే ఉంటారండి… పాపగారికిట్టవని … ఆల్లెవర్నీ ముట్టుకోవద్దని రాత్రే పక్కనెట్టేసేనండి..” ఆ కాయని అతన్నాకు అందిస్తుంటే మనసులో మురిపెంగానే ఉన్నా అమ్మవైపు చూసాను తీసుకోనా వద్దా అన్నట్టుగా. మొహమాటంగానే తీసుకో అన్నట్టుగా కళ్ళతో సైగ చేసింది. ఆ తర్వాత ఆ తెచ్చిన కాయకు సరిపడా ధాన్యం అమ్మ ఇవ్వబోతే తీసుకోలేదు అతను.

“పాపగారూ సేనా మంచోరండి… ఆరికోసమే తెచ్చానండి… వద్దు వద్దండి”

ఆ రోజు నుంచీ మరింతగా ఎదురు చూసేదాన్ని అతని కోసం. అతను రాని రోజు ఏదోలా ఉండేది నాకు. అస్సలు నచ్చేది కాదు నాకు. ఒకవేళ నా గొడవ పడలేక అమ్మ ఇంకొకతని దగ్గర ఎవరిదగ్గరైనా కొన్నా ముట్టుకునేదాన్ని కాదు వాటిని.

అతనొచ్చినప్పుడు అమ్మ చెప్పేసేది కూడా ఇలా అని. నవ్వుకునేవాడతను. అంతగా అలవాటైపోయాడతను మాకు.

అలవాటయినకొద్దీ… అమ్మ తను మా కోసం ఏం వండినా కొన్నింటిని పొట్లాం కట్టి “పిల్లలున్నారంటున్నావు కదా ఇంటికి పట్టుకెళ్లమని” అతనికి నాతోనే ఇప్పించేది. తర్వాత్తర్వాత… అతను తన ముంతని మా ఇంట్లోనే తినేవాడు. కొన్నికొన్నిసార్లు అమ్మ  కూరలు కూడా వేసేది అతనికి.

“సేనా బాగున్నాయమ్మగారూ కూరలు. కడుపు నిండిపోయిందండి అనేవాడు. అతనలా అంటున్నప్పుడు అతని కళ్ళల్లోని సంతోషాన్ని గమనించిన అమ్మ అతనితో అంది ఒకనాడు…

"సర్లే అంత తెల్లారగట్టే ముంత కట్టమని మీ ఆవిడ్నెందుకు కష్టపెట్టటం.. సీతాపలపళ్ళు కావిడేసుకొచ్చినన్నాళ్ళూ... మా ఇంట్లోనే తినెయ్... నువ్వు తినే ఆ రెండు ముద్దల కోసం చలిలో లేచి ఏం చేస్తుందిలే పాపం" అని. అదిగో... రోజు విడిచి రోజూ అతను కాయలేసుకొచ్చినప్పుడల్లా... మా ఇంట్లోనే భోజనం అతనికి.

ఎంత తృప్తిగా తినేవాడో. ఎంతోప్రేమగా అమ్మ వడ్డించే అన్నం కోసం తెల్లవార్లూ ఎదురుచూసేవాడట. కోటి రూపాయలిచ్చినా కనిపించని తృప్తి... కమ్మని కూరలతో కడుపునిండా అన్నం పెడితే కనిపిస్తుందట. అమ్మ పెట్టిన అన్నం తింటూ పక్కనే కూర్చుని చూస్తున్న నాకో చిన్న కథ కూడా చెప్పాడు. నాకిప్పటికీ గుర్తే.

మనిషై పుట్టిన ప్రతివాడూ ఆకలిగా ఉన్నవాడికి అన్నం పెట్టాలట. అన్నదానం చేసిన వాళ్ళు తిన్నగా స్వర్గానికి పోయి ఎంతో సుఖపడతారట. కర్ణుడు ఎంత వీరుడైనప్పటికి అలా అన్నదానం చేయకపోవటంతో అతను చేసిన మంచి పనులకి స్వర్గానికి వెళ్లినా అంతగా సుఖపడలేకపోయాడట. అందరూ చక్కగా బంగారు వర్ణంలో చెట్లకి వేల్లాడుతున్న అనేక రకాల పళ్లను కోసుకుని తినేస్తుంటే, కర్ణునికి మాత్రం అలా కోసుకుని తింటుంటే అవి బంగారంగా మారిపోయి తినటానికి కుదిరేది కాదుట. పాపం కర్ణునికి ఆకలి తీరేది కాదుట. ఇలా ఎందుకు జరుగుతుందని దేవేంద్రుని అడిగితే నువ్వు భూమ్మీద ఉండగా అన్నదానం చేయలేదు అందుకని అన్నాడట. కర్ణుడు మళ్ళీ భూమ్మీదకొచ్చి అన్నదానం చేసి వెళ్ళాడట. అంతటివాడు కూడా అన్నదానం చేయక ఎన్నో ఇబ్బందులు పడ్డాడట. అందుకే అన్ని దానాలకన్నా అన్నదానం చాలా గొప్పదట. ఆనాడు అన్నదానం గురించి అతను చెప్పిన కథ నా మనసులో ఎంతగా ముద్రించుకుపోయిందో.

అమ్మ కూరలేనా, అమ్మ పెట్టిన అవకాయ పచ్చడంటే మరింత ఇష్టం అతనికి. చాలాసార్లు సీసాల్లో కూడా పెట్టిచ్చేదతనికి. అలా అని ఒక్కసారి కూడా ధాన్యానికి మేము కొనుక్కున్న కాయలు తప్ప, ఒక్క కాయకూడా ఎక్కువ తీసుకునేది కాదు అమ్మ. ఎన్నోసార్లు అతనివ్వబోయినా... వద్దనేది. పైగా "రెక్కలు ముక్కలు చేసుకుని తిరుగుతున్నావ్... అమ్ముకో... నాలుగ్గింజలొస్తాయ్... నీ కష్టం నాకెందుకయ్యా... ఉంచు" అనేది.

అదిగో అలాగే ఏదైనా ప్రతిఫలం ఆశించకుండా నలుగురితో పంచుకోవటం అమ్మనుంచే అలవాటైంది నాకు.

పెద్దయ్యాకా పెళ్ళిళ్ళు చేసుకుని మేమంతా ఎక్కడాళ్లం అక్కడికి వెళ్ళిపోయాక కొంతకాలానికి అమ్మకూడా కాలం చేసింది. ఉద్యోగాల రీత్యా అందరూ తలో చోట ఉండటంతో ఇంచుమించుగా అందరం ఊరికి దూరమయ్యామనే చెప్పచ్చు. ఏదో నేనే పక్కనే కొవ్వూరులో ఉండటంతో దగ్గర కాబట్టి అప్పుడప్పుడూ వెళ్ళి ఇల్లూ గుమ్మాలవీ శుభ్రం చేయించి తాళం వేసి వస్తూంటాను. తర్వాత్తర్వాత... సీజను వచ్చినప్పుడల్లా సీతాఫలాలు కొన్నా, తిన్నా ఎక్కడన్నా చూసినా గాని అమ్మతో పాటే అతనూ, అతని జ్ఞాపకాలు.

వాటితో పాటే ఒకదానివెంట మరొకటి నేను ముందంటే నేను ముందన్నట్టుగా తరుముకొచ్చే నా బాల్య స్మృతులు. కానీ ఇంత కాలానికి ఆశ్చర్యంగా గతాన్ని సజీవంగా కళ్లముందుంచుతూ అంతే శ్రావ్యంగా మళ్ళీ అదే గొంతు. నాకు అర్ధమైంది. అతను నాకోసమే వెతుకుతున్నాడని. మంచి సరుకు అమ్మేవాళ్లంటే కొనేవాళ్లకి అభిమానం ఉండటం ఒక్కటే కాదు అమ్మేవాళ్లకి కూడా కొనే వాళ్లల్లో అభిమానులుంటారన్నమాట అంతేకాదు.

నా జ్ఞాపకాల్లో అతనే కాదు అతని జ్ఞాపకాల్లో నేను కూడా సజీవంగానే ఉన్నానన్న సంగతి నాకిప్పుడే అర్ధం అయింది. ఎంత విచిత్రం? లేదంటే ఈ వయసులో ఇంత కష్టపడి నన్ను వెదుక్కుంటూ వస్తాడా? ఎంత ప్రేమ? ఎంతటి అభిమానం? వయసుని కూడా లెక్క చేయకుండా... కాళ్లల్లో సత్తువ ఇంకిపోయినా... మైళ్లకొద్దీ దూరాన్ని నడుచుకుంటూ...

అవునూ నేనిక్కడ ఈ ఊర్లో ఉంటానని, అదీగాక ఈ కాలనీలోనే ఉంటానని ఇతనికెవరు చెప్పారో? అదే అడిగానతన్ని...

తర్వాత్తర్వాత వయసు మీద పడటంతో తిరగలేక కాయలమ్మటం మానేసినా పెద్ద పెద్ద కాయల్ని చూసినప్పుడల్లా నేనే గుర్తొచ్చేదాన్నట. పోయేముందు ఒక్కసారన్నా మమ్మల్ని చూడగలనా అని చాలాసార్లు అనుకునేవాడట. ఎప్పుడైనా మా ఊరి

వాళ్ళెవరైనా కనిపిస్తే మా ఇంటి గుర్తులు చెప్పి మా వివరాలు అడిగేవాడట. అయినా తృప్తిగా ఉండేది కాదుట. ఏదైతే అదే అవుతుందని చెట్లని ముగ్గిన కాయలట్టుకుని ఊనగట్ల నుంచి నడుచుకుంటూ మధ్యలో చాగల్లుని దాటుకుని మరీ పశివేదల అంటే అదే మా ఊరు వెళ్ళాడట. ఎలాగోలా పాతబడిపోయిన మా ఇల్లు గుర్తుపట్టి చుట్టుపక్కల వాళ్లని వాకబుచేస్తే అమ్మ పోయిందని, నేను ఇక్కడ ఉంటున్నానని చెప్పారట. ఎవరో పెద్దావిడట... కోడూరి వారి వీధని నేనుండే వీధిపేరు చెప్పి

"అబ్బాయి ద్యూటీకెళ్ళాడు. తెల్లారేపాటిక్కానీ రాడు. వాడి దగ్గరుంది అడ్రసు, ఫోన్ నంబరూను. పోనీ ఉంటానంటే ఉండు వాడొచ్చేదాకా" అనేసరికి కాస్తంత నిరాశకి లోనైనా... తెల్లారేదాకా ఉంటే పళ్ళు పాడై పోతాయోమోనని అప్పటికప్పుడు రైలు కట్టమీద నుంచి నడుచుకుంటూ వచ్చేసాడట. అమ్మాయిగార్ని చూడాలనే సంకల్పం ముందు అవేవీ అడ్డంకాలేదట. మా ఊరికి ఈ ఊరికి మధ్యలో గుణ్ణం కూడా ఉంది. ఎలా దాటాడో ఏమో పాపం ఆ వయసులో అదీ అంత కారుచీకటిలో, ఊళ్ళోకొచ్చాక... వాళ్లనీ వీళ్ళనీ అడ్డంకొట్టి మా వీధిపేరు రాసున్న కాగితం ముక్క చూపించి, ఎలా వెళ్ళాలని అడుగుతూ స్టేషన్ నుంచి నడుస్తూ మా వీధికి వచ్చేసాడట. అప్పటికే పొద్దుపోవటంతో తెల్లవార్లూ గోవుపాదాల రేవులో చెట్టుకింద పడుకుని, తెల్లారగట్ట గోదావరిలో స్నానం చెయ్యటానికి వచ్చేవాళ్లని చూసి తెల్లారిందనుకుని అమ్మాయిగారు ఏ ఇంట్లో ఉంటారో, ఎలా పట్టుకోవాలీ తెలీక, ఎవర్నడిగినా ఎవరూ చెప్పరని అమ్మాయిగార్ని పట్టుకోవాలంటే ఇంక ఇదే పద్ధతి, తన గొంతు వినైనా అమ్మాయిగారు బయటికి రాకపోతారా అనే ఆశతో ఇలా తెల్లవారు ఝామున బుట్ట నెత్తిమీద పెట్టుకుని

"సీతా... ఫలప్పళ్ళు, సీతా... ఫలప్పళ్ళు..." అంటూ అరుచుకుంటూ తిరుగుతున్నాడట. వీధి ఆ చివర్నించి ఈ చివరికి.

"ఈ వయసులో నువ్వింతగా కష్టపడి వెతుక్కుంటూ రావటానికి ఆ పిల్ల నీకేం చేసిందని తాతయ్యా..." నా మాట నోట్లో ఉండగానే తరుముకొచ్చేశాడు...

"అమ్మమ్మో... ఎంత మాటన్నారండా... కాళ్లీడ్సుకుంటా ఇలా రావాలంటే కన్న పేగుబంధమే కానక్కరలేదమ్మాయిగోరు... ఆకలిగున్న కడుపుకి పెట్టిన పట్టెడు ముద్ద కూడా ఇలా లాక్కొత్తాది. ఇంతకన్నా ఇంకేటి కావాలమ్మాయిగోరూ..."

అవును, నిజమే... అంతకంటే ఇంకేమైనా కావాలా?

గుండెల్లో తడి ధారలు కదుతుంటే నోటిమాటరాక నిలుచుండిపోయాను అలా..

జ్ఞాపకం కాలాన్ని స్థంభింపచేస్తుందని ఎక్కడో చదివిన గుర్తు. అంటే బహుశా ఇదేనేమో. కాసేపటికి... ఉవ్వెత్తున ఎగసిపడే కెరటంలా గుండెల్ని దాటి తన్నుకొస్తున్న దుఃఖాన్ని గొంతు దగ్గరే అదిమిపట్టి

నా జ్ఞాపకాలు కనురెప్పల కింద కన్నీళ్ళవగా అతన్నే చూస్తూ..

"నేనే తాతయ్యా... నీ అమ్మాయిగార్ని"

అతికష్టంమీద గొంతు పెగుల్చుకుని నేనన్నమాట సరిగా వినిపించలేదో... ఏమో... కాసేపు అయోమయంగా చూసాడు. కాస్త స్వరం పెంచి మళ్ళీ అన్నాను.

"నీ గొంతు గుర్తుపట్టాను తాతయ్యా..."

"అమ్మా... నువ్వా... కనిపిచ్చేవా తల్లీ... అమ్మా... ఇలారా" అతని గొంతులో వణుకు.

అతని అన్వేషణ ఫలించిన ఆ క్షణంలో... ఆతని కళ్లల్లో కనిపించని ఆ వెలుగు కోటి సూర్యుళ్ళ కాంతితో పోటీ పడుతుంటే–

"సూత్తానో... సూడనో... సూడకుండానే పోతానేమో అనుకున్నాను తల్లీ... ఆ బెగమంతుడున్నాడు. తల్లీ... ఆ బెగమంతుడున్నాడు... తల్లీ"

ఎంతో ఉద్వేగంతో ప్రేమగా నా భుజాలని నిమరాలనే ఆ కంగారులో వణుకుతున్న చేతిలోంచి కర్రజారి కింద పడిపోగా... సత్తువలేని కాళ్ళు పట్టుతప్పి నేల మీదకి ఒరిగిపోతూంటే గబుక్కున పొదవి పట్టుకున్నాం నేనూ, నాతోపాటు అప్పుడే వాకింగ్ నుంచి తిరిగొచ్చిన మా వారూ...

# 3

# కనిపించే దేవుడు

నా పేరు బుల్లి. మా ఇంట్లో అక్కల పేర్లన్నీ ఇలాగే ఉంటాయ్. పెద్దపాపా, చిన్నపాపా, ఎర్రపాపా (నాకంటే కొంచెం తెల్లగా ఉంటుంది అది), బుల్లిపాపా అని.

తమ్ముడినేమో బాబిగాడంటారు. నేనేమో బుల్లిపాపన్నమాట.

అప్పుడప్పుడూ కొత్తినీ అనీ కొసరనీ కూడా పిలుస్తారు నన్ను. ఎందుకంటే ... నిజం చెప్పెయ్యనా... నా పైన ముగ్గురు అక్కలూ పుట్టాక ఒక్క అబ్బాయి అయినా ఉంటే బాగుండునని నాన్న ఎదురు చూశారంట. అబ్బాయి కాకుండా నేను అమ్మ కడుపున పడ్డానంట. అందుకని నేను దేవుడిచ్చిన కొసర్నంట అమ్మకి.

నా తర్వాత తమ్ముడు పుట్టాడనుకోండి.

స్కూలైపోయాక అక్కలందర్లాగా బయటికెళ్ళి ఆడుకోకుండా అమ్మకూడానే ఉంటూ అమ్మకీ అమ్మమ్మకీ చిన్నచిన్న పనుల్లో సాయం చేస్తుంటాను కదా. అలా సాయం చేసినప్పుడల్లా నేనంటే ఇద్దరికీ బాగా ముద్దొచ్చేసి వాళ్లే చెప్పేరు ఇలాగని.

మా అక్కలు ముగ్గురూ, మా తమ్ముడూ, నేనూ అమ్మమ్మా, అమ్మా నాన్నా. ఇంత మంది ఉంటాం మా ఇంట్లో. ఎప్పుడూ ఎంత సందడిగా ఉంటుందో మా ఇల్లు. మా ఇంటినిండా  పూల మొక్కలే. మా ఇంట్లో నవ్వుల్లాగే ఎప్పుడు చూసినా చెట్లన్నీ విరగబూసి ఉంటాయి.

అరవిరిసిన పూల నుంచొచ్చే సువాసనల్ని పీలుస్తూ కొబ్బరి చెట్టు నీడలో తుంగచాప వేసుకుని కూర్చుని పచ్చీసాటో, చింతగింజలో ఏదో ఒకటి అమ్మమ్మా, అమ్మా, పెద్దక్కా అంతా ఆడుకుంటుంటే వాళ్ళ పక్కనే కూర్చుని చూడటం ఎంత

ఇష్టమో నాకు. నాకు తోక లాగా మా తమ్ముడు. వైకుంఠపాళీ అయితే మా ఇద్దర్నీ కూడా ఆడనిచ్చేవారు. ఆడుతూ ఆడుతూ మధ్యలో లేచెళ్ళి మా అందరికీ ఏదో ఒకటి తెస్తుంది అమ్మ తినటానికి.

మేమందరం పిల్లలం కదా. అస్తమానూ మాకు నోరు ఆడించాలనుంటుందని అమ్మా అమ్మమ్మా మాకేమి వండాలా అని ముప్పొద్దులా మా తిండి గురించే ఆలోచిస్తూంటారు. అమ్మమ్మైతే మినుములు వేయించి తిరగలిలో సున్నిపిండి విసురుతుంది. అప్పుడప్పుడూ శెనగపిండికూడా. అందుకే ఎప్పుడూ మా ఇంట్లో మినప సున్నుండలో, పప్పు చెక్కలో, రాగి పొంగడాలో, చిమ్మిలుండలో ఏవో ఒక చిల్లర తిండి ఉంటూనే ఉంటుంది.

అప్పుడప్పుడూ మా తమ్ముడు తినకుండానో, సగం తినో మిగతాది పడేస్తా ఉంటాడు. నేనయితే అస్సలు పడెయ్యకుండా తినేస్తాను. ఎందుకో తెల్సా... పాపం అమ్మ, ఒక్కొక్కసారి అమ్మమ్మ కూడ పొయ్యి దగ్గర కూర్చుని వండుతారు. వండేటప్పుడు ఆ పొగంతా కళ్ళల్లోకి వెళ్ళి వాళ్ళకి కళ్ళు మండుతాయికూడా. ఒక్కోసారి పుల్లలు పచ్చిగా ఉంటే పొయ్యి మండేది కాదు. అప్పుడు గొట్టాంపెట్టి "ఉప్ఫూ... ఉఫ్ఫూ..." అంటూ పొయ్యి ఊదుతూనే ఉంటారు. పాపం ఎంత కష్టమో కదా అలా. అందుకే అవ్వన్నీ గుర్తొచ్చి పడెయ్యకుండా తినేస్తాను.

అలా కమ్మకమ్మగా అమ్మ, అమ్మమ్మ వండినవి తింటూ సాయంవేళ చల్లగాలికి ఆరుబయట దొడ్లో పట్టె మంచం మీద వెల్లకిలా పడుకుని ఆకాశంలోని నక్షత్రాల్ని ఎన్నిసార్లు లెక్కెట్టామో లెక్కేలేదు వాడూ, నేనూ. అలా లెక్క పెట్టేటప్పుడల్లా టప్పున మా మీద పడ్డ కొబ్బరి పువ్వు మా లెక్కల్ని మళ్ళీ మొదటికి తీసుకొచ్చేది. నాకంటే బాబిగాడు ఒక్క సంవత్సరమే చిన్నోడు. అందుకే మేమిద్దరం జతకట్టు.

వేసవికాలంలో కొబ్బరి చెట్టు కింద అలా దొడ్లో పడుకోవటం అంటే ఎంతిష్టమో శీతాకాలంలో చలికి జడిసి తలుపులన్నీ వేసేసుకుని ఇంట్లో పడుకోవటం కూడా అంతే ఇష్టం నాకు. అమ్మమ్మా, అక్కలూ, నేనూ మావాడు అందరం మధ్య గదిలోనే పడుకునే వాళ్ళం. అందరి మంచాలూ పట్టేటంత పెద్ద గది అది. చిన్నవాళ్ళం అవటంతో నేనూ మా బాబిగాడూ ఒకే మంచం మీద పడుకునేవాళ్ళం. అమ్మేమో వసారా

మీదున్న నాన్నగారి గదిలో పడుకునేది. నాన్నెప్పుడైనా ఊరెళితే అమ్మకూడా మాతోపాటే.

పల్లెటూరు కావటంతో పెందలాడే అన్నాలు తినేసి ఎనిమిదిన్నరకే పడుకుండిపోయే అలవాటు మాకు. అలా పెందలాడే నిద్రపోయే మాకు శీతాకాలంలో రాత్రి పొద్దెక్కువ కావటంతో తెల్లారగట్ట నాల్గింటికే మెలకువొచ్చేసి ఇక నిద్రపట్టేది కాదు.

మా అమ్మమ్మైతే మాకంటే ముందే లేచి కుంపటి రాజేసి అందులో చిన్న చిన్న గోగుపుల్లలేసి సన్నగా మంట చేసేది.

అంతే... ఆ వెలుతురుకి, వెచ్చదనానికి ఠక్కున మంచాలు దిగేసి కుంపటి ముందుకు చేరిపోయేవాళ్లం. అలా అందరం కుంపటి చుట్టూ కూర్చుని చలి కాగుతూ కాగుతూ ప్రశాంతంగా ఉండే ఆ తెల్లవారు ఝామున అమ్మమ్మ చెప్పే సుమతీ పద్యాలూ, వేమన పద్యాలు, పొడుపు కథలూ వినటానికి ఎంత బాగుంటాయో.

అవన్నీ అప్పటికే నాకొచ్చేసును. అయినా బళ్ళో మా మాస్టారిలా కాకుండా అమ్మమ్మ ఇంకోరకంగా పాడుతుందేమో వింటే ఏదో కొత్తగా మధురంగా ఉంటుంది. వాటితో పాటు "కొరగామయ పెమ్మయ సింగదీవెన" అంటూ మాకు తెలియనివి, ఏవేవో కొత్తవి కూడా చెబుతుంది అప్పుడప్పుడూ...

పద్యాలే ఇలా ఉంటే ఇక కథల సంగతో ?

అమ్మమ్మ కథలు చెప్పిందంటే... చెవులు రిక్కించి మరీ వింటాం... పేదరాసి పెద్దమ్మ కథలూ, ఒంటి కొమ్ము రాక్షసుడి కథలూ వర్ణించి అమ్మమ్మే చెప్పాలి. పాపం నక్క. వట్టి పిచ్చిముండ అది. ఏ కథ విన్నా అందులో నక్క ఎంత మోసకారో. కానీ అమ్మమ్మ చెప్పే కథల్లో మాత్రం నక్క చాలా మంచిది. అస్సలు ఎవర్నీ మోసం చెయ్యదు.

అమ్మమ్మ కథలు చెబుతుంటే వింటూ వింటూ అమ్మమ్మ పక్కకి చేరిపోయి అమ్మమ్మని వాటేసుకుని పడుకుంటాం. అమ్మమ్మని అలా పట్టుకుని పడుకుంటే ఎంత పెద్ద పెద్ద రాక్షసుల కథలు విన్నా మా కస్సలు భయం వెయ్యదు.

భయం అంటే గుర్తొచ్చింది... వర్షాకాలంలో ఒక్కోసారి పెద్ద పెద్ద ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసేవి. వర్షంతోపాటు ఉరుములూ, మెరుపులూ కూడా వస్తే ఇక చెప్పనే అక్కర్లేదు. కళ్ళూ చెవులూ కూడా మూసేసుకుని భయంతో ముడుచుకుపోయేవాళ్ళం. కళ్ళు తెరిస్తే ఒట్టు. అమ్మమ్మ మా భయం పోగొట్టటానికని తన రెండు చేతుల్నీ మా అందరి మీదా వేసి ఉరుము ఉరిమినప్పుడల్లా...

"అర్జునా ఫల్గుణా... అర్జునా... ఫల్గుణా అర్జునా.. ఫల్గుణా... పార్ధకిరీటీ..."

అంటూ మమ్మల్ని కూడా అనమనేది. భయంతో కళ్ళు మూసుకునే, చెవుల్లో వేళ్ళు తియ్యకుండా అమ్మమ్మ అనమన్నట్లుగా అనేవాళ్లం. అలా అంటే పిడుగులు పడవట. అన్నట్టు మీకు పిడుగంటే ఏంటో తెల్సా?

అర్జునుడు రథం ఎక్కి పైన ఆకాశంలో తిరుగుతుంటే ఆ రధం సీల ఊడిపోయి కిందకి పడిపోతుందట. అలా కిందపడేటప్పుడు వచ్చే శబ్దమేనట పిడుగంటే. పిడుగు అంటే ఏంటని ఒకసారి అడిగితే అమ్మమ్మే చెప్పింది ఇలా అని. లేకపోతే నాకేం తెల్సు.

వర్షం కురిసేటప్పుడు ఇలా ఉరుములూ మెరుపులు కూడా వస్తుంటే మేమెక్కడ భయపడతామోనని అమ్మ కూడా మాతోపాటే పడుకునేది. అంతే... తమ్ముడు నన్నొదిలి అమ్మ పక్కలో చేరిపోయేవాడు. అమ్మ మా దగ్గర పడుకున్నప్పుడల్లా అమ్మ పక్కలో పడుకునేవాడు. అమ్మకి రెండో పక్క నేను పడుకుంటానన్నా ఒప్పుకునేవాడు కాదు. అప్పటిదాకా వాడి దగ్గరున్న బొమ్మలేవైనా "ఒక్కసారి ఆడుకుని ఇచ్చేస్తాన్రా తమ్ముడూ" అని ఎన్ని సార్లడిగినా ఇవ్వని వాడు... అమ్మ పక్కలో పడుకున్నప్పుడు మాత్రం ఆ బొమ్మల్ని నాకిచ్చేసేవాడు. నేను తీసుకునే దాన్ని కాదనుకోండి. అమ్మ పక్కన పడుకోవటం కంటే నాకు మాత్రం ఏమి ఇష్టం ఉంటుంది ఆ బొమ్మలంటే.

ఒకసారిలాగే వారం రోజులు ముసురు పట్టి ఏకధాటిగా వర్షాలు పడుతూనే ఉన్నాయి. చిన్న నాయనమ్మని తీసుకుని రెండు రోజుల్లో వచ్చేస్తానని తాతయ్య వాళ్ల ఊరు వాదాలకుంట వెళ్ళిన నాన్న వర్షాల వల్ల దారుల్లేక నాలుగు రోజులైనా రాలేదు. పైగా నాన్న దగ్గర్నుంచి ఎలాంటి కబురూ లేకపోవటంతో, ఏమైపోయారో ఏంటోనని

అమ్మకీ, అమ్మమ్మకీ ఒకటే దిగులు. నాలుగు రోజులకొచ్చారు నాయనమ్మని తీసుకుని. విస్తారంగా కురిసిన వర్షాలకి వాగులూ వంకలూ పొంగి పొరులుతుంటే... రోడ్లన్నీ కొట్టుకు పోయాయట. బస్సులు తిరక్క ఆగిపోయారట. నాన్న ఒక్కరూ అయితే ఎలాగైనా వచ్చేసేవారట. కానీ నాన్న తన కూడా చిన్న నాయనమ్మని తీసుకు వస్తూండటంతో పెద్దావిడతో ఇబ్బందవుతుందని ఆగిపోయారట. ఎంత మంచోరో కదా నాన్న. నాన్నకీ జై.

చిన్న నాయనమ్మని అప్పుడెప్పుడో నా చిన్నప్పుడు చూశాను. కానీ ఇన్ని రోజులు వరసగా చూడ్డం ఇదే. చిన్న నాయనమ్మ నాకెంతో నచ్చిందో. సన్నగా, పొడుగ్గా, తెల్లగా అచ్చం నాన్నలాగే ఉంది. ఎప్పుడూ తెల్లటి చీరలే కట్టుకుంటుంది. కానీ జాకిట్టు వేసుకోదు. చుట్టూ చెంగు కప్పుకుంటుంది.

అందరాల్ల చిన్నమ్మమ్మ జాకిట్టు వేసుకోదని పెద్దక్కా, చిన్నక్కా ఏవేవో గుసగుసలుగా చెప్పేసుకుని నవ్వుకున్నారు కూడా... నేనయితే నవ్వలేదనుకోండి...

ఎందుకంటే అది నాయనమ్మ ఇష్టం కదా...!

లేదంటే ఒకవేళ అమ్మమ్మ చెప్పే కథల్లోలా... నాయనమ్మని జాకిట్టు వేసుకోవద్దని ఏ మునీశ్వరుడైనా శాపం పెట్టాడేమో... తెలీదు.

రాములోరి పాదం తగిలాకా కదా రాయి అహల్యమ్మగా మారి తనెందుకు అలా అయ్యిందో చెప్పింది. నాయనమ్మ కూడా ఎప్పుడైనా చెప్పుద్దేమోలే తర్వాత.

మీకింకో విషయం చెప్పనా చిన్న నాయనమ్మ మెడ చుట్టూ అదోలాంటి గొలుసు ఉంటుంది. పట్టెడ అంటారంట దాన్ని. అమ్మ చెప్పింది. బంగారందేనంట. ఎంత బాగుంటుందో. చిన్న నాయనమ్మ మాట్లాడేటప్పుడు అది కూడా కదులుతుంది. అందుకే చిన్న నాయనమ్మ మాట్లాడేటప్పుడు నేను అదెలా కదులుతుందో చూస్తూ ఉంటాను.

చిన్న నాయనమ్మతోపాటే కొత్త కథలూ, పద్యాలూ... పొడుపుకథలూ ఇంకా కొత్త కొత్త ఆటలూ, మరి కొన్ని నవ్వులూ చాలానే వచ్చాయి మా ఇంట్లోకి.

అమ్మమ్మకి వచ్చినట్టే చిన్న నాయనమ్మకి కూడా చాలా పాటలొచ్చు. "కస్తూరి రంగ రంగా ... మాయన్న కావేటి రంగరంగా..." లాంటి నేనెప్పుడూ వినని కొత్త కొత్త పాటలు.

వచ్చిన మొదట్లో ఎక్కువగా మాట్లాడేది కాదు చిన్న నాయనమ్మ. మౌనంగా కూర్చునేది. అప్పుడప్పుడూ మాకు వినపడకుండా అమ్మమ్మతో ఏవేవో గుసగుసలుగా చెప్తూ కళ్లనీళ్ళెట్టుకునేది. మమ్మల్ని చూసి మామూలుగా అయిపోయేది. ఎందుకో మాకు అర్ధం అయ్యేది కాదు.

ఒకసారి మాత్రం వినేసాను. చిన్న నాయనమ్మ అమ్మమ్మతో ఏదో చెబుతూ మమ్మల్ని చూసుకోకుండా కళ్ళనీళ్ళెట్టుకుంటుంటే–

"ఊరుకో వదినీ... మీ అబ్బాయైతే ఒకటీ మీ అప్పగారబ్బాయైతే ఒకటీనా? ఇదీ మా అబ్బాయి ఇల్లే అనుకోండి. మీరలాటిదేదీ పెట్టుకోకండి. అబ్బాయి మంచోడు. ఒక్కత్తే ఆడనలుసవటంతో కొడుకుల్లేక నేనుంటల్లేదా నాకూతురింట్లో.

ఆ మాటకొస్తే నాకేవక్కుందని... ఈ ఇంట్లో ఉంటాకి. అబ్బాయి బాగా సూత్తాడనే ఉండగల్గుతున్నాను. ఒక్క మగనలుసన్నా లేకపోయాడే అనే తలంపు ఎప్పుడూ రానివ్వలేదు నాకు. నా అల్లుడు బంగారం. ఏనాడు ఒక్కమాటన్నా అనెరగడు. ఎంత బాగా సూత్తాడో. రాగానే అడుగుతాడు "అత్తయ్యా అన్నం తిన్నారా?" అని. కడుపు నిండిపోద్దనుకో...

ఎంతబెమో... పెద్దోళ్లంటేని. ఈ వయసులో ఇంత కంటే ఇంకేం కావాలొదినా? మనేదెట్టుకోకండి ... అన్నీ అయ్యే సద్దుకుంటాయ్.' అని అమ్మమ్మ అంటుంటే విన్నాను. కానీ వాళ్ళు మాట్లాడుకుంటున్నది నాన్న గురించీ, బాబాయ్ గురించీనని.

అర్ధం అయినా ఆ సూత్తం అంటే ఏంటో ఎంతకీ అర్ధం కాలేదు నాకు. స్కూలికెళ్ళేటప్పుడు చిన్నక్కనడిగేను. "నువ్వెక్కడున్నావే బుల్లీ" అనడిగింది. చెప్పేను.

"అదా... సూత్తం అంటే ఏటంటే... అమ్మమ్మని నాన్న సూత్తన్నారు కదా అదన్నమాట... అలాగ సిన్న నాయనమ్మని బాబాయ్ సూడాలంట.. నాకూ తెలవదు. నాకు పెద్దక్క చెప్పింది. "అంది...

"అదే అడుగుతున్నాను... సూత్తం అంటే ఏదో తెలుత్తాలేదు. అమ్మమ్మకి అమ్మ పుట్టింది... నాయనమ్మకి నాన్న పుట్టేరు. నాయనమ్మేమో చచ్చిపోయింది అనుకో. అందరం ఒకే ఇంట్లో ఉంటన్నాం కదా. అలాగే ఉండాలి కదా... మరి సూత్తం అంటే ఏటి?"

"ఏమోబాబూ... నాకు తెలవదు ఇలాటియ్యి... నన్నడక్కే బుల్లీ" అంటూ తన క్లాసులోకి వెళ్ళిపోయింది.

క్లాసులోకి పోయి కూర్చున్నానన్నమాటే గాని ఎన్ని ప్రశ్నలో... అన్నీ సందేహాలే నా బుర్రనిండా...

"అవును... సూత్తం అంటే ఏటి? అమ్మమ్మ అంది ఎంత బాగా సూత్తాడో... రాగానే అత్తయ్యా అన్నం తిన్నారా అనడుగుతారు అని. అలా అడిగితే బాగా సూసినట్టా అంతే అయ్యుంటది. అయితే నేనూ అందర్నీ అన్నం తిన్నారా అనడుగుతాను... నేనూ బాగానే సూసినట్టవుతుంది కదా... అవును. అంతే.

నేనలా అడిగినప్పుడల్లా అందరూ నవ్వుతుంటే నాకేమీ అర్ధమయ్యేది కాదు.

ఆ రోజు రాత్రి బాగా పొద్దుపోయాకా... మా చిన్న నాయనమ్మని చూడ్డానికి మా అత్తయ్యొచ్చింది పొరుగూర్నుంచి. అత్తయా, బాబాయ్ ఇద్దరేనట చిన్న నాయనమ్మకి. వస్తూనే చిన్న నాయనమ్మని చూసి ఏడ్చింది. ఎందుకోమరి. నాన్న గదిమారు అత్తయ్యని అలా ఏడవద్దు నేనున్నానుగా అని.

అమ్మల్ని చూస్తే ఎవరికైనా సంతోషం కలగాలి గాని ఏడుపెందుకొస్తుందో. అలా నిలబడే అత్తయ్యవైపు సందేహంగా చూస్తుంటే 'రేపు బళ్ళోకెళ్ళాలి. పదండి పడుకుందురుగాని. పొద్దుపోయింది." అంటూ మమ్మల్ని తీసుకుని గదిలోకొచ్చేసింది అమ్మ.

మర్నాడు మేము లేచేసరికి ఫస్ట్ బస్‌కి అత్తయ్య వెళ్ళిపోయింది.

స్కూలుకి వెళ్ళటానికి తయారై అమ్మమ్మకి బై చెబుదామని వెళ్ళేసరికి చిన్న నాయనమ్మ మళ్ళీ అంటోంది అమ్మమ్మతో...

"…. రామ్మా … నా దగ్గరుందుగాని, అన్నయ్య చూడకపోతే నేను లేనా అని మాటవరసకన్నా ఒక్క ముక్క అందేమో సూసేరా వదినీ నా కూతురు. పరాయోళ్ళొచ్చి నట్టు ఏదో సుట్టం సూపుగా వచ్చి తెల్లారేపాటికి ఎల్లిపోయింది. దాంతో దాని బాద్దెత తీరిపోయిందనుకుంది. నేనెల్లినా ఎల్లకపోయినా ఆ ఒక్క మాటంటే ఈ ముసలిపేనానికి ఇంత బుదుండునా… నువ్వే సెప్పొదినా…"

మళ్ళీ అదే సందేహం… సూత్తం అంటే ఏంటో…?

చాన్నాళ్ళకి సక్కుబాయ్ చెప్పింది అంటే ఏదో… అది నాకంటే ఒక క్లాసెక్కువ. దానికన్నీ తెలుసని పెద్ద ముదినాపసాననే పేరుకూడా ఉంది దానికి.

అదీ నేనూ ఎప్పుడైనా తొక్కుడు బిళ్ళాట ఆడుకుంటూంటాం. సక్కుబాయ్ ఏం చెప్పిందంటే…

"మనకి నడవటం రానప్పుడు అమ్మానాన్నలే కదా మనకి నడక నేర్పి, అన్నం అదీ తినిపిస్తారు. వాళ్ళు పెద్దోళ్ళయ్యే కొద్దీ మళ్ళీ చిన్నపిల్లల్లాగే అయిపోయి వాళ్ళేమీ తినలేకపోతే మనమే తినిపిత్తాం, నడవలేకపోతే నడిపిత్తాం, వాళ్లకి ఒంట్లో బాగాలేకపోతే డాక్టర్ గారికి చూపిచ్చి మందులవీ వెయ్యటం, మనకి చిన్నప్పుడు వాళ్ళేమేమీ చేసేరో అన్నీ మనం ఆళ్లకి చెయ్యటమన్నమాట సూత్తం అంటే. ఆళ్లకి మనం సేత్తే మన పిల్లలు మనకి సేత్తారన్నమాట. అర్థమయ్యిందా…?"

"అయ్యిందీ… కానీ… కానీ మరి నాన్న చిన్న నాయనమ్మకి పుట్టలేదుగా. మా నాయనమ్మ ఎప్పుడో చచ్చిపోయిందిగా… మరి చిన్న నాయనమ్మని బాబాయ్ చూడకపోతే అత్తయ్యుందిగా అక్కడికెళ్లచ్చుగా…"

"ఓసి… బోడి మొకవా… అదా నీ గోల…" అంటూ నా నెత్తిమీద ఒక్కటి మొట్టి చెప్పిందది.

"తల్లిదండ్రులు పెద్దాళ్లయిపోయాకా కొడుకుల దగ్గరే ఉండాలి. కూతుళ్ల దగ్గర ఉండకూడదంట. అమ్మ అమ్మమ్మకి ఒక్కతే కాబట్టి అమ్మ దగ్గరే ఉంటుందంట. అవును మరి ఒక్కళ్లే ఉంటే అమ్మమ్మల్ని అమ్మలు కాక ఇంకెవరు చూస్తారు పాపం. అమ్మెంత మంచిదో… అమ్మకీ జై.

నిజానికి అలాక్కూడా ఉండకూడదట. ఇదీ సక్కుబాయే చెప్పింది. అలా ఉంటానంటే అందరి నాన్నలూ ఒప్పుకోరట. కాని, నాన్నలలాంటి మంచి వాళ్ళు అయితే ఉండనిస్తారట. నాన్నెంత మంచోరో. అమ్మమ్మని ఉండనిస్తున్నారు.

కానీ... కానీ అంతమంచి అమ్మా నాన్నల్ని పెద్దయితే ఎవరు చూడాలి? అదే అడిగాను సక్కుబాయ్‌ని..

"మీ తమ్ముడున్నాడుగా... వాడే చూడాలే పిచ్చిమొహమా... అందుకే ఒక్క మగముండగాడన్నా పుడితే చాలని చూస్తా ఉంటారీ పెద్దాళ్ళు. అమ్మో తక్కువోళ్లేం కాదు ఈ పెద్దోళ్ళు. తల్లిదండ్రుల్ని మాగాళ్ళే చూడాలని ఎప్పుడో మనం పుట్టక ముందు పూర్వీకులు చెప్పారంట.. ఆడాళ్లం మనవెంత ప్రేమగా చూసినా కోడలు విసిరే ముద్దకోసవే పడిచస్తారీ ముసలోళ్ళు... కూతుళ్ళ దగ్గరుంటే పరువు పోయిందనుకుంటారు..."

'మరి... మరి... అమ్మమ్మ అలా అనుకోవటం లేదుగా...'

'ఎలా అనుకుంటుంది... కొడుకులు ఉండి కూడా కూతుళ్ళ దగ్గర ఉండాల్సొస్తే బాధ కాని... కూతురొక్కత్తే ఉంటే వాళ్ళ దగ్గరుండక ఇంకెవరి దగ్గరుంటారే... అయినా బుల్లీ... ఇవన్నీ నీకెందుకే?... నన్నే పెద్ద ముదినాపసాన్నని అంటారు. నాకంటే పెద్ద ముదినాపసానల్లే ఉన్నావు...'

నాకెందుకో మనసంతా ఒకలా అయిపోయింది. బుర్రనిండా ఎన్నో ప్రశ్నలు

తమ్ముడున్నాడు కాబట్టి అమ్మా, నాన్నా నా దగ్గరకీ, అక్కల దగ్గరకీ రారు. సక్కుబాయ్ చెప్పిన దాన్నిబట్టి రాకూడదు. మరి తమ్ముడు చూస్తాడా అమ్మానాన్నల్ని? ఒకవేళ వాడు చూడకపోతే? బాబాయ్... చిన్న నాయనమ్మని చూడనట్టు వీడు అమ్మా నాన్నల్ని చూడకపోతే అక్కలు పట్టించుకున్నా పట్టించుకోకపోయినా దేవుడిమీదొట్టు, అమ్మా నాన్నల్నీ నేను చూస్తాను. అమ్మమ్మనీ, చిన్ననాయనమ్మనీ కూడా. కానీ ఆడపిల్లని కదా... పరువు తక్కువని అమ్మా నాన్నా నా దగ్గర ఉండకపోతే? నాకు తెల్సు వాళ్లతో పాటే ఉండే అమ్మమ్మా, నాయనమ్మ కూడా రారు. అపుడేమవుతుంది? అమ్మా నాన్నా ఎక్కడుంటారు పాపం?

ఎందుకో అమ్మమ్మ కథల్లో చెప్పే అడవిలోని జంతువులు గుర్తొచ్చి బాధేసింది.

పాపం వాటికి ఇళ్ళుండవు కదా... అందుకని వానొచ్చినా కూడా చెట్లకిందో, చెట్టమీదో అలా తడుస్తూనే ఉంటాయి. అయినా తమ్ముడు చూడనప్పుడు కదా ఇవన్నీ? మరి చూస్తాడంటావా?... చూడడంటావా? ఏమో?

ఆలోచిస్తుంటే ఒక్కసారిగా ఒళ్ళు జలదరించినట్టయింది నాకు. ఎందుకంటే? అప్పటిదాకా చిన్న చిన్న చినుకులతో కురిసే వర్షం ఒక్కసారిగా పెద్ద పెద్ద ఉరుముల్నీ, మెరుపుల్నీ తోడేసుకుని పెద్దదైపోయింది.

వర్షానికి ఫీజులు కొట్టేసి కరెంటెక్కడ పోతుందోనని అమ్మమ్మకీ, చిన్న నాయనమ్మకీ, మా అందరికీ అన్నాలు పెట్టేసింది అమ్మ. తినెయ్యమని ఎన్నిసార్లడిగినా అమ్మ తినలేదు.నాన్నొచ్చేదాకా ఎప్పుడూ అన్నం తినదు అమ్మ. ఇప్పుడూ అంతే. నాన్నంటే ఎంతిష్టమో అమ్మకి. నాన్నక్కూడా అంతే అమ్మంటే.

ఇలాంటి అమ్మా నాన్నల్ని తమ్ముడు చూస్తాడో? చూడడో?

అదెలా తెలుస్తుంది నాకు? అనుకోకుండా వాడివైపు చూసాను.

అప్పటికే అన్నం తినేసి అమ్మ పక్కకి చేరి చెంగులో దూరిపోయి ముణగ దీసుకుని పడుకున్నాడు వాడు. వాడికి చలి తగలకుండా అమ్మ తన పైటచెంగుని వాడి చుట్టూ కప్పింది. వాడలా అమ్మని వాటేసుకుని చుట్టేస్తే అమ్మని చూస్తాడనే అనిపించింది ఆ కాసేపూ.

ఇంతలో చిన్ననాయనమ్మ అమ్మతో అంది.

"చిన్నప్పుడు... మీ మరిది కూడా ఇంతేనమ్మా... ఉరుములూ మెరుపులూ వస్తే జడిసిపోయి, నా పొట్టలో దూరిపోయి... నా పైట చెంగుని చెవుల్లో కూరేసుకునే వోడు... ఉరుములు తగ్గాయి లేవరా నాయనా అన్నా లేచేవాడు కాదు ..."

చిన్న నాయనమ్మ బాబాయ్ చిన్నప్పటి సంగతుల్ని తలచుకుంటూ నవ్వుతుంటే అమ్మనీ, తమ్ముడ్నీ మార్చి మార్చి చూసాను. చిన్నప్పుడలా చేసిన బాబాయ్ పెద్దయ్యాకా చిన్న నాయనమ్మని చూడటం లేదు... మరి తమ్ముడో ? ఇప్పుడిలా అమ్మ ఒడిలో

దూరి దూరి పడుకుంటున్నాడు. అచ్చం చిన్నప్పటి బాబాయ్‌లా... మరి పెద్దయ్యాకా వీడూ అంతేనా?

ఈ సందేహం ఎలా తీరుతుంది...?

ఆలోచిస్తున్నంతలో... పేద్ద ఉరుము. ఎక్కడో పిడుగుపడినట్టుంది. మా దొడ్లోనే పడిందా అన్నంత శబ్దమూ, మెరుపూను. ఒక్కంగలో అమ్మని చేరి వెనకనించి వాటేసుకున్నాను.

“అర్జునా... ఫల్గుణా... అర్జునా... ఫల్గుణా...” అమ్మమ్మ చిన్నగా గొణగటం మొదలెట్టేసింది. మేము కూడా. రెండో అక్క తప్ప.

రెండో అక్కకి రాముడంటే బాగా ఇష్టం. రాములోరి గుడికాడ శ్రీరామనవమి పండక్కి చెంబులు చెంబులు పానకం తాగుతూనే ఉంటుంది సాయంత్రం దాకా. అది మాత్రం రామా... అని అనటం మొదలెట్టింది చెవుల్లో వేళ్ళుంచుకునే.

అదెప్పుడూ అంతే లెక్కలు చేసేటప్పుడు ఆన్సరు త్వరగా రాకపోయినా, డిక్టేషన్ చెప్పేటప్పుడు స్పెల్లింగు రాకపోయినా కూడా రామా రామా అని గొణుక్కుంటూనే ఉంటుంది నోట్లో నోట్లో.

అంతలోనే మళ్ళీ... మెరుపూ... ఉరుమూ అదేం పట్టనట్టు వెన్నంటే కుండపోతగా కురుస్తున్న వర్షం. అకస్మాత్తుగా చిన్న నాయనమ్మంది. రెండో అక్క బుగ్గ గిల్లుతూ...

“ఊరందరిదీ ఒకదారియితే ఉల్లిపొట్టుది ఇంకోదారట. అందరూ... అర్జునా ఫల్గుణా అర్జునా అంటుంటే నువ్వు రాముడంటున్నావేమే...”

“దానికి రాముడంటే బాగా ఇష్టం...” అమ్మమ్మంది.

‘అవున్లే ... ఇంకేం కావాలెవరికైనా...’ చిన్న నాయనమ్మ రెండో అక్కని మెచ్చుకోవటం చూసి కాబోలు... మూడో అక్క

“నాయనమ్మా ... నాయనమ్మా మరేమో ... నాకేమో ... కుమార స్వామంటే...” అని చిన్న నాయనమ్మని కుదిపి కుదిపి మరీ చెప్పింది.

'నా బంగారవే .. నాకూ ఆయనంటేనే ఇష్టమే తల్లీ ..” కాస్తంత పొగిడేసరికి చీకట్లోనే మా అందరివైపు గర్వంగా చూసింది మూడో అక్క.

చిన్న నాయనమ్మ మాటలు ఇంకా పూర్తయ్యాయో లేదో అప్పటిదాకా బిక్కుబిక్కుమంటూ భయంగా అమ్మ ఒళ్ళో పడుకుని అన్నీవింటున్న తమ్ముడు రకాల్న లేచి కూర్చుని

“నాకెవరిష్టమో చెప్పనా నాయనమ్మా ... చెప్పేస్తున్నా ... చెప్పేస్తున్నా ... చెప్పెయ్యనా...”

“చెప్పెహ్హా ...” విసుక్కుంది ఎర్రక్క.

అందర్నీ ఆశ్చర్య పరుస్తూ .. చెప్పేస్తున్నా ... చెప్పేస్తున్నానంటూ మరి కొంచెంసేపు మా అందర్నీ ఎదురు చూసేలా చేసి అప్పుడు చెప్పాడు.

“పుల్లలు కొట్టే దేవుడు...”

ఎవ్వరూ మాట్లాడలేదు కొంచెంసేపు. నేనైతే అయోమయంగా చూసాను వాడివైపు. పుల్లలు కొట్టే దేవుడు. అవును నిజంగానే ఉన్నాడు. పుల్లలు కొట్టే గొడ్డలిని భుజాన వేసుకుని ఊరంతా తిరుగుతాడు. కూలికి ఊర్లో అందరికీ పుల్లలు కొట్టిపెడతాడు.

బాబాయ్ అప్పుడప్పుడూ ఎడ్లబండి మీద వాదాలకుంట నుంచి ఎండు పుల్లలు పంపించేవాడు. అందులో అడుగున పెద్ద పెద్ద దుంగలు (మానులు) కూడా ఉండేవి.

అమ్మ సన్నగా, చిన్నగా ఉండే పుల్లలన్నీ ముందు పొయ్యిలో పెట్టేసేది. ఆ తర్వాత కాస్త పెద్దవి. అవన్నీ అయిపోయేదాకా ఆ పెద్ద పెద్ద మానులన్నీ అయిపోతాయనగా పుల్లలు కొట్టే దేవుడ్ని పిలిచి డబ్బులిచ్చి అతనితో ఆ దుంగల్ని పుల్లలుగా కొట్టమనేది. అతని పేరే దేవుడు. అదేం పేరమ్మా అనడిగితే అమ్మ చెప్పింది.

తూర్పు ప్రాంతాల్లో నివసించేవాళ్ళు అలాంటి పేర్లే పెట్టుకుంటారట.

అలా అప్పుడప్పుడూ మాక్కూడా ... పుల్లలు కొట్టటంతో అతను నాకూ తెల్సు.

అయితే, అతను మనిషి. రాముడు, కుమార స్వామిలాగా దేవుడెలా అవుతాడు? మరి తమ్ముడు అతన్నెందుకు ఇష్టమని చెప్పాడు?

నా ఆలోచనల్లో నేనుండగానే మా పెద్దక్క ..

వాడి నెత్తిమీద మెల్లగా ఒక్కటి మొట్టి “పుల్లలు కొట్టే దేవుడా...? అతనంటే నీకెందుకిష్టంరా... కొంటె వెధవా...” అంది నవ్వుతూనే.

“ఎందుకా ... ఎందుకా ... ఎందుకంటే చెప్పనా ... అప్పుడప్పుడూ అమ్మకి పుల్లలు కొట్టిస్తాడుగా అందుకని. నేనేమో ... నేనేమో ... ఇంకా చిన్నోణ్ణే గదా ... నేను కొట్టలేనుగా...”

నా సందేహం తీరిపోయింది.

మెల్లగా తమ్ముడి పక్కన చేరి వాడ్ని ప్రేమగా వాటేసుకున్నాను.

౨౨౨

# 4
# అమ్మమ్మ కానుక

మోకాళ్లపై నుండి బిగుతుగా పైకి లాగి దోపిన మాసిపోయిన తెల్లని పంచె, అప్పుడే మూటలోంచి తీసారా అన్నంతగా నలిగిపోయి రంగుమారిన పొడుగు చేతుల చొక్కా, భుజంమీద గోరంచు తువ్వాల, ఒక పక్క ఫ్రేము విరిగిపోతే పురికొసతో కట్టి చెవి వెనగ్గా తీసిన కళ్లజోడు... అంగుళానికి పైగా అడ్డదిడ్డంగా తెల్లని పెరిగిన గడ్డం, చేతిలో కర్ర.

అంతకు పది నిమిషాలముందు నుంచీ కూతురికి రాసిన ఉత్తరాన్ని చేత్తో పట్టుకుని పాతకాలపు ఎత్తు అరుగుల పెంకుటింటి స్థంభానికి చేరబడి అక్కడే నిలబడి ఉన్న భానుమతి దశరథరామయ్య తమ ఇంటివైపే రావటం దూరం నుంచే గమనించి అరుగు దిగి కిందికి వస్తూ “రండి మావయ్యా...” అంది గొంతునిండా ప్రేమ నింపుకుని అతన్ని ఆహ్వానిస్తూ ...

మెల్లగా వచ్చి గుమ్మానికెదురుగా రోడ్డుమీదే నిలబడి తలెత్తి కళ్లజోడులోంచి భానుమతికేసి చూస్తూ ...

“ఏమ్మా ...గుమ్మంలోనే నిలబడ్డావ్ ...అబ్బాయి కోసవా?” అన్నాడు నవ్వుతూ

“లేదు మావయ్యా. అమ్మాయికి ఉత్తరం రాశాను. పోస్టు బాక్సులో వేయించ టానికని పిల్లలెవరైనా కనిపిస్తారేమోనని చూస్తున్నాను. పైకి నడవండి ... అరుగుమీద కుర్చీలోకి?” అంటూ అతని దగ్గరకంటా వెళ్ళి చేయి పట్టుకుంది మెట్లెక్కటానికి సాయం చేస్తానన్నట్లుగా ...

అయితే పైకి రాలేను ఇక్కడే మెట్ల మీద కూర్చుంటానన్నట్టుగా చేత్తో సైగ చేసి భానుమతి సాయంతో మెల్లగా రెండడుగులేసి... మెట్ల దగ్గరకొస్తూ ...

“ ...నువ్వింకా ఉత్తరాల దగ్గరే ఉన్నావా తల్లీ ... ఎవుర్ని సూసినా చెల్లుపోనులే గదా... సెవికి మేక్కొట్టి ఏలాడేసినట్టు ...”

“అవును మావయ్యా... ఎవరి చేతిలో చూసిన ఫోన్లే... కానీ ఆళ్ళ మావగారికి అల్లాంటివేవీ నచ్చవు మావయ్యా...ఇప్పటికీ కింద పీటలమీద కూర్చుని అన్నాలు తినాల్సిందే, రోట్లో రుబ్బాల్సిందే, ఏవైనా సరే తిరగట్లో ఇసరాల్సిందే. అలాంటివేవైనా నా తర్వాతే అంటారంటాయన...”

“అలాటోళ్ళు ఉండబట్టేనమ్మా...పోస్టాఫీసులూ, రోళ్ళూ రోకళ్ళూ ఇంకా ఊపిరి పీలుత్తున్నాయ్... లేకపోతే అయ్యీ అజాపజా ఉండాపోను...''అని ఏదో ఆలోచిస్తున్నట్టుగా క్షణంసేపు ఆగి “మరి...మనమ్మాయికొచ్చా అయ్యన్నీ...?

“పెళ్లప్పుడికి రావు మావయ్యా... మొదట్లో కాస్త ఇబ్బందిపడ్డా తర్వాత్తర్వాత అదీ అలవాటు పడిపోయింది. ఇప్పుడదే బాగుంటుంది. ఎప్పుడైనా వచ్చినప్పుడు మమ్మల్నీ అవే వాడమంటుంది...” అది ఎంతో మురిపెంగా కూతురు కాపరానికి వెళ్ళిన రోజుల్ని తలచుకుంటూ.

“సరీ...” మెచ్చుకోలుగా అన్నాడు బోసినోటితో శబ్దం వచ్చేట్టుగా నవ్వుతూ. అతని నవ్వుతో తనూ శ్రుతి కలిపింది భానుమతి.

“మొన్నామజ్జన... ఆల్లాల్లో బేంకీ ఎలచ్చన్లప్పుడు...ఓటున్నోల్లకి చెల్లు పోన్లు ఇచ్చేరంట... మా మనవడన్నాడు... వాడతావా తాతా... మనవరాల్తో మాట్టాడు కుందూగానని... అయ్యన్నీ ఎక్కడేది నొక్కాలో నాకేవొత్తాదమ్మా... దాన్ని మోసే ఓపికుందా నాకు... ఎకెసక్కెం... ఆడేడు... మనవడు... ముసిలోణ్ణి గందా...” నవ్వుతూనే కర్రని మెట్లమీద అడ్డంగా పడుకోబెట్టి... చివరి మెట్టుమీద మెల్లగా కూర్చుంటూ... ఆయాసంగా అన్నాడతను. అలా ఆయాసపడుతూనే ఇంకా ఏదో చెప్పబోతుంటే... భానుమతి అడ్డుకుంది అతన్ని మాట్లాడనివ్వకుండా.

భానుమతికి దశరథరామయ్యతో బంధుత్వం ఏమీలేదు. ఏదో పెద్దాయన కదా అనే గౌరవం కొద్దీ అతన్ని మావయ్య అంటూంది. పల్లెటూళ్లల్లో ఇలాంటి పిలుపులన్నీ మామూలే.

అలా కూర్చుని అలుపు తీరిందనుకున్నాకా... కాస్సేపటికి...

"అబ్బాయి లేడామ్మా... ఇంట్లో..." పై కండువాతో ముఖానికి పట్టిన చెమటని తుడుచుకుంటూ దశరథరామయ్య అన్న మాటలకి

"...లేరు మావయ్యా... ఊరెళుతున్నానని పొద్దున్ననగా వెళ్లారు... అన్నాని క్కూడా రాలేదు... వంటచేసాను"

"అట్టాగూ..." నూతిలోంచొచ్చినట్టున్న ఆ గొంతులో కించిత్తు నిరాశ స్పష్టంగా కనిపిస్తుంటే "మంచినీళ్ళు తాగుతారా..." అనడిగింది భానుమతి.

"వద్దమ్మా ...ఇంటి దగ్గర్నుంచేగా... వచ్చింది..." అన్నాడు నీర్సంగా...

"పోనీ కాస్త మజ్జిగ తెస్తాను... అంత దూరం నుంచీ కష్టపడి వచ్చారు దాహం వేస్తోందో ఏమో పాపం" భానుమతి గొంతులో ఆప్యాయత.

"ఎంత మందికని ఇస్తావమ్మా...మజ్జిగ. మజ్జిగ మీ ఇంట్లో గౌడు గేదెలున్నాయా." అంతలోనే హాస్యంగా అంటూ బోసినోటితో పకపకా నవ్వాడు.

"మా ఇంట్లో సంవత్సరం పొడుగూతా పాలుంటాయ్ మావయ్యా... మీ అబ్బాయి కూడా అదే అంటూంటారు అప్పుడప్పుడూ... పాడి చేసేవాళ్లకైనా ఒక్కో రోజు గేదె తన్నేసి పాలు ఉండవేమో గానీ... కొనుక్కునే వాళ్లం మన ఇంట్లో మాత్రం మూడొందల అరవై అయిదు రోజులూ పాలుంటాయ్... అని" చెప్తూనే తనూ నవ్వేసింది భానుమతి అతనికి కాస్త వెనగ్గా నిలబడ్డ చోటే చతికిలబడుతూ.

బోసినోటితో అతనలా నవ్వుతుంటూ కల్మషం లేని పసిపాప నవ్వులా వినటానికి హాయిగా ఉంది భానుమతికి.

పాపం. పెద్దాడైపోయాడు. ఈయనతో ఎంతో అవసరం ఉంటే తప్ప కష్టపడి ఇంతదూరం నడుచుకుంటూ రాడు. ఏం పనిమీద వచ్చాడో మరి.

నిజమే...

సుబ్బారావుది మంచికీ చెడుకీ కాస్తంత చేదోడు వాదోడుగా ఉండే మనస్తత్వం కావటంతో ఏవేవో పనుల మీద ఎవరెవరో వస్తూనే ఉంటారు సుబ్బారావు ఇంటికి. అదీకాక కాస్తంత వ్యవహారం తెలిసిన మనిషి కూడా కావటంతో బ్యాంకుల్లోనూ,

గవర్నమెంటాఫీసుల్లోనూ ఏవైనా పనులుంటే బేసిగ్గా సుబ్బారావుని సంప్రదించిగాని వెళ్ళరు. మరీ ముఖ్యంగా ప్రామిసరీ నోట్లు వ్రాయటంలో అతనిది అందె వేసిన చెయ్యి.

క్లుప్తంగా, సూటిగా, నాజూకైన పదాలతో వ్రాయటం అతనికి వెన్నతో పెట్టిన విద్య. పొందిగ్గా ఏర్చికూర్చిన పదాల అల్లిక అచ్చం మంచి ముత్యాల హారమేనా అన్నంత ముచ్చటగా ఉంటుంది చూడ్డానికి. మిగతా వాటి మాటెలా ఉన్నా ప్రామిసరీ నోటయితే అతనే వ్రాయాలి.

ఆ చుట్టుపక్కలా పది పన్నెండు ఊళ్లలో ప్రామిసరీ నోటు (తాకట్టు పత్రము) అతను వ్రాసినంత విపులంగా, చక్కగా ఎవ్వరూ వ్రాయలేరు. పైగా నోటు వ్రాయించుకునే విషయంలో అతని మీదున్న గొప్ప నమ్మకం ఏమంటే అతను నోటు వ్రాస్తే ఆ బాకీ తొందరగా తీరుతుందని అప్పుతీసుకున్న వాళ్ళు భావిస్తే, ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఇచ్చిన డబ్బులు క్షేమంగా తిరిగొస్తాయని అప్పు ఇచ్చిన వాళ్లకి నమ్మకం.

అందుకే, ఒకవేళ అతను ఊళ్లో లేకపోతే, రెండు మూడు రోజులు ఆలస్యమైనా అతను వచ్చేదాకా ఆగి ఆతనొచ్చాకే నోటు వ్రాయించుకుంటారు తప్ప మరొకరితో వ్రాయించుకోవటం కాని లేదా స్టేషనరీ షాపుల్లో దొరికే ప్రింటెడ్ ఫారం తెచ్చేసుకోవటం కానీ చెయ్యరు.

అతను వ్రాసిన నోటు మీద వాళ్లకెంత నమ్మకమో... అతనూ అంతే శ్రద్ధతో ఏ సమయంలో వచ్చినా కాదనక వ్రాసిపెడుతూ ఉంటాడు. రెవెన్యూ స్టాంపులూ, వేలి ముద్రల పెట్టె, కలమూ, ఒత్తు కోసం కార్డుబోర్డు అట్టా, చెక్క లక్క పిడతలో ఎండిపోయిన ఉన్న నల్లని తుమ్మ జిగురు ఎప్పుడూ బయట అరుగు మీదున్న కిటికీలోనే ఉంటాయ్ అందుబాట్లో. వాటిజోలికెవరూ వెళ్ళరు.

భానుమతి ఆలోచనల్లో ఉండగానే అకస్మాత్తుగా అతనన్నాడు...

“ఆ కవరు నాకియ్యమ్మా... మా ఇంటికెల్లే దార్లోనేగా ఎర్రడబ్బా ఉండేది ... ఎల్లేప్పుడు నేనేత్తాలే ...”

“అయ్యో ఇంకా నయం... మీతో వేయించనా దీన్ని పోస్టుబాక్సులో... నా సిగ్గు బొగ్గులవ్వ.” అంటూ బుగ్గలు నొక్కుకుంటూ మళ్ళీ అంతలోనే

"అయినా ఇదేమంత అర్జంటు కాదులెండి. మా అమ్మాయికే. ఇవ్వాళ కాకపోతే రేపైనా వెయ్యచ్చు..." అంది మూసేసిన ఆ ఇన్లాండు లెటర్ని అటూ ఇటూ తిరగేసి చూసి అందులో తను రాసిన విషయాన్నే మళ్ళీ మళ్ళీ గుర్తు తెచ్చుకుంటూ.

"అమ్మడూ... నాన్న ఇంటి ఖర్చులకని నాకిచ్చిన డబ్బుల్లో ఎలాగోలా పొదుపుచేసి కాసిన్ని డబ్బులు ఒక చోటేట్టాను. పిల్ల పుట్టిన రోజు వస్తోంది. నీ దగ్గరున్న డబ్బులతో నేను కొన్నానన్నట్టుగా దాని కాళ్ళకి పాంజీ పట్టీలు కొను. మువ్వలుండేటట్టు చూడు సుమా... ఇప్పుడిప్పుడే నడకొస్తూన్న నా మనవరాలు కాళ్ళకి పట్టీలు పెట్టుకుని నా నట్టింట్లో తిరుగుతుంటూ ఆ గజ్జల శబ్దాన్ని వింటూ మురిసిపోవాలనుంది. వీలు చూసుకుని అబ్బాయీ నువ్వూ పట్నం వెళ్ళి ముందు అవి కొనండి. ఎలాగూ పుట్టిన రోజుకి నాన్న నేనూ అక్కడికొస్తాం కదా... ఎంతయితే అంతా అక్కడికొచ్చాక నేనిచ్చేస్తాను నీకు. ఇలా అని అబ్బాయితో చెప్పు. మనవరాలి పుట్టినరోజుకి తాతయ్య ఏమివ్వాలనుకుంటున్నారో నాకు తెలవదు కానీ... ఇది అమ్మమ్మ కానుక అని నా మనవరాలితో చెప్పు..."

ఎన్నోసారో అలా గుర్తుతెచ్చుకోవటం. గుర్తొచ్చినప్పుడల్లా ... మనవరాలు ఘల్లూ ఘల్లూ మని గజ్జల శబ్దం చేసుకుంటూ నడుస్తున్నట్లే కళ్లముందు కనిపిస్తుంటే భానుమతి చెంపలు సంతోషంతో అరుణిమ దాల్చాయి. ...

మనవరాల్ని తలచుకుంటూ భానుమతి ఆనంద డోలికల్లో తేలిపోతుంటే ...

"సుబ్బారావు కూతురు ఉత్కాలాడిందని ఎవరో సెప్తే ఇన్నట్టే గురుతు ... పిల్లా? పిల్లోడా...?

"అమ్మాయే మావయ్యా... మొన్ననేగా పుట్టింది. ఇంకా ఏడాది కూడా నిండలేదు. వచ్చే నెల్లో పుట్టిన రోజు. ఏడాది నిండుతుంది..."

"అంతేనా ...? అయితే ఖర్చు ఉందన్నమాటే... మావోడికి ...?"

"ఆ... ఆ ... ఉన్నట్టే... అయినా తప్పదుగా మావయ్యా... అసలు కంటే వడ్డీ ముద్దని ... మనవరాలిని తలచుకోకుండా తెల్లారదు మీ అబ్బాయికి. ఎప్పుడెప్పుడు వెల్దామా మనవరాల్ని చూడటానికి అని కలలుగంటన్నారు..."

చెప్తూ చెప్తూ అంతలోనే ఏదో గుర్తుకొచ్చినట్టు ...

“అయ్యో ... నామతిమండా ... మాటల్లోపడి మరిసేపొయ్యాను ... ఇప్పుడే వస్తానుండండి మావయ్యా ...” అంటూ గబుక్కున లోపలికెళ్ళి స్టీలు గిన్నెలో కానీ, గాజు గిన్నెలో కాని వేసిస్తే మోయగలడో లేదోనని చిన్న ప్లాస్టిక్ గిన్నెలో కొంచెం రవ్వకేసరి, స్పూనూ వేసి తీసుకొచ్చి అతనికిచ్చి “తిను మావయ్యా ...” అంది పై మెట్టుమీద అతనికి అందేట్టుగా గ్లాసుతో నీళ్ళుంచుతూ ...

“పళ్లు లేవమ్మా ... నమిలడవ్ తల్లీ ... ఎప్పుడొచ్చినా ఏదోటి పెట్టందే పంపవ్ గదా” అన్నాడు గిన్నెవైపే తేరిపారా చూస్తూ ...

“నువ్వు నమల్లేవనే ...జీడి పప్పులు తీసేసాను ... పళ్ళకి అడ్డంబడేవేం లేవందులో ...చప్పరించటమేగా తీసుకో ...”

భానుమతి ప్రేమా ఆప్యాయతలకి చలించిపోయాడతను. కళ్ళు చెమర్చాయి. ఎడం చేత్తో కళ్లజోడు కాస్త పైకెత్తి భుజం మీది తువ్వాలుతో కళ్ళని తుడుచు కున్నాడాయన. కాసేపు మౌనంగా ఉండిపోయి మనసు కాస్త కుదుట పడిందనుకున్నాకా

మెల్లగా గిన్నె చేతిలోకి తీసుకుని స్పూనుతో కాస్లంత రవ్వకేసరి నోట్లో పెట్టుకుని ... చప్పరిస్తూ అన్నాడతను ...

“ఏదో తల్లీ తండ్రీ లేని పిల్లమ్మా... ఎలా... పెంచానో...” దేవుడి దయన్నట్టు కుడి చెయ్యిపైకి చూపిస్తూ...

“పిల్ల సిన్నదే... ఈ మజ్జనేగా ఈడేరింది. నేనా కాటిక్కాళ్ళు సాపుక్కూకున్నోడ్ని ఎప్పుడు పోతానో ఏమో... నేనుండగా ఆ పిల్ల మెళ్ళో మూడు ముళ్ళూ పడి, దాన్దోదారైతే... అంతే సాలనుకున్న... నాలుక్కుంచాల నేలమ్మా పిల్లకిచ్చింది. బాట పక్కన సేను. కట్టపడి సేసుకుంటే... అయిదేళ్ళూ నోట్లోకెల్తాకి ఇబ్బందిపడక్కర్లేదు ...కుర్రాడా బుద్ధిమంతుడు.ఎడ్లబండి ఉంది... సరుకదీ తోల్తాడు. తింటాకి ఉంటాకీ లోటులేత్తల్లీ...” అంటూ మరికొంచెం నోట్లో వేసుకుని బోసినోటితో చప్పరిస్తూనే

“పిల్ల నెలదప్పింది... పురిటి రోజులు... తొలికాన్పు ఇక్కడే సెయ్యాలన్నారు. ఎవరో ఎల్తంటే కబురంపాను. కుర్రోడు తీసుకొచ్చి దింపెట్టేడు...తొమ్మిదో నెల...

అల్లూ ఈల్లూ సెప్తే ధర్మాసుపత్రికెల్లి చూపిచ్చుకొచ్చింది... బిడ్డ అట్టే పెరగలేదన్నారంట అమ్మా... అమ్మమ్మా...ఎవరున్నారు దానికి కడుపుతో ఉన్న పిల్లని కూతంత వైనంగా వండిపెడతాకి. ఏం తింటందో... ఏం తాగుతుందో... నన్నేసూత్తదా... అదే సూసుకుంటదా... దానికితోడు ఆ యాసుపత్రిలో పురుడోసుకుంటం నాకిట్టం లేదమ్మా. నీకు తెలుసో తెలవదో... ఈ పిల్లని కన్నప్పుడు ఆళ్లమ్మ ధనుర్వాతం కమ్మి అక్కడేగా పోయింది. ఈ మాట నోరు విడిసి దాంతో సెప్పలేను. తొలిచూలు కాన్పు. శుభమా అంటా పిల్ల పురుడుపోసుకోవటానికొస్తే ఇది సెప్పి దాన్ని బాధ పెట్టలేను?... సెప్పినా ఇనదు. పెద్దాస్పటళ్ళకెళ్ళటానికి మనదగ్గర పైసలేవంటుంది. ఏమ్మాట్లాడను? కాతంత ఈ నెలా ఏదో బలమైన తిండితిని, ఈ పిల్ల కడుపునో కాయ కాస్తే... రేపు నేను పోయినా... దానికంటూ ఓ నలుసు..."

ఆపైన మాట్లాడలేక గొంతులో బాధ సుళ్ళు తిరగ్గా గొల్లుమన్నాడు ఒక్కసారిగా కట్టలు తెంచుకున్న దుఃఖం తెరలు తెరలుగా అతన్ని ఊపేస్తుంటే... భానుమతికి ఏం చెయ్యాలో తోచలేదు కాసేపు... గబుక్కున ముందుకి జరిగి అతని భుజాల్ని పట్టుకుని

"ఊరుకో మావయ్యా...ఊరుకో... అన్నీ సవ్యంగానే అవుతాయ్... నువ్వెందుకలా డీలా పడిపోతావ్...ఉండు... మావయ్యా...ఊరుకో ...ఇన్ని చూసినవాడివి ...నువ్వే ఇలా డీలా పడిపోతే ఎలాగా చెప్పు..." అంటూ పక్కనున్న మంచినీళ్ళ గ్లాసు తీసుకుని అతని నోటి దగ్గర పెట్టి "మావయ్యా... ఊరుకో... కాసిన్ని నీళ్ళు తాగు..."అంది ఓదార్పుగా...

భానుమతి చేతిలో గ్లాసందుకుని కాసిన్ని తాగి కండువాతో ముక్కు కళ్ళూ తుడుచుకుని...

"పాతికేళ్ళు దాటినియ్యమ్మా ... మీ అత్తయ్య పోయి ... మొండోడల్లే బతుకీడుత్తున్నాను ...పిల్ల ఉందనుకుంటే ...అదీ మాయజేసి మదురెక్కేసింది ...పోతా పోతా దీన్ని నా కాళ్లకి చుట్టింది... ఒకటా రెండి... ఎన్నమ్మా... ఎన్నికడగళ్ళూ..."

గొంతు రుద్ధమయిపోగా... భానుమతి కనిపించేలా పక్కకి తిరిగి

"...నిన్నే వద్దామనుకున్నా తల్లీ...నిన్నొత్తే... ఉండీవోడేమో సుబ్బారావు..."

“ఆ...నిన్నంతా ఇంట్లోనే ఉన్నారు మావయ్యా... కబురెట్టాపోయావా... ఈయనే వచ్చేవోరుగా... నీకాడికి...పెద్దోడివి నువ్వెందుకు రావటం కాళ్ళీడ్చుకుంటూ...”

ఏదో చెప్పబోయాడు...ఏం చెప్పేవాడో ఏమో... అంతలోనే అతన్నెదుక్కుంటూ అక్కడికొచ్చింది తొమ్మిదో నెల కడుపుతో భారంగా నడుస్తూ అతని మనవరాలు... అతన్నక్కడ చూడగానే... ఆపిల్ల ముఖంలో చెప్పలేనంత రిలీఫ్. “హమ్మయ్య దొరికావా” అన్నట్టుగా...

వస్తూనే భానుమతిని చూసి పలకరింపుగా ఒక నవ్వు నవ్వి...“ఎక్కడికెళ్ళాడోనని ...ఇందాకట్నుంచీ వెతుకుతున్నానాంటీ...ఎక్కడా లేదు. ఈ మధ్య నడుస్తూ నడుస్తూనే పడిపోతున్నాడు ఆంటీ. అందుకే ఇల్లు కదలనివ్వటం లేదు నేను. అప్పటి దాకా అక్కడే కూర్చున్నాం ఇద్దరమూను ... నడుం నొప్పొస్తుందని లోపలికెళ్ళి కాస్త వొరిగానంతే. కాసేపటికి వచ్చి చూస్తే లేడు... కళ్ళు పెద్దగా కనపడతంలేదాంటి. ఎక్కడైనా పడిపోతాడేమోనని భయం... ఎవరైనా చూస్తే ఫర్వాలేదు...” అంటూ తాత దగ్గరగా వెళ్ళి

“...పద వెళదాం. చీకటి పడింది... ఇంకా చీకటైతే... కళ్ళు కనపడవ్ కదా నాకు చెప్పకుండా ఎందుకొచ్చేసేవ్? ఏ గొప్పైనా తగిలి పడిపోతే...”అంటూ అతని జబ్బట్టుకుంది లేపటానికి ప్రయత్నిస్తూ...

“నిజమేనమ్మా... నేనూ అదే అన్నాను... కబురు చేస్తే ఈయనే వచ్చేవారు కదా అని... కష్టపడి వచ్చాడు పాపం... ఉండమ్మా... ఒక్క నిమిషం ఉండు. తింటున్నాడు కదా... తిననియ్... ఇంకా పూర్తికాలేదది...” భారంగా అంది భానుమతి అతని చేతిలో ఉన్న గిన్నెనే చూస్తూ...

అప్పటిదాకా అతను చెప్పినవన్నీ విని ఆమె గుండె అప్పటికే తడిదేరింది.

మరణానికి మరో అడుగు దూరంలో ఉండి కూడా బాధ్యతల పట్ల అతని తపనా, తాపత్రయం ఒక్క ఈ ఖర్మ భూమిలో తప్ప మరెక్కడా ఉండదేమో.

మనవరాలు బలవర్ధకమైన ఆహారం తిని పండంటి బిడ్డకి జన్మనిస్తే తనున్నా లేకపోయినా ఈ భూమ్మీద ఆ పిల్లకంటూ ఓ తోడున్నట్టుంటుందనే అతని ఆశ.

పైగా కూతురు చనిపోయిన ఆసుపత్రిలోనే మనవరాలికీ పురుడంటే ఆ ముసలి ప్రాణంలో ఏదో చెప్పలేని భయం. ఏ ప్రవేటు హాస్పిటల్లోనన్నా... పురుడోసుకుంటే పిల్లకేం కాకుండా బయట పడుద్దనే తాపత్రయం.

అతనలా ఆశపడ్డంలో తప్పేం ఉంది. ఉన్నది ఒక్కగానొక్క నలుసు. దానికెవరైనా ఇద్దరు ముగ్గురు పిల్లలు బయలుదేరితే...దీనికి పదిమంది ఉన్నట్టుంటాదని కొట్టుకులాడుతున్నాడు. ప్రవేటు హాస్పిటల్లో చూపించాలంటే చేతిలో డబ్బులుండాలి. ఆయనే ఉంటే తెల్ల చీరలెందుకన్నట్టు డబ్బులే ఉంటే ఇన్ని బాధలెందుకు ఈ మలి వయసులో.

చిల్లిగవ్వ ఆస్తిలేదు. అప్పు మాత్రం ఏం చూసి ఇస్తారు ఎవరైనా? సమాజం అంతా చుట్టూ తిరగాలంటే...డబ్బు, అధికారం, పలుకుబడి ఈ మూడింట్లో ఏదో ఒకటుండాలి. ఏదీ లేని ఇలాంటి వాళ్లని ఎవరు పట్టించుకుంటారు? ఏం చూసి అప్పులిస్తారు? ఎలా తీరుస్తాడని ఆలోచన చేస్తారు కదా ఎవరైనా?

అతనిదా ఎవరి దగ్గరా చేయి చాచలేని మధ్య తరగతి... మనస్థత్వం! ఇక ఎలా తీరతాయి సమస్యలు.

ఆలోచిస్తూ అటే చూస్తూందేమో... పైకి లేవదీస్తున్న మనవరాలూ. ఆ పిల్ల చేతి ఆసరాతో లేవటానికి ప్రయత్నిస్తున్న ఆ ముసలాయన.

ఆ తాతా మనవరాళ్ళిద్దర్నీ అలా చూస్తుంటే భానుమతి మనసంతా తరుక్కుపోయినట్లయింది...ఏదో అసంతృప్తి. అతనితో ఇంకా మాట్లాడాల్సినదేదో ఉందని, తను చెయ్యాల్సిన పని ఏదో పూర్తి చెయ్యకుండానే వాళ్ళు వెళ్ళిపోతున్నారనే చెప్పలేని వ్యధ. మనసంతా ఇదమిద్ధమని తెలియని ఒకలాంటి దిగులు. అంతలోనే మనసంతా ఆవరించుకున్న ఒంటరితనం.

ఎంతో మందికి భర్త ప్రామిసరీ నోట్లని రాయటం చూసింది తను. అప్పు తీసుకున్న ప్రతీ వాళ్లదీ ఏదో ఒక వ్యధ, అవసరం. భానుమతితో వాళ్లకున్న చనువునిబట్టి కొంత మంది చెప్పుకుంటారు. కొంతమంది చెప్పరు.

అతను అప్పుకోసమే వచ్చాడో, అసహాయుడ్ననే వచ్చాడో...ఏమో...గానీ తను విన్న ఏ వ్యధా ఇంతగా గుండెల్ని పిండెయ్యలేదు భానుమతిని.

"వచ్చెల్లానని...సెప్పమ్మా" అంటూ వెనక్కి తిరక్కుండానే మెల్లగా ముందుకి కదిలాడు. అతనికి వెళ్ళాలని లేదని అతని నడకే చెబుతుంది. అతన్నలా గమనిస్తూనే ఆలోచిస్తూంది భానుమతి. తనేమైనా చేయగలదా? తనవల్ల ఏమౌతుంది? అయ్యో వెళ్ళిపోతున్నారే...ఏదో చెయ్యాలి అతనికి... ఏం చెయ్యాలి... బుర్రంతా కరిగి బింగిరిగా ఉండి ఎంత ఆలోచించినా ఒక కొలిక్కి రాని ఆలోచనలు.

విసిరిన రాయి, పలికిన మాట, గడచిన క్షణం, చేజారిన అవకాశం తిరిగి రావట. ఎక్కడో చదివిన గుర్తు.

అవును... ఏ నిమిషానికి ఏం జరుగుద్దో ఎవరూ చెప్పలేరు... కాబట్టి ఆ ఇద్దరు నిస్సహాయులకీ ఏమైనా చేస్తే ఇప్పుడే చేయాలి. ఏం చెయ్యాలి...

ఆ ఆర్తిలో, ఆ ఆలోచనల్లో...మెరిసిందో తటిల్లత. ఏది చేస్తే వాళ్లకు సంతోషంగా ఉంటుందో... ఏది చేస్తే... తనకీ చేసానన్న తృప్తి ఉంటుందో...

ఆలోచనకి తుదిరూపం వచ్చిన మరుక్షణం ఇక ఆగలేదు భానుమతి. ఒక్కంగలో వాళ్లకి ఎదురు నిల్చి.

"ఉండండి... మావయ్యా... కడుపుతో ఉన్న పిల్ల. శుభమా అంటూ దీపాలెట్టే వేళ గుమ్మాల్లోకి వచ్చింది... బొట్టు పెట్టి పసుపూ కుంకుమా ఇస్తాను... ఒక్కసారి రామ్మా..."

"మళ్ళీ ఇంకోసారి వస్తాన్లెండి... ఆంటీ... ఎక్కడైనా పడిపోతాడేమోనని భయం మళ్ళీ ఏ కాలూ చెయ్యన్నా విరిగిందంటే ఎంత కష్టం ఆంటీ" మొహమాటంగాఅంది ఆ అమ్మాయి...

"అవునమ్మా... పెద్దాళ్లయిపోయాకా భయమే...అయినా ఏం పర్వాలేదు తల్లీ... మళ్ళీ వచ్చినప్పుడు మళ్ళీ ఇస్తాను... ఏం పోయింది అందులో..."

అంటూనే దశరథరామయ్య చేతిని మెల్లగా మనవరాలి చేతుల్లోనుంచి విడిపించి మళ్ళీ అతన్నా మెట్టుమీద కూర్చుపెట్టి ఆ అమ్మాయి భుజం పట్టుకుని మెట్ల మీదుగా లోనికి నడిపించుకొచ్చింది.

లోనికొస్తూనే హాల్లో లైట్లేసి "కూర్చోమ్మా..." అంటూ ఆ పాపకి కుర్చీ చూపించి... చిన్న గిన్నెలో ఆ అమ్మాయికూడా కాస్తంత రవ్వకేసరి వేసిచ్చి తినమని చెప్పి ఆ అమ్మాయి తింటూ ఉంటే లోనికెళ్ళి ఒక పళ్ళెంలో ఖరీదైన జాకిట్టు గుడ్డా, డజను గాజులూ, అరటిపళ్ల అత్తం, రెండు యాపిలు పళ్ళూ పెట్టి, గబ గబా పెరట్లోకి వెళ్ళి కాసిన్ని నిత్యమల్లెపూలూ, నందివర్ధనం పూలూ కోసుకొచ్చి పళ్ళెంలో వేసి చేతిలో కుంకుమ భరిణెతో అక్కడికొచ్చింది.

అప్పటికే ఆ అమ్మాయి రవ్వ కేసరి తినేసి చెయ్యి కడుక్కుందేమో ఆమె నుదుటన బొట్టుపెట్టి పళ్ళెం చేతికందిస్తూ..."పండండి బిడ్డను కని చల్లగా నూరేళ్ళూ వర్ధిల్లమ్మా..." అంది నిండుగా మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తూ...

"తాతయ్యని వెదుక్కుంటూ వస్తే... ఇవన్నీ ఎందుకాంటీ...?..." అంది మొహమాటంగా... వాటిని అందుకుంటూనే.

"ఇవన్నీ పసుపూ కుంకుమలో భాగమమ్మా... సమయానికి జాకిట్టు గుడ్డ ఒక్కటే ఉంది. చీర లేదు. జాకిట్టు గుడ్డలో డబ్బులు పెట్టాను చీర కొనుక్కో...ఇదీ మీ కన్నవారిల్లే అనుకో...సరేనా..." అంది.

కాసేపయ్యాక ఆమె చేతిలోంచి పళ్లెం తీసుకుని పట్టుకెళ్ళటానికి వీలుగా లోన్నించి తెచ్చిన కవరులో అవన్నీ వేసి పూలను విడిగా ఒక కవరులో వేసి రెండూ ఆమె చేతికందిస్తూ...

సిగ్గుపడుతూనే ఆ కవరుని తీసుకుని పక్కనున్న కుర్చీలో పెట్టి కిందకి వంగి భానుమతి కాళ్లకి దణ్ణం పెట్టబోతుంటే గబుక్కున భుజాలను పట్టుకుని ఆపింది భానుమతి. "నెలలు నిండాయి... అంతలా వంగటం పాపకి మంచిదికాదమ్మా..." అంటూ

రెండు చేతులెత్తి నమస్కరిస్తూ ... మొహమాటంగానే కవరు చేతిలోకి తీసుకుని భారంగా నడుస్తూ తాతని నడిపిస్తూ...

వాళ్లనలా ... కనుమరుగయ్యేదాకా చూసి లోనికొస్తూనే కూతురికి రాసిన ఉత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చించేసింది భానుమతి.

# 1

# గిరి కాన దీపం

"వచ్చినవాయ్యా.గీ ముచ్చటిన్నావా..? నీ బిడ్డకు పెండ్లయి ఆరునెళ్ళగాలె.. మొగడిమీద షికాయత్ జేస్తదంట. రేపు కులపెద్దల తోని పంచాయితి బెట్టిపిస్తదంట.." కొట్టంలో పచ్చగడ్డి మోపు వేసి వచ్చిన భూక్యాతో చెప్పుకున్న గవిరి గొంతులో అంతులేని దు:ఖం..తాను చెబుతున్నది నిజం కాకుంటే బాగుండునని..ఆశ..కూతుర్ని తన భర్త పంచాయితి వరకు పోనివ్వకుండా నివారిస్తాడన్న ఆరాటం.

జాలా వచ్చిందని విని సంతోషంగా వడివడిగా ఇంటికి వచ్చిన భూక్యాకిది పిడుగుపాటైంది..."ఏ ఊకో గవిరి నోరు మూసుకోని గూసో..జాలామ్మంటే ఏందనుకున్నవ్ నిన్ను జరంత పరేషాన్ జెయ్యనీకి..నీతో గిట్ల మజాక్‌జేస్తాంది.. గంతె గదా బిడ్డా..?గుండె చిక్కబట్టుకుంటూ భూక్యా అన్నాడు..అప్పటికే గవిరి ఏడుపులకు పెడబొబ్బల కు తండా అంతా వార్త తెలిసిపోయింది.విషయం తెలుసుకుందామని పరుగు పరుగు వచ్చిన భూక్యా తమ్ముళ్ళిద్దరు..వీరు నాయక్..లక్ష్మణ్‌నాయక్‌లను చూసి ప్రాణం లేచి వచ్చింది గవిరికి వాళ్ళెలేగన్నా జాలాకు నచ్చజెప్పుతే బాగుండునని.. ఆరాట పడ్తూ దు:ఖాన్ని తట్టుకోడానికి ప్రయత్నిస్తున్నది..

"ఏంది బిడ్డా..ఎప్పుడన్న..ఎవ్వళ్ళన్నా పంచాయితి బెట్టాల్నంటే..అన్నదమ్ములు కొట్లాడు కోకూడదని మొగడు పెండ్లాలు మంచిగుండాల్నని మీది మీకు దెల్వదా..గింత దానికి కులపెద్దలతో పంచాయితి బెట్టిపించి..ఆడ ఆళ్ళు ఎంత జెప్పితే గంత తప్పు గట్టి...గా పెద్దలకు తినబెట్టి ..తాగబోయిస్తే గాని మీ లొల్లిలు దీరవా..? మనకే పొయ్యికిందకుంటే పొయ్యిమీదకుండవ్..మనమే ఉండీ లేక సస్తాంటం..మీదకెళ్ళి పంచాయితిలుబెట్టి కులపెద్దలను మేపుడు అవసరమా..? అనుకుంట మస్తు లల్లి పెట్టేదానివి..గసోంటిది నువ్వు పంచాయితి బెట్టిపియ్యమంటున్నవా..? అడిగారు వీరుకాకా..లక్ష్మణ్‌కాకా..జాలా బదులు పలుకలేదు..

"తండాల నువ్వంటే అందరికి పాణం బిడ్డా గసొంటిది నువ్వే పంచాయితిల నిలవడతవా..? రామ్‌కాకా అన్నాడు. "అల్లుడు నిన్నేమన్నా అన్నడా..చెప్పు మంచిగుండమని బతిమాలుకుంటం..నీతోని ఆయనకు తక్లీబా..? ఆయనతోని నీకు తక్లీబా..వీరుకాకా తోని రామ్‌కాకా తోని మాట్లాడిపిస్త.గంతేగాని పంచాయితి దాంక బోవద్దు బిడ్డా ఇజ్జత్ బోతదని గాదు బిడ్డా..నీ బతుకు బరబాత్ గాకూడదని..ఇంతకీ అల్లుడేడి తల్లీ..? భూక్యా గొంతులో వాత్సల్యం

"ఆయన రేపు పొద్దుగాల్ల అస్తనన్నడు. ఇగ ఆయనకు నాకు కుదరదు నాయనా.ఏమున్నా రేపు పంచాయితిల మాట్లాడుదాం కాకా..అమ్మా..ఆకలయితాంది రొట్టె జేసినవా?.జాల మాటలకు అందరూ మౌనంగా నిష్క్రమించారేగాని ఆ రాత్రి ఎవరికీ నిద్రలేదు.నిదుర కొరిగిన గవిరి కళ్ళల్లో దు:ఖపు ధారాలు.చిన్నప్పటినుండీ అంతే ! జాలా ఒక నిర్ణయం తీసుకున్నదంటే దాన్నేవరూ మార్చలేరు.దిగులు ముసురుకున్న అందరి మనసులో జ్ఞాపకాల దొంతరలు.

******

"నాయినా..మందంత ఉండె కాడ మనముండకుంట..అడివిల సెట్లతీరు.. అడివిల పులి,పురుగు..గొర్లు గొడ్లు మాకెల తీరు మనం గీ అడివిల ఎందుకుంటున్నం.?" జాలా ప్రశ్నిస్తుంటే..విస్తుబోయిన భూక్యా గుండె జలదరించింది. ఎప్పుడైనాతన్ను తాను ఈ ప్రశ్న వేసుకుంటే కదా..? ఇంతవరకూ..ఇన్ని తండాల్లో ఎవరైనా ఈ ప్రశ్న వేస్తే కదా..మౌనంగా ఉండడానికి లేదు..బదులియ్యకపోతే..జాల ఊరుకోదని తెలుసు.గుడిసెలోని గుడ్డి దీపం రెపరెప లాడుతున్నది..ఆ వెలుగులో..జాల ముఖం ప్రకాశవంతంగా కనపడుతున్నది.ఆ దీపకాంతిని తట్టుకోడానికి. ప్రయత్నిస్తూ... "ఈడున్నోళ్ళంత మనోళ్ళు. మనోళ్ళున్న కాడ మనముండాలె గదా."మొత్తానికి ఓ జవాబు చెప్పగలిగానని సంతోషపడ్డాడు..భూక్యా...జాల ఆలోచనలో పడింది... అంతలోనే. "మరి మనమూ మనోళ్ళుండే కాడా..రోడ్లులేవు. కచ్రంబండ్లే గాని.. బస్‌లు, ఆటోలు ఏం లేవు.రోగమొస్తే రామ్‌కాకా ఇచ్చే పసర్లేగాని..డాకటర్లు లేరు.. నాలుగు మైళ్ళు నడిసిపోతే..పోచారంల ఐదోది దాంక జెప్పేబడి.పెద్దబడికిబోయి ఆరు నుండి..సదవాల్నంటే..అందరు ఊర్లు బట్టుకుని పోవాలె..పెద్దవ్వింటికి బోయనపుడు

సూసిన గదా..ఆడ ఊర్లల్ల..ఎటు జూసిన మందే..మస్తు బుర్రు మోటర్లు ఆటోలు బస్‌లు కార్లు..అబ్బో గవ్వన్ని మన తండా లుండుంటేనా. ఏడోది దాంక చదవాల్నంటే.. నాలుగు మైళ్ళు నడిచి పోచారంబోయి చదువుకోవాలె..రోగంరాని నెప్పిరాని ముందు పోచారందాక బోతెనేగదా..ఆడ్నించి ఆటోలుగాని బస్సులుగాని దొరుకుతయ్..మరి మన తండాల కెందుకు రోడ్లు ఎయ్యరు..'.కళ్ళు విప్పార్చుకుని అడిగింది..జాలా.'

"అవ్ బిడ్డా...ఉప్పుకని సబ్బుకని..పసువుల అమ్ముకుంటానికని తండాలోళ్ళంతా.. ఊర్లెకు బోతరు..సిటీకి బోతరు.గంతెగాని ఊర్లనుండి గీ తండాకెవళ్ళు అస్తరని ఆళ్ళు మనకోసరం రోడ్లు గిట్ట ఏస్తానికి...ఎప్పుడో మన తండాకు గూడ రోడ్లు.ఏస్తరంట తియ్.. బిడ్డా.."సముదాయించ చూసాడు భూక్యా.

కాని జాలా సమాధాన పడ్డట్టు అనిపించలేదు.తమ తండాకు త్వరగా రోడ్డు వేస్తే బాగుండునని..ఆశపడింది. మరి నాలుగురోజులు గడిచాయో లేదో..జాలా పరుగు పరుగున తండ్రి దగ్గరకు వచ్చింది... "నాయనా మనతో మన తండాతో ఎవరికవసరం..మన కాడికి ఎవళ్ళస్తరు అన్నవ్ గదా..సూడు మన తండాలోల్లతోని ఏదో పనిబడి..అగ్గో పెద్దబండ్ల మీద ముగ్గురు.. నలుగురు పెద్దమనుష్యులు అచ్చిండ్రు..చూడు.."జాలా చెప్పింది.

తమ తండావాసులతో ఇతరులకు పని బడినందుకు సంతోషం.. కలిగింది...కాని ఆ సంతోషం ఎంతో సేపు నిలవలేదు. సగం తండా అంతా వీరుకాకా ఇంటిముందు నిలబడి వచ్చిన వాళ్ళను చూస్తూ వాళ్ళ మాటలు వింటూ నిల్చున్నారు వాళ్ళు వెళ్ళాక చాలా ఆత్రంగా

"కాకా ఆళ్ళు ఎందుకచ్చిండ్రు..?" అని జాలా అడిగింది."దొరగారి అమ్మాయికి కొడుకు బుట్టిండంట..వాళ్ళ తాన ఉండి పని జేసేటందుకు పనిపిల్లలు కావాల్నంట.. తిండిపెట్టి ఏడాదికి రెండుజతల బట్టలు కుట్టిపించి..యాడాదికి వెయ్యరూపాయలు ఇస్తామని చెప్పారట.."అంతా విన్న జాలా..నీరసపడి పోయింది. "ఏంది వీరుకాకా .సీతక్కను పంపుతున్నవా మల్ల..? అని అడిగింది.."అవ్ పంపుత పంపకేంజేసుడు..? గింత మందికి తిండిబెట్టుడు నాతోని గాదు..ఆడుంటెనన్నా కడుపునిండ దింటరు."

వీరుకాకా..నీరసంగా అన్నాడు "అయ్యో కాకా..ఆళ్ళు పాపం వీరుకాకా పిల్లలకు ధావత్ ఇస్తం రమ్మంటల్లేరు..నీ పిల్లలతోని ఊడిగం జేపించుకుని గింత ముద్దపడేస్తమని రమ్మంటాండ్రు..గట్లబంపకు మీకు సదివిపించుడంటే భయంగాని..అదే తిండి హాస్టలోసుత పెడుతున్నారు..ఏడాదికి రెండు జతల బట్టలు గుట్టిపిస్తున్నరు..కాకా నా మాటిను..సీతక్కోళ్ళను నువ్వు పనికి బంపకు సదువుకోను బంపు.."జాలా ఎంతో బతిమిలాడింది.వీరునాయక్ వినలేదు.పైగా ఇద్దరు ముగ్గురిని జతచేసిఇలాగే..ఇంటి పనుల్లో పెట్టాడు..చదువుకోవాల్సిన తమ తండా పిల్లలు చాకిరికి పరిమితమయి పోత్నుందుకు కలత పడింది. తాను మాత్రం నాలుగు మైళ్ళు నడిచి పోచారమెళ్ళి అక్కడనుండి బస్‌లో దమ్మపేటకు వెళ్ళి చదువుకుంటూనే ఉన్నది..తమ తండాకు బడి..రోడ్డు..రావాలని కలలు కంటూనే ఉంది.

******

ఆ రోజు కుంభవృష్టి కురుస్తున్నది."నాకు భయమైతాంది..నాయినా..అమ్మ చెల్లె తమ్ముడు సూడు ఎట్ల పన్నరో గీ వానా ఇంక పెద్దగైతే..గీ గుడిసె కూలిపోతే.. మనేమేడుంటం..?గట్టిగా భూక్యా చేయి పట్టుకుని..జాలా అన్నది..

"ఏంగాదు తియ్ బిడ్డా గా..అమ్మతల్లే మనల్ని కాసుకుంటది."నాయినా జప్పన గీ వాన తగ్గాలె..పొద్దుగాల నేను బడికి బోవాలె..గిట్ల వానగురిస్తే అడుసుతోని అడుగుబడదు నాలుగు మైళ్ళు నడవాలె..ఏంజేతు నాయినా..?' "ఆ..ఆ ఒక్కదినం బడికి బోకుంటె ఏంగాదు తియ్..జాలా..ఊకే నాయినను గట్ల సతాయించకు సప్పుడుజెయ్యకపండు.."తల్లి కసిరింది..మూతి ముడుచుకుని పడుకున్నది.. "ఏందే పొల్లను గట్ల గదామాయిస్తవ్..దానికి సదువంటే గంతపాణం..గీ తండాల దానితీరు ఎవరు సదువుతున్నరు.?జాల తల నిమురుతూ..ఒకింత గర్వంగా అన్నాడు..నిమిషాల్లో జాల నిదురపోయింది.. "ఏందయ్యా..పోరి సదువుతాననుడు నువ్వు మస్తు మురుసుకుంట దాన్ని బంపుడు..నీకు యాదున్నదో లేదో మీగంగక్క పొల్లనిత్తరా యేరే సమ్మందం మాట్లాడుకోమ్మంటరా..? అని. అడుగుతాంది.."పిల్లపెండ్లి జెయ్యవా.?అని తండలఅందరు అడుగుడే..పొల్లగాడు మంచిగున్నడు గింత చేను

జాగా..ఉన్నోడు.అత్త మామ..అందరూ మనకు దెల్సినోల్లే..ఆరందిన్నా దాని పరీచ్చలు గూడ అయిపోతయ్..సదివినకాడికి సాలుగాని..మొదాలు దాని లగ్గం సంగతి జూడు గవిరి హెచ్చరించింది "నువ్వు గట్ల రంధిబడకు..నేను మెళ్ళగ..జాలమ్మను ఒప్పిస్త గదా.."అన్నాడే కాని.. జాలా పెళ్ళికి ఒప్పుకుంటుందన్న నమ్మకం లేదు. అట్లా అట్లా..ఎండ కాలం రానిచ్చాడు...మెళ్ళగా జాలా దగ్గర పెళ్ళి ప్రస్థావన తీసుకువచ్చాడు ...జాలా ఇంతెత్తున లేచింది.."ఏంది..లగ్గమా..నేనస్సలు జేసుకోను...నేను సదువుకుంటనని జెప్పిన కదా.." అరిచింది..జాలా.. నేను కాలేజిల జేర్తనని జెపినగదా.. మీరేమన్న కర్సు బెట్టాల్నా సర్కార్ హాస్టల్ల దింటా సర్కార్ కాలేజిల సదువుకుంట..ఆళ్ళే తిండి బెట్టి పుస్తకాలు గూడా ఇస్తరు. నేను లగ్గంజేసుకోను సదుకుంట.."గవిరి, లచ్చిమి., వీరునాయక్లక్ష్మన్ నాయక్.బాబూలాల్ బంధువులు.. తండాలో ఎవరు ఎంత చెప్పినా.జాలా నేను పెళ్ళి చేసుకోనంటే చేసుకోనని కూర్చుంది.పెద్దలెవరెవరో వచ్చి నచ్చజెప్ప జూసారు చదివించి చెడగొట్టావని.. భూక్యానుతిట్టారు..మూడు నాలుగురోజులు వాదనలైనాయి..తిండీతిప్పలన్నా మానింది. కాని పెళ్ళి మాత్రం కాని పెళ్ళి మాత్రం చేకోనంది.ఐదవరోజు జాల తల్లి కోపం పట్టలేక కొట్టబోయింది..జాలా బయటకు పరుగు తీసిగుడిసె ముందు నిల్చుని..గట్టిగా అరిచింది.. "ఇగ్గో గిదే జెప్తున్న..ఎవ్వరు ఎంతన్న మొత్తుకోండ్రి నేను మాత్రం లగ్గం జేసుకోను..నేను సదివేది..సదువుడే.కాదని ఎవ్వళ్ళన్న లొల్లి వెట్టిండ్రో..పోలీసోళ్ళకు షికాయత్..జేసి ఠాణాల బెట్టిపిస్త.."జాలా మాటలకు అంతా నిర్ఘాంతపోయారు "ఏందే బాగా లాడెక్కువయ్యింది నీకు అమ్మా నాయినలను ఠాణాల బెట్టిపిస్తవా..? అని నోటికి వచ్చినట్లు తిట్టారు భూక్యాకి మాత్రం కోపం రాలేదు. జాలా..మామూలు అమ్మాయి కాదని..తన కూతురిలో ఏదో ప్రత్యేకత ఉన్నదని ఆమె చాలా గొప్పదౌతుందని మరీమరీ అనిపించ సాగింది..ఎవరు ఎన్నిరకాలుగా చెప్పినా వినక కూతుర్ని తీసుకువెళ్ళి..టౌనులో కాలేజిలో దగ్గరుండి చేర్పించాడు..చదువుకోవడం ద్వారా తానేదో సాధించగలనన్న ఆశ. ఈ తండాకి ఆ ఊరికిఉన్న దూరాన్ని తుడిచెయ్యాలని తపన రోజు రోజుకు పెరిగి పోతున్నది. నాగరికతకు అతి దూరంలో ఉన్న ఆ తండాలో జాలా చేసింది చాలా పెద్ద సాహసమే అయ్యింది..మిగతా పిల్లల కది ఆదర్శమయ్యింది. ఆ తరువాత తండాలోని వారంతా తమ పిల్లలను బడులకు పంపడం మొదలుపెట్టారు..దానికి

కారణం కూడా జాలానే..వీరు నాయక్ పనిలో పెట్టిన తండా అమ్మాయిల్లో..బాల్‌నాయక్ కూతురికి దొంగతనం అంటగట్టి వెళ్ళగొట్టడంతో తండా వాళ్ళంతా కుంగిపోయారు. జాలా విపరీతంగా కదిలిపోయింది.. ఎవరితో చెప్పకుండా మిగితా అమ్మాయిలు పని చేసే ఊర్లకు వెళ్ళి పనిమాని వెనక్కు రమ్మని అడిగింది.. అడ్వాన్స్ ఇచ్చి మరీ ఈ పిల్లలను పనిలో పెట్టుకున్నాం..మేం పంపం అన్నారు..గిప్పుడు జల్ది నాతోని బంపకుంటే చిన్నపిల్లలను పనిల బెట్టుకున్నరని ఠాణాల షికాయత్ జేస్తానన్నది. జాలాతో తండాకు తిరిగి వచ్చిన తమ పిల్లలను చూసి ముందు జాలాను తిట్టినా..తరువాత ఆమె మాటవిని హాస్టల్‌లో వేసి బడికి పంపడం మొదలు పెట్టారు..తండాలో వస్తున్న ఆ కాస్త మార్పులకు జాలా సంతోషపడి పోయింది. ముందు ముందు తామేదో సాధించగలమన్న నమ్మకంకుదరసాగింది.

జాలా తాను శ్రద్ధగా చదువు కోవడమే కాక వస్తూ పోతూ..అందరిని పలుకరిస్తూ..“ఓ రాధక్క సరోజను గట్ల పొలం పనికి బంపకు మంచిగ బడికి బంపు. ఓ చిన్నక్కా..సిన్న పోరిని ఉప్మా బడికి బంపు..ఉప్మా తింటే బలమొస్తది.అంగన్‌వాడి టీచర్‌తాన పాటలు పద్యాలు మంచిగ నేరుస్తది..అని చెబుతుంది..“ఓ చిన్నమ్మా..జర వదినెను అంగన్‌వాడికి బంపు.. కడుపుతో ఉన్నోళ్ళకు మందులిస్తరంటా..అని చెబుతుంది..పోచారందాక వస్తవ్ మా తండాలోళ్ళ దగ్గరకు రావెందుకు అంటూ వెంట నిలబడి మరీ ఏ ఏన్ ఎమ్ ను పిలుచుకొచ్చి తండాలో రోగులకు మందులిప్పిస్తుం టుంది.తమ్మి..గట్ల..రికాంగా గూసున్నవ్...లేసి ఉరుకు.. మస్తుగ ఉరుకు.. తండాలల్ల ఉండేటోళ్ళం..మనకు నడుసుడు కొత్తనా..ఉరుకుడు కొత్తనా..మనోళ్ళు లేక సర్కారు మనకోసరం ఉంచిన ఉద్యోగాలు మిగిలిపోతున్న యంట. హెూంగార్డు..కానిస్టేబుల్ ఉద్యోగాలు బడ్డయంటే అప్లికేషన్లు దెచ్చిన..మీరు జల్దిబోయి.. పాస్‌పోర్టు ఫోటోలు దిగిరండి..’’అని...పురమాయిస్తుంది..‘‘ఓ బాబ్‌లాల్ మామా..సదువుకున్న కోడల్ని..దెచ్చుకున్నవ్ సంతోషమే..కోతలు నాట్లని ఈడనే ఉంచకు..కండక్టర్ పోస్టులు బడ్డయి.. పంపు..”జాలా చెప్పిందంటే వేదవాక్కే..ఎవరు ఎక్కడకు వెళ్ళాన్నా..జాలాతో పంపితే వారికి నిశ్చింత..సమర్థవంతంగా పని పూర్తి చూసుకుని వస్తుందన్న నమ్మకం. “జాలక్కా..బుక్కులకు అట్టలేసుకుందమంటే రాజారాం.. దుకణంల రూపాయికి ఒక్క

పేపరంట..మా తాన పైసల్ లేవు...టీచరేమో అట్టలేసు కోమ్మంటాంది...పిల్లలు తమ బాధలు చెప్పుకుంటారు..స్నేహితులను అడిగి కొన్ని...కిలోల లెక్కన కొని పేపర్లు మోసు కొస్తుంది..దగ్గరుండి పుస్తకాలకు అట్టలు వేసుకోవడం నేర్పుతుంది. అక్కా బడిల మంచి నీళ్ళు దొరుకుతల్లేవు..సీసతో తెచ్చుకోమ్మంటున్నరు...సీసలేడి నుంచి దెచ్చేము. బయట గొందామంటే ఒక్కొక్క సీసకు మూడురూపాయలంట..హాస్టల్ పిల్లలు..అడిగేవారు..జాలా తాను చదువుకునే ఊరిలో చుట్టుపక్కలవారిని స్నేహితులను అడిగి..అవసరమైతే కొని పిల్లలకోసం ఖాళీ సీసాలు మోసుకొస్తుంటుంది..పుస్తకాల సంచులు లేక నాలుగు మైళ్ళు నడిచి వస్తుంటే పుస్తకాలు జారిపోతున్న య్యక్కా...అన్నారని.ఇంటింటికి తిరిగి..జూట్ బ్యాగులు సేకరించి ఒక్కో బ్యాగ్ నాలుగైదు రూపాయలకు కొనివాటిని పోచారం తీసుకువెళ్ళి..మిషన్ రంగన్నకిచ్చి పుస్తకాలసంచులుగా కుట్టించి..ఎవరికి సంచి లేదో చూసి వారికి ఇస్తుం టుంది.పదిహేను రోజులకో నెలకో జాలా వస్తుందని కబురు తెలియగానే..రాము నాయకో..బాబూలాలో సైకిళ్ళు పట్టుకుని..ఊరి మొదట్లో నిల్చుంటారు..తాను తెచ్చిన పేపర్ బండిల్స్..ఖాళీ సీసాలు.. పుస్తకాల సంచులు అవన్ని సైకిళ్ళ మీద తండాకు తెచ్చుకుంటారు. ఆ వస్తువులను పిల్లలూ పెద్దలూ కూడా ఎంతో అపురూపంగా వాడుకుంటారు.. ఆ రోజు దసరా సెలవులకి ఇంటికి వచ్చిన జాలా పిల్లలందరిని కూర్చోబెట్టుకుని కథలు చెప్పుతున్నది..బాబూలాల్ గుడిసె గుడిసెకి తిరిగి..జప్పన నదుంద్రి.అని తొందర చేస్తున్నాడు.అందరూ ఉత్సాహంగా ఎక్కడికో వెళ్ళడానికి సిద్ధమ వుతున్నారు..జాలా కేమి అర్థంకాలేదు. విషయం కనుక్కుంటే..“పనులు లేవని రంధి బడుతాన్నం గదా..

టౌనుల మీటింగ్‌బెడుతున్నరంట..మనోళ్ళను దీస్క రమ్మన్నరు..పైసలిస్తరంట..” అందరూ హడావిడి పడుతున్నారు..జాలా కెందుకో నచ్చ లేదు..“వద్దు కాకా..పొద్దుగాల్ల మనం అనుకున్నంగదా..అందరం గూడి దారి పొడుగుతా ఉన్న కంపంతా కొట్టేయ్యాల్నని. గుర్తుచేసింది.కాని ఎవ్వరూ వినిపించుకోలేదు..ఊరిలో ఎవరికి ఏ అవసరం వచ్చినాఏ వాహనం రాని ఆ తండాకు నిమిషాల్లో ట్రాక్టర్ వచ్చింది..భూక్యా గవిరి తోసహా అందరూ వెళ్ళి పోయారు .. రాత్రి తండాలో మిగిలిన పిల్లాపెద్దా ఓ ముద్ద తిని వెళ్ళిన వారి కోసం కోసం ఎదురుచూస్తూ నిద్రకొరిగారో లేదో ఏడుపులు పెడబొబ్బలు విని అందరూ లేచి బయటకు వచ్చారు..“ట్రాక్టర్‌కు టక్కరైందుల్లా..

మనోళ్ళకు మస్తు దెబ్బలు దగిలినయ్..సర్కారు ధవఖాన్ల షెరిక్‌జేసినముల్లా.." అంటూ..ఆడవాళ్ళు మగవాళ్ళు ఒకొర్నొక్కరుపట్టుకుని ఏడవసాగారు... జాలా పరుగున వచ్చి.."అయ్యయ్యో..మరి మిమ్ముల దీస్కపోయినోళ్ళు ఏం పట్టించుకోలేదా.." ఎళ్ళినోళ్ళకు మంచినీళ్ళే గతి లేవు తిండి తిప్పల్లేవు ..ఇచ్చినకాడికి పైసల్‌దీస్కోని అస్తాంటే.. లారోడు టక్కర్‌జేసిండు.."చెప్పుకున్నారు.ఆ ఏడుపులు..ఆ గోలలు తండా నుండి టౌనుకు..టౌను నుండి..తండాకు హాస్పటల్‌చుట్టూ తిరగుతూ ఓ పదిహేను రోజులు సాగాయి..వచ్చినయి వంద రూపాయలైతే..పదిహేనురోజులు పనికివెళ్ళకుండా.. మంచాన పడి చాలా అవస్త పడ్డారు..ఆ గాయాలింక తగ్గనేలేదు నెలరోజులకు అన్ని మరచిపోయారు...వాళ్ళకంత తీవ్రగాయాలైనా తండాకి ఆటో కూడా రాలేదు. ఇపుడు తండా వాసుల కోసం జీపులువేసుకుని రాజకీయ నాయకులు వచ్చి..గుడిసె గుడిసెకి తిరిగి తమతో ఆడిపాడి..ఓట్లు అడుగతుంటే.. జాలా నివ్వెరపోయింది.. లచ్చా తండాకిపుడు రోజూ ఉదయానే జీపు వస్తున్నది.పొలో మంటూ కురక్రారు పెద్దవాళ్ళూ ఆ జీపెక్కి తిరుగతున్నారు.ఎవరు ఏపార్టీ వారో..వారు గెలిచి ఎవరికి ఏంచేస్తారో తెలియదు గాని రోజల్లా పార్టీ జెండాలు పట్టుకుని పోచారం..దమ్మపేట తిరగడం సాయంత్రం పీకలదాకా తాగిరావడం..ఇక పోలింగ్ రోజు సారా ఏరైపారింది. అంతే..ఆ మర్నాటినుండి.. ఖండాంత రాలో ఉన్న దీవితో సంబంధాలు తెగిపోయినట్లు లచ్చాతండాతో.. ప్రపంచానికి సంబంధాలు తెగిపోయాయి..క్రమంగా జాలాకు చాలా విషయాలు అవగతమవ్వసాగాయి.. జనాభాలో తామూ భాగస్వా ములైనా.. తమ ఓటు ఎంతో విలువైనదైనా..తమ తండావారు కేవలం పనివాళ్ళుగా..పార్టీల జెండాలు మొస్తూ. రాజకీయనాయకులకు జేజేలు కొడతూ.. సభా స్థలాలను నింపే కూలివారిగా కరివేపాకుల్లా..ఉపయోగపడుతున్నందుకు కించపడింది. జాలా నింతర సంఘర్షణలోనే తండాలో వారి చదువులకు ఉద్యోగాలకు సహకరిస్తూ..తన చదువును టీచర్ శిక్షణను కొనసాగించింది.. ఇకనైనా పెళ్ళిచేసుకోమ్మని అంటున్న తల్లిదండ్రుల తండా వారి పోరు పడలేక.పెళ్ళికి వప్పుకున్నది. పోచారానికి ఆ పక్కన ఉన్న కొత్తతండా అబ్బాయి తౌర్యా నాయక్ పట్నంలో ఉద్యోగం చేస్తున్నాడు..జాలాను ఇష్టపడి చేసుకుంటానన్నాడు... జాలా బాగా ఆలోచించింది.. పెళ్ళికి ఒప్పుకుంది.. పెళ్ళి జరిగి ఆరు నెలలు అయ్యింది.

"చెప్పు బిడ్డా ఎందుకు పంచాయితి బెట్టిపించినవ్..?"తండా పెద్ద అడిగాడు...జాలా మౌనంగా నిలబడింది గవిరి భూక్యా..లక్ష్మణ్ నాయక్..రామ్‌నాయక్.. బాబూలాల్.. లచ్చక్క.. సీతమ్మ. రాంబాయ్..ఒకరేమిటి ఎవరూ ఇళ్ళ ల్లో లేరు అందరూ పంచాయితి వింటానికే వచ్చారు..."ఏంది మీ కిర్‌కిర్..చెప్పు కొడుకా..అని తౌర్యాను అడిగారు తండా పెద్దలు..

"కిర్‌కిర్ లేదు లొల్లి ల్లేవ్..ఏంలేవు మీ బిడ్డనే నాతోని విడిపోతన్నన్నది..ఎందుకో గామెనే చెప్పమనుండ్రి.." నిర్లక్ష్యంగా అన్నాడు. తౌర్యానాయక్ "నువ్వు మాట్టాడవేంది.. జాలమ్మా.. అడిగారు.. అందరూ..జాలావంక చూస్తున్నారు. తల వంచుకున్న జాలా అంత రంగంలో తుఫాను..ఏమని చెప్పాలి..తండా నుండి వీరు కాకా కొడుకు ఎమ్‌సెట్‌కు అప్లై చేసుకోడానికి వచ్చి,.పని కానందున ఆ రాత్రి..జాలక్కా అంటూ వచ్చి ఉ న్నందుకు.."ఇట్ల నువ్వు అందరిని రానిస్తే..ఇల్లుగాదు సత్రం అవుతుందంటూ.."తిట్టిన విషయం చెప్పాలా..? వృద్దాప్య ఫింఛన్ కోసం గంగూ తాత వచ్చినప్పుడు. రెండు రోజులు తానూ గంగూతాతతో తిరిగి పనిచేయించి పంపిన రోజున నాస్నేహితుని పెళ్ళికి రాకుండా..లేబరోడి కోసం తిరుగుతావా.?అని గొడవ పెట్టుకున్నాడని చెబితే తట్టుకుంటారా.? తన చుట్టూ ప్రశ్నల పరంపర.ఈ మౌనాన్ని ఛేదించాలి

తన నోరు విప్పాలి.కాని ఎలా..? నీళ్ళ సీసాలు..కవర్లు.పేపర్లు.. సేకరించి తండాకు తీసుకెళ్తున్న తనను తండా పిల్లలకోసమని ఎంత చెబుతున్నా వినకుండా...ఉ ద్యోగస్తుడిని చేసుకున్నా నీ చిల్లరబుద్దులు బోనిచ్చుకుంటల్లేవని చులకన చేస్తున్న విషయం.. తన నోటితో ఎలా చెప్పగలదు..? నీపచ్చబొట్టు జూస్తే..తండా దానవంటరు.. నా దోస్తుల మధ్య నాకు ఇజ్జత్ అనిపిస్తదని..తన ఉనికినుండి తాను పారిపోజూస్తూ... ప్లాస్టిక్ సర్జరి చేయిస్తా పదమంటూ కదంతొక్కిన వైనానికి కుంగిపోయిన తనను టీచర్స్ కౌన్సిలింగ్‌లో మాత్రం.."చూడు నీకు రిజర్వేషన్ ఉన్నది చక్కగా సిటీకి దగ్గరగా ఉండే ప్లేన్ ఏరియాలో. మంచి ప్లేస్‌లో ఉద్యోగాన్ని ఎంచుకోమన్నాడు..తాను పోచారానికి బాగా దూరానా ఉండి నాలుగు మైళ్ళు నడిచి వెళ్ళే బిక్కు తండాలో పోస్ట్‌ను ఎంపిక చేసుకున్నందుకు..ఇంటికి వెళ్ళాక చాలా పెద్ద గొడవ పెట్టాడు "అంత దూరం ఎవరు నడుస్తారని? ఆ బడిని ఎవరూ కోరుకోరు..మరి ఎవరూ వెళ్ళి చదువు చెప్పకపోతే

ఏళ్ళకొద్దీ ఖాళీగాఉన్న పోస్టులతో..మనతండా పిల్లలకు చదువులెలా వస్తాయి..? కనీసం మన చదువు పాట్లు తెలిసిన  మనమే మన సమస్యను పట్టించుకోకపోతే..మరెవరు పట్టించుకుంటారు..? అని అన్నందుకు..‘‘నువ్వేమన్నా మదర్ థెరీస్సాననుకుంటున్నావా..బతికే తెలివితేటలు లేవు ..అంటూ రభస రభస చేసాడన్న విషయం వీళ్ళు నమ్ముతారా.! తన బాస్ కూతురికి తోడు వెళ్ళి బీటెక్‌లో జాయిన్ చేసి వచ్చిన తౌర్యా..తండా తప్ప ప్రపంచం  చూడని తమ ఆడపిల్లలను జాలమ్మయితే దగ్గరుండి హాస్టల్స్‌లో చేరిపిస్తుందని నమ్మకంతో పంపినపుడు...“రేపు  మేము ఊరికివెళుతున్నామని..” అబద్ధంచెప్పి పంపేయ్యమన్నపుడు...ఉన్నవాడు ఉన్నవాడికే సాయం జేసి..లేని వాడు ఉన్నవాడికే సాయం జేస్తే... ఇగ మన తండాలల్ల ఉండేటోళ్ళు ఎట్ల పైకొస్తరు..?అని అడిగినందుకు..“ఇగ  నీ తోని నీ దేశసేవతోని యాష్టకొస్తున్నది..గాని గీ టీచర్ ఉద్యోగ మొద్దు..ఏ మొద్దు..మంచిగ కంప్యూటర్  కోర్సులు నేర్సుకో..ఏ బెంగులూరో బోయి.. ఈళ్ళందరికీ దూరంగ సుఖంగ బతుకుదమన్నాడని...చెప్పడానికి నోరు పెగలడం లేదు. తన జాతిని నీతిని మరచి స్వంత రక్తంలో పరాయితనాన్ని చూస్తున్న అతన్ని భరించలేనని చెప్పక తప్పని తరుణమిది..ఇప్పటికైనా తన మౌనాన్ని భగ్నం చెయ్యాలి..“చెప్పు  జాలమ్మా.. “అసలు నీ మాటేందో చెప్పు” అంటూ తన వారి... ప్రశ్నల రొద “ చెప్పేదేం లేదు కాకా .. నేను ఈయనతోని కలిసి బతుకలేను..నేను బోయి లచ్చాతండాల పాఠాలు జెప్పుకుంట.“గట్లంటే ఎట్లా బిడ్డా..? అని ఒకరు.. “అసలేమయ్యిందో..ఎందుకు మీరు విడిపోవాల్నను కుంటున్నారో  పెద్దలకు చెప్పాలెగదా ..”అని ఒకరు ప్రశ్నమీద ప్రశ్న. “అయిన గాని మీరు సదువుకున్నోళ్ళు.. మీరు ఒకళ్ళకు జెప్పేటోళ్ళు..గిట్ల..విడిపోతనంటే ఎట్లా బిడ్డా..? ‘‘చెప్పు బిడ్డా..నీ మొగడు తాగొస్తున్నడా..? “సామాన్లు గిట్ట మంచిగ దీస్కస్తల్లేడా ..?” “ నిన్నుగొడు తున్నడా.? చెప్పు బిడ్డా..నీకు మేమున్నం..తౌర్యా ఎవరితోనన్న తిరుగుతున్నడా..? ‘‘గట్ల తలవంచుకుని నిలుసుంటే ఎట్లా..చెప్పు..మాట్లాడు బిడ్డా..?

‘ఇగ గిట్ల అడుగక తప్పుతల్లేదు...

చెప్పు బిడ్డా నీ మొగడు..మొగోడు కాడా..? జాలా నోరు విప్పింది..

“మగవాడే..కాకా.. కాని మనవాడు కాదు..”

******

# 2
# సర్వేంద్రియానాం లోపం ప్రధానం

“ఏందిరా వారీ! ఇంకా లేవకపోతివి? పాసింజర్ టైమైతల్లే దొరతీర్గబన్నవ్” “లే నీయవ్వ నకరాల్ జేస్తున్నావ్‌రా...” అర్ధగంట నుంచి రకరకాలుగా తిడుతూ లేపుతున్నది కొమరవ్వ. “అరెమళ్ళ బన్నవ్ ఇగలెగవా ఏంది?” ఒక్క అరుపు అరిచింది.

“గట్ల తిట్టకే అవ్వ. రాతిరంతా నిద్రనే లేదే.. నెత్తినొస్తంది” ఎంకటి అన్నాడు. “ఎందుకురా? నాతిరెమన్న కైకీల్‌కు బోయనవా. నౌకరీకీ బోయనవా? నిద్ర లేదట నిద్ర. నీ యవ్వ నీకు గార్వమెక్కువైంది. పోరగాండ్లంత లేచి రైల్ టేషన్‌కు ఉరికింద్రు నీకింక తెల్లార లేదురా...” కొమరవ్వ తిట్టిన తిట్టు తిట్టకుండా తిడ్తూనే ఉన్నది.

సణుక్కుంటూనే ఎంకటి లేచి ముఖం పుల్ల దీసి పళ్ళు తోమడం మొదలు పెట్టాడు. వాడి మనసు నిండా లచ్చి జ్ఞాపకాలే.ఏదో ఆలోచిస్తూ నింపాదిగా పళ్ళు తోముతున్న ఎంకటిని చూస్తే వళ్ళు మండి కొమరవ్వకు.

“ఇంకా గాలేదురా? ?.” అరిచింది.

“అస్తున్న తియ్ ఊకే లొల్లిబెడతవ్...” విసుక్కున్నాడు.

“అవ్ ఒక మొగం కడ్గి ఇంకో గంట తానం జేసి నవాబ్ తరీఖ్ తయారై పోతవా ఏంది? పోయేది అడుక్కదిననా దేశమేలనా?..” గదమాయించింది కొమరవ్వ

“చీ... నీయవ్వ మొఖం కడుగుతుంటే గూడ ఓర్వదీ... ఎప్పటికి అడుక్కది నొచ్చి చిల్లర చేతిల బొయ్యాలె.. బేమాన్ బతుకులల్లమన్ను బొయ్య...” తిట్టుకుంటూ ఎంకటి మాసిపోయిన చొక్కాకు ముఖం తుడుచుకుని ఉరుకులతో పరుగులతో రైల్వే స్టేషన్‌కు బయలుదేరాడు. ఇంతా చేస్తే అదెంతో దూరం లేదు... బ్రిడ్జ్‌కు అతి దగ్గరలోనే

రైల్వే స్టేషన్, ఆ బ్రిడ్జ్ క్రింద నున్న పెద్ద సిమెంట్ పైపులే ఎంకటి లాంటి మరో పది పదకొండు కుటుంబాల ఇళ్ళు. కొందరు వెదురు బొంగులు కర్రముక్కలూ పాతి పోలిథిన్ షీట్లు కప్పి టైర్లు కట్టి చిన్న చిన్న గుడిసెల్లాంటివి వేసుకున్నారు.

ఎంకటి వెళ్ళేటప్పటికే పల్లీలు అమ్ముకునే రాజు. జామకాయలమ్ముకునే గౌరీ అక్కడున్నారు. రాందాస్ "ఎందిరా ఎంకటిగా ఇప్పుడు లేసినవా ఏంది?" అడిగాడు.

"అవ్..." అన్నాడు ఎంకటి ముఖం ఎటో తిప్పుకుని. కుంటోడు రాజేశం పాటలు పాడుతున్నాడు. టీలమ్మే జీవరత్నం అతని కొడుకు క్యానులతో రెడీగా ఉన్నారు...

"మీ అమ్మకు పేయి బాగున్నదా." అడిగాడు నారిగాడు.

"ఆ మంచిగనే ఉన్నది." ఎంకటి ముక్తసరిగా జవాబిచ్చాడు నారిగాడంటే ఎంకటికి ఎంతో కోపం. ఎప్పుడూ లచ్చీతో చేరి ఊసులాడతాదని.

"దవ్ఖానకు దోల్కపోయినవా లేదా ?." మళ్ళీ అడిగాడు. "నేను దీస్కపోతనన్నా ఆమె రాలె. నిన్న తనే రాములక్కను దీస్కొని బోతనన్నది. పోయింది గావచ్చు. ఏందో ఎర్ర గోళీలు దెచ్చుకుని ఏసుకుంటుంటే జూసినా." ఎటో చూస్తూ చెప్పాడు.

అంతలో లచ్చి ఇద్దరు ముగ్గురు అమ్మాయిలతో కలిసి అక్కడికి వచ్చి చేరింది. వాళ్ళంతా చింపిరితలలతో... మురికి బట్టి వాసన కొడుతున్న బట్టలతో ఉన్నారు. ఆ వాసనలకు ఎవరికైనా కడుపులో తిప్పుతుంది కూడా....

"ఆళ్ళు గిట్ల రెండు పూటలా సుబ్రంగా స్నానం చేసి దినాం బట్టలుతుక్కోని మంచిగ తయారైతే ఏ మారాజు ఒక్క పైస సుత ఎయ్యడు. అందుకే ఆళ్ళు గట్లనే ఉంటరు. తనుగూడ గట్లనే ఉండాలని అవ్వ లొల్లి బెడతది" విరక్తిగా అనుకున్నాడు. అంత మురికి బట్టలతో ఉన్నా లచ్చి వాళ్ళందరిలోకి ప్రత్యేకంగా కనపడ్తున్నది. రాగం దీస్కుంటూ. అది ఎన్నో సినిమా పాటలు పాడుతూ అడుక్కుంటుంది. పైగా మంచి మాటకారి... అందుకే పిల్లలంతా ఆమె చుట్టే చేరుతుంటారు. ఎంకటి కూడా ఎప్పుడూ దాని పక్కనే చేరి బోలెడు సిన్మ కథలు చెబుతుంటాడు. సిన్మా కథలంటే చెవి కోసుకునే లచ్చి ఎంకటి వంక ఆరాధనగా చూస్తూ వింటూంటుంది. ఆ చూపు కోసం దాని మెప్పు కోసం ఎంకటి ఎక్కడ లేని విషయాలు కల్పించి కథలుగా చెబుతుంటాడు.

ఎంకటికెప్పటి నుంచో లచ్చి మీద మనసుంది. లచ్చి ముందు బయట పడలేదు. లచ్చి తండ్రి మల్లయ్యకు ఎంకటంటే చిన్నప్పటి నుంచి ఎంతో అభిమానం. అసలక్కడ ఉన్న ఓ పది పన్నెడు కుటుంబాలల్లో ఎంకటి లాంటి రూపసిలేడు. ఎంకటి ఎన్నో సార్లు పగిలిన అద్దం ముక్కలో ముఖం చూసుకుంటూ తన అందానికి తానే గర్వపడుతుంటాడు. వాళ్ళమ్మ పక్కన చేరి...

"అవ్వా. గా నారిగాడికి సిన్నప్పుడే వాళ్ళమ్మ కండ్లల్లో జీడి పోసిందంట. దానికి తోడు టక్కరై ఒగ కాలుబోయి కుంటోడైండు. ఇగ శీను గాడికి మడత పడ్డ సెయ్యి. రాజయ్యకు రెండు కండ్లూ లేకపోయే. ఈళ్ళందర్నీ జూస్తాంటే పాణం కళకళమంటదే... గా సూరమత్త తీరు... రాజక్క తీరు నీ గిట్ట నా కండ్లల్ల జీడి బొయ్యాలనిపించలేదా..." అడిగాడు ఎంకటి

"లేదురా కొడుకా ! సందమామల్లే నా వడిల నీ వుండి సగుతాంటే నాకు పాణం గొట్టుకపోతాంటే నీ కంట్ల జీడిబోస్తలేనని... మీ నాయనమ్మ ఒక దిట్టుగాదు.. ఒక్క కంట్లన్న బొయ్యకుంటే వాడెట్ల బతుకుతడే అనెడిది." "దొరసానికి పుట్టిండనుకున్నావే... బిచ్చెపు ముండవుగాదే." అని ఏమి దిట్టినా దిట్టింది.

మీ అయ్యయితే "ఏందే మస్తు నకరాల్ చేస్తున్నవ్... నీయవ్వ నీ పోరగాడి కండ్ల జీడి బొయ్య నీకు మనసైతల్లే గాని నా గిట్ట తిక్క రేగిందంటే నీయవ్వ ఉయ్యాల్లో ఉన్న నీ పోరగాడి కాళ్ళు సేతులిరుస్త అని లొల్లి పెట్టి నన్ను మస్తు గొట్టిండు... గా సాయంత్రం నేను ఎవ్వల్కి జెప్పకుంట రేల్ గాడెక్కి బోనగిరి బోయిన మానవత్వానికి. లేకుంటే బిడ్డా... మీ అయ్య సిన్నోడు గాదు అన్నంతపని జేస్తడని మస్తు భయపడ్డ. మీ పెద్దన్న పుట్టుకలప్పుడు మీ తాత గట్లనే ఆడి కాలు మెలిపెట్టి ఇరిసిండు. రెండ్నెల్లు ఆడు ఒక్క ఏడ్పుగాదు. వాడ్ని దవఖాన్లకి దిప్పుకుంట మస్తు ఏడిసినగాని ఆడి కాలు సక్కంగ రాలే. మీ నడిపన్నపుడు గూడ నేనడ్డంబడ్డాగాని. మీ నాయనమ్మ దెయ్యం తీరు జేరి... ఒక కండ్ల జీడి బొయ్యనే బోసింది. నీకొక్కనికే నేను ఎట్లన్న జేసి ఆపినరా.." కళ్ళనీళ్ళతో కొమరవ్వ వివరించింది.

"నీవు అవ్వవుగావు అమ్మతల్లివి. దినాల నీ కాళ్ళు మొక్కాలె మా అవ్వ ఎంత మంచిదో" చెమరించిన కళ్ళతో ఎంకటి కొమరవ్వ వడిలో తలపెట్టుకున్నాడు.

"గంత మాటెందుకురా కొడుకా... మీరంతా మంచిగుంటే నా కంత సాలు" ఎంకటి తన జ్ఞాపకాల్లో ఉండగానే పాసింజర్ ఎనౌన్స్‌మెంట్ వినిపించింది.

"అరెవారీ! ఏసోబ్.. దిగేటోళ్ళ మొగం జూస్కుంట ఇగిలించుకుంట నిలవడద్దు రైలాగ మునుపే ఆళ్ళకంటే ముందే జొరబడి ఎక్కాలే." జీవరత్నం కొడుకును హెచ్చరించాడు. రైలు ప్లాట్‌ఫాం వైపు ఆగితే వీళ్ళంతా రైలు ఆగక మునుపే రెండో వైపు నుంచి ఎక్కేసి రైల్లో జొరబడ్డారు ఇంకా ఎంకటి ఎక్కుతూనే ఉన్నాడు. లచ్చి "పరదేశి..పరదేశి జానా నహీ.." పాటందుకున్నది.

"అరె రాజుగా... గిరిగాడు గన్పడ్డడా..." అడిగాడు ఎంకటి....

"గిరిగాడెప్పుడో గాడెక్కి వాడి సిన్గిపోయిన అంగిదీసి మంది దిన్న పల్లితొక్కల్ని ఊడుసుడు మొదలుపెట్టిండు..." అని చెప్పాడు ఎంకటి ముందుకు కదిలాడు.

నారిగాడు... "అయ్యా అయ్యా.! ఒగ కన్ను కాలు లేనోడ్ని మీ కాల్మొకుత బాంచన్ జర ధర్మం జేయండ్రి !." దయనీయంగా అడుక్కుంటున్నాడు.

"ఆచాయ్... గరంచాయ్... గరమ్ గరమ్ చాయ..." అనుకుంటూ జీవరత్నం ఒక బోగీలో, ఏసోబు ఒక బోగీలో టీలమ్ముతున్నారు. ఎంకటి చెయ్యి జూపి రైల్లో అటు ఇటూ తిరుగుతున్నాడు. వాడి చిరిగిపోయిన బట్టలు చిక్కిపోయిన శరీరం చింపిరి తలా చూసి వాడు బిచ్చగాడనుకోవాలే తప్ప వాడు శుభ్రంగా తయారైతే వాడ్నెవరూ బిచ్చగాడనుకోరు. అందుకోనేమో వాడికి ఎవరో ఒకరు ఒక పావలా అర్థా వేస్తున్నారే తప్ప... నారి గాడిలా... శీను గాడిలాగా చెయ్యి నింపడం లేదు. అసలు వాడి మనసు అడుక్కోవడం మీదే లేదు. లచ్చికి తన మనసులో మాట ఎలా చెప్పాలి... లచ్చి తన గురించి ఏం అనుకుంటుంది? లచ్చిని తన లగ్గమాడ్తానంటే వాళ్ళ అయ్య ఏమంటాడో? ఇదే వాడి ఆలోచన. రైలు స్పీడందుకోగానే వాడు డోరు దగ్గరకు వచ్చి నిలబడ్డాడు. వాడి ఆలోచనల్లో వాడుండగానే యాదగిరి వచ్చాడు.

"ఏందిరా వారీ అడుక్కుతిన శరమైతేందిరా నీకు.. నోట్ల నుంచి మాటనే అస్తలేదు..."

“అవ్ అన్న శరమైతాంది... ముఖమంతా ఇకారంగ పెట్టి మడుసుల మీదిమీదికి బోయి... ఆలు అసమంచుకుంటే సుత ఆడనే నిలుసోని పోరీ పోరా అడుక్కుదిన మస్తు శరమైతాంది...” మనసులో మాట చెప్పాడు.

“మరి గసొంటపుడు ఏమైన్న బేరం జెయ్యక పోయినవుర తమ్మి...”

“ఆ గది కూడ అయింది. ఒకనాడు గిట్లనే మా అయ్యకి అవ్వకి దెల్వకుంట నలపై రూపాయలు జమచేసి బఠాణీలు గొని అమ్ముడు మొదలు పెట్టిన ఒగ వారమైందోలేదో ఒక నాడేమైందో ఎర్కేనా... పెద్ద టీ.సీ. సార్లు వచ్చి రైల్ గాడి పోలీసోళ్ళకు మమ్మల బట్టిపిచ్చింౘ్రు... వాళ్ళు మూడు సార్లు జరిమానా ఏసింౘ్రు ఏడ్పించిదెస్త... అది గట్టకపోతినని రెండు నెలలు వరంగల్ జైల్లో బెట్టింౘ్రు. గప్పట్నుంచి బేరం జేయ్యాలన్న ముచ్చట్నే బందు బెట్టిన... గా జీవరత్న మసంటోళ్ళు రాములక్క లాంటోళ్ళంటే మస్తు సంపాదిస్తుంౘ్రు. ఒక నాడు సంపాదిస్తరు ఒకనాడు గిట్ల పోతయి పోయినంత... మళ్ళ ఒక దినంల వస్తయి. వాళ్ళ లెక్క నాతోని ఏడైతది..” తన గోడు చెప్పుకున్నాడు.

“గది సరే గాని తమ్మి... ఏంది గా లచ్చిమి మస్తు దిర్గుతున్నవ్... ఏందీ కత..”ఎంకటి అనుకోని ప్రశ్నకు మెలికలు తిరిగిపోయాడు.

“అంత దాని మీద మనసైతే లగ్గం జేస్కో రాదురా... వాళ్ళ అయ్య ఎట్లన్న ఈ ఏడు దాని లగ్గం జేయ్యాలని జూస్తున్నడు గాదు...” అనుకోని ఈ ప్రతిపాదనకు ఎంకటి కళ్ళల్లో మెరుపులు మెరిసాయి. కాస్సేపు మెలికలు తిరిగినా ఒక నిమిషం ఆలోచించి “నువ్వే మాట్లాడరాదే అన్న. నేనెట్ల అడుగుత జెప్పు...” అన్నాడు.

“సరే తియ్యి. నేనే మాట్లాడ్త గాని. నోట్ల కెళ్ళి మాటరానోడివి నువ్వెట్ల పెండ్లామును జూస్కుంటవ్‌రా. జర హుషార్‌తనం జెయ్యకుంటే దునియాల మంచి నీళ్ళు గూడ బుట్టవ్ ఎరికేనా.? గా పాటలు పాడే రాజయ్య లేడా.. వాడు అడుక్క దిన్న పైసల్తో... వాడి కూతురు వాడి పెండ్లాం వాడు బతకంగా దినాం బాంక్‌ల పైసల్జమ జేస్తున్నడెరికేనా.? అడక్క దిన నోట్ల కెళ్ళి మాట రాదు. ఎవ్వడేస్తౘ్రా పైసల్ లగ్గమనంగానే సరిపోయిందా.?” పెండ్లాని సాదాలెగదా.?” యాదగిరి అన్నాడు.

ఎంకటి తల వంచుకుని కూర్చున్నాడు. "అట్లంటే ఎట్లన్న.? నువ్వు చెప్పినట్టే ఇంట గాని జరలచ్చి వాళ్ళ అయ్యతో మాట్లాడాలే.. నీతోనే అయితదీపని." యాదగిరిని వేడుకున్నాడు.

"మాట్లాడ తెయ్య నువ్వేం పరేషాన్ గాకు మరి మీ అవ్వతో బాపుతో జెప్పినవా..."

"వాలేమంటరు మా అవ్వకు బాపుకు లచ్చి అంటే మస్తు పావురం." రైలు తర్వాతి స్టేషన్‌లో ఆగగానే యాదగిరి. ఎంకటిల బృందం దిగిపోయారు.

*****

ఎంకటి ఊరిలోకి బయలుదేరాడు. వాడి భుజం మీద ఉన్న జోలెలో పెద్ద పెద్ద అద్దం ముక్కలున్నాయి. అవన్ని లచ్చి కోసం దాచాడు. వారం రోజులుగా రకరకాల రబ్బరు గాజులు గాజుల షాపుల ముందు జేరి ఏరి జమ జేస్తున్నడు. వాటిని పంపు దగ్గర నీళ్ళతో శుభ్రంగా కడిగాడు. కడిగిన అద్దంలో తన ముఖం మరోసారి చూసుకున్నాడు.... వంగిపోయిన దువ్వెనతో తల దువ్వుకుంటూ... "నాకేమైంది వీరో లాగుంటా లచ్చికి ఎట్లన్న నేనంటే ఇష్టమే వాళ్ళ అయ్యతో యాదగిరి ములాఖత్ అయినంక... ఒక వారం దినాలల్ల మాకు లగ్గమైతది..." వాడి ఆలోచనలు లచ్చి చుట్టే పరిభ్రమిస్తున్నాయి. ఎట్టకేలకు యాదగిరి ఎంకటికి శుభవార్త చెప్పాడు. లచ్చి వాళ్ళ అయ్య ఎంకటితో లచ్చి పెళ్ళికి వప్పుకున్నాడని, కొమరవ్వ కూడా ఎంతో సంతోషించింది. అప్పటి నుంచి ఎంకటికి లచ్చితో మాట్లాడాలని ఆరాటపడి పోతున్నాడు.

బజారులో ఆ సందుకూ ఈ సందుకూ తిరుగుతున్నాడు ఎంకటి. వెల్లుల్లి పాయలు, ఉల్లిపాయలూ, ఎండుమిర్చి, సొంటి పసుపుకొమ్ములూ కుప్పలు చేసి అమ్ముతున్నదొకామె. ఆమెను సమీపించి... మంచి పసుపు కొమ్మొకటి ఏరాడు.

"ఇది ఎంత కిస్తవ్..." అడిగాడు...

"ఒక్కటే కావాల్నా ఏం జేస్కుంటవ్ ?" ఇకిలించింది అమ్మే ఆమె "ఏమన్న జేస్కుంట. ఎంత కమ్ముతవ్ చెప్పు." ముఖం ముడుచు కొని అన్నాడు.

'ఆఠాణా".చెప్పిందామె. జేబులోంచి చిల్లర తీసి అర్థ రూపాయి ఆమెకిచ్చి పసుపుకొమ్ము తీసుకొన్నాడు. కిరాణాషాపు ముందు నుంచుని "ఓ అయ్యా... జాదారమియ్యి... నీ బాంచెన్" అడిగాడు ఎంకటి..."

"ఓ సారు గింతంత దారమియ్యరాదూ..." పదేపదే అడిగినా బేరాలు చేసుకుంటూ షాపతను జవాబివ్వలేదు. జేబులోంచి రూపాయి బిళ్ళదీసి "తెల్లదార మియ్యి..." విసురుగా అడిగాడు.

"ఏం దారం బాబూ! అసుంట నిల్చుని అడుగు ఏం కావలే..."

"తెల్లదారం..."

"ఇంకో చారానా ఇయ్యి రూపాయికే వస్తుదా ఏంది.?" ఇంకో చారానా తీసి ఇచ్చాడు. దారపుండ తీసుకున్నాడు.

ఎంకటి జేబులో పసుపుకొమ్ము దారపుండ గుండెలకు తగులుతుంటే వాడికెన్నో వేల ఆలోచనలొస్తున్నాయి. మా లగ్గం నాడు సోపతులంతా (స్నేహితులంతా) జేరి ఎంత మస్తీ జేస్తరో.?. సంబరంగా ఆళ్ళంతా సుట్టూ జేరి మస్తు పాటలు పాడుకుంట మస్తు లొల్లి లొల్లి జేస్తరు... ఆలోచనలతో మురిసిపోతున్నాడు. అంతలో ఏదో కళవళపడ్తూ లచ్చితో మాట్లాడాలని పరితపిస్తున్నాడు.

లచ్చి అందరితో ఎంతో కలుపుగోరుగా ఉంటుంది. ఎంకటి మనసులో అదే భయం. ఎంకటితో పెళ్ళికి వప్పుకుంటుందా లేక వాళ్ళందరిలో ఎవరినైనా ఇష్టపడుతుందేమోనని జేబు నుంచి అద్దం ముక్క తీసుకుని మరోసారి ముఖం చూసుకున్నాడు. "ఊహూ ఏట్లా చూసినా అక్కడ చేరిన తమ బృందంలో తానే చాలా బాగుంటాడు. ఏం తనకేమైనా కన్నొంకరా కాలొంకరా.? లచ్చి తప్పకుండా తనను పెళ్ళాడతానికి వప్పుకుంటుంది. లచ్చితో మాట్లాడాలి. లచ్చితో మాట్లాడాలంటే ఈ ప్యాసింజరు తమ ఊరు చేరాలి... ఆమె వంటరిగా కలవాలి అపుడు తన మనసులో చెప్పాలి. లచ్చి వప్పుకునే ఉంటుంది. లేకపోతే వాళ్ళ తాతయ్య చెప్పనే చెప్పి ఉంటాడు... అయినా సరే తనే స్వయంగా ఆమె మనసులో మాట తెలుసు కోవాలి. ఇవాల రాత్రి ఆమెతో ఎలాగైనా మాట్లాడాలి" ఇవీ వాడి ఆలోచనలు.

*****

## నాల్నాలుగుల పదహారు

అనుకున్న సమయం రానే వచ్చింది. ఆ రాత్రి ఏడున్నరకు తన లచ్చిని తీసుకొని పాసింజర్ వచ్చింది. తోటి పిల్లలతోటి లచ్చి సందడిగా రైలు దిగింది. జాంకాయలు తింటూ వాళ్ళంతా ఓ చోట చేరి వచ్చిన చిల్లర లెక్క పెట్టుకుంటున్నారు. కాస్సేపటికీ ఎవరిదారిన వాళ్ళు వెళ్ళి పోతుంటే ఎంకటి లచ్చిని ఆపాడు.

"లచ్చీ నీతో మాట్లాడాలే..."

"ఏం మాట్లాడ్తవ్.? నాకు మస్తు ఆకలౌతొంది. నేను బోవాలో"

"అరె జర ఆగు... నీకు తింటానికి బన్ను తెస్త ఛాయ్‌తెస్త గాని ఒక్కమాట జెప్పు మీ అయ్య అవ్వ నీతో ఏమన్నా చెప్పింర్రా...?" ఆశగా అడిగాడు.

"ఆ చెప్పింర్రు..."

అమ్మయ్య విషయం తెల్సన్నమాట"ఏమని చెప్పింర్రు..?" మళ్ళీ అడిగాడు.

"యాదగిరితోని నన్ను లగ్గం చేస్కుంటనని అడిగిపించినవని చెప్పింర్రు..." చెప్పింది లచ్చి

"అయితే నువ్వేమన్నావ్.?" ఆత్రంగా అడిగాడు.

లచ్చి తలవంచుకు నిలబడింది. ఆమె నుంచున్న తీరుకు ఎంకటికి ముచ్చటేసింది. "లచ్చీ అంత సిగ్గైతే ఎట్ల... నేనేమన్న కొత్తోడినా.? ఒగ మాట జెప్పరాదు నేనంటే ఇష్టమేనని."

"నువ్వంటే ఇష్టమే గాని గంత ఆశబడకు. రాతిరే మా అయ్య జెప్పిండు. ఎంకటికి నీకు లగ్గమని ఈ లగ్గం జేస్కోనని రాతిరే మా అయ్యకు జెప్పిన. ఇదేం సిన్మా గాదు నువ్వంటే నా కిట్టం నేనంటే నీకిట్టమని కతలు జెప్పుకుంట బతికేందుకు. నువ్వేమన్న అనుకో, నేను నిన్ను లగ్గం జేసుకోను." ఊహించని జవాబుకు ఎంకటికి తల తిరిగి పోయింది.

"ఏం ఎందుకు జేస్కోవు నాకేం తక్కువ.?" అయోమయం నుంచి తేరుకుంటూ కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరుగుతుండగా అడిగాడు.

"ఏం తక్కువనా.? ఏం తక్కువ గాదు కాబట్టే చేసుకోనంటున్నా. మనం బిచ్చపోళ్ళం జమీందార్లం గాదు, అందం గుండిఅంగీలు మారుసుకుంట తిరగనీకి.. నీ గిట్ట కాలు సెయ్యి కన్ను అన్ని మంచిగనే ఉంటే... నీవేం జెప్పి అడుక్కుదింటవ్. దినం నీ ఆమ్దాని ఎంతో నా కెరికలేదా? అందుకే ఆమ్దాని బాగా వచ్చేటి నారిగాడ్ని లగ్గం చేస్కుంటనని జెప్పి అయ్యకు సంజాయించి చెప్పిన. మా అయ్య గూడ సరేనన్నడు. ఒక వారం దినాలల్లనే మా లగ్గం మనసు కష్టబెట్టుకోకుండా రా." పొడిగా అనేసి లచ్చి చీకట్లో కలసిపోయింది.

ఎంకటి ఒక్క పరుగున వెళ్ళి కొమరవ్వ వళ్ళో వాలిపోయాడు. "అవ్వ సిన్నపుడు బొయ్యక పోతివి సరే. ఇపుడన్న నా కండ్ల జీడిబోయ్యి. నాకు దక్కాల్సిన లచ్చి ఎవ్వళ్ళకో దక్కుతుంటే నేను జూడలేను. నా కండ్లలో జీడి బోయ్యవ్వా.. నా కండ్లలో జీడి బొయ్యి..." కొమరవ్వ వడిలో జేరి ఎంకటి ఎక్కిళ్ళు పడుతున్నాడు.

*****

# 3

# నిన్ను నిన్నుగా ప్రేమించుటకు

"కుశలమా... నీకూ కుశలమేనా..?" అల్లరిగా అడుగుతున్నాడు ప్రశాంత్ ఫోన్లో...

"ఆహా! నిక్షేపంగా ఉన్నాను... ఆంగ్ల శిక్షణేమో కాని హాయిగా అన్నీ సమయానికి అందుతున్నాయి... లేవగానే టీ, కాఫీలు ఆపై ఎనిమిదింటికలా టిఫిన్, ఆ తర్వాత క్లాస్... అంతలో టీ, మధ్యలో భోజన విరామం... మధ్యాహ్నం క్లాసులో మళ్ళీ టీ, సాయంత్రం ఆరుగంటలకు టీ, స్నాక్స్... రాత్రి డిన్నర్ ... వండకర్లేదు... వార్చక్కర్లేదు... ముఖ్యంగా తినండి తినండి అంటూ ఎవరినీ బతిమాలనక్కర్లేదు... స్వర్గమిక్కడే ఉన్నది..." పెంకెగా జవాబిచ్చింది బృంద.

"మేమైతే ఊహించనంత సంతోషంతో తూగిపోతున్నాము. త్వరగా లెమ్మనే పోరు లేదు... స్నానం రెండుమూడు రోజులకోసారి చేసినా అడిగేవారు లేరు... రోజు ఇంటి టిఫిన్‌లతో బోరు కొట్టి నేను పిల్లలు ఉడిపి హొటల్ రుచులన్నీ చవిచూస్తున్నాం... ఇదే తినమని పోరు పెట్టేవారు లేరు... అన్నింటికి ఆంక్షలు పెట్టేవారు లేరు..."

"నిజంగా అంత ఆంక్షలు పెట్టి బాధించానా..?" చిన్నబుచ్చుకుంటూ అడిగింది బృంద...

"ఏయ్ బృందా! నీ అల్లరికి నా అల్లరి చెల్లు... అంతేగానీ చిన్నబుచ్చుకోవడాలు లేవు..."

శ్రీవారితో మనసారా మాట్లాడుకుంటున్నది బృంద. అంతలో కింద గేటుదగ్గర ఎవరో ఒక స్త్రీ గొంతు చాలా హెచ్చు స్థాయిలో వినబడుతుంటే కిటికీలోంచి కిందకి తొంగి చూసింది...

గేటు దగ్గర ఒకామె ఎవరో వార్డెన్‌తో... వాచ్‌మెన్‌లతో పెద్దగా వాదిస్తున్నది. గేటుకవతల ఆటో ఆగిఉంది... దానిలో ఆమె లగేజ్ కనిపిస్తున్నది. ఆమె వెంట ఐదేళ్ళ బాబు కూడా ఉన్నాడు.

నిన్నటితో బ్యాచ్‌కు సరిపడా అభ్యర్థులు వచ్చేశారని... కొత్తగా ఇంకెవ్వరు వచ్చినా తీసుకోరని చెప్పేశారు. ఆలస్యంగా వచ్చారని ఉదయం ఒకరిని తిప్పి పంపేశారు కూడా...

నాలుగు దక్షిణాది రాష్ట్రాల నుండి ఉపాధ్యాయులను ఆహ్వానించి వచ్చిన వారికి ఇక్కడ రెండు నెలలు ఆంగ్ల భాషపై శిక్షణనిస్తారు. ఈ సారి అనుకున్నదానికంటే ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు వచ్చారని రాష్ట్రానికి ఇరవై మంది చొప్పున ఎనభై మందితో కొత్తబ్యాచ్ ప్రారంబిస్తున్నామని నిన్న చెప్పారు. అయినా కొత్తగా మరో ముగ్గురు వస్తే చేర్చుకున్నారు కూడా. మరివ్వాళ్ళ ఈమెను ఎందుకు అభ్యంతర పెడుతున్నారో తెలియదు అనుకున్నది బృంద.

రానురాను ఆమె స్వరం మరింతగా పెరుగుతున్నది. ఆటోలో నుంచి లగేజి దింపేసి లోపలపెట్టింది. గేటులోనుంచి దూసుకొని లోపలకి వచ్చేసింది. ఆటోవాడ్ని తిప్పిపంపేసింది. అక్కడే నుంచోని ఫోన్లో ఎవరిఎవరితోనూ మాట్లాడింది. మొత్తానికి ఓ అరగంటకు ఆమె పైకి రానే వచ్చింది.

"హూ ఈజ్ ధట్..." ఓ కేరళ ఆమె అడిగింది.

"సమ్ బడీ ఫ్రం ఆంద్రా.." చెప్పింది అందులో ఏ అర్థం ధ్వనించలేదనే భావించాలి.

"ఆ కొత్తగా వచ్చినావిడది ఎంత పెద్ద గొంతో... మా రూములోకి మాత్రం వద్దు..." కర్ణాటక ఆవిడ అన్నది.

"అమ్మో! ప్రతి దానికి గొడవపెట్టుకునేటట్లు ఉంది... మా రూమ్‌కి మాత్రం వద్దు... ఓ తమిళ టీచర్ అన్నది..." ఇలా ఎవరికి వారు మా రూమ్‌లోకి మాత్రం వద్దు... మారూమ్‌లోకి మాత్రం వద్దు అని వాళ్ళలో వాళ్ళే గుసగుసగా అను కుంటున్నారు.

ఆమె పెట్టాబేడా, పిల్లాడ్ని పట్టుకొని నించుని అందరి వంక చూస్తున్నది. ఎవరూ ఆమెను తమ రూమ్‌లోకి ఆహ్వానించలేదు... ఎవరికి వారు మౌనంగా నిష్క్రమించారు.

బృంద వెళ్ళి "రండి! నాపక్క బెడ్ ఖాళీగా ఉన్నది" అన్నది. ఆమె ముఖం సంతోషంతో విప్పారింది.

"థ్యాంక్స్ అండి" అంటూ వచ్చి లగేజ్ పెట్టుకున్నది. బృంద సహాయం చేసింది. అలసిపోయినట్లున్నారు. ముందు స్నానం చేసి రండి అన్నదే తడవుగా ఆ బాబుకి స్నానం చేయించి తాను స్నానం చేసింది. తను సుధీర అని చెప్పుకొని బృందాను పరిచయం చేసుకున్నది.

"రండి డైనింగ్ హాల్‌కి వెళ్దాం.." అన్నది బృంద. ఆమె ఎన్ని గంటలు ప్రయాణం చేసి వచ్చిందో..? ఎంత ఆకలితో ఉందో..? ఆ మాట కోసమే ఎదురుచూస్తున్నట్లుగా కదిలి వచ్చింది. డైనింగ్ హాల్‌లో బాబు గురించి ప్రస్తావన వచ్చింది.

కొలీగ్స్ అంతా "మీ బాబేనా..?"

"మీతోపాటే ఉంటాడా..?"

"మేడమ్‌తో మాట్లాడారా..?"

"ఆమె పర్మిషన్ ఇచ్చారా..?"

"బాబుకి ఫ్రీనా... లేక మీరు పే చేస్తారా..?" వార్డెన్, బాయ్స్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పింది సుధీర... చివరకు

"వాళ్ళు పెట్టలేకపోతే నేనే పే చేస్తాను. సరేనా..." చాలా పెద్ద స్వరంతో చెప్పింది. ఆమె స్వరం విని భోజనం చేస్తున్నవాళ్ళంతా ఉలికిపడి ఆమె వంక చూశారు. సుధీర అసలు పట్టించుకోలేదు. బాబుకి శ్రద్ధగా భోజనం తినిపించసాగింది.

భోజనం అయ్యాక గదిలోకి వచ్చాక వివరాలు చెప్పింది. తాను చీరాల నుండి వచ్చానని, ఇంగ్లీష్ అంటే ఎంతో ఆసక్తి అని ఏదో నేర్చుకోవాలన్న తపనతో వచ్చానని బాబుని చూసుకోవడానికి ఇంట్లో వేరెవ్వరూ లేరని చెప్పింది. బృంద కూడా "మీవారేమి చేస్తుంటారు... ఆయన చూసుకోవచ్చుగా..?" లాంటి ప్రశ్నలేమి వేయలేదు. సుధీర అలసిపోయి నిద్రపోయింది. ఉదయం చెప్పింది.

"నేను పనిచేసేది చాలా చిన్న పల్లెటూర్లో. మా ఎం.ఇ.వోగారిని కలిసి సంబంధిత పత్రాలని ఇచ్చి వచ్చేసరికి ఓ రోజు ఆలస్యం అయింది...ట్రైనింగ్‌కి రమ్మని వీళ్ళు పంపిన ఉత్తర్వుల ప్రకారమే కదా వచ్చాను. దాదాపు ఇరవై గంటలు ప్రయాణం చేసి వచ్చాక వెనక్కి వెళ్ళమంటే ఎలా వెళతాను చెప్పండి.?" అన్నది సుధీర నిజమేకదా అనిపించింది బృందాకి. త్వరత్వరగా సిద్ధమై డైరెక్టర్‌గారిని కలిసి తాను వెనక్కి ఎందుకు వెళ్ళాలని నిలదీసింది సుధీర. తన బాబుకి వాళ్ళు ఆశ్రయం ఇవ్వవచ్చునంటూ మార్గదర్శకాలను కూడా చూపించింది. డైరెక్టర్ ఆమె ఉండటానికి ఒప్పుకున్నాడు. సుధీర స్థిమితపడింది.

ఆ రోజు నుంచి అన్నింటా తనకేం కావాలన్నా అదే స్వరంతో సాధించు కోవడంతో ఆమంటే అందరికీ ఓ విముఖత ఏర్పడింది. అంతవరకూ షెడ్యూల్ ప్రకారం తరగతులు జరిగినా జరగకున్నా. ఎవరూ ఏమి పట్టించుకునేవారు కాదు. కానీ సుదీర చేరిన మూడో రోజే టైమ్ టేబుల్ ప్రకారం లాంగ్వేజ్ ల్యాబ్ క్లాస్ ఎందుకు నిర్వహించట్లేదు అంటూ..? నిలదీసింది. లైబ్రరీ పుస్తకాల గురించి కూడా అలాగే అడిగింది.

క్లాస్‌లో కూడా వాళ్ళు వేగంగా చెబుతూ ఉంటే ఆనకట్ట వేసేది. "చూడండి మేడమ్! ఇంగ్లీష్ మీ మాతృభాషా కాదు. మా మాతృభాషా కూడా కాదు. మీరు ఇక్కడ ఫ్యాకల్టీ. మేమంతా ట్రైనీస్. మీ టాలెంట్ ప్రకారం కాకుండా మేము ఫాలో అయే స్పీడ్‌లో వివరంగా చెప్పండి." పెద్ద స్వరంతో అనేది.

ఒక్కోసారి బాబు బయట నించుని పెద్దగా ఏడ్చినా లేచి వెళ్ళేది కాదు. లెక్చర్ పూర్తిగా విన్నాకే వెళ్ళేది. ఒక్కోసారి బాబుపై అంతులేని ప్రేమ చూపించి ముద్దులతో ముంచెత్తేది.మరోసారి విపరీతంగా కొట్టేది. సుధీరను పరిశీలించడం బృందాకు ఒక వ్యాపకమైపోయింది.

మెల్లమెల్లగా బృందాకి సుధీరకి మంచి స్నేహం కుదిరింది. సుధీర ఓ రోజు అన్నది "నా జీవితంలో నన్నింత ఆప్యాయంగా పలకిరించింది మీరే..." అని

"అలా ఎందుకనుకుంటారు..? ప్రేమ, స్నేహం ఇచ్చిపుచ్చుకోవడంలోనే ఉంటుంది. మనం ఎంత ఇస్తే అంత పొందవచ్చు." సుధీర పగలబడి నవ్వింది.

"మీరు నవలలు బాగా చదువుతారా..?" అని అడిగింది. బృంద చిన్నబోయింది.

"లేదు బృందా! ఈ వాఖ్య నేను చాలాసార్లు విన్నదే కానీ అన్నిసార్లూ అందరి జీవితాలకు అన్వయించదు" అన్నది సుధీర...

"సరే! ఎందుకు అన్వయించదో బాబు భోజనమయ్యాక నీవే చెప్పాలి. సుధీర" అన్నది బృందా అలాగే ముక్తసరిగా అన్నది సుధీర..

భోజనమయ్యాక పనసపండు చెట్టుకింద, సిమెంట్ చప్టాల మీద కూర్చున్నారు ఇద్దరు

"సుధీరా! నీ కళ్ళు చాలా బాగుంటాయి. పైగా తలకుపోసుకున్నావేమో ఈ వెన్నెలలో భలే బాగున్నావు సుమా" అన్నది బృందా.

సుధీర కళ్ళలో నీళ్ళు "నన్ను నా అందాన్ని మెచ్చుకున్న ఏకైక వ్యక్తివి నీవే... నేను చాలా అందంగా ఉన్నానని అది నీవు మాత్రమే గమనించి కితాబిచ్చావని కాదు... ఈ కన్నీళ్ళు నా గురించి ఆలోచించే ఓ తోడు దొరికిందని. నాకు కాస్తా గుర్తింపు దొరికిందన్న సంతోషంతో. అయినా ఇప్పటి దాకా నా అందాన్ని పొగిడిన వారే లేరు..." సుధీర నవ్వింది.

"అబద్ధం! నీ అందాన్ని పొగిడిన మరో వ్యక్తి కూడా ఉండి ఉండాలి..."

"అంత అదృష్టం లేదు. కట్నం కుదిరి కుటుంబ నచ్చితే చాలు... ఏ చెక్కపేడుకో తాళికట్టమన్నా... కట్టే వ్యక్తిత్వం లేని పెళ్ళికొడుకుల వర్గానికి మా ఆయనే ప్రతినిధి." పగలబడి నవ్వింది.

"సరే! పెళ్ళి ఎలా చేసుకున్నా. ఆ తర్వాతైనా అమ్మాయి అందం నచ్చి ఉండాలి కదా..?"

"నచ్చే ఉంటుంది...చాలా ఉబలాటపడుతూ నా చుట్టూ తిరిగే వాడు. నేను అదంతా నాపై ప్రేమే అన్న అమాయకత్వంలో చాలా రోజులు గడిపాను."ఈ మాటలతో స్పష్టమైంది. సుధీర తన భర్తతో కాపురం చేయటం లేదని. తన జీవితంలో చెప్పలేని వ్యధేదో ఉందని తాను కొనసాగించింది.

"ఆడవాళ్ళకైనా మగవాళ్ళకైనా కావాల్సింది అందం కాదు. వ్యక్తిత్వం. వెన్నముక. నాకు వెన్నముకతో జీవించేవారంటే ఇష్టం." మౌనం వహించింది బృంద.

"ఏమిటో బృందా! జీవితమంతా అసంతృప్తితో పోరాటాలతో గడిచిపోయింది. ఇవాళ నాలో ఏదో అలజడిగా ఉంది. ఏదో చెప్పాలని ఉంది వినే ఓపిక ఉందా..."

"చాలా ఉంది... ఓపిక కాదు సుధీరా! నీతో స్నేహం పంచుకోవడమంటే కలిసి క్లాసులకు వెళ్ళడం కలసి భోజనం చేయడమే కాదు... కలిసి కన్నీళ్ళు మోదాలు పంచుకోవటం కూడా..."

"నీవు పంచుకుందామనుకున్నా... నేను పంచుతానన్నా... మోదాలేమీ లేవు... ఖేదాలే తప్ప..."

********

"మధ్యతరగతికి దిగువస్థాయి కుటుంబమైనా మరీ తింటానికి లేని కుటుంబం కాదు మాది. నాకు మా ఊరంటే చాలా ఇష్టం. మాకున్న ఆకాస్త పొలమంటే ప్రాణం. అమ్మతో పాటు మిరపచేనుకో పత్తిచేనుకో వెళ్ళి పనిచేయడం మరీమరీ ఇష్టం. అలా అని నా చదువునేం నిర్లక్ష్యం చేయలేదు కానీ అమ్మ ఆశ ఏంటో అర్థం కాలేదు. ఊర్లో ఆరుఏడు తరగతులున్నా నన్ను టౌన్‌లో హాస్టల్‌లో వేసింది."

"మన ఊరి వాళ్ళంతా అక్కడే చదువుతున్నారు. నీకక్కడైతేనే చదువుబాగా వస్తుంది." అనేది. ఎంత ఏడ్చినా వినలేదు. నన్ను తిట్టీ కొట్టీ ఆ హాస్టల్‌లో వేసి నిర్ధాక్షిణ్యంగా తాను వెళ్ళి పోయిన రోజు వరకు నేను చాలా సౌమ్యురాలిగానే ఉండేదాన్ని..."

"అమ్మ వెళ్ళిపోయిందని తెలుసు. వెనక్కి రాదని తెలుసు అయినా పెద్ద గొంతు వేసుకొని ఎన్ని గంటలు ఏడ్చానో లెక్కలేదు. ఆ తర్వాత కూడా ఎవరు పలుకరించినా ఏడుపే. అందరూ ఎప్పుడూ ఏడుస్తుందే ఆ సుధీరేనా అనేవాళ్ళు." పెద్దగా తెరలు తెరలుగా నవ్వింది. అబ్బురంగా చూసింది బృంద.

అందరి మధ్యలో ఉన్నా అమ్మలేని ఒంటరితనం నన్ను తీవ్రంగా బాధించేది. నా ఏడుపును ఎవరైనా ఎగతాళి చేస్తే “మీకెందుకు...” అని పెద్దగా ఒక అరుపు అరిచేదాన్ని. ఆ ఆరుపుకు అందరు అంత దూరాన నిలిచేవారు. అప్పటినుండి అరుపు నా ఆయుధమైంది.

“ఓ నెల రోజుల తర్వాత కాస్తా పరిస్థితులకు అలవాటుపడ్డాను. ఆరు పూర్తి చేసి ఏడులోకి వచ్చాను. మళ్ళీ వేసవి సెలవుల్లో అమ్మని బ్రతిమాలాను. హాస్టల్‌లో వేయొద్దని. అమ్మ వినలేదు. అంతే అమ్మంటే నాకు ఆసక్తి పోయిందని అనుకున్నాను. అమ్మ రావాలని... నన్ను తీసుకెళ్ళాలని ఆలోచనలు మానుకున్నాను. ఇంతలో మా హాస్టల్ అమ్మాయి నీరజ పెద్దమనిషి అయిందని చెప్పారు. వార్డెన్ వాళ్ళ అమ్మవాళ్ళకు కబురుచేసింది. తెల్లారే వాళ్ళవాళ్ళు వచ్చి ఆ అమ్మాయిని తీసుకెళ్ళారు...”

“పెద్దమనిషి అవటం అంటే ఏమిటి..? నేనందర్ని పదేపదే అడిగాను. అందరూ నవ్వారేగానీ ఎవ్వరూ చెప్పలేదు. నాకు ఒకటి బాగా అర్థమైంది. పెద్దమనిషి అయితే హాయిగా ఊరెళ్ళిపోవచ్చని. అమ్మవాళ్ళు వచ్చి తీసుకెళ్ళి పోతారని. వార్డెన్‌గానీ బడిలో టీచర్లుగానీ ఏమి అనరని...”

“ఓ పదిహేను రోజుల తర్వాత నీరజ పచ్చగా మెరిసిపోతూ కొత్తపరికిణి పల్లెవాటు వేసుకొచ్చింది. చిన్న క్యాన్‌లో లడ్డూలు తెచ్చి అందరికీ పంచింది. నాకు మరో విషయం అర్థమైంది. పెద్ద మనిషి అయితే లడ్డూలు పంచవచ్చని. ఇక ఆమె చెవులకు కొత్తగా పెట్టుకున్న బుట్టలోలాకులు ఎంత అందంగా ఉన్నాయో చెప్పలేను. అప్పట్నుంచి ఎవరు పెద్దమనిషి అవుతున్నా బాగా గమనించసాగాను.

“వాళ్ళు వాళ్ళ ఊర్లకు వెళ్ళటం... కొత్త అందంతో తిరిగిరావటం... వచ్చాక కొత్తబట్టలేసుకొని మాకు ఇచ్చినా ఇవ్వలేకపోయినా వార్డెన్‌కి, టీచర్లకు స్వీట్లు పంచడం ఆహా... నేనెప్పుడు పెద్దమనిషి అవుతానా..? అని ఎంత ఎదురుచూశానో..”

“అనుకోకుండా మా వార్డెన్ నాలుగు రోజులు సెలవుపెట్టింది... గుమస్తా వంటవాళ్ళే హాస్టల్ చూసుకుంటున్నారు... ఆరోజు నేను కడుపు నొప్పితొ మెలికలు తిరిగిపోతూ చాలా ఏడ్చాను... ఆ రక్తం... ఆ తడిబట్టలు... ఆ ఛండాలం.. ఛా...ఛా...

ఇదా పెద్దమనిషి అవడమంటే! చాలా విరక్తి పుట్టింది... నొప్పి భరించలేక అమ్మా అమ్మా అని ఎంత ఏడ్చానో... వంటావిడ నన్ను ఓ మూలకి కూర్చొబెట్టింది...

మా ఊరికి కబురు చాలా ఆలస్యంగా చేరింది... మూడు రోజులైనా నాట్లనో... కోతలనో అమ్మరానేలేదు. నన్ను లోపలికి వెళ్ళనివ్వమంటే అందర్నీ ముట్టుకొని అమంగళం చేస్తావా..? అంటూ ఆయమ్మ తిట్టింది... నన్ను వంట గది ముందు వసారాలో కూర్చోబెట్టారు... మిగతా పిల్లలతో కలవనియ్యలేదు... వాళ్ళంతా ఒక్కొక్కరు వచ్చి నావంక చూసి ముసిముసినవ్వులు నవ్వుకుంటూ వెళ్ళడం చూసి నేనింత ఏడుస్తుంటే... మీరెందుకు అలా నవ్వుతారు..? పెద్ద గొంతేసుకొని అరిచేదాన్ని అందరూ పరుగుపరుగున వెళ్ళిపోయేవారు..."

"నన్ను పంపండి... నేను మా ఊరెళ్ళిపోతాను అని ఏడ్చాను... మీ వాళ్ళు వస్తేనే పంపుతామని అన్నారు వాళ్ళు... ఆ వసారాలో... ఆ చలిలో వాళ్ళిచ్చిన పాత బట్టలు చుట్టుకొని ఐదు రోజులు నరకం పడ్డాను... వంటమనిషి తోడు పడుకున్నా... ఒంటరితనంతో వెక్కివెక్కి ఏడ్చాను..."

" ఆ తర్వాత ఎప్పుడో మా అమ్మ వచ్చి తీసుకెళ్ళింది. నాన్నకు జబ్బు చేసింది. డబ్బులు లేవని ఏదో చిన్నపాటి హడావుడి చేసి నాలుగురోజుల తర్వాత తలస్నానం చేయించి మళ్ళీ తీసుకొచ్చి దించింది..."

"పెద్దమనిషయ్యాక ఎంతో మంది అమ్మాయిలు ఎంతో అందంగా తయారవడం. ఎన్నెన్నో కొత్తబట్టలు వేసుకోవడం. పేరంటం చేసి రకరకాల స్వీట్లు పంచుకోవడం. నును సిగ్గులతో అమ్మాయిలు బుట్టబొమ్మలా తిరగటం నాకు తెలుసు కానీ ఇవేవీ నా జీవితంలో జరగలేదు. మళ్ళీ రెండవసారి అయినప్పుడు అమ్మను పిలుస్తామన్నారు. ఏం అక్కర్లేదు అంటూ ఒక అరుపు అరిచాను. ఊరుకున్నారు..."

"ఇంటికి వెళ్ళాలంటే విరక్తి... స్నేహితులు లేరు. దానికి కారణం నా కోపం నా స్వభావం కావచ్చు. ఎక్కువగా ఒంటరిగా ఉండటానికి ఇష్టపడేదాన్ని. నాలో ఏదో చెప్పలేని కసి. ఆ కసినంతా చదువుమీద చూపేదాని... టెన్త్ ఫస్ట్ వచ్చాక అమ్మ ఇంక చదువు ఆపేయమంది."

" హాస్టల్‌కి పంపి చదివించటం, చదువు మాన్పించి ఇంట్లో కూర్చోబెట్టడం అంతా నీ ఇష్టమేనా? రంకెలు వేశాను. నేనే కాలేజీకి, హాస్టల్‌కి అప్లై చేసి చాలా నిర్లక్ష్యంగా ఇంటి నుంచి బయటపడి డిగ్రీ పూర్తి చేసాను. అక్కడా అంతే. ఎవరన్నా నాతో మాట్లాడాలన్నా జంకేవారు..."

"డిగ్రీ అయ్యాక నాలో కాస్తా మార్పు వచ్చింది. ఇంటికి తిరిగి వెళ్ళాక నా కోపం అరుపులు అన్నీ పోయాయి. ఊర్లో మా వీధి వాళ్ళంతా పెళ్ళిళ్ళు చేసుకొని ఒకరిద్దరు పిల్లల్ని కనేశారు. అమ్మానాన్న నాకు పెళ్ళి చేస్తానన్నారు. పెద్ద మనిషి అయినప్పుడు తీరని సంబరమంతా పెళ్ళి సంబరంతో తీర్చుకున్నాను. చాలా మామూలు ఆడపిల్లలా సిగ్గుపడుతూ సంతోషంగా, ఇష్టంగా పెళ్ళి చేసుకొని అత్తవారింట అడుగుపెట్టాను"

"అక్కడ అడుగుపెట్టాక తెలిసింది. నేను మా ఆయనకంటే మా మామగాడికే బాగా నచ్చానని. అస్తమానం అటు వచ్చి ఇటు వచ్చి చూస్తుంటే కొత్త పెళ్ళి కూతుర్ని కదా! అందరూ అలాగే చూస్తారులే అనుకుని నాకు నేను నచ్చజెప్పుకున్నాను. కానీ రెండు నెలలైనా, నాలుగు నెలలైనా అతనలా ఆబగా చూడటం మానలేదు. ఎవరికి చెప్పాలో తెలియలేదు. ఏదో కలవరం ..బాధ భయం ఎంతో అమాయకంగా, అన్యోన్యంగా ఉండే ఈయనతో చాలాసార్లు మీ నాన్నేంటి అదోలా చూస్తారు. నాకు చిరాకుగా ఉంది. మనం వేరే వెళ్ళిపోదాం అని రకరకాలుగా చెప్పినా వినిపించు కోలేదు..."

"మా మరిదికి బిటెక్‌లో సీటు వచ్చి సిటీకి వెళ్ళిపోయాడు. బంటి కడుపునపడ్డాక ఈయన ఉద్యోగరీత్యా తరుచూ ఊర్లకి వెళ్ళవలసి వచ్చేది... నేను మామగారు మాత్రమే ఇంట్లో ఉండేది. అన్నం పెడుతుంటే అవసరం లేకుండా చేయి తగిలించటం. స్నానం చేస్తుంటే బాత్‌రూమ్ ముందు తచ్చాడటం. నిద్రపోతుంటే దొంగచూపులు చూడటం కవ్వింపు మాటలు మాట్లాడటం విసిగిపోయి కొంత...భయంవేసి కొంత... ఏడోనెలకే పుట్టింటికి ప్రసవానికని వచ్చేశాను... బిడ్డ పుట్టాక తప్పదు కదా మళ్ళీ వెళ్ళాను... బిడ్డకు పాలుపడుతుంటే... దేబిరించి చూసేవాడు. ఈసారి మరో అడుగు ముందుకు వేసి వచ్చి పక్కనే కూర్చోవటం, భుజం మీద చేయి వేయడం మొదలుపెట్టాడు... ఒకసారి ఉండబట్టలేక మొత్తం చెప్పేశాను ఆయనకి..."

"రవ్వంత కూడా పౌరుషపడలేదు... తన తండ్రి ఇలాంటి వాడా అని నిర్ఘాంతపోలేదు. తన భార్య పరిస్థితి ఏమిటని ఆందోళన పడలేదు. పైగా వేరే కాపురానికి ఒప్పుకోలేదని మా నాన్ననే అవమానిస్తావా.? అంటూ ఎదురు నాపైనే చేయిచేసుకున్నాడు. తిక్కతిక్కగా ప్రవర్తించాడు. ఏమి చేయలేక మిన్నకున్నాను."

"ఒక రోజు ఆయన క్యాంప్‌కి వెళ్ళాడు... బిడ్డకు పాలిచ్చిన నాకు మగతనిద్ర పట్టింది... ఎప్పుడు వచ్చాడో.. మా మామగాడు పక్కనే చేరి వళ్ళంతా తడుముతూ ఆక్రమించుకోబోతున్నాడు. అంత ముసలాడికి అంత బలం ఎలా వచ్చిందో..? వాడితో పెనుగులాడుతూ వదిలించుకోవటం ఎంత కష్టమైందో..."

సుధీర ఆ సంఘటన అప్పుడే జరిగినంత బాదగా కన్నీరు కార్చింది. కళ్ళు తుడ్చుకొని మళ్లీ కొనసాగించింది.

"అసహ్యంతో వాడిని ఒకతోపు తోసి వెళతావా..? చంపమంటావా..?" పెద్దగా ఒక అరుపు అరిచాను. వెళ్ళి గోడకు గుద్దుకున్నాడు... లేచి బయటకు పారిపోయాడు. ఆ రాత్రి ఈయనకు జరిగినదంతా చెప్పాను. ఏమన్నాడో తెలుసా..? ఎవరికీ చెప్పకు సుధీరా! నా పరువు నాన్న పరువు పోతుంది. నేను ఆయనను కోప్పడతాను కానీ కాస్త నువ్వే ఓర్చుకో అని..."

"నాకు ఆ ముసలాడికంటే నా మొగుడ్ని చూస్తేనే అసహ్యంతో కక్కొచ్చింది. ఛూ.. అని ఊయబుద్ధయింది. ఆ రాత్రి ఓర్చుకొని పడుకున్నాను. తెల్లారే నింపాదిగా స్నానం చేసి కడుపునిండా తిని క్యాంప్‌కు వెళ్ళిపోయాడు. వాళ్ళ నాన్నని ఏమి అడగలేదు. అనలేదు. ఆయన తత్వం ఏమిటో అర్థం కాలేదు..."

"ఇక అంతే. ఆ రోజు ముసలాడు మళ్ళీ విజృంబించాడు. ఎక్కడ లేని తెగువ వచ్చింది నాకు కత్తిపీట పట్టుకొని అరుస్తూ వాడి వెంటపడ్డాను.పరుగెత్తబోయి గుమ్మం తగిలి పడిపోయాడు. ఆ చెంపా ఈ చెంపా వాయించేశాను. కొట్టొద్దు కొట్టొద్దు అని తప్పై పోయిందని ఏడ్చాడు..."

"వాడ్ని వదిలేసి ఎంత పెద్దగా ఏడ్చానో బట్టలు సర్దుకొని సర్టిఫికెట్లు పెట్టుకొని చంటాడ్ని భుజానవేసుకొని పుట్టింటికి వెళ్ళాను... అక్కడ వాళ్ళు ఏదేదో నచ్చుజెప్ప బోయారు. అల్లుడ్ని పిలిపించి మాట్లాడతామన్నారు..."

“మగాడు కాని వాడితోనైనా కాపురం చేయొచ్చు... మనిషే కాని వాడితో కాపురం చేయనన్నాను. రోగిష్టిని, కోపిష్టిని భరించవచ్చు... పిరికివాడ్ని. వెన్నెముక లేని వాడ్ని భరించలేనని ఖచ్చితంగా చెప్పాను. మళ్ళీ నా నోరు ఉపయోగించి వారిని గదమాయించి బిఇడి చేశాను.వెంటనే ఉద్యోగం వచ్చింది...”

“మూడేళ్ళ పిల్లాడ్ని బడికి తీసుకొస్తే బడిలో డిస్టబెన్స్ ఉండదా.? మా ప్రధానోపాధ్యాయుని దీర్ఘం తీసింది.”

“అయితే ఉదయానే మీ ఇంట్లో దింపి వస్తాను... ఒక అరుపు అరిచాను... మళ్ళీ ఈ రోజు వరకు నోరు విప్పితే ఒట్టు...” సుధీర

నవ్వులు ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనిస్తున్నాయి. ఆ స్వరం వెనుక..ఆనవ్వుల వెనుక ఎన్ని వందల గాయాలో. సుధీర చేయి పట్టుకొని బృందా గదిలోనికి తీసుకువెళ్ళింది. ఇద్దరూ అలాగే కబుర్లాడుతూ ఏ అర్థరాత్రో నిద్రలోకి జారుకున్నారు.ఆ తెల్లారే బృందా తమ స్నేహం గురించి తన స్నేహితురాలి గురించి శ్రీవారితో మురిపెంగా చెప్పుకొంది...

ట్రెయినింగ్ మాత్రం నేను ఆశించిన స్థాయిలో లేదు. కాకపోతే నాలుగు రాష్ట్రాలవాళ్ళం కలిసి తమిళింగ్లీష్, మళయాళింగ్లీష్, కన్నడింగ్లీష్, తెలుగింగ్లీష్ మాట్లాడుకుంటూ సందడి చేస్తున్నాం. ఒకరి విద్యావిధానాలు మరోకరు పంచుకుం టున్నాం. ఇక్కడ ఫ్యాకల్టీ కంటే మన ఆంధ్రాలో స్పోకెన్ ఇంగ్లీష్ సెంటర్‌లు నడిపే ఫ్యాకల్టీ వందరెట్లు నయం అంటూ బృందా చాలా సేపు శ్రీవారితో మాట్లాడింది..

అంతలో సుధీర హడావుడిగా వచ్చింది.“బృందా బాబుకి బాగా జ్వరం! ఒకసారి వచ్చి చూడండి.వాడికి అమ్మవారు పోసిందని అనుమానంగా ఉంది.” అన్నది కంగారుగా బృందా ఫోన్ పెట్టేసి బంటి మంచం దగ్గరకు వెళ్ళి చూసింది.అవును వాడికి చికెన్‌ఫాక్స్ వచ్చింది... పదకొండు గంటలకు డాక్టర్ విజిట్‌కి రాగానే చూపించారు. మందులు ఇచ్చారు... వార్త క్షణాల్లో పాకింది... ఆ మగవాళ్ళ హాస్టల్‌లో ముత్తుస్వామికి, సెల్వరాజ్‌కి చికెన్‌ఫాక్స్ వచ్చిందని తెలిసిన రోజున వాళ్ళని వెంటనే డైరెక్టర్‌గారు ఇంటికి పంపేసుంటే బాగుండేది. ఆవిడ గారు వాళ్ళని పంపలేదు... ఆ

హాస్టల్‌కి ఆడుకోవటానికి వెళ్ళిన బంటికి చికెన్‌ఫాక్స్ వచ్చేసింది... ఇప్పటికైనా ఈవిడగారు సర్దుకొని ఇంటికి వెళ్ళకపోతే మనందరికీ వచ్చేస్తుంది... నాన్సీ, కుట్టి, వలసలా, సరళా అందరు గుసగులు పోయారు...

సుధీర వినిపించుకోనట్లే రూమ్‌లోనే ఉండి బాబుకి సేవలు చేయసాగింది. ఆ సాయంత్రం బాబుకి బన్ను తినిపిస్తూ బృందా, సుధీర కబుర్లు చెప్పుకుంటున్నారు... ఒక్కసారిగా టీచర్లందరూ రూమ్ ముందుకు వచ్చి

"యూ సీ సుధీరా... యు మస్ట్ గోబ్యాక్ అథర్‌వైజ్ వి మే సఫర్ ఎ లాట్" అంటూ మొదలుపెట్టి అది అంటువ్యాధని త్వరగా సుధీర తన కొడుకుని తీసుకొని వెళ్ళకపోతే ఆ వ్యాధి తమకూ వస్తుందని... తామెంత భయపడుతున్నామని వాదించారు... బెదిరించారు...

సుధీర వాడికిప్పుడు విపరీతమైన జ్వరమని ప్రయాణం చేసే స్థితిలో లేడని నచ్చజెప్ప చూసింది... ఎవరూ వినలేదు... అంతే.

"ఐ డోంట్ టేక్ హిమ్ బ్యాక్ యూ కెన్ గో నౌ" పెద్ద గొంతేసుకొని ఒక అరుపు అరిచింది...అంతే అందరూ వెనుదిరిగారు.

అనుకోకుండా ఆ రాత్రే మరో ముగ్గురికి వచ్చింది... బంటికి తగ్గింది... అక్కడ మగవాళ్ళ హాస్టల్‌లో ఆరుగురికి ఇక్కడ ఆడవాళ్ళ హాస్టల్‌లో నలుగురికి వచ్చింది... అందరూ భయంతో మొక్కులు మొక్కేసుకుంటున్నారు... ముసుగులు వేసుకొని నడుచుకుంటున్నారు... ఒకరు కనపడితే ఒకరు సర్దుకొని సర్దుకొని పక్కకు నడుస్తున్నారు... కొందర్ని చూసి వెనక్కి మళ్ళిపోతున్నారు.

వారిలో ఏ ఒక్కరిద్దరో తప్పా అందరూ పీజీలు చేసినవారే... అందరూ గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారే... ఒకరిని చూసి ఒకరు తొలగి పోతున్నారు... పాపం చేసిన వారిని చూసినట్లు రోగుల వంక చూస్తున్నారు... భయంతో ఇండ్లకు ఫోన్లు చేసుకుంటున్నారు. బయట ఎవరూ తిరగకుండా రోజంతా రూములోనే ఉండిపోతున్నారు... హఠాత్తుగా వాతావరణమంతా మారిపోయింది... సంస్కారపు

ముసుగులన్నీ తొలగిపోయాయి... వికృతకోణాలన్నీ వెలికివస్తున్నాయి... ఈ రోగం వాడి మూలంగా అంటే కాదు వీడి మూలంగా అంటూ నిందలు వేసుకుంటున్నారు...

మొత్తానికి చికెన్‌ఫాక్స్ వచ్చిన పేషంట్స్‌నందరిని విడిగా ఒక గదిలో ఉంచేసి ఆహారం నీరు పంపిస్తున్నారు. ఆడవాళ్ళ హాస్టల్‌లోనూ అంతే... ఆరోజు ఫ్యాకల్టీ అంతా సాయంత్రం ఐదు గంటలకే వెళ్ళిపోయారు. నాన్సీ, వలసలకి జ్వర తీవ్రత పెరిగిపోయింది.... డాక్టర్ మధ్యాహ్నమే వెళ్ళిపోయాడు. భయంతో ఆమె రూమ్‌లో ముడుచుకొని పడుకొని ఏడుస్తున్నది. ఎవరూ పేషంట్స్ ఉన్న రూములోకి వెళ్ళడం లేదు...

" బృందా! ఇలా ఒకసారి వస్తావా..?" అంటూ బృందను తీసుకొని బయటకు వెళ్ళింది. ఓ అరగంట తర్వాత బృందా, సుధీర పేషంట్స్ ఉన్న గదిలోకి అడుగుపెట్టారు. సుధీర చేతిలో పెద్ద సంచి. ఆ సంచి నిండా వేపాకులు. అందరి మంచాల దగ్గరకు వెళ్ళి వేపాకులు తురిమి పక్కలో పరిచింది. అందరికీ దగ్గరుండి కొసరి కొసరి పుల్కాలు తినిపించింది. దగ్గరుండి జ్వరం బిళ్ళలిచ్చింది...

వాచ్‌మెన్‌తో పోట్లాడి టీ పెట్టించి ఫ్లాస్క్‌లో తీసుకొచ్చి అందరికీ ఇచ్చింది... బృందా దగ్గరుండి అందరితో టీ తాగించింది.

అప్పటికీ రాత్రి పదిన్నరైంది... సంచినిండా వేపాకులతో మరో చేత్తో టీ ఫ్లాస్క్ మందులు పట్టుకొని ఆ పక్క హాస్టల్‌లోకి కూడా అడుగుపెట్టారు... సుధీర, బృందా. వాచ్‌మెన్ అడ్డువచ్చాడు..

"అమ్మా! ఇది జెంట్స్ హాస్టల్ డైరెక్టర్‌గారు వస్తే ఏమైనా..."

"ఛస్ నోర్మూయ్..సుధీర గొంతు ఆ భవనమంతా మారుమోగింది. కుక్కిన పేనులా అడ్డుతప్పుకున్నాడు వాచ్‌మెన్... బృంద తోడురాగా సుధీర మగవాళ్ళ హాస్టల్ గదులలోకి దారితీసింది. వేపగాలి పరిమళించగా...

❖❖❖

4

# పితృదేవోభవ

"అమ్మమ్మా... నేను మా ఊరెళ్ళిపోతాను"

"చూసారా చూసారా ! పదిహేనేళ్ళు నా దగ్గర పెరిగి... ఇది దాని ఊరుకాదట. మా ఊరెళ్ళిపోతాను అంటుంది. మనం ఎంత చేసినా అమ్మానాన్న సాటిరాము కదా?

"అమ్మమ్మ ఎందుకలా అంటావు. మీరు నన్ను ఎంత ప్రేమగా పెంచారో నాకు తెలుసు ఇక అమ్మనాన్నల ప్రేమ ఏ పాటిదో కూడా నీకు తెలుసు"

"తెలిసీ ఎందుకమ్మా మమల్ని వదిలి వెళ్ళాలనుకుంటున్నావు" హృద్య ఆ క్షణమే తమని వదిలి వెళ్ళిపోతున్నదన్నంతగా తల్లడిల్లిందామె.

"మిమ్మల్ని వదిలి వెళ్ళాలని నాకు లేదు... కాని నేనుండవలసిన స్థానం ఇది కాదుగా అమ్మమ్మా... నా గమ్యం నేను చేరుకోవాలిగా" ఎన్ని రాత్రుల ఆలోచనసారమో హృద్య గొంతులో పలికింది.

"పిచ్చి పిల్లా మీ అమ్మ నీ కోసం వెంపర్లాడుతుంటుంది గానీ, మీ నాన్న చిరాకు కోపం నీకు తెలియంది కాదుగా... మరింక ఎందుకమ్మా అక్కడికి వెళ్ళడం... ఓ రెండేళ్లయితే మేమే మంచి సంబంధం చూసి పెళ్ళి చేసేస్తాం.

"అవునమ్మ... రెండేళ్ళు కాకుండా నాలుగేళ్ళలో ఎలాగూ నా పెళ్ళి చేసి పంపుతారు. కనీసం ఈ కొద్ది కాలం ప్రేమ పొందకపోతే పోనీ కనీసం మా నాన్న ద్వేషం పొందైనా అక్కడ కొంతకాలం ఉండాలని ఉంది. పైగా నాన్నకి ఆరోగ్యం బాగుండక అమ్మ ఒక్కతే చేసుకోలేక అవస్థపడుతున్నది. అమ్మ కోసమైన నన్ను ఆపకండి. తాతయ్యా మీరైనా చెప్పండి"

"హృద్య చెప్పింది నిజమే! దానికి మాత్రం అందరి పిల్లల్లా అమ్మా,నాన్నల దగ్గర ఉండాలని ఉండదా! ఆ త్రాష్టుడి మూర్ఖత్వం మూలానా దానికి తల్లిదండ్రుల ప్రేమ లేకుండాపోయింది. అది వెళ్ళాలనుకుంటుంది వెళ్ళనీ భారతి దాన్ని బాధపెట్టకు.

తనని వదిలి ఉండలేక తల్లిదండ్రుల దగ్గరకు పంపకుండా ఉండలేక వాదన పెట్టుకుంటున్న వారి ప్రేమకు కదిలిపోయింది హృద్య.

"మీరు బాధపడకండి అమ్మమ్మా! అక్కడ నా అవసరం ఉన్నది నాన్నగారికొక్కరికే కాదు. అమ్మ గురించి కూడా ఆలోచించు". భారతి బదులు పలకలేకుండాపోయింది. హృద్య మాటల్లో విజ్ఞత ఆమెను కట్టిపడేసింది. మౌనంగా వీడ్కోలు పలికింది.

*****

తల్లిదండ్రుల ముద్దు మురిపాలనడుమ, ఎదుగుతున్న క్రమంలో బాల్యం అందరికీ మధురానుభూతి. జీవితంలో ఎప్పుడు బాల్యం గురించి తలుచుకున్నా మనసుకు ఆహ్లాదం కలుగుతుంది. కానీ హృద్య పరిస్థితి ఇందుకు విరుద్ధం, బాల్యమంతా సంఘర్షణలతోనే గడిపింది. రైలు వేగంగా సాగిపోతుంటే ఆమె మనస్సులో పరిపరి విధాల ఆలోచనలు కలతపెడ్తున్నాయి.

అమ్మలాలనతో తండ్రి గారాలతో సంతోషంగా తన వారి మధ్య గడపలేక పోయిన తొలిరోజుల్లో హృద్యకి అమ్మ మీద చెప్పలేనంత బెంగగా ఉండేది. అమ్మ కావాలని పదేపదే ఏడ్చేది... అలిగేది యాగీచేసేది. హృద్యకు ప్రస్తుత పరిస్థితి కొత్తగా ఉంది. తన బాధ్యతను జాగ్రత్తగా నిర్వహిస్తున్నది. కానీ మనసులో తుఫాను రేగుతున్నది. తండ్రిని పలకరించటానికి వచ్చిన బంధువుల మాటలు చెవిన పడినప్పటి నుంచి ఎంతో ఆవేదనగా ఉంది.

"పిల్ల చూస్తే చక్కగా ఉంది. పైగా అచ్చుగుద్దినట్లు అన్నీ అన్నయ్య పోలికలే. ఈ ముదనష్టం అనుమానం ఎలా అంటిందో గాని, పసిదాన్ని దూరంగా ఉంచడానికి ప్రాణమెలా ఒప్పింది."

"ప్రియవంద నిప్పమ్మా... వాడివే పాపిష్టి ఆలోచనలు. ఈ తాగుబోతును, పొగరుబోతును ఆవిడగాబట్టి భరిస్తుంది. ఇంకెవరైనా అయితే ఏనాడో వదిలి దూరంగా పోయేది. ఇంతోటి మొగుడు లేకపోతే ఇక బ్రతకలేకపోమా" అని విడిచిపెట్టి వెళ్ళేది.

"వదినా! మీకు దణ్ణం పెడ్తాను. హృద్య విన్నదంటే బాధపడ్తుంది. ఇప్పుడా విషయాలన్నీ ఎందుకు, రండి టీ త్రాగుదురు కాని, తల్లి మాట మార్చాలని చూడడం" చెవుల బడ్డాయి. హృద్యకు సగం అర్థమయి, సగం అర్థం గాక గుండెకోత అనిపించింది. తండ్రి కాస్త కోలుకున్నాక మళ్ళీ అమ్మమ్మ వాళ్ళ ఊరు తిరుగు ప్రయాణమైంది. రాజేందర్ దూరపు బంధువు అర్చన ఉండేది, భారతమ్మ గారి ఊర్లోనే, అర్చన దగ్గర హృద్యకు చనువెక్కువ. ఓ రోజు మెల్లిగా అర్చనను మాటల్లో పెట్టి, చాలా విషయాలు తెలుసుకుంది. హృద్య అడగడమే తడవుగా అర్చన చెప్పిన విషయాలు విని హృద్య మనసు మొద్దుబారిపోయింది.

"ఏం చెప్పనే తల్లీ... మీ అమ్మ బతుకు. మీ నాన్న వట్టి అనుమానపు మనిషి. నీ పుట్టుకలపుడు నానా కష్టాలు పడింది. ఇపుడేదో సుఖపడుతుందని కాదు కానీ, చిన్నప్పటి నుంచి మీ నాన్న బాగా అడిగినపుడు అడిగినంత డబ్బిచ్చి గారాబం చేసి పెంచింది. మీ నానమ్మ.. పెళ్ళినాటికే త్రాగుడు అలవాటు ఉందని తెలిసి, మీ అమ్మ క్రుంగిపోయింది. తాగుడు మానమని బతిమాలింది వినలేదు. గొడవ పెట్టుకుంది వినలేదు. కాళ్ళావేలా పడింది మారలేదు. తాను మారలేక త్రాగుడు మానలేక, తన తప్పు కప్పిపుచ్చుకోవడానికి, ఎదురు మీ అమ్మ మీదే దేనికోదానికి కాలుదువ్వేవాడు. ఆ అమాయకపు తల్లి ఎలా భరించిందో చేతులెత్తి మొక్కాలి".

అంతలో నీవు కడుపున పడ్డావు. కడుపుతో ఉన్న ప్రియంవదను అపురూపంగా చూసుకోవాల్సిందిపోయి, ఆమెను అనుమానిస్తూ, అవమానిస్తూ దాష్టీకం వెలగబెట్టాడు. మీ అమ్మ ఏం తప్పు చేయలేదని, చెయ్యదని తెలుసు, కానీ చాలా మంది త్రాగుబోతు మొగుళ్ళకి ఆ ఆయుధం ఏమిటంటే, తమ అలవాట్లని నిలదీయకుండా ఎదురు తామే ప్రతిదాడికి దిగుతారు. దౌర్జన్యానికి, పశుబలానికి విజయం లభిస్తుందనే ఆటవికత ప్రియంవదపై దాడి శారీరకంగానే కాదు, ఓ బలమైన నిందవేసి చేయని నేరానికి కుంగిపోయేలా చేసి, అతనంటే హడలిపోయేలా చేసుకున్నాడు. తన దౌర్జన్య సామ్రాజ్యాన్ని తను యధేచ్ఛగా ఏలుకోనారంభించాడు. ఇలాంటి సమయంలో నీవు పుట్టావు. నిన్ను చూసి కష్టాలన్నీ మరచి మురిసిపోయింది ప్రియంవద. తను అనుమానాన్ని మీ అమ్మపై ఆపాదిస్తూ మీ నాన్న లేనిపోని కష్టాలను కొని తెచ్చుకుని

మీ అమ్మను బాధపెట్టేవాడు. పసిపిల్ల ఆటపాటలతో మురిసిపోయే ప్రియంవదను, ఆ బిడ్డ తండ్రిని నేను కాదు పొమ్మన్నాడు. త్రాగుడు మైకంలో అనరాని మాటలన్నాడు. తనెలా మాట్లాడుతున్నాడో వళ్ళుమరచిపోయాడు. పిల్లతో మళ్ళీ కనిపిస్తే నిన్ను దాన్ని కూడా చంపేస్తానని వెంటబడేవాడు. ఓ రెండేళ్ళు ఎలాగోలా తంటాలుపడి పెంచింది కాని ఓ రోజు నిన్ను కొట్టి నానా రభస చేస్తుంటే ఎక్కడ చంపేస్తాడేమోనని తీసుకెళ్ళి మీ అమ్మమ్మ దగ్గర ఉంచింది.

మీ అమ్మమ్మ రాజేంద్రను వదిలి వచ్చేయ్యమని అక్కడే ఉంటే నువ్వు మాకు దక్కుతావో లేదోనని భయంగా ఉంది" చెప్పిచూసారు. కానీ ప్రియంవద మొండిది. తనలా కాపురం వదులుకుని వస్తే పెళ్ళికావలిసిన ఇద్దరు చెల్లెళ్లకు పెళ్లి అవుతుందో, కాదోనని భయపడింది. తన నరక ప్రాయపు జీవితంలోకి మళ్ళీ మౌనంగా నడిచివెళ్ళింది.

హృద్యా! నిన్ను అమ్మమ్మ దగ్గర వదిలి నీకు ద్రోహం చేసిందని భావించకు, నిన్ను సురక్షితంగా ఉంచి తను బెంగతో క్షోభను అనుభవించింది.

అర్చన ఇంకా చాలా చాలా చెప్పింది. హృద్య హృదయం బద్దలవకుండా తను నిలవరించుకుంది. పదవతరగతి పరీక్షలు ఇంకో రెండు పరీక్షలు మిగిలి ఉండగానే మళ్ళీ రాజేందర్‌కు ఆరోగ్యం బాగుండలేదన్న వార్త వచ్చింది. హృద్యను అర్చన దగ్గర ఉంచి భారతమ్మ, వాసుదేవరావులు వెళ్ళి చూసివచ్చారు. ప్రస్తుతం కొంచెం కోలుకున్నాడు. కాని హృద్య అదేం పట్టించుకోనట్లుగా, ఆ ఇంట్లో తన స్థానం పదిలంగా ఏర్పరుచుకోవడానికి సమాయత్తమైంది. యధాప్రకారం తండ్రికి సేవలు చేయడం ప్రారంభించింది. ఆమెను అన్నింటికంటే అమితంగా బాధించిన విషయం త్వరలోనే రాజేందర్‌కు లివర్ ఆపరేషన్ అని ప్రియవద చెప్పి తల్లడిల్లుతుంటే, ఖిన్నురాలైపోయింది. తల్లిని ఓదార్చి ధైర్యం చెప్పింది. దగ్గరుండి పూటపూటకూ మందులు అందించింది.

*****

ఆ రోజు "అమ్మా నేను ఇవాళ బడికి వెళ్ళను" హఠం వేసుక్కూర్చున్నాడు రేవంత్. అసలే రాజేందర్ అనారోగ్యంతో పని ఒత్తిడి ఎక్కువై నిదుర, తిండి సరిగాలేక చికాకులో ఉన్న ప్రియంవద వాడికి నాలుగేసింది. హృద్య అడ్డమెళ్ళింది. రేవంత్ పెద్దగా ఏడవసాగాడు.

"అమ్మా! వాడిని అలా కొడితే ఏం వస్తుంది. వాదనలు ఎందుకు? స్కూలుకు ఎందుకు వెళ్ళనంటున్నాడో అడిగి తెలుసుకోవాలి గాని..."

"అపుడపుడు మా టీచర్లు కూడా సెలవులు పెడ్తారు. నేనెందుకు ఓ రోజు మానకూడదని అడ్డంగా వాదిస్తున్నాడు" విసుగ్గా చెప్పింది ప్రియవంద.

"నువ్విలా రా రేవంత్," వెళ్ళివాడిని ప్రక్క గదిలోకి తీసుకెళ్ళింది. వాడు స్థిమిత పడ్డాక అసలు సంగతి తెలుసుకుంది. వాళ్ళ లెక్కల టీచర్ చాలా వేగంగా బోర్డు మీద చకచక ఓ మాదిరి లెక్క చెప్పేసి, ఒక అభ్యాసమంతా ఇంటి పనిగా ఇస్తున్నదంట. చేసుకురాకపోతే కఱ్ఱతీసుకుని కొడుతుందట.

"అక్కా కొడితే లెక్కలు వస్తాయా, నన్నలా కొడ్తుంటే, నాకు లెక్కలంటే భయం, విరక్తి కలుగుతున్నాయి" చెప్పుకొచ్చాడు రేవంత్.

"అవును నువ్వన్నది సరియైనదే, కొడితే లెక్కలు రావు, ఒకటికి పదిసార్లు ప్రయత్నిస్తే సాధిస్తే వస్తాయి. ఇలా వచ్చి కూర్చో నేను లెక్కలు చెప్తాను. అమ్మా, ఇవాళే కాదు రేవంత్ రేపు కూడా బడికి వెళ్ళడు. వాడినేం అనకు. వాడికి కాస్త గణిత భావనలు పట్టుబడితే, లెక్కలు చేయడం వచ్చాక భయం పోయి హాయిగా వెళ్తాడు"

"లేకపోతే ఆ టీచర్ తన్నే తన్నులు వాడు తట్టుకోలేదు..." తల్లికి చెప్పింది.

లోపల మంచంపై పడుకున్న రాజేందర్‌కు హృద్య తమ్ముడికి లెక్కలు చెప్తున్న తీరు ఆశ్చర్యపరిచింది. అనుభవజ్ఞురాలైన టీచర్‌లా చక్కగా ఎక్కడా వాడికి విసుగురాకుండా చాలా ఆసక్తిగా, ఇది చాలా సులువు సుమా అన్నట్లుగా చెప్పిది. దాంతో చెల్లి రేవతి కూడా హృద్యను ఒక్క క్షణం కూడా వదలడం లేదు. ఇద్దరు బుద్ధిగా హృద్య పక్కనే కూర్చుని అక్కా! మాకీ లెక్కచెప్పవా, అక్కా ఈ పద్యం చెప్పవా, ఈ పాఠం చెప్పవా అంటూ అడుగుతూ చదువులో పడ్డారు. రాజేందర్‌కు అంతరాలలో ఏదో తెలియని గర్వం రేఖమాత్రంగా పొడసూపింది.

రాజేందర్ కాస్త లేచి తిరుగుతున్నాడు. రక్తం కాస్త పట్టేలా మంచి ఆహారం తీసుకోమన్నారు డాక్టర్లు. ఆపరేషన్‌కు తేదీ ఖరారు అయ్యింది అయినా ఏదో వంకన చిటికెలో ఇపుడే వస్తానని చెప్పి బయటకు వెళ్ళి ఎంతో కొంత త్రాగి వచ్చేవాడు. హృద్య వచ్చిన దగ్గర నుంచీ కూరగాయలు, సరుకులు, మందులు పళ్ళు అన్ని తానే తేవడంతో ఏ వంకన బయటకు వెళ్ళాలో అర్థం కావడం లేదు.

మధ్యాహ్నమయ్యేసరికి రాజేందర్ నరాలన్నీ లాగేస్తున్నాయి. హృద్య ఇచ్చే కొబ్బరి నీళ్ళు, పళ్ళరసాలు విసుగుతెప్పిస్తున్నాయి. నాలుక మరేదోరుచి కోరుతుంది. నరాలు జివ్వుమంటున్నాయి. రేవంత్‌ని దొంగతనంగా బయటకు పంపి ఓ క్వార్టర్ తెప్పించుకుందామంటే వాడు హృద్యను ఒక్క నిమిషం వదలడం లేదు. హృద్యను లెక్కచేసేదేంటి అన్న ఉడుకుమోత్తనం వస్తున్నా ఎక్కడో హృద్య మాటలకు, చేతలకు ఇంటిల్లిపాదీ బందీలైపోతున్నారు. చివరకు బింకంగా,

"హృద్యా తమ్ముడ్ని పంపించి ఓ క్వార్టర్ మందు తెప్పించు, అకస్మాతుగా మానెయ్యడం మంచిది కాదని డాక్టర్లు చెప్పారు. అసలు తాగకుండా ఉండడం నా వల్లకాదు..." కాస్తా గట్టిగానే చెప్పాడు.

అలాగే నాన్నా!అంటూ రేవంత్‌ని పిలిచి డబ్బులిచ్చి మందులు తెప్పిచింది ప్రియంవదకు మతిపోయింది. ఇంత సుళువుగా పని జరిగిపోతుందని ఊహించని రాజేందర్ ఆవురావురుమని త్రాగేశాడు. రెండు మూడు గంటలు హాయిగా నిద్రపోయాడు. లేచాక హృద్య తెచ్చిన అన్నం తినసాగాడు.

"నాన్నా రేవంత్ పుట్టిన రోజు ఎపుడు?" మెల్లిగా అడిగింది, ఈ మధ్య హృద్యతో కాస్త మాటలు కలుపుతుండడంతో ధైర్యం వచ్చింది. "ఏమో! ఫిబ్రవరి నెల–తేదీ గుర్తులేదు కాని తొంబైఏడులో పుట్టాడని గుర్తుకుఉంది. ఎందుకంటే వాడు పుట్టిన నెలకే నాకు ప్రమోషన్ వచ్చింది.

"అంటే మీరు రిటైరయ్యే సమయానికి రేవంత్ ఇంటర్ పూర్తి అవుతుంది. రేవతి డిగ్రీ చివరి సంవత్సరంలో ఉంటుంది. అంతేనా..."ముద్ద నోట్లో పెట్టుకోబోతున్న వాడల్లా ఆగిపోయి "ఏమో అవుననుకుంటా! నేనెపుడు ఆలోచించలేదు" అన్నాడు.

'అవున్నాన్నా! అంతే బాబాయి ఇక్కడ లేడు, బొంబాయిలో ఉద్యోగం చేస్తూ, ఓ మోస్తరు జీవితం గడుపుతున్నాడు. రేపు మనకేదైనా అవసరమొస్తే మనలను ఆదుకోవాలన్నా అంత ఆర్థిక శక్తి లేదనుకుంటా కదూ. నానమ్మ గత సంవత్సరమే పోయింది. తాతయ్య పోయి పదేళ్ళయింది. ఈ చిన్న స్వంత ఇంట్లో బాబాయికి వాటా ఉంది. మీ మంచి చెడు దగ్గరుండి చూడడానికి, ఆర్థికంగా సహకరించడానికి ఇక మనకెవరున్నారు. అసలు ఏమిటి నాన్నా! మీ ధీమా పది రోజుల్లో ఆపరేషన్ పెట్టుకొని క్వార్టర్లు కావాలంటున్నారు" మెత్తగా పదునుగా అడిగింది.

రాజేందర్ తెల్లబోయి చూస్తున్నాడు. అతని తలలో ఏదో తిరుగుతున్నట్లయింది "అమ్మను ఇంటర్ పూర్తి కాకుండానే ఎక్కడో పెళ్ళిలో చూసి, ఇష్టపడి చేసుకున్నారట పదేళ్ళ తేడా ఉంది ఇవ్వనని తాతయ్య అంటే పంతం పట్టి బంధువులను ఒకరి తరువాత ఒకరిని పంపి ఒప్పించి చేసుకున్నారట. పెళ్ళైతే ఏం నాన్నా అమ్మను ఎందుకు చదివించలేదు, ఉద్యోగంలో ఎందుకు చేర్పించలేదు."

"అమ్మకు... చదువూ.... ఉద్యోగమా...." ఆశ్చర్యంగా అడిగాడు.

"కాక ఈ పెళ్ళి కాకుంటే అమ్మ చదువుకునేది కదా... ఉద్యోగం చేసేది కాదా తనకి నచ్చిన వాడ్ని చేసేకునేది కదా! నాన్నా పెళ్ళంటే ఒక వేడుక. ఒక సందడి ఓ శుభకార్యం మాత్రమే కాదు, ఓ బంధం, ఓ బాధ్యత ఓ ఆలాపనా కాదా...? అకస్మాత్తుగా అమ్మ జీవితంలో చొరబడ్డ మీరు ఆమె బాధ్యత ఏరకంగా తీసుకున్నారు. భార్య అనే హెూదా తప్ప ఆమె ఎదుగుదల కానీ ఆమె ఆనందం, ఆత్మగౌరవం వీటి గురించి ఏనాడైనా ఆలోచించారా..?

"ఏమిటి మాట్లాడుతున్నాను కదా అని... చాలా పెద్దమాటలే మాట్లాడుతున్నావు నోర్ముయి" అరిచాడు రాజేందర్.

"నేను మాట్లాడింది వింటే నన్ను అర్థం చేసుకుంటారు. మీరు నన్ను నోర్ముయిమంటే నేను పైకి మాట్లాడకున్నా నాలో ఆలోచనలు ఆగవుగా నాన్నా! నిజానికి ఈ ఆలోచనలన్నీ మీకు కలగవలసిన ఆలోచనలు." ప్రియంవద రాజేందర్ ఎక్కడ తిరగబడి హృద్యను కొడ్తాడో అని భయంభయంగా చూడసాగింది.

"ఏం నేనేమైనా అయిపోతానేమో! నువ్వు మీ అమ్మా నీ తమ్ముడు చెల్లి ఏమైపోతారోనని భయంగా ఉందా? వంకరగా అన్నాడు.

"అవున్నాన్నా." పిడుగు పడ్డట్లుగా చూసాడు రాజేందర్.

"మీకిప్పటికే సీరియస్ అయి రెండుసార్లు హాస్పిటల్ పాలయ్యారు. తమ్ముడు చెల్లి భయంతో బిక్కచచ్చిపోయారు. తల్లడిల్లిపోతూ సేవలు చేస్తున్నది అమ్మ. మీ ప్రవర్తనకు పరిస్థితులకు నలిబిలి అయిపోవడం తప్ప ఏమీ చేయలేక నిస్సహాయంగా రాత్రిపగలు ఏడుస్తూ కూర్చుంటుంది. అయినా మీరు త్రాగడం మానకపోతే నిజంగానే మీరు చచ్చిపోతారేమో నన్న భయం వేస్తుంది. జరుగనున్న ఆపరేషన్ మీరెలా తట్టుకుంటారోనని, మీకేమైపోతుందోనని హడలిపోతున్నాం నాన్నా! నాన్నా! మేమంతా, మీ క్షేమం మాకు కావాలి. మీకేమైనా అయితే మా బ్రతుకులెలా అని మాత్రమే కాదు నాన్నా, ఈ ప్రపంచంలో అందరికీ చోటుంది. ఎవరికి వారు ఎలాగోలా బ్రతికేస్తారు అలా కాదు. మిమ్మల్ని మేం బ్రతికించుకోవాలి. మీరు మేము అందరం సంతోషంగా జీవించాలి. హృద్య తండ్రి చేతులు పట్టుకుని ఏడ్చింది.

రాజేందర్ కదలిపోయాడు. ఎందుకో తెలియని దు:ఖం వెల్లువలా ముంచెత్తింది, వెక్కివెక్కి ఏడ్వసాగాడు. రాజేందర్‌ను ప్రియంవద దగ్గరకు తీసి మంచి నీళ్ళు త్రాగించింది. కాసేపటికి రాజేందర్ నిద్దురపోయాడు.

మర్నాడు ఉదయం అందరూ ఏమీ జరగనట్లే తండ్రితో అందరు హుషారుగా మాట్లాడారు. రాజేందర్‌కి కమలాలు వొలిచిపెడ్తుంది హృద్య. 'నేనంటే కోపం... అసహ్యంగా ఉందా హృద్యా!..." కించపడ్తూ అడిగాడు రాజేందర్.

"లేదు నాన్నా... మీరంటే నాకెంతో ప్రేమ, మనిషి జీవితంలో ఏది కొరవడు తుందో దానిని పొందాలన్న తపన, పదే పదే మీ దగ్గరకు రావాలని మీతో మాట్లాడాలని మీ చేయి పట్టుకు తిరగాలని, నాకెంతో కోరిక నాన్నా, నేను జన్మంతా ఋణపడి ఉంటాను. ఎందుకో తెలుసా... మొన్న వార్తల్లో చూసాను భార్య మీద అనుమానంతో కన్నకూతురిని కొడుకుని పసిపిల్లలని కూడా చూడకుండా భావిలో పడేసి చంపేశాడట ఓ తండ్రి. మీరా పని చేయలేదు నాన్నా, కేవలం అమ్మమ్మ వాళ్ళ దగ్గరికి మాత్రమే పంపారు" రాజేందర్ దెబ్బతిన్నట్లుగా పిచ్చిచూపులు చూసాడు.

"హృద్యా ఆపమ్మా.... అలా మాట్లాడకు" ప్రియంవద విలవిలలాడి పోయింది. "అమ్మా నన్ను మాట్లాడనీ, నాన్న నేను వచ్చిన ప్రతిసారీ నన్ను తిట్టి అమ్మను కొట్టి తగాదా పెట్టుకునేవాడివి. అదేంటో అంత అవమానపడ్డా నాకు పదే పదే ఇక్కడకు రావాలనిపించేది. మీతోనే గడపాలనిపించేది. నేను మిమ్మల్ని కోల్పోతున్న ప్రతిసారి మిమ్మల్ని పొందాలన్న కాంక్ష బలంగా పెరిగేది.

"ఈ మధ్య బిటెక్ అమ్మాయి. తండ్రి కోపిష్టివాడని కాలేజీలో స్నేహితుల మధ్య తనని అనుమానించాడని. ఇప్పుడు సరే భవిష్యత్‌లో ఇంకెన్నిసార్లు అనుమానిస్తారోనని భయపడుతున్నానని అవమానపడుతూ ఆత్మహత్య చేసుకుంటున్నానని రాసిపెట్టి మరీ చనిపోయింది.

"నేనంత అవమానపడ్డా మీరు నన్నెంత దూరంగా ఉంచినా ఆత్మహత్య చేసుకోవాలనిపించలేదు. ఎందుకో తెలుసా నాన్నా నాకు జీవితమంటే ఎంతో ప్రేమ నాన్నా మనకు మంచి రోజులొస్తాయని ఎంతో ఆశ...నాన్నా"!

"లేదు హృద్యా! నేను తాగలేకుండా ఉండలేకపోతున్నాను. నా వల్ల కావడంలేదు. నాకు అందులోనే ఆనందం దొరుకుతుంది... మీ ఆశలేవీ తీర్చలేను." నిస్సహాయంగా అన్నాడు. రాజేందర్.

"మీరింత స్వార్థపరులేం నాన్నా, మీ సుఖం కోసం అంత ఆనందంగా త్రాగుతారు. పైగా మానలేనంటారు. మీకో విషయం తెలుసా.! మీ జీవితం మీది మాత్రమే కాదు. మీతో బంధం పెనవేసుకున్న మా అందరిదీ. ఆ త్రాగుడు అంత ఆనందాన్నిస్తే అది మాకందరకూ పోయండి. మేమందరం మీకు కావాలనుకుంటే. ఆ త్రాగుడు అలవాటు మానండి. ఈ అలవాటును సమర్థించుకోవడం కోసమేగా. అమ్మ ఎలాంటిదో తెలిసీ... కావాలని నిందలు వేసారు. అమ్మ ఎంతో మంచిదని మీకు తెలుసు, చాలా అమాయకురాలని తెలుసు, అమ్మ సరైనదని కాకపోతే మీరింతకాలం అమ్మతో కలిసి జీవించేవారు కాదు నాన్నా."

రాజేందర్ బుగ్గల మీద నుంచి నీళ్ళు కారిపోతున్నాయి. దోషిలా తలవంచుక్కూర్చున్నాడు.

“నాన్నా ప్రపంచంలో ఏ ఆడపిల్లకీ ఇలాంటి పరిస్థితి రాకూడదు. ఇంత చిన్న వయస్సులో ఇలాంటి విషయం తల్లిదండ్రులతో చర్చించే కర్మ ఎవ్వరికీ పట్టకూడదు. కాని చాలా స్పష్టంగా ఓ విషయం చెబుతున్నాను. తన మీద తనకు నమ్మకం లేనివాడే భార్యను అనుమానిస్తాడు. హృద్య మౌనంగా అక్కడి నుంచి నిష్క్రమించింది కానీ రాజేందర్‌కు మాత్రం కొరడాతో కొట్టినట్లైయింది.

అవును తన మీద తనకు నమ్మకం లేనివాడే, తనకే సరైన క్యారెక్టర్ లేనివాడు మాత్రమే భార్యను అనుమానిస్తాడు. తనకు తాను అలవాట్ల బారి నుంచి నియంత్రించుకునే నమ్మకం లేకనే తన దౌర్జన్యానికి తెరలేపాడు. తన ఉనికిని తన ఇంట మగ మహారాజుగా నిలబెట్టుకునేందుకే పాశవికతను ప్రదర్శించాడు. ఈ తప్పులన్నీ ఒకదాని వెంట ఒకటి అలా యధేచ్ఛగా జరిగిపోయాయి. ఇన్నేళ్ళ తరువాత తన రక్తం పంచుకుపుట్టిన కన్నకూతురు తన దాష్టికంలోని... తన దౌర్జన్యంలోని ప్రతీ కోణాన్ని ఎత్తి చూపుతోంది. రాజేందర్ ఇంకే భాషలో మాట్లాడ్తాడు? నేరం చేసిన వాడిలా ముడుచుకుపోయి పడుకున్నాడు.

తెల్లవారితే ఆపరేషన్ ఆపరేషన్ లివర్‌కి కానీ హృద్య హృదయానికి చికిత్స చేస్తున్నది. రాజేందర్ ఎంత ప్రయత్నించినా నిద్రపట్టలేదు. ఆపరేషన్ విజయవంతమై క్షేమంగా తిరిగి వచ్చి... పదిలంగా తన కుటుంబాన్ని కాపాడుకోవాలనే ఆలోచనలు తీవ్రమౌతున్నాయి... ఎంత వద్దనుకున్నా హృద్య అన్న మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి.

“ఇంటిని చూసి ఇల్లాలిని చూడు అంటారు కదా... నాన్నా అలాగే నాన్న లేని ఇల్లు చూడండి. ఎంత అస్తవ్యస్తంగా ఉంటుందో, నాన్నలు అమ్మల మీద దాష్టికం చేసే ఇల్లు చూడండి. ఎంత అనిశ్చితంగా అగమ్యగోచరంగా ఉంటాయో... మీరెప్పుడూ ఆడదెలా ఉండాలో అరుస్తూ, తిడ్తూ చెబుతుంటే వందలసార్లు విన్నాను. కాని భర్తలెలా అలవాట్లకి దూరంగా ఉండాలో ఎంతముందు చూపుతో నిజాయితీతో ఉండాలో.. ?ఎంత బాధ్యతగా ఉండాలో... తాను నవ్వుతూ నవ్విస్తూ కుటుంబాలని ఎలా సంతోషపెట్టాలో మీకు చెప్పేదెవరు నాన్నా...?

"భార్యలను కొడ్తూ, శారీరకంగా మానసికంగా బాధిస్తూ, మేమేదో సాధించాం అనుకుంటారే కాని స్వర్గసీమలా ఉండాల్సిన ఇంటిని నరకం చేస్తూ భర్తలు తాము కూడా కుటుంబ సౌఖ్యానికి దూరమౌవుతూ భార్య మనసులో పిల్లల మనస్సులో రాక్షసుడిగా మిగిలిపోతారు. వారి మనస్సులో అసహ్యంతో కూడిన భయమే తప్ప అసలైన ప్రేమానురాగాలను మాత్రం కోల్పోతారు. ఇది ఎంత పతనమో తెలుసా నాన్నా! ఎందుకు నాన్న మీరు మారరు. కనీసం ప్రయత్నించరు".

"నాన్నా! భర్త చనిపోతే కుటుంబాన్ని మొత్తం కష్టపడి పైకి తెచ్చిన స్త్రీలున్నారు. భర్తతో విడిపోవలసి వచ్చినపుడు కూడా నానా అగచాట్లు పడి అవమానాలు పడి మొత్తానికి ఎలాగోలా పిల్లలను మంచి స్థితికి తీసుకువచ్చిన కుటుంబాలున్నాయి. భర్త లేకపోయినా భార్య, తండ్రి లేకపోయినా పిల్లలూ ఎలాగైనా బ్రతుకుతారు. అయినా అమ్మ అన్ని భరించేదే తప్ప ఎంతో ఆదరించే తల్లిదండ్రులున్నా అమ్మ మీ నుంచి ఎందుకు విడిపోలేదో తెలుసా. ఏ నాటికైనా మీరు మారుతారన్న ఆశ. తండ్రి బ్రతికుండగానే పిల్లలకు దూరం చేయకూడదన్న తపనతో అన్ని సహించింది.

"మేమంతా పెద్ద చదువులు చదువుకున్నా, ఎంత గొప్ప ఉద్యోగం చేసినా తండ్రి స్థానం తండ్రిదే. ఆ లోటు ఎవరూ పూడ్చలేనిది నాన్నా. అందుకే మీరు మాకు కావాలి నాన్నా కోపాలకు, ద్వేషాలకు, అలవాట్లకు, అనుమానాలకు, దౌర్జన్యాలకు అతీతంగా మమ్ముల్ని ప్రేమించే నాన్న కావాలి..."

"నాకే కాదు ఈ సమాజంలో రకరకాలుగా భర్తల ఆగడాలను, హింసలను భరిస్తున్న ప్రియంవదలున్నారు. భార్యలను రకరకాలుగా వేధిస్తున్న రాజేందర్‌లున్నారు. మధ్యలో నలిగిపోతున్న మాలాంటి పసిహృదయాలూ ఉన్నాయి."

"ప్రస్తుతం ఈ సమాజానికి కావల్సింది మంచి నాన్న. ప్రేమ, బాధ్యతలు గల నాన్న. కుటుంబాన్ని చిన్నాభిన్నం చేయని నాన్న. భార్య పిల్లల మనసులను, శరీరాలను తూట్లు పొడవని నాన్న. గొప్ప ఆలంబనగా ఆదర్శంగా దక్షతగా నిలిచి కుటుంబాన్ని నిలబెట్టే నాన్న కావాలి నాన్నా. వేదనగా హృద్య అన్న మాటలు వేదంలా వినిపిస్తున్నాయి రాజేందర్‌కు....

# 1
# ఇదీ భారతం

ఊరు ఊరంతా ఆయనగారికి డొల్లగా కన్పిస్తోంది. దగాపడి దిగాలు చెందినట్లుంది. గ్రామకంఠం పీక నులిమి ప్రక్కకు విసిరేసినట్లనిపిస్తోంది.

పొరపొచ్చాల మాయలో కుళ్ళూ కుతంత్రాల సందిగ్ధాన ఊరు నిర్వీర్యమయినట్లుంది. తాతాలుతో బాటు ఆయన వర్గానికయితే మరీనూ... వాళ్ళ దృష్టిలో ఊరుపోకడంతా ఛిద్రమైపోతున్నట్లు. ఆధిపత్యాలు, అధిక్షేపణలు ప్రజ్వరిల్లుతున్నట్లు అవినీతి రాజ్యమేలుతున్నట్లు ఇంకా ఇంకా ఎన్నో రుగ్మతలు! అవడానికి చిడిబోతు గ్రామమే అయినా, ఆశ్రితపక్షపాతాలు, వర్గవైషమ్యాలు, సాధారణ జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నట్లనిపిస్తోంది.

చెప్పాలంటే వాళ్ళ ధోరణి వాళ్ళది. రాజ్యాధికారానికి చేరువ కాలేకపోతూన్న ప్రతి తస్మదీయుణ్ణి పట్టిపీడించగల్గిన జాడ్యం అక్కడ తాతాలుని ఆవహించి ఉంది. అతనితోబాటు ఆ వర్గ అనుచరుల్ని సయితం పట్టి పిండి చేస్తోంది. ఇక లేని వాటిని గూడ ఉన్నట్లుగా చూపించి ప్రజల నాడీ మండలపు గతిని తప్పించి తన వైపు తిప్పుకొనేలా చేయడంతో ప్రతి పంచాయితీ ఎలక్షన్లోనూ భంగపడి మిగలక తప్పడం లేదు తాతాలుకి.

ప్రతి ఐదు సంవత్సరాలకి ఎలక్షన్లు వస్తూనే ఉన్నాయి. ప్రతిసారీ చిడిబోతు గ్రామ పంచాయితీ ప్రెసిడెంట్ పదవికి తాతాలు పోటీ పడుతూనే ఉన్నాడు మస్తానయ్యను ఓడించడానికి శతవిధాల ప్రయత్నిస్తూ ఉన్నాడు. చివరికి తను పరాజిత ప్రెసిడెంటుగా మిగులుతూనే ఉన్నాడు. ఎవరికీ ఎజెండా అక్కరలేకపోయినా, ఎవరి ఎజెండా వారిదయినా తాతాలు జెండాతో ప్రజల్లోకి వెళ్ళి చతికిలపడుతూనే ఉన్నాడు.

గెలవని ప్రెసిడెంట్ తాతాలు ప్రజా సానుభూతిని మూట గట్టుకుంటున్నాడే గాని దానిని తర్వాత ఎలక్షన్లలో ఓట్ల రూపంలోకి మరల్చుకోలేక పోతున్నాడు. చెప్పాలంటే కారణం కులం... కులబలం... మస్తానయ్య ఇరవై సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా చిడిబోతు గ్రామపంచాయితీకి ప్రెసిడెంట్‌గా ఉంటూ చక్రం తిప్పుతున్నాడంటే కేవలం ఆయనగారికున్న రాజకీయ చతురత, ఆర్థిక అంశబలం, అధిష్టానం ఆశీస్సులు ఒక్కటే అనుకుంటే పొరబాటే. అన్నీ ఉన్న ఎందరినో గతంలో మట్టికరిపించగలిగాడు. ప్రత్యర్థి ఎంత గట్టివాడయినా బ్యాలెట్ బాక్స్ దగ్గరకెళ్ళేసరికి ప్రజలు ఓటు ముద్రను మటుకు మస్తానయ్య గుర్తు ఒంటెమీద పడేలా చేయగలిగేవాడు. దాంతో ఒంటె గుర్తు మస్తానయ్య ఆఖండ విజయంతో ప్రెసిడెంట్ సీట్లో ఎగిరికూర్చునేవాడు.

తాతాలు కూడ గ్రామ రాజకీయాల్ని బాగా వంట పట్టించుకున్నాడు గానీ ఈ కులాల గోదాములో ఎందుకో వెనుకపడుతూనే ఉన్నాడు. దాంతో ఎప్పుడూ 'మాజీ' అన్న మసిని ఒంటికి పూసుకోకతప్పడం లేదు.

'సిరంజీవి రాజకీయాల బాట పట్టాడంట! నాయాల్ది ఆయనగారి కులపోళ్ళు ఆయనెంటే' అంకాలు అన్నమాటలు బాగా ఆలోచింప గలిగేవిగా ఉన్నాయి.

'నిజమేనంటావా అంకాలా! సిరంజీవి వస్తే రాజకీయ సిత్రమే మారి పోద్దంటన్నారు. పేపరోళ్ళయితే మరీను! అతగాడు ఎక్కడో సిన్మాల్లో ఎగిరిగంతులేస్తూ కోట్లకు కోట్లు ఎనకేసుకుంటుంటే అసలు రాజకీయం ఆయనకెందుకంట, 'సిరంజీవా! మజాకా... రాను మొర్రో అన్నా ఎంటనున్నోళ్ళు ఊరుకుంటున్నారా బలవంతాన సేతులు పట్టుకు తోసి పడేస్తారు.'

మస్తానయ్యకు అంకాలు కబుర్లు ఎప్పుడూ రుచిగానే అన్పిస్తాయి. అతగాడి మాటకారి తనం అటువంటిది. పేపర్ న్యూస్‌కి కాసింత ఫినిషింగ్‌టచ్ ఇచ్చి మరీ సెపుతాడు. టీవీ స్క్రోలింగ్‌కి కాస్త మాటల మసాలాల్ని దట్టించి బొమ్మ చూపిస్తుంటాడు.

'అది కాదులే అంకాలా! ఎక్కడో హైదరాబాదులో సిరంజీవి ఏదో సేత్తాంటే మనకేంటంట చెప్పు. మన సిడిబోతు మంది... మన సింతాలమ్మ గుడి నుండి ...

మన హంస లక్ష్మి బ్రాండీ షాపు నుండి ... మన కుర్ర కాలవ గట్టు నుండి ... మన రచ్చబండ నుండి ... మన పంచాయితీ మనది...'

'మన ప్రెసిడెంట్ మస్తానయ్యా మనోడు. ఇలా తుప్పు డైలాగులు సెపుతూ కూర్చోండి. ప్రెసిడెంట్ పదవికి లెక్కలొచ్చి ఎక్కడికో ఎగిరి పోతాది! అంకాలు ఊరి పది సెప్పడు ఆడిమాటల్లో కొంత వ్యంగ్యం ఉంటుంది. కొంత విమర్శ ఉంటుంది. అసలు సిసలైన ఆలోచన ఉంటుంది. నిఖార్సయిన నిజం ఉంటుంది.

అందుకే మస్తానయ్య అతగాణ్ణి అంతగా పట్టించుకొనేది. నిజం చెప్పాలంటే గత నాలుగు టరములు చిడిబోతు పంచాయితీకి ప్రెసిడెంట్ అవడంలో లక్షలకు కట్టల పంపిణీ ఉన్నది. కేసులకు కేసుల సీపు లిక్కరు పందేరం ఉన్నది. ఇంకా కావాల్సినోడికి కావాల్సినంత అన్నట్లు ఏర్పాట్లన్నీ ఉన్నాయి.

అన్నీ సేత్తోన్నానే ఉన్నాడు. అయితే ఎగస్పార్టీవోడు కూడ సేసి పడేత్తన్నాడు. నోటుకు నోటు అడ్డేసి పడేత్తన్నాడు. ఇంకేంటి గెలుపోడికి ఓడి నోడికి తేడా.

సరిగ్గా అక్కడే... అక్కడే ఉన్నాది అంకాలు గాడి బుర్ర. ప్రత్యర్థి వర్గంలో వాళ్ళని ఎలా లాక్కోవాలో బాగా తెల్సు. సరిగ్గా ఆ ఫార్ములా మీదే ఇన్నాళ్ళూ మస్తానయ్య గెలుపొందుతూ వచ్చాడు. ఇంకా సెప్పాలంటే ఆ ఊరి పంచాయితీకి మస్తానయ్య గెలుస్తున్నాడు. ఆయన చేష్టలు గెలుస్తున్నాయి. ఇంకా డీప్‌గా పోవాలంటే అతగాడి కులం గెలుస్తున్నాది... కుల బలం వర్ధిల్లుతున్నది.

అవన్నీ తలపండి కాకలు తీరిన మస్తానయ్యకు బాగా ఎరుకే. అందుకే ఇన్నాళ్ళూ ఏది ఎటుపోయినా ఎన్నికలు వచ్చాయంటే తన కుల రాజకీయాలు నడిపిస్తూ...తన కుల వర్గాన్ని ఐక్యంగా నిలుపుకుంటూ...నిలుస్తున్నాడు. ... తద్వారా నిలబడుతున్నాడు.

అంకాలు చెవిలో జోరీగలాగా పోరుతున్నాడు. మొదట్లో పెద్దగా ఆలోచించ లేదు. ఎక్కడో పదో సిన్మావోడు కొత్తగా పెట్టిన పార్టీని తనకు తగిలిస్తాడేంటన్న అంశం పెద్దగా బుర్రకెక్కించుకోలేదు ఇన్నాళ్ళూ.

'ఇదిగో మస్తానయ్యా! సిరంజీవిని చూసి కుర్రకారు రెచ్చిపోతున్నారు. ఆ జెండాలు భుజాన్నేసుకొని ఎగిరెగిరి పడతన్నారు. సూడు రేపు ఎలక్షన్లలో నీ మీద

తారకుగాణ్ణి నుంచో పెట్టకపోతే ఒట్టు'. మస్తానయ్యకు వెన్నులో ఒణుకు బయలుదేరింది. పడక్కుర్చీలో కూలబడి లంక పొగాకు సుట్టను అంటించి అదే పనిగా దమ్ములాగుతున్నాడు

'సరిగ్గా సెప్పి చావేహే!'

'అవునయ్యా తారకంగాడు దుబాయి నుండి దిగాడు దుబాయి డబ్బు సంచులు మొత్తం దించి పడేసినాడు. నువ్వేమో సేపల పరువులకు యాలంలు యిస్తివి. మొత్తం ఆడేపాడేస్తివి. నెమ్మదిగా కౌలు భూముల్నికూడా రొయ్యల పంటకి ఇచ్చేస్తిరి.

ఇక సూస్కో నాయాల్ది! తారకం రేపు పంచాయితీ ప్రెసిడెంట్‌ని పాడిపడేస్తాడు. వేడి రక్తం పెద్దయ్యా ఊరంతా ఊపు మీద ఉన్నది. ఊర్లో కుర్ర కారంతా ఆడినీ, ఆడి జండానీ రొయ్యల ట్రాక్టరు మీద ఎత్తుకు మరీ తిరిగేత్తన్నారు.

కళ్ళు బయర్లు కమ్మినట్లున్నాది మస్తానయ్యకి. వేరే కులపోడయినా తారకాన్ని ఊర్లో ఎదగనిచ్చాడు తను..

"దుబాయినుండి దిగిన అతగాడి గురించి అప్పట్లో పెద్దగా ఎవరికీ తెల్దు... అతగాడు ఆడికన్న తల్లి ... తారకానికి అంతసీనుందని అన్పించడంలేదు. సీనేమిటి పెద్దయ్యా! ఊళ్ళో ఆళ్ళకులం బలం తక్కువేంగాదు. సెప్పాలంటే ఆడు గెల్చాడంటే ఆడి గొప్ప కొంత...

ఆ కులపోళ్ళ సత్తాదురి కొంత... మరిసిపోతున్నావ్! ఆడు నిలబడినాడంటే రేపు తాతాలు కూడా సేయి కలిపేయొచ్చు."

'.....'

'ఆ రెండు కులాలు కల్సిపోయినాయంటే నువ్వూ... నీ లంక పొగాకు సుట్టా... అంకాలు మాటలేకాదు. ఊరిలో వస్తూన్న పెనుమార్పుల్ని తానుకూడ గ్రహిస్తూనే ఉన్నాడు. రాబోయే ఉప్పెన ఉపద్రవాల్ని అంకాలు తెరమీద చూపిస్తున్నాడంతే! కొత్తదనం కోరుకునే కుర్రకారు. మార్పు రావాలని ఆశించే అభ్యుదయవాదులు, తమ కులానికి సయితం అవకాశం కావాలనుకునే తారకం వర్గపోళ్ళు .....

మస్తానయ్యను ఎలాగైనా దించి పడేయ్యాలన్న చిరకాల ప్రత్యర్థి తాతాలు మనుషులు ..... అన్నీ వలయంగా మారి మస్తానయ్యను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

❖❖❖

అంకాలు అన్నట్లు అన్నీ మీదకొచ్చి పడ్తున్నాయి. తారకం ఊర్లోని కొత్త వర్గం ప్రోత్సాహంతో పంచాయితీ ఎలక్షన్లో నిలబడుతున్నాడన్న విషయం గుప్పుమంది. 'సూడు కూనమ్మ' నువ్వు నాకు సెల్లెలు లాంటిదానివి. ఇంతకాలం నీ గడప తొక్కి ఎరుగను. ఇప్పుడు ఓ అన్నగా పలకరించి పోదామని నీ ఇంటికొచ్చేసినాను. తారకం గాడిది ఉడుకురక్తం. సెప్పాలంటే అసలు మీ ఊరు పేరు ఎడ్రస్సూ మాకు తెల్సు. ఏదో కుర్రాడు దుబాయి జాబు వదిలి వాలిపోనాడని సేరదీశాం. ఆనాడు మీ తల్లీ కొడుకుల్ని సూత్తే ముచ్చటేసినాది. ఆడికి నాన్న లేడన్న జాలి కొంత నాకు . నిజం సెప్తున్నా! ఈ చిడిబోతు సేపల సెరువుల మీద ఒట్టు. ఏదో కమ్మగా రొయ్యల సాగు చేసుకోక ఇదంతా ఎందుకంట సెప్పు!

'.....'

"ఆణ్ణి తగ్గమను మరో పాతిక ఎకరాలు కౌలుకి ఇప్పింసేత్తా!"

'.....'

'ఆ తాతాలు గాడు మీ పోడిని ఎక్కేత్తన్నాడు. ఆ దొంగ నాయాళ్ళని నమ్మొద్దు ఆడికి బాగా కుల గజ్జి ఎక్కువయినాది ఊరిలో నిప్పులు పోస్తున్నాడు.

'.....'

'సొంత సెల్లివి కాకపోయినా అన్నగారిగా సెప్తున్నాను. తారకం గాణ్ణి నా గొడుగు కిందకి వచ్చేయమను. ఆడే చిడిబోతుకి వైస్ ప్రెసిడెంట్ ..."

కూనమ్మకు మస్తానయ్య రాజకీయం కొంత అర్థమవుతోంది. కొంత అర్థం కాకుండాను ఉంది. తన కొడుకు సంగతి ఆమెకు బాగా తెలుసు.

అతగాడి నిర్ణయాలకి తాను ఎప్పుడూ ఎదురు సెప్పి ఎరుగదు. బ్రతుకులో తానుపడ్డ కష్టాలు... దుబాయిలో ఉద్యోగం ... కొంత సంపాదన... కొన్నాళ్ళ తరువాత

ఇక్కడకొచ్చి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవడం... కష్టపడి అందరిచేత మంచి అన్పించుకోవడం... చెప్పాలంటే తారకం చిడిబోతు గ్రామంలో మంచి పేరే సంపాదించుకున్నాడు. ఇక పదవికి పోటీ చేయడమనేది తన చేతుల్లో ఏముందట!

ప్రజలు కావాలనుకుంటున్నప్పుడు తాను కాదనడమేంది! అదే విషయం మస్తానయ్యకు తేల్చి చెప్పేసింది.

❖❖❖

మస్తానయ్యకు మంటగానే ఉంది. ఆ కులపోళ్ళందరూ నిన్నటిదాక తన మోచేతి దగ్గర నీళ్ళు త్రాగినోళ్ళే. ఇప్పుడు ఆ తారకంగాడి సుట్టూ తిరగడం తట్టుకోలేకపోతున్నాడు. పైగా శత్రువుకు ఉన్న శత్రువులందరూ మిత్రులన్నట్లు తాతాలు కూడా అతగాడితో సేతుల కల్పడం కలవరానికి గురి చేస్తోంది. ఓట్లు సరిచూసు కున్నాడు. అవును వర్గ ప్రాతిపదికన చూస్తే ఆ రెండు సామాజిక గ్రూపులూ కల్సిపోయి నాయంటే తానుసరి. ఇంతకాలం చిడిబోతు గ్రామంలో జెండా ఎగరేసిన తన కులం సరి. అసలు ఈ అంకాలు గాడు తక్కువేం గాడు. ఆడికి ముందు సూపులు ఎనక సూపు కూడా ఎక్కువే!

పదిమంది కుర్రకారుని ఎంటేసుకొని తిరుగుతున్న తారకాన్ని కూడా కదిపి చూశాడు.

“నాదేముంది అంకులూ! కుర్రోళ్ళందరూ కావాలనుకుంటున్నారు. ఆడ తల్లులయితే కొత్త నీరును చూడాలంటున్నారు. వాళ్ళందరిలో, నేను ఒకణ్ణి తప్ప!”

‘అంటే నాదేదో సిరంజీవి పార్టీ అనుకుంటున్నావన్నమాట!

ప్రతిచోటా మార్పుకోసం ముందుకు కదులుతూంటే అక్కడ ఆయన చిరంజీవి కావచ్చు...! ఇక్కడ నేను సిరంజీవి అవ్వొచ్చు...!! మనుషుల్లో ఎంత మార్పు. తారకాన్ని చూస్తే ఏమీ మారేటట్లు అన్పించడం లేదు. తనకు వ్యతిరేకంగా అన్ని శక్తులూ కల్సిపోవడం.... తనమీద కత్తులు నూరుతుండడం... ఇన్నేళ్ళ రాజకీయ జీవితంలో మస్తానయ్యకి మింగుడు పడని అంశంగా మిగిలిపోతుంది.

అంకాలు తీసుకొచ్చిన కబురు ఊరంతటినీ ఆయోమయంలో పడేస్తోంది. ఎవరికీ నమ్మశక్యంగా లేదు. చిడిబోతు గ్రామమే కాదు. ప్రక్క పల్లెటూర్లలో కూడ ఏ నోట్లో చూసినా తారకంగాడి విషయమే. ఇదంతా మస్తానయ్యని తాతాలుని చాల ఇరకాటంలో పడేస్తోంది. ఎవరు ఎన్ని ఇరకాటాల్లో పడినా నిజాలెప్పుడూ వాస్తవికతలను ప్రతిబింబిస్తూనే ఉంటాయి. తారకం పుట్టి పెరిగిన ఊరిలోని తెల్సిన వ్యక్తులద్వారా అంకాలు కొంత విషయం లాక్కొచ్చేశాడు. అది ఈ ఎన్నికలు సమయంలో ఊరు నంతటినీ కదిలించిపడేస్తోంది. తారకం చిన్నతనంలోనే తండ్రి మరణించాడట. కూనమ్మది కులాంతర వివాహమట!!ఇంకా లోతులోకి వెళ్ళితే కూనమ్మ భర్త మస్తానయ్య వర్గానికి చెందిన మనిషట!!

భర్త మరణం తర్వాత కొడుకుని అన్నీ తానయి పెంచి పెద్దజేసిందట. దుబాయిలో ఉద్యోగంచేస్తూ చాలా కాలం అక్కడే కాలం వెళ్ళబుచ్చిన తర్వాత సొంత ఊరులో పరిస్థితులు అనుకూలించక వ్యాపారాల నిమిత్తం చిడిబోతు వచ్చేసి ఇక్కడే స్థిరపడ్డారట! ఇంతకాలం ఈ విషయం చెప్పాల్సిన అవసరం వాళ్ళకి ఎప్పుడూ కల్గలేదు. తెల్సుకోవాల్సిన అవసరం ఊరికీరాలేదు. ఇప్పుడు అంకాలు తెచ్చిన వార్త నిప్పులోని ఉప్పులా పనిజేస్తోంది. చిటచిటలాడుతూ పంచాయతీ రాజకీయాన్నీ చుట్టుముట్టి పడేస్తోంది. 'వేరేవాడని తెల్సినా ఇంతకాలం వాడికి మద్దతు ప్రకటించాం! ఈ తార తండ్రి కులం మస్తానయ్యదే అని నిర్ణయమైపోయిం తర్వాత ఇక మేమేమిటి ఇచ్చేది... చేతులో చిప్ప. అంతవరకు తాను పోటీ నుండి వైదొలగి మస్తానయ్యను ఎదురు దెబ్బతీయాలన్న ఉద్దేశ్యంతో తారకానికి మద్దతు ప్రకటించిన తాతాలు తిరిగి నామినేషన్ చేయడానికే నిర్ణయించుకున్నాడు.

మావాడు... మా దుబాయి తారకం... మార్పు కోసం యువశక్తి అంటూ వెంటేసుకు తిరిగిన కుర్రకారంతా వర్గ ప్రలోభంలో పడి ఒక్కొక్కరూ ప్రక్కకు జారుకుంటున్నారు. మస్తానయ్యకు అంతా అదోలా ఉంది. అంకాలు సలహా ఇక్కడ పనిచేయదేమో అనిపిస్తోంది. 'అవును...తను తన స్వార్థం...పదవీ రాజకీయం. ఎన్నో ఏళ్ళుగా తానేనన్న ఆధిపత్య ధోరణి... కుర్చీని పట్టుకొని వేళ్ళాడిన వైనం...అన్నీ పునరాలోచనలోనికి నెట్టేస్తున్నాయి.

వీటన్నింటినీ ప్రక్కన పెట్టి ఆలోచిస్తే ఇంతకాలం వేరే వాడనుకున్న తారకం ఇప్పుడు తన సొంత వర్గానికి చెందిన వ్యక్తి. తన సామాజిక వర్గమన్న ఏకైక సాకుతో ప్రత్యర్థి మద్ధతు ఉపసంహరించినపుడు...మార్పు మార్పు అంటూ అరిచి గీపెట్టిన వాళ్ళంతా కేవలం 'కులం' కారణంగా సీమను మార్చి పడేసినప్పుడు...ఆలోచిస్తే అన్నిటా, అంతటా ఓ మానసిక రుగ్మతాంశ, దుర్నీతి అంకంగా సహజాతి సహజంగా అల్లుకుపోతోంది.

అవును, తన రాజకీయం తనకుంది. ప్రత్యర్థికి అంతుచిక్కని రాజకీయ చిత్రం తనకుంది.

తానుగా పదవిని అనుభవించినా లేకపోయినా తన కులానికి చెందిన వ్యక్తి ఆ పదవిలో కొనసాగడం అనివార్యం... తన అభిలాష కూడాను. అదే తన వర్గం వారికి సార్వజనీక మవుతుంది. అందుకే...

తారకాన్ని అత్యంత భారీ మెజార్టీతో గెలిపించుకోవడం కోసం తన నామినేషన్ను ఉపసంహరించుకోవడానికి సమాయత్తమవుతున్నాడు మస్తానయ్య.

# 2
# యాదృచ్ఛికం

ఫోన్ మోగుతోంది

టాబ్లెట్ ఇవ్వబోతూ ఆగి ఫోన్‌కేసి చూశాడు.

పట్టు విడవడం లేదు. తదేకంగా మోగుతూనే ఉంది.

'టాబ్లెట్ వేస్కో కౌసల్యా!"

చిన్నగా మూలిగి మంచం మీద అటునుండి ఇటు ఒత్తిగిల్లింది. ఆవిడ మొహం బాగా పీక్కుపోయి ఉంది. జుట్టు చెల్లాచెదరుగా కన్పిస్తోంది.

"ఇంకా అవసరమంటారా!" కడుపులోంచి లేని ఓపికను తెచ్చుకుంటూ అంది. భర్త మొహంలోకి సూటిగా చూడాలని ప్రయత్నిస్తోంది. కానీ కనురెప్పలు వాలి పోతున్నాయి.

"ఇంకా రెండు రోజులుంది. సమయం గడవాలి కదా!" ఫోన్ తన పని తాను చేసుకుపోతూనే ఉంది ఆగి మరలా రింగ్ అవుతూనే ఉంది.

'నాయనా నేను!'

'ఓహ్! నమస్తే గురూజీ!'

'నేపాల్ యాత్ర ముగించుకొని ఆశ్రమానికి ఇప్పుడే వచ్చాను  నాయనా!'

"సంతోషం గురూజీ!' కమలాకరం మాటలు దృఢంగా ఉన్నాయి.

'విషయం తెల్సింది. విని ఆశ్చర్యపోయాను. ఈ ఆశ్రమానికి మంచి క్రమశిక్షణ కల్గిన కార్యకర్తవి నాయనా!'

'అంతా మీ ఆశీర్వాదం గురూజీ!'

'అయినా ఎందుకిలాంటి నిర్ణయం తీసుకున్నారో'

కమలాకరం ఒక్క క్షణం మౌనం వహించాడు.

"ఈ నిర్ణయం ఈనాటిది కాదు గురూజీ ! మనసు పొరల్లో చాలా రోజుల నుండి ఉంది. నాకున్న కొద్దిపాటి ఆస్తి బాధ్యత మన ఆశ్రమం చక్కగా నిర్వహిస్తూందన్న నమ్మకం ఉంది నాకు."

'మంచిది నాయనా!'

'అంతేకాదు. మా తదనంతరం మాకిద్దరికీ నిర్వహించాల్సిన కార్యక్రమాలు మీ శిష్యులలో ఎవరు చేసినా...'

'ఆశ్రమ ధర్మానుసారం అన్నీ జరుగుతాయి'

'.....'

'అయితే అడ్వకేట్‌తో మాట్లాడుతాను నాయనా!'

'మంచిది గురూజీ!'

ఫోన్ పెట్టేసి భార్యకు దగ్గరగా వచ్చాడు కమలాకరం.

'మందులు తీస్కో కౌసల్యా!'

మంచం మీద లేవలేక అవస్థపడుతూన్న ఆమెకు తాపు పట్టి మంచినీళ్ళ గ్లాసును నోటికి అందించాడు. భర్త ఇచ్చిన నీళ్ళు త్రాగి తిరిగి పడుకొంది కౌసల్య. కళ్ళు మూసుకున్న ఆమె కనుకొలనులోని సన్నటి నీటిపొరను ఆయన గమనింపక పోలేదు.

కొన్ని క్షణాల తర్వాత కళ్ళు తెరిచింది.

కన్నీటి కావల తన మొహాన్నే తదేకంగా చూస్తున్న భర్త కనిపించేసరికి ఆవిడలో దుఃఖం కట్టలు తెంచుకొంది. అంతలోనే సర్దుకొంది.

'ఏమిటిది కొత్తగా' భర్త చేతిని అందుకుంటూ అంది.

'నాకెప్పుడూ నీవు నిత్య నూతనమే!' చిన్నగా నవ్వబోయాడు. దానిలో జీవం ఏమీ కానరావడంలేదు.

ఫోన్ రింగవుతోంది.

'హల్లో.. డాడీ నేను వల్లభను'

'వ..ల్ల..భ! సారీ రాంగ్ నంబర్!' ఫోన్ పెట్టేశాడు.

'ఎక్కడి నుండి ఫోన్!' దగ్గుతూ అడిగింది.

'రాంగ్ నంబర్!'

'ఏదో మన అమ్మాయి దగ్గర నుండి అనుకున్నానులెండి'

'అంతా నీ పిచ్చిగాని..'

'వాడికి ఎలానూ మనం అక్కరలేదు. ఆడది కనీసం దానికైనా జ్ఞానం ఉండక్కరలేదా!'

'అవును ఈ రోజుల్లో కొడుకూ కూతురూ ఒక్కటే అని నిరూపించారు!'

'కన్నవారిని కర్కశంగా ఒదిలి పడేయడంలోనా!'

'ఫర్వాలేదే. నువ్వు బాగా డవలప్ అవుతున్నావ్!!'

'అవును ఆరిపోయే కొవ్వొత్తి!'

మళ్ళీ ఫోను మోగుతోంది.

'హలో నేను వల్లభను..'

'సారీ ఎగైన్ యు ఆర్ రాంగ్ నంబర్!' కమలాకరం ఫోన్ పెట్టేశాడు. ఆయనకి చాలా విరక్తిగా ఉంది. ఎంతో అసహనాన్ని ఫీలవుతున్నాడు. మంచం మీద పడి ఉన్న భార్యకేసి చూశాడు.

'పిచ్చిది!' తనలో తాను అనుకున్నాడు.

తమను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూన్న కొడుకు, కూతురు గుర్తుకు వచ్చారు.

తాము ఎవరికోసం బ్రతకాలి. బ్రతికి ఎవరిని ఉద్ధరించాలి. ఈవేళ కాకపోయినా కొద్ది నెలల్లోనో, సంవత్సరాలలోనే ఈమె పోవడం ఖాయం. కౌసల్య లేకుండా తాను బ్రతకలేడు. అందుకే ఇప్పుడున్న పరిస్థితులలో తాము తీసుకున్న నిర్ణయం సహేతుకంగా అన్పిస్తోంది.

ఈ జీవితాన్ని భరించడం ఇష్టంలేక డిసైడెడ్ టు డై.

అందుకే తమకున్న కొద్దిపాటి ఆస్తిపాస్తుల్ని ఆశ్రమానికి రాసేయడానికి నిర్ణయించుకున్నారు.

ఫోన్ అదే పనిగా రింగ్ అవుతోంది.

'హాలో డాడీ... నేను వల్లభను... ఒక్కసారి మాట్లాడండి.'

'సారీ! రాంగ్ నంబర్ మిస్టర్ వల్లభ్. నేను మీ డాడీని కాదు' ఫోన్ పెట్టేశాడు.

'ఎన్నాళ్ళు ఈ వ్యధాభరిత జీవితాన్ని మీరు మోస్తారు. నన్ను పంపేయండి. నాకు జీవించాలన్న ఇచ్ఛలేదు. ఉన్నా సుఖం లేదు. మూడు సంవత్సరాల నుండి ఈ వేదన తప్ప నాకు మరే ఆనందమూ కన్పించడంలేదు.'

'ఆల్‌రైట్ ఐ విల్ సెండ్ యు అవుట్. బట్ ద సేమ్ టైమ్ సో యామ్ ఐ'

మళ్ళీమళ్ళీ ఫోన్ రింగ్ అవుతూనే ఉంది.

'హలో డాడీ! నేను వల్లభ్‌ను'

'సారీ మీ కాల్ రాంగ్ నంబరుకి పోతోంది. నెంబరు కన్‌ఫాం చేసుకోండి' అన్నాడేగాని, అవతల వ్యక్తి పట్టువదలని విక్రమార్కుడయిపోతున్నాడు.

మరలా ఫోన్ రింగ్ అవుతోంది. టేబుల్‌కి దూరంగా ఉన్న కమలాకరం కుర్చీని ఫోన్‌కి దగ్గరగా లాక్కున్నాడు. సావధానంగా మాట్లాడటానికి వీలుగా కూర్చొని ఫోన్ లిఫ్ట్ చేశాడు.

'ఎందుకు ఫోన్ కట్ చేస్తున్నారు నేను వల్లభను.'

'యు ఐ యామ్ రాంగ్'

'యస్ యు ఆర్ కరెక్ట్. డాడీ ఐయామ్ రాంగ్ ఇన్ ఎవ్విరియాస్పెక్ట్ ఆఫ్ మై లైఫ్' ఈసారి కమలాకరానికి ఫోన్ పెట్టబుద్ధి కాలేదు. అవతల వ్యక్తి మాటలు ఆలోచింపజేస్తున్నాయి.

"అవును డాడీ! మీరు రాంగ్ నెంబరు అని డిస్కనెక్ట్ చేస్తూంటే ... ఐ ఫీల్ వెరీ శాడ్. మీ ఓదార్పు కావాలి డాడీ! ఎప్పటిలా మీరిచ్చే మంచి సలహా కావాలి డాడీ!"

✸✸✸

కమలాకరం మౌనమే అతనికి సమాధానమవుతోంది.

అవతల నుండి వల్లభ ఏదేదో మాట్లాడేస్తున్నాడు.

వ...ల్ల...భ కొంచెం అర్థమవుతూ ఉన్నాడాయనకి,

✸✸✸

'నాకు మీ నాన్నంటే ఇష్టం లేదు!'

'ఎందుకో తెల్సుకోవచ్చా!' భార్య చేతిని దగ్గరగా తీసుకుంటూ అన్నాడు వల్లభ.

'అవును అంతే!'

'ఏమిటీ సమయంలో హఠాత్తుగా...' సుస్మితకు మరింత దగ్గరగా జరిగాడు. అతని మాటలు మంద్రతగా ఉన్నాయి. కళ్ళు మత్తుగా చూస్తున్నాయి. ఊహలు మౌన ప్రపంచంలో ఒదిగి అల్లరి చేస్తున్నాయి. భార్యను సుతరామూ హత్తుకుంటున్నాడు.

వల్లభలోని చిలిపి అంశానికి తెరవేస్తోంది. అసలే ఏరి కోరి చేసుకున్న అందాల బొమ్మ.

'సుస్మీ! ప్లీజ్' పెళ్లందాలు జడ మల్లెపూలు... బయట మల్లెల వానలా వెన్నెల... ఆమె ఒడిలో ఒదగబోయాడు.

'సరసానికి కొదవేం లేదు. ఆయన మాటల మధ్య నీతో కాపురం చెయ్యాలంటేనే మంట పుడుతోంది.

'.....'

'ఆయన మాటలు నేను మర్చిపోలేకపోతున్నాను. నేను నీకు తగిన దాన్ని కాదట. మీ ఆలోచనలకు నా జీవితం సరిపడదట.'

'డోన్ట్ టేక్ హిమ్ సీరియస్. ఆయనో పిచ్చి మాలోకం'.

ఆ క్షణంలో అలా అనగలిగాడంటే, అసలు వల్లభ్‌కి తండ్రి మాటలు, ఆయన ఆలోచనలు ఎప్పుడూ ఒక కొత్త ఊపిరినే ఇస్తూ ఉంటాయి.

తండ్రి డెషిషన్స్ అన్నీ కరెక్ట్ అని అతని గట్టి నమ్మకం.

బట్ హి టోటల్లీ ఫెయిల్డ్ ఎట్ హెర్. ఎందుకో సుస్మిత దగ్గర ఆయన కేలిక్యులేషన్స్ తప్పుతున్నాయి.

✷✷✷

'డాడీ! ఈ మధ్య చెప్పానే సుస్మిత…ఆ అమ్మాయిని లైఫ్ పార్టనరుగా నేను…'

'ఈమె నీకు తగిన అమ్మాయి కాదు!"

సుస్మిత ఆశ్చర్యపోయింది. ప్రత్యక్షంగా ఓ మనిషి ముఖంమీద ఇంత ఖచ్చితంగా మాట్లాడతారని ఆమెకు తెలియదు.

'ఇన్నాళ్ళూ చాలా ఒడుదుడుకులు అనుభవించావు, చదువుకు తదనంతరం ఉద్యోగానికి… చాలాసార్లు అందుకోవాలన్నది అన్నీ అందుకోలేక చాల బాధలు పడ్డావ్. ఎగైన్ యు ఆర్ గోయింగ్ టు ఫేస్ ద సేమ్.'

'.....'

'ఐ వార్న్ యు. తనతో జీవితం నీకు సుఖాన్నివ్వదు.'

'హి ఈజ్ నథింగ్ బట్ సెల్ఫిష్, ప్యూర్‌లీ సెల్ఫిష్'

జయమూర్తిగారి మాటలకి సుస్మిత ముఖం కోపంతో కందగడ్డగా మారి పోయింది. ఊహించని పరిణామానికి వల్లభ విస్తుబోయాడు.

'ఇది నా నిర్ణయం. ఇప్పటిదికాదు. మీ అమ్మ పోయినప్పుడు తీసుకున్న నిర్ణయం.'

"సుస్మిత మంచిదే నాన్నా! మామగారిని బాగానే చూసుకుంటుంది. తేడా వస్తే బాధ్యత తీసుకోవడానికి నేనున్నాను.'

"అప్పుడు మీ అమ్మతో చెప్పాను. ఇప్పుడు నీతో చెప్తున్నాను."

'నా స్వేచ్ఛ సంగతి కాదు, కొడుకులకి, కూతుళ్ళకి బరువు కారాదని, వాళ్ళకి స్వతంత్రం ఇవ్వాలని...'

తల్లి ప్రస్తావన వచ్చేసరికి వల్లభ మిన్నకుండిపోయాడు. అయినా డెబ్భైఏళ్ళు దాటుతున్న తండ్రి ఆరోగ్యంగా ఉండడం అదృష్టమే!

ఆందోళనగా అక్కడి నుండి నిష్క్రమిస్తూన్న కొడుకుని పిలుస్తూనే ఉన్నాడు జయమూర్తి.

ఇప్పటిదాకా తన అడుగునే అతనిదిగా చేసుకున్న కొడుకు మొదటిసారిగా జీవితంలో మారు మనిషిగా అన్పిస్తున్నాడు.

***

'ఏమిటి ఎప్పుడూ ఆలోచనలేనా!' భర్త మొహాన్ని ప్రేమగా తనవైపు తిప్పు కుంటూ అంది సుస్మిత.

'ఏమీ లేదు!' ఆ ముక్తసరి సమాధానం ఆమెకు ఒప్పలేదు. ఆ క్షణాన వల్లభకు కావాల్సింది మాటల ఊరడింపు కాదు. మురిపాల వడ్డింపు.

చిన్నగా నవ్వుకొంది.

'అబ్బాయి గారు అబ్బాయిగారెప్పుడవుతారో' భార్య తన ఒడిలో కూలబడి అంటున్న మాటలు వల్లభను ఎక్కడికో తీసుకుపోతున్నాయి.

ఆమె నడుం చుట్టూ గోముగా చేతులు వేశాడు. ఆమె జడలోని మల్లెపూలు మంచి నిగారింపుతో ఉన్నాయి. ఆ వాసనలు అతగాడిని ఎక్కడికో లాక్కుపోతున్నాయి. భార్యను ప్రేమగా మరింత దగ్గరగా పొదివి పట్టుకున్నాడు. అదే సుస్మితకు కావాల్సింది.

***

సుస్మితలోని స్వార్థాన్ని తల్చుకుంటే శరీరం కంపించిపోతోంది. లోకంలో జీవితాన్ని పంచుకున్న మనుషులు అసలు ఇలా ఉంటారా! సంకుచితత్వం అనేది కొన్ని కోణాల్ని ప్రభావితం చేసినా తను భర్త, సంసారం అన్న చట్రాన్ని ఏ ఆడదీ ఉపక్రమించిన దాఖలాలు ఏమీ లేవు. కానీ తన భార్య మటుకు వాటన్నింటికీ కూడా అతీతం.

వల్లభకి సన్నగా వెన్నులో వణుకు ప్రారంభమయింది.

'హలో డాడీ!'

'చెప్పు వల్లభ్'

'నాకు చాలా అవమానం జరిగింది డాడీ!'

'యు నో హవ్ ఇంటలెక్టువల్ ఐయామ్. నన్ను కాదని నాకన్నా తక్కువ కేటగిరిలో ఉన్నవాడికి ప్రమోషను ఇచ్చారు. హి ఈజ్ నథింగ్ బట్ ఎ జీరో!'

సింగపూర్‌కి పంపేందుకు నన్ను తప్ప అందర్నీ సెలక్ట్ చేశారు. కెరియర్ ఆపర్చ్యునిటీస్ మిస్ అయిందనేసరికి సుస్మిత చాలా అప్‌సెట్ అవుతోంది. నాతోపాటు తనుకూడా సింగపూర్ వద్దామని ప్లాన్ చేసుకుంది పాపం. బట్ టోటల్లీ ఉయ్ మిస్‌డ్ ద ఆపర్చ్యునిటీ.

✸✸✸

'అసలు మీకు ఆఫీసులో ఎలా పనిచేయాలో తెలియదు. అలాగే పైవాణ్ణి కన్విన్స్ చేయడమూ చేతగాదు' భార్య మాటలు వల్లభను కృంగదీస్తున్నాయి.

'అది కాదు డార్లింగ్!

'మాటలు వినే ఓపిక లేదు నాకు. నా కెరియర్ గురించి, నా సింగపూర్ ట్రిప్ గురించి ఎంతగానో ఊహించుకున్నాను. చెప్పాలంటే నీకన్నా నేను ఫెడప్ అవుతున్నాను.'

సుస్మిత నిద్రపోయిన తర్వాత తండ్రికి ఫోన్ చేశాడు.

'జీవితంలో ఎదురైన ప్రతి దాన్నీ నెగిటివ్‌గా తీస్కోకు. థింక్ పాజిటివ్‌లీ. డెఫినెట్లీ యు హేవ్ యువర్ ఓన్ ఆపర్చ్యునిటీ. దెబ్బతిన్నప్పుడు, దెబ్బ తగిలినపుడు

మరింత ఎగ్రిసివ్‌గా పనిచేయి. నీకు తెలియని లోపం అవతలివాడు గ్రహించాడనుకో! డోన్ట్‌ఫీల్ యు ఆర్ సుపీరియర్. అవతల మనిషిలోని గొప్పతనాన్ని నువ్వు గ్రహింపగల్గితేనే నువ్వు గొప్పగా రాణింప గల్గుతావు' ఫోన్ పెట్టేశాడు.

తండ్రి మాటలు వల్లభకు కొంత ప్రశాంతతను కల్గిస్తున్నాయి. అవి తన ఆలోచనా పథానికి పదును పెడుతున్నట్లుంది.

అవును, తనతో కలిసి పనిచేస్తూన్న కొలీగ్స్ ఆ నలుగురూ సింగపూర్ వెళ్లారు. పాజిటివ్‌గా ఆలోచిస్తే వాళ్ళు బెటర్‌గా ఉన్నారన్న సంతృప్తినిస్తోంది. అవును ఆ నలుగురూ తనకన్నా తెలివైనవాళ్ళే. అందుకే తనకన్నా ముందు నడుస్తున్నారు.

చిన్నతనం నుండి ఏ సమస్య వచ్చినా తండ్రి ఇచ్చే ఓదార్పు, ధైర్యం, సూచన వల్లభను ఎంతగానో ప్రభావితం చేస్తున్నాయి. చెప్పాలంటే ఆ పెద్దమనిషి మాటలు తనకు ఆక్సిజన్‌గాను, ఉత్ప్రేరకంగాను పనిచేస్తుంటాయి.

***

'వెళ్ళాల్సిందేనా!'

'ఏమిటి సుస్మీ! సెన్స్‌తోనే మాట్లాడుతున్నావా!! పోయింది ఎవరనుకున్నావ్ నా కన్న తండ్రి. కర్మకాండకు పెద్దవాణ్ణి కాకపోయిన చిన్నవాడిగా నాకూ కొంత బాధ్యత ఉంది' భార్యకేసి అసహ్యంగా చూశాడు.

సుస్మిత ధోరణి రోజురోజుకి దిగజారుతూ ఉంది, చెప్పాలంటే తానో మనిషినన్న విషయమే మర్చిపోయి ప్రవర్తిస్తోంది.

***

ఎంటైర్ వరల్డ్ ఆర్థికమాంద్యం, వేలమంది ఉద్యోగాలు కోల్పోతున్నారు. రోజు పేపరు చూడాలంటేనే భయం పట్టుకుంటుంది. ఈ రోజుల్లో చాలామందిలాగ వల్లభ కూడా లోన్లు మీద లోన్లు పెట్టేశాడు.

బ్యాంక్‌లోన్ మీదు కారు, ఫ్లాటు, ఇంట్లో ఖరీదైన ఎన్నో వస్తువులు ఎన్నెన్నో కొనిపడేశాడు. అన్నీ బికాజ్ ఆఫ్ హెర్.

సుస్మిత గురించి అటు ఇటు ఎన్నో లోన్లు చేసేశాడు.

బికాజ్ ఆఫ్ ద జూనియర్ హి లాస్ట్ ద జాబ్.

అవును ... ప్రపంచాన్ని కుదిపేస్తున్న ఆర్థిక మాంద్యం పుణ్యమా అని ఉద్యోగాలు కోల్పోయిన వేలాదిమందిలో తానూ ఒకడయ్యాడు.

తీర్చవలసిన బకాయిలు, బ్యాంకు లోన్లు, జీవితాన్ని ఎదుర్కొవడం తెలియడం లేదు వల్లభకి. చివరికి తనని ఉద్యోగమే కాదు సుస్మితకూడా వదిలిపోవడానికి నిశ్చయించుకొంది.

తమ వైవాహిక జీవితం ఆర్థిక సంక్షోభానికి అతీతం ఏమీకాదని నిర్ధయగా వదిలి వెళ్ళిపోవడానికి సమాయత్తమవుతోంది.

"థ్యాంక్ గాడ్! పిల్లలు వద్దనుకొని ఇన్నాళ్ళూ ఆగడం కూడా మేలే చేసింది. లేకపోతే నా జీవితానికి అదో గుదిబండ అయేది."

'ప్లీజ్ సుస్మీ! థింక్ ఆఫ్ మి. ఈ రోజు ఉద్యోగం పోవచ్చు. మర్నాడు మరొకటి రావచ్చు. అప్పటిదాకా బ్రతకలేమా! ఒక్కసారి ఆలోచించు! మనమధ్య ఇన్నాళ్ళూ నడిచిన ప్రేమ, ఆ ఇంటిమసీ... అవీ... ఇవీ...'

'.....'

'అవన్నీ అబద్ధమని ఇన్నాళ్ళు నేను అబద్ధంలోనే ఉన్నానని నమ్మమంటావా...'

'ఐయామ్ సారీ' గో టు హెల్. మామూలు జీవితాన్ని గడపడం నాకిష్టంలేదు!'

'ఇప్పుడు నన్ను ఒదిలేసి నీ తల్లిదండ్రుల దగ్గరకెళ్లినా గొప్ప జీవితాన్ని అందుకోగల్గుతావా!'

'తల్లిదండ్రుల దగ్గరకా! నేను వెళ్ళేది అక్కడికెందుకనుకుంటున్నావ్! సారీ బై!'

వల్లభకి అంతా శూన్యంగా అన్పిస్తోంది.సుస్మిత వెళ్ళిపోయింది. ఇక తోడబుట్టిన మనుషులు, వాళ్ళు ఇప్పుడు తనను చూసే విధానం చాలా డిఫరెంటుగా, అవహేళనగా ఉంది.

తిరిగి ఆ వేలకు వేల రూపాయల ఉద్యోగానికి రాలేకపోతానన్న నిజం తెలుసు వల్లభకి.

'సో హి డిసైడెడ్ టు డై. ఈ జీవితం అనవసరం. కలలాంటి జీవితాన్ని కలగా అనుకోకుండా నిజంగా బ్రతికేయాలా!'

బ్రతికి అలా, ఇలా ఉండటం అతనికి ఎందుకు సిగ్గుగా ఉంది. వీధిలో చిత్తుపేపర్లు ఏరుకునే ముష్టివాడిగా ఫీలవుతున్నాడు. ఆ జీవితం లేకుండా ఈ జీవితం ఏమిటి.

తనే ఇలా ఆలోచిస్తుంటే సుస్మిత చేసిందాంట్లో తప్పేముంది

సో హి డిసైడెడ్ టు డై...

వెన్ ఎవర్ హి ఫీల్స్ డిప్రెషన్, హి టెలిఫోన్స్ టు డాడీ!

'అది కాదురా! ఇది జీవితం. మీ నాన్న ఎప్పుడో చనిపోయాడు. నీ పిచ్చిగాని మరలా మరలా డిస్కనెక్ట్ చేసి పడేసిన జయమూర్తిగారి నెంబర్‌కి డయల్ చేయడం...' ఆనంద్ చెబుతూనే ఉన్నాడు.

'.....'

"టెలిఫోన్ డిపార్టుమెంటు వారు ఈ పాటికి ఆ నెంబరును వేరే వాళ్ళకి ఎలాట్‌చేసి ఉంటారు. ఇంకా ఆ నెంబరంటావ్! నీ బాధ అవతల వాళ్ళకెందుకు చెప్పు."

ఆనంద్ మంచి మిత్రుడే! కానీ ఈ విషయంలో అతగాడి మాటలు వల్లభ చెవులకి ఎక్కడంలేదు.

✸✸✸

'డాడీ...'

'.....'

'నేను వల్లభని... రాంగ్ నెంబరు అంటూ ఫోన్‌ని ఎందుకు డిస్కనెక్ట్ చేస్తారు చెప్పండి"

'.....'

'మీరు చెప్పింది కరెక్ట్ డాడీ! సుస్మిత గురించి మొదట్లో చెప్పిన మాటలు నేను అసలు పట్టించుకోలేదు. ఆమె నిర్దయగా నన్ను ఒదిలి వెళ్ళిపోయింది. ఆర్థికమాంద్యం పుణ్యమా అంటూ ఇప్పుడు నేను నిరుద్యోగిని.

తనకు నేనిచ్చే డబ్బుతో కూడిన సుఖం ఆనందమే కావాలి. నిజానికి నాకూ అంతేనేమో! ఈ జీవితాన్ని, ఈ ఉద్యోగం లేని దారిద్ర్యాన్నీ నేను భరించలేను! ఘొల్లుమని ఏడుస్తున్నాడు వల్లభ.

అవతలవైపు వింటూన్న కమలాకరానికి విషయం పూర్తిగా అర్థమవుతోంది. తనకు పూర్తిగా సంబంధంలేని వ్యవహారమైనా కావాలనే పొడిగిస్తున్నాడు. వల్లభ చెప్పే మాటలు చాల బాధను కల్గిస్తున్నాయి. కానీ అతనికి మౌనమే ఇప్పుడు ప్రధాన భూమికను పోషిస్తోంది.

'నీ మాటలు నమ్మలేదు నాన్నా! ఇప్పుడు పూర్తిగా మోసపోయాను!' వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

'.....'

'మాట్లాడరేం డాడీ! ఈ స్థితిలో మీకు కూడ రోత అయ్యానా!!'

కమలాకరానికి విషయం పూర్తిగా అవగతమయింది. మొదటిసారి నోరు విప్పాడు.

'వల్లభా! నీ జీవితం ఎప్పుడూ ఒడుదుడుకుల నావే! మొదటినుండీ చెప్తూనే ఉన్నా, సుఖం మత్తు ఆవహించినపుడు దాని వెనుక కష్టం కూడా పొదిగి ఉంటుందని తెలుసుకోవాలి మరి. చెప్పాలంటే సుఖం వెనువెంట కష్టం నీడలా అల్లుకునే ఉంటుంది. ఇప్పుడు కుంగిపోయావంటే తిరిగి వచ్చిన సుఖాన్ని నువ్వు అందుకోలేవు.

చావు అన్నింటికీ పరిష్కారము కాదు.

ఐ ప్రామిస్ యు డెఫినెట్లీ యు గెట్ యువర్ వోన్ గుడ్ లైఫ్! ఈ ఒడుదుడుకులు ఎక్కువ రోజులుండవ్!!

తెల్లవారుతుంది. సూర్యోదయంతోబాటు ఓ మంచి వెలుతురు... ఓ మంచి జీవితం నీకోసం ఎదురుచూస్తూ ఉంటుంది.

నిన్ను వదిలింది ఏదీ నీది కాదు ... నిద్రపో!

హాయిగా నిద్రపో!!

'నేను నిద్రను శాసిస్తున్నాను. నీకు కలతలేని నిద్రనిమ్మని...' కమలాకరం ఫోన్ పెట్టేశాడు.

'ఎవరితో ఇంతసేపు'

కుర్చీని భార్య మంచానికి దగ్గరగా లాక్కున్నాడు. ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"మనం కొంత కాలం చావును వాయిదా వేద్దామా కౌసల్యా!'

'భయమేసిందా!' పాలిపోయిన పెదాలతో నవ్వుతూ అంది కౌసల్య.

'భయంకాదు!' వల్లభ విషయాన్ని సంక్షిప్తంగా చెప్పాడు.

'ఒకప్పుడు ఈ ఫోన్ నెంబరు వాళ్ళ నాన్నగారిది.' ఇప్పుడు మనకు అలాట్ చేశారు. డిప్రెషన్‌లో ఉన్న వల్లభకు తండ్రితో తరచు మాట్లాడే అలవాటు. ఆయన కాలం చేశారు. నేను తన తండ్రినన్న ఫీలింగ్‌లో విషయం అంతా ఏకరువు పెడుతున్నారు.

ఎందుకో అతన్ని ఓదార్చాలనిపించింది. దానిలో నాకు కొంత ప్రశాంతత దొరుకుతోంది.

వల్లభకు చావు నుండి తప్పించడానికి కొంతకాలం మన చావుల్ని పోస్టుపోన్ చేద్దామని!'

ఆ క్షణం నుండి కమలాకరం వల్లభ ఫోన్ల కోసం ఎదురు చూస్తూనే ఉన్నాడు.

మళ్ళీ మళ్ళీ వల్లభ ఫోన్లు చేస్తూనే ఉన్నాడు. అతనిని కమలాకరం ఓదారుస్తూనే ఉన్నాడు. క్రమంగా ఎదురు చూపు అనేది ఆ పెద్ద మనిషికి ఓ మంచి వ్యసనంగా మారుతోంది.

'వల్లభా గుడ్‌న్యూస్! టెర్మినేట్ చేసిన మీ కంపెనీ ఎంప్లాయిస్ నందర్నీ హాఫ్ శాలరీతో తిరిగి రిక్రూట్ చేసుకుంటారట!' పేపరు చూస్తూ అంటున్నాడు ఆనంద్.

నాల్నాలుగుల పదహారు

వల్లభలో తిరిగి విచిత్రమైన ఉత్సాహం!

'డాడీ!'

దానికోసమే ఎదురు చూస్తున్న కమలాకరం ఫోన్ లిఫ్ట్ చేశాడు.

'గుడ్‌న్యూస్ డాడీ...'

'.....'

'మా కంపెనీ మరలా మమ్మల్ని రిక్రూట్ చేసుకుంటోంది! కాకపోతే సగం జీతం మీద!

'.....'

'చెప్పానా డాడీ! ఏ క్షణంలో నిరాశలోకి వెళ్ళినా... నీ మాటలు... నీ చేయూత .... ఓదార్పు నాకు ఆధారమని' వెక్కివెక్కి ఏడుస్తూ చెప్తున్నాడు వల్లభ.

'బి బ్రేవ్ బోయ్ ! జీవితంలో ఎప్పుడూ చలించిపోకు. స్థిరంగా నిలబడు. నీ జీవితం నీదే! మరొకరిది కాదు. బలమైన మనసుంటే ఒడిదుడుకులు అవే సమసిపోతాయి.

'ఎగైన్ ఐ ప్రామిస్ యు. యు ఆర్ గోయింగ్ టు గెట్ ఎ వెరీ గుడ్ లైఫ్ సూన్. నీ కోసం కొత్త జీవితం చిగురులు తొడుగుతూ ఉంటుంది' ఫోన్ పెట్టేశాడు.

'ఏమిటండీ!'

కౌసల్య ఆతృతగా అడుగుతోంది.

కమలాకరం విషయాన్ని విడమర్చి చెబుతున్నాడు.

వల్లభకు ఉద్యోగం వచ్చేసింది.

టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లో వాళ్ళ నంబరు ఎడ్రస్ కోసం ఎంక్వైరీ చేశాడు.

"కలిమి కమలాకరం, కీర్తివారి పాలెం"

తర్వాత మరిన్ని వివరాలను సేకరింపగలిగాడు.

ఈజ్ ఎ రిటైర్డ్ ఎంప్లాయ్. భార్య సిక్. కొడుకులు, కూతుళ్ళు పూర్తిగా ఆ ముసలాళ్ళను ఒదిలేశారు.

వాళ్ళని తన లైఫ్‌లోకి తీసుకురావడానికి బయలుదేరుతున్నాడు.

***

'అక్కరలేదండీ! ఇప్పుడు ఈ జబ్బు కూడా పెద్దగా బాధ అన్పించడం లేదు. వల్లభకు కొత్త జీవితాన్ని ప్రసాదించారు. అది నాకు పండుగే!'

ముగింపుకొచ్చిన తమ వార్ధక్యపు జీవితాలలోంచి తన అన్న అందరూ నిర్ధయగా వైదొలగిపోయారు. దానితో మెర్సీకిల్లింగ్ కోసమని ఆలోచనలు. ఆ స్థితిలోంచి ఒకరికి జీవనోత్సాహాన్ని అందిస్తూ తద్వారా తాము కూడా కొంత ఉపశమనాన్ని పొందుతూ...

చెప్పాలంటే కమలాకరం, వల్లభ కాస్త అటు ఇటుగా ఇద్దరిదీ ఒకే స్థితి. విషయాన్ని ఒకరి బ్రతుకులతో ఒకరు అన్వయింపజేసుకొనేసరికి ఓ విధమైన చైతన్యం, బ్రతుకు మీద ఆశ చిగురిస్తున్నాయి.

వాళ్లతో కలిసి బ్రతకడానికి సమాయత్తమవుతున్నాడు వల్లభ.

చిన్న గదిలోకి మారిపోయినవాడు పెద్ద యింటికోసం ప్రయత్నిస్తున్నాడు ఇప్పుడు.

'ఏమిటిదంతా!' పట్టరాని ఆనందంతో అడుగుతున్నాడు ఆనంద్.

మా అమ్మని, నాన్నని తీసుకురావడానికి వెళుతున్నాను. వాళ్ళు తప్పక నా దగ్గరకు వచ్చేస్తారు.

'ఈ కొత్త తల్లిదండ్రులెవరబ్బా!'

ఆనంద్ ఆశ్చర్యానికి అవధులు కన్పించడంలేదు ఇప్పుడు.

***

# 3
# తూటిపూల తోట

ధనరాజు దగ్గర డబ్బులుండాలన్న రూలేముంది! బిగ్గరగా నవ్వబోయాడు.

సుకన్య చిరాగ్గా చూసింది.

"అన్నీ ఎప్పుడూ నిండుకోవడమే!"

"ప్రక్కన పారే కాలువ చూడు. నిండుకుందా ఏంది! నిండుగా పారుతోంది. అసలు నిండు కోవడమేంటే పిచ్చిదానా!!"

'... మాటంటే' మాటే ... తొందర్లోనే ఇద్దాంలే...!!"

ధనరాజు కొంచెం దర్పాన్ని మేళవించి అంటున్నాడు.

"బాబు డాబులకేమీ లోటుండదు. కేలండరు మారుతోంది చూస్కోమరి!" గోడకు వ్రేలాడిన కేలండరును చేతిలోకి తీసుకొని అంటోంది.

"నెలా మారుతుంది! సంవత్సరాలు మారుతాయి!!"

"ఈ బతుకులే మారడంలేదు!"

"పిచ్చి మొగమా! మా బాబు పేరు నాకు ఊరికే పెట్టాడనుకున్నావా! ఈ ధనరాజుగాడి సుడి తిరుగుద్ది. ధనం రాశులై కురుస్తాది చూస్కో".

"ముందు నెలాఖరుకు ఒగ్గవయ్యా! ఓనరు వచ్చి వాలుతాడు. వాలి వాగుతాడు"

"ఏం పర్లేదులేవే... పైసలు తెచ్చి ఫెడేలున ఆయన మొగానికేసి కొడతా!"

సుకన్య కళ్ళలో ఒక్కసారి నీళ్ళు చిప్పిల్లినాయ్. ఉన్నట్టుండి తనలో తాను కుంచించుకు పోసాగింది. తెలియని భయం మనసును ఆవహించేసరికి గుండె దడయిపోయింది. తనకు తెలియకుండా పిడికిలి వేళ్ళు బిగుసుకు పోయాయి. ఆవేశం ఎగదోసు కొచ్చేసింది. అంతలోనే ఏమి చేయలేని తమ చేతకాని బ్రతుకులు నెమరుకు వచ్చేసరికి బిగుసుకున్న పిడికిలి విడివడిపోయింది.

"అద్దె కట్టకపోతే నామీద ఒట్టే! రోషమున్న మగాడివయితే రెండు రోజుల ముందే అద్దె డబ్బులు ఆయన మొహాన కొట్టిరా" భర్త చొక్కా పట్టుకొని అదే పనిగా పిచ్చిపట్టినట్టు అరుస్తోంది. "ఒసే ... పిచ్చిమొద్దా...ఈ పూరికొంపని కూలిపోకుండా కాపాడుతున్నది ఇంకెవరంట నువ్వు నేనేగా!" ధనరాజు చెప్పుకుపోతున్నాడు.

"పిచ్చివాగుడు వాగమాకు" గట్టిగా అరిచింది.

"నీకేం తక్కువ చేశానే! చేసుకున్నాను. పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్నానా లేదా!!" సుకన్య కళ్ళు ఎర్రబడ్డాయ్. తమాయించుకోవడం తనవల్ల కావడంలేదు.

"సిగ్గులేదయ్యా నీకు. మగోడివయితే ఆ రోజున ఇంటిపట్టు నుండి ఆడికి సర్ది చెప్పి పంపించు."

"నువ్వోటీ నేనోటీనా ... మతిలేకపోతేను"

"మతి లేకపోవడం కాదయ్యా! సిగ్గుతో చచ్చిపోతున్నాను. కట్టుకున్న దాని గోడు వినవెందుకయ్యా."

"అసలు ఇంటికి అద్దెందుకు కట్టాలంటే? ఇదేమయినా ఆయనగారి పట్టా కొంపనుకున్నావా, బంజరు భూమేగా?"

ఏ భూమయినా బాడుక్కి మినహాయింపు లుండవంట!

"ఎప్పుడిచ్చాం గనుక.... ఇకపై బాడుగలివ్వడానికి, నువ్వు గమ్మునుండు వచ్చినోడు మూసుకుపోతాడు'.

ధనరాజు ధోరణి సుకన్యలో బడబాగ్నిని రగులుస్తూనే ఉంది. ప్రతిసారీ నెలమారుతోందంటే ఇంట్లో ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతూనే ఉంది.

నాల్నాలుగుల పదహారు

నెలాఖరు వస్తుందంటే ఉన్నట్టుండి భయం పట్టుకొంటుంది. ఇన్ని సంవత్సరాల వుతున్నా దాన్నుండి తమాయించుకోవడం తనవల్ల కావడంలేదు.

'ఉహూం ఉహుం... ఉహూం ఉహూం...! వెనుకవైపు కాలువగా నాటు పడవను నీటి వాలుకి ఎదురుగా లాక్కెళ్ళుతున్నారు. అసలే వేడి ఎక్కువగా ఉందేమో లాగడానికి చాల కష్టపడుతున్నారు వాళ్ళు, అంత ఎండ వేడిమిలో తాడేసి లాగుతున్న వాళ్ల నల్ల శరీరానికి పట్టిన చెమట బిందువులు చిత్రంగా మెరుస్తున్నాయి.

పడవమీద ఉన్న అతను నీటి వాలుకు తగ్గట్టు లంగరును అటుఇటు అదమడంతో భారమైనా ముందుకు కదులుతూనే ఉంది.

ఆ దృశ్యం సుకన్య బుర్రకు ఏమీ పట్టడం లేదు. అయినా అలా అవలోకిస్తూనే ఉంది. రోజు చూస్తున్న సంగతే అయినా, దానిలో కొత్తదనం అంటూ ఏమీ లేకపోయినా చుట్టుముడుతున్న భయాందోళనల మధ్య నిర్వీర్యంగా అగుపిస్తూనే ఉంది.

నెలమారుతోందంటే హడలిపోతుంది. ఈసారి ఎలాగైనా యతిమూర్తి వచ్చే రోజున ధనరాజుని నిలేసయినా ఇంటి పట్టున నిలబెట్టాలి.

'నువ్వు చెప్పినట్టే చేస్తాలేవే! ఇంటి ఓనరు అయినంత మాత్రాన ఆయన గారేమయినా అమ్రేష్‌పురి అనుకున్నావా? విలనీ చేయడానికి?? వస్తాడు... డబ్బుకు నిలేస్తాడు. నువ్వయినా నేనయినా చేప్పేది అదే... వినిపోతాడు. అయినా మన దగ్గర లెఖ్ఖ లెక్కడకు పోతాయట. ఇప్పుడు కాకపోతే నాలుగు రోజులాగి కట్టేస్తాం...'

"వాడనే మాటలు ... ఆ వెకిలి వేషాలు నువ్వు నిలబడితే అర్థమవుతాయి!"

"సరే చెప్పావుగా! ఈ రోజు నా ఇటుక బట్టీలవీ బంద్! మూర్తిగారి మాటకి పది మాటలు చెప్పి మరీ కదులుతాను!!" భార్యను దగ్గరకు తీసుకోబోయాడు. సుకన్య సూటిగా కళ్ళలోకి చూసే సరికి తన చేతగాని తనం బేలతనాలు ప్రదర్శితం కాగా తలదించేసుకున్నాడు.

'నాకేం సంబంధం లేదయ్యో ! వాడొచ్చి గిన్నెలు బయటకు విసిరేస్తానంటాడు. ఫీజు పీకేస్తానంటాడు'.

'చెప్పొకదే! అలవాటయిన డైలాగ్‌లు అవన్నీను. అయినా ఈ కొంపేమైనా యతిమూర్తి అబ్బసొమ్మనుకున్నావా! కాలవగట్టును కమ్మగా ఆక్రమించి పారేశాడు.'

ఆ మొండి మనిషి మాటలు సుకన్యలో ఉక్రోషాన్ని పెంచుతూనే వున్నాయి. మాట ఇచ్చి గాడి తప్పిన మనిషి ముష్టి వస్తుందంటే ముందు రాత్రికే పొరుగూరుకు చెక్కేశాడు. సుకన్య గుండె దిటవు చేసుకుందామనుకున్నా తెరిపిన పడటం లేదు.

'ధనరాజులేడా!' యతిమూర్తి రావడంతోటే  అడిగాడు. '

'ఇటిక బేరాలకని ఇప్పులూరు పోయినాడయ్యా! రేపు తొలిపొద్దు వేళకి పడవ దిగుతాడు!" సుకన్య దడదడగా సమాధానం చెప్పింది.

"ఏడిశాడు' అద్దెకి ఎగనామం బెట్టేసి చెక్కేస్తున్నాడు... ఎదవ"

'లెక్క సద్దుబాటుగాక గాని బాడుగడబ్బులు బంతిపువ్వుల్లో పెట్టి ఇచ్చేయమా సెప్పండి!" పాత వాయిలుచీర చెరుగును ఒళ్ళంతా కప్పుకుంటూ అంది.

'గిన్నెలు బయట విసిరేసి... కరెంటు ఫీజులు పీకించేస్తేగాని ఇనుకొనే రకాలు కావే మరి'...

"అవన్నీ అతగాడి దగ్గర పలుక్కోండి! ఆడకూతుర్ని నేనేం చేయగలను" వాకిట్లోంచి వంటింట్లోకి అడుగులు వేస్తూ పలికింది'.

పౌరుషాలకేమీ తక్కువలు లేవు. అసలు ఆడు నాకు కన్పించి ఎన్ని నెలలయిందే! అద్దె కట్టడం మానేసి అడుక్కు తినే కబుర్లు చెబితే ఎక్కడ కాలాలో అక్కడ కాలుతుంది'. పులిలా మారి గర్జిస్తూన్నట్లున్న ఓ మానవ మృగం ముందు బేలగా అలా మిగిలిపోతూనే ఉంది బిక్కచూపులతో నేలను కొలుస్తూనే ఉంది.

"ఇది మామూలేగా! అయినా నిన్ను చూసి నీ ఒంటి నిగారింపును చూసి ఇన్ని సంవత్సరాలు సర్దుకు పోతున్నాను" పాత కొయ్య కుర్చీలో కూర్చున్న యతిమూర్తి పైకి లేచాడు. స్వరం తగ్గిస్తూ అన్నాడు.

"ఎంత అందగత్తెవో నీకే తెలీదు" ఆ శరీరాన్ని తన కళ్ళతో తడుముతూ అన్నాడు. భరించలేని సుకన్య ఒంటి నిండా బట్టను కప్పుకోవడానికి ప్రయత్నిస్తూనే

ఉంది. ఆయనగారు ఎప్పుడు బయటకుపోతాడా అని ఎదురుగా కన్పిస్తూన్న దేముడి పటానికి మనసులో మొక్కుకుంటూనే ఉంది. అయినా వాడు ఒదిలి పెట్టే రకం కాదు.

“చెప్పాగా! ధనరాజు వచ్చిన తరువాత అద్దె బకాయిలు తప్పకుండా ఇచ్చేస్తాడు”.

“ఏంటి నువ్వు ఇప్పించేది. నాచేత విప్పిస్తున్నావు’ పెద్ద జోక్ వేస్తున్నట్లు ఫీలయి చటుక్కున ఆమె చేయిని అందుకున్నాడు. కాయకష్టం చేసిన శరీరమేమో నిగనిగలాడుతోంది. అరవాలని ఉంది ఆమెకు. నల్గురిని పిలిచి ఆ చెంపా ఈ చెంపా వాయ గొట్టాలనుంది. అయినా ఈ వయస్సులో వీడికి ఇదేం పోయే కాలమో! విపరీతమైన అంతఃస్సంఘర్షణకు లోనవుతోందన్నమాటే గాని నోట మాట పెగలడం లేదు. చేష్టలుడిగి పోయినట్లు అలా నిల్చుండి పోయింది.

వద్దని వారిస్తూన్నా అదిమిపెట్టి ఆమెను దగ్గరకు తీసుకున్నాడు... ఒళ్ళో కూర్చోపెట్టుకొని ఆచ్ఛాదనలేని ఆమె పెదిమలను తన పెదిమలతో చుంబించాడు. భుజాల నుండి విడివడిన చేతులు క్రిందకు దిగుతూ ఆమె చేస్తున్న ఆక్రందనలను ఏమాత్రము లెఖ్ఖ చేయడం లేదు. ఎక్కడెక్కడో తడుముతున్నాడు. మైకం కమ్మేసిన ఆమెతోటి పొందుకోసం ప్రాకులాడుతూనే ఉన్నాడు.

తేరుకొని చాకచక్యంగా విడిపించుకొని లేని నవ్వును ముఖాన పులుముకొని ఒక్కదుటున అలా పెరట్లోకి పరుగుతీసింది.

ఫక్కున నవ్వాడు. ‘నా ఇంట్లో ఉండాలి. అద్దె లేకపోయినా నువ్వుండాలి. అదే నాకు కావాల్సింది’.

యతిమూర్తి మాటలు కర్ణకఠోరంగా అన్పిస్తున్నాయి. ప్రతినెలా ఇదే తంతు. భర్త చేతగానితనాన్ని తల్చుకొని కుమిలిపోతుంది సుకన్య. పరాయి పురుగు బారి నుండి తనను తాను రక్షించుకోలేని బ్రతుకు వైఫల్యాలను నెమరువేసుకొని కంపించి పోతుంది. అదే విషయాన్ని ధనరాజు చెవిన వేస్తూనే ఉంది.

‘చెప్పాగా కాలువ గట్టు ప్రక్కన... ఇటుక బట్టీలకు దగ్గర ...ఓనరు ఒప్ప జెప్పిన పనుల్నీ రాత్రీ పగలు ఇంట్లో ఉండి  చూసుకోవచ్చు”. మనసు గాయం అధికమవడంతో సుకన్య కంట కన్నీరు ధారకట్టింది.

"అయినా ఆ ముసలి పీనుగ వచ్చిపోడమే గాని ఏం చేస్తాడు. ఏం చేయగల దంట! అద్దె అద్దంటూ అరచి పోవడం తప్ప... ఆడదానవు... నువ్వు నచ్చచెబితే తక్కువలో వదిలేస్తానన్నాడే! గుమస్తా గిరీచేసే ధనరాజు ధనరాజులా అన్పించడం లేదు ఆమెకు. భార్యను మరొకడికి తార్చడానికయినా 'సై' అంటున్న అధనరాజులా అగుపిస్తున్నాడు.

అయినా తాను ద్రౌపది కాదు... సుకన్య.

ప్రతిసారీ తనమీద తాను నమ్మకాన్ని పెంపొందించుకొని ముందుకు సాగుతూనే ఉంది. ఆ క్రమంలో పులివాత పడకుండా తప్పించుకుంటూనే ఉంది.

చాలాసార్లు పెరటివైపు పంటకాలువలో దూకి చావాలనుకుంది సుకన్య. అందుకని నీటి సుడులు బాగా తిరుగుతూన్న చోటుల్ని ఎంచుకుంటూనే ఉంది. కానీ ధైర్యం చాలడంలేదు.

చెప్పాలంటే ఆ కాలువలో ఏపుగా ఎదిగిన తూటిమొక్కల్ని బోలిన బ్రతుకులు తమవి. అనేక సందర్భాలలో వాళ్ళు పెరికి పారేసినా అటు ఇటుగా మళ్ళీ అక్కడే పేరుకుపోతున్న ఎదుగు బొదుగూ అంటూ ఎరుగని వంకర బ్రతుకులు తమవి. కంచానికీ నోటికీ మధ్య దూరం పెరుగుతూంటే దానిని తగ్గించుకోవాలన్న ఆరాటంలో నిరంతరంగా అందుకుంటూ... అంతలోనే కుదేలై అందుకోలేని వ్యర్థమైన బ్రతుకులు తమవి.

రాత్రి అనకా పగలనకా అలుపెరుగక కాయకష్టం చేసే కూలీల మీద యజమానికి కాసింత కనికరం కూడా ఉండేది కాదు. పాటిమన్నును తెచ్చి నీళ్ళతో తడిపి పదునుచేసి ఇటుకలు చేసి ఎండబెట్టిన తర్వాత అనుకోకుండా వర్షం వచ్చి పచ్చి ఇటుకలు కరిగిపోతే ఆ నష్టాన్ని తమ బోటి కూలీనాలీ మీద వేసేవాడు. అదే పనిగా ఆ నాలుగు రోజుల కూలి డబ్బుల్ని త్రొక్కి పెట్టేవాడు.

"ఈసారి నువ్వులేనప్పుడు ఆయనగారు వచ్చి గోల చేశాడంటే మందు మ్రింగి చస్తాను. లేదా కాలువలో శవమై తేలుతాను॥. సుకన్య వేదన ధనరాజు బుర్రకు పడుతున్నట్లు లేదు. చేవలుడిగిన వాడిని కట్టుకున్న పాపానికి చేతగాని బ్రతుకును బ్రతకక తప్పడం లేదు.

"మూసుకో! చేవలుడిగి పోవడానికి నీకు ఎక్కడ లోటు జరిగిందట!" ఎదురు తిరగబోయి వచ్చీరాని మాటలతో ఏదో అనబోయాడు.

ఎప్పుడూ ఏదో విధంగా భార్యమీద ఆధిపత్యం చెలాయించాలనుకొనే ధనరాజు మిన్నకుండి పోయాడు. అతగాడి కంట కన్నీరు సమాధానంగా నిలుస్తూంటే అచేతనంగా అలా సుకన్య ఒడిలో ఒదిగిపోయాడు.

"నన్ను క్షమించు సుకన్యా! జీవితంలో డబ్బుతో సహా దేనికీ కొరగాకుండా పోయినోడిని"!! భర్త వేదన మొదటిసారిగా ఆమె అంతరంగాన్ని స్పృశిస్తూనే ఉంది.

'యతిమూర్తి వస్తాడు. ఏదో వయసుకు పెద్దోడులే అని సరిపెట్టుకుందామంటే అద్దె డబ్బులు కట్టడంలేదని బండబూతులు తిట్టిపోతాడు. భరించలేక, అందునా నాముందర అలాంటి మాటలు పడలేక...'

అప్పటి నుండి నెలాఖరు వస్తోందంటే జుగుప్స చెందుతూనే ఉంది. ఓ విధమైన భయానక సందర్భం ఆవిష్కృత మవుతూనే ఉంది. అయినా ధనరాజును ఇంటిపట్టున ఉండమని పోరడంలేదు.

కూలడానికి సిద్ధంగా ఉన్న ఆ పూరిగుడిసెలో ఒంటరిగా ఉన్న సుకన్య బ యట ఎండుటాకుల చప్పుళ్ళు వినేసరికి కలవర పడిపోయింది. ఒక్కసారిగా బిగుసుకు పోయినట్లయింది. అనుమానంలేదు. ఆయనే... చటుక్కున ఆమెను మీదకు లాక్కున్నాడు. నడుముచుట్టూ చేతుల్ని పెనవేసి గాఢంగా హత్తుకుంటున్నాడు. వద్దని వారిస్తున్నా దేనికోసమో ఆరాటపడుతున్నాడు.

ఆమెలో ఏడుపు ఎగదోసుకొస్తోంది. విడిపించుకోబోయింది. ఇంకా గట్టిగా పట్టు బిగిస్తున్నాడు.

"ఎంతబాగున్నావో తెల్సా! సూపర్!" తన ఒళ్ళో కుదేలయిన సుకన్యను గాఢంగా హత్తుకొని దొరికినచోటల్లా చుంబనాలతో ముంచెత్తుతున్నాడు.

'వద్దు, నాకిష్టంలేదు' అనిమాత్రం అనగల్గింది. వెనుక నుండే ఆమె మొహాన్ని తనకు అభిముఖంగా చేసుకుని ఆమె పెదిమలను అదే పనిగా చప్పరిస్తున్నాడు. పైటను తప్పించపోయే సరికి కెవ్వున అరవబోయింది.

ఎప్పటిలానే ఇప్పుడూ అనుకున్నంత పనీ అయిపోయింది. సుకన్య తనకే స్వంతం అయినట్టు విచక్షణ అనే పదాన్ని కాలరాచి కామంతో కళ్ళు మూసుకుపోయి మదమెక్కిన ఆంబోతయ్యాడు యతిమూర్తి.

"దణ్ణం పెడ్తాను వదలండి" చేతులు జోడించింది.

వినే స్థితిలో ఏమాత్రం కన్పించడంలేదు. ఒక్కసారి ధైర్యాన్ని కూడ తీసుకొని అతగాడిని ప్రక్కకు నెట్టిపారేసి వంటింట్లోకి పరుగెత్తి తలుపులు బిడాయించుకుంది.

♦♦♦

ఈ వార్త కొందరికి బాధను కల్గిస్తూంటే సుకన్యకు అలవికాని సంతోషాన్ని, ఆనందాన్ని కలుగచేస్తోంది. "నిన్నరాత్రి గుండెపోటు రావడంతో యతిమూర్తి ప్రాణం నిద్రలోనే హరీమందట!" ధనరాజు బాధపడుతూ వచ్చి చెప్పాడు.

"బాధెందుకూ!" హాయిగా నవ్వింది. సంతోషంగా తెరలు తెరలుగా నవ్వుకొంది. పీడవిరగడయి పోయినందుకు మనసారా ఆనందించింది.

"అయ్య కాలం చేశాడు. అద్దె ఐదొందలు. ఇక నుండి వెయ్యి పెంచుతున్నాను. ఉండగల్గితే ఉండేది. లేకుంటే ఖాళీ చేసి పోయేది!" యతిమూర్తిగారబ్బాయి సుధాకరం వచ్చీ రాగానే ఖరాఖండీగా చెప్పేశాడు. సుకన్యకు నవ్వాలో ఏడవాలో తెలియడంలేదు.

"అవును దిగువగట్టు దగ్గర ఇంకా ఐదొందలు ఎక్కువ పలుకుతోంది తెలుసా!" సుధాకరం మాటలు ఖచ్చితంగా ఉన్నాయి.

"పది సంవత్సరాల నుండి ఉంటున్నాం! ఈ ఇల్లు మాది!" అంతే ఖచ్చితంగా అంటున్న సుకన్యవైపు ఆశ్చర్యంగా చూశాడు ధనరాజు.

"ఇంత ధైర్యం తెగింపు ఈమెకెక్కడివబ్బా!" సుధాకరం విస్తుబోతున్నాడు.

"అవును పట్టాలేని గుడిసెకి బాడుగ కట్టేదీలేదు. ఖాళీచేసేది లేదు" ఖచ్చితంగా అంది సుకన్య

సుకన్యలోని ధిక్కార ధోరణిని చూసి కాలువలో పేరుకున్న తూటిపూలు ఫక్కున నవ్వుకుంటున్నాయి. మరింతగా వికసిస్తూ మురిసిపోతున్నాయి.

సుధాకరం విస్తుబోతున్నాడు. ఈసారి మౌనం వహించడం అతగాడి వంతయింది. 'అవును, పది సంవత్సరాల నుండి తాము ఆర్థికంగా ఎంతో ఎదిగారు. కానీ ధనరాజు ఇటుక బట్టీలలో గుమస్తాగిరిలో అప్పుడూ ఇప్పుడూ..... ఒకేలాగ అక్కడే'

సుధాకర్ అడుగులు బయటవైపుకు సాగిపోతున్నాయి. నిఖార్సయిన ఆత్మస్థైర్యాన్ని సంతరించుకున్న అందమైన ఆణిముత్యం సుకన్యను లాలనగా దగ్గరకు తీసుకుంటున్నాడు ధనరాజు.

'ఏమండీ..... సాయంత్రం వకీల్ని కలుద్దామండీ' అంది సుకన్య నిశ్చయంగా.

ఞఞఞ

## 4

# బ్రతుకు చిత్రం

ఎండవేడిమి నిలవ నీయడంలేదు. ఎదురుగా ఉన్న నాయుడు హోటల్ లోని గోడ గడియారం అప్పుడే తొమ్మిది గంటలు కొట్టింది. మామూలుగా రోజూ ఉండే రోడ్డు రణగొణధ్వనులలో గడియారం గంటలు విన్పించేవికావు. ఈ రోజు అంతా నిశ్శబ్దంగా ఉండటంతో దూరాన చీమ చిటుక్కుమన్నా అన్నీ చక్కగా విన్పిస్తున్నాయి చింపిరయ్యకి.

తొమ్మిదయిందోలేదో అప్పుడే ఎండ మిట్ట మధ్యాహ్నం ఒంటిగంటలా ఉంది. అంతా వేసవి మహిమ. చింపిరయ్య కడుపు కాలిపోతోంది. పొద్దుట్నుంచీ ఏమీ తినలేదు. ప్రక్కనే వేపచెట్టు వినాయకుడి దగ్గరలో ఉన్న బోరింగు కొట్టి చూశాడు. 'ఉహూ' ఒక్కచుక్క కూడ రాలి పడలేదు. చింపిరయ్యకు కోపం తన్నుకొచ్చింది. చాలా నీరసంగాను, ఆకలిగాను ఉంది.

దూరాన రోడ్డు మీద ఏడుకొండలవాడి బొమ్మను పరికించి చూసుకున్నాడు. ఏమీ రాలడం లేదు. ఏ స్వామైనా అటుగా వచ్చి రెండు రూపాయలు పడేస్తాడేమోనని ఆశగా చూస్తున్నాడు. తన పేద నికృష్ట జీవితానికి ఆ బొమ్మ మీద రాలే నాణాలే జీవనాధారం.

అసలు ఎవరూ అటువైపు వస్తూన్న జాడలేదు. ఎప్పుడూ సందడిగా ఉండే రోడ్డు మీద ఈ రోజు నూటనలభై నాలుగో సెక్షన్ పెట్టేశారంట. పోలీసు వ్యాను అప్పుడప్పుడు వచ్చి గస్తీ తిరిగి పోతోంది.

"ఏయ్ ముసలోడా! ఇక్కడ ఎవరూ కన్పించకూడదు పోరా!!" కర్ర పెకెత్తి హెచ్చరించి పోయాడా కానిస్టేబులు. ఇవన్నీ తనకు మామూలే. 'ఈనాడు వారి

సెంటరు తనది!' తనలో తను నవ్వుకున్నాడు చింపిరయ్య ఈ సెంటర్లో ఏదీ తనది కాదు. అయినా అన్నీ తనవే. ఈ సెంటర్లో పాతికేళ్ళ నుండి బొమ్మలు వేస్తున్నాడు.

అప్పట్లో చిన్న చిన్న బొమ్మలేసేవాడు. గవర్నమెంటోళ్ళు ఆక్రమిత కట్టడాలని కూల్చిపడేసి రోడ్లను వెడల్పు చేసింతర్వాత రోడ్లమీద తన బొమ్మరాతల్ని కూడ బాగా విస్తృతం చేశాడు చింపిరయ్య.

చింపిరయ్య గీసే బొమ్మల్లో జీవకళ ఉట్టిపడుతుంది. కానీ తన జీవితంలోనే కళ తప్పుతుంది. డెబ్భైకి పైబడిన వయసులో అయిన వాళ్ళంటూ ఎవరూ లేని... తినడానికి, ఉండడానికంటూ ఏమీలేని బికారి బ్రతుకు తనది. నీరసంగా నిట్టూర్చాడు.

కడుపులో ఆకలి దంచేస్తోంది. ఎంతో ఆశతో మంచినీళ్ళ బోరింగ్ కొట్టి చూశాడు. తనకు తెలుసు సెంటర్లోని ఆ బోరింగ్‌లో నీరు వచ్చినంత కాలం తన బడ్డీలోని గోళీ షోడాలు ఖర్చుకావని పైరవీ ద్వారా దానిని పనికిరాకుండా చేసిన సాధుమూర్తి నిర్వాకమది. పోనీ అతగాడి బడ్డీకొట్టులో రెండురూపాయలు పడేసి గోళీషోడా తాగుదామని అటుచూశాడు. వెంకటేశ్వరస్వామి ఎండలో తనలాగే మాడిపోతున్నాడు. ఎవరూ ఒక్కపైసా కూడా విదిల్చిన పాపాన పోలేదు.

చింపిరయ్యకు ఏడుపొస్తోంది. ఉద్వేగం తన్నుకొస్తోంది. ఎంతో కాలంగా అక్కడ ఉంటున్నాడేగాని పిలిచి తన ఆకలిని తీర్చగల్గిన వారెవరూ లేరు తనకు.

నోరు తెరిచి అడుక్కోలేని ఆత్మాభిమానం అతగాడిది. పూటుగా అన్నం తిని ఎంతకాలమయిందో. వారం వారం రోడ్డుమీద బొమ్మని మారుస్తూనే ఉన్నాడు.

ఏడుకొండలవాడు, వినాయకుడు, రాముడు, కృష్ణుడు, ఏసుప్రభువు, అల్లా, అయ్యప్ప, లక్ష్మీదేవి, ఒకరేమిటి అందరు దేవతామూర్తులు అతగాడి చేతిలో సజీవమూర్తులుగా కొలువుదీరుతూనే ఉన్నారు. మతాల కతీతమైన సెక్యులర్ ధోరణి చింపిరయ్యలో కన్పిస్తూనే ఉంది.

దసరాలప్పుడు దుర్గమ్మ, క్రిస్టమస్‌కి జీసస్, వినాయక చవితప్పుడు గణపతి, శ్రీరామనవమికి రామచంద్రుడు ప్రజల నాడిని బాగా పట్టగల్గిన చింపిరయ్యకి తన నాడిమీద తనకు నమ్మకం లేకుండా పోతోంది.

దుర్గమ్మతల్లిని రోడ్డుమీద దించి పడేశావ్. రంగులు బాగా కలిపి పులిమావంటే కాసులపంట పండిపోద్ది. రోడ్డుమీద తన బొమ్మని దణ్ణం పెట్టుకొని పావలానో అర్ధరూపాయో వేసిన వాళ్ళు ఇచ్చే కితాబు తనకు కోటి ప్రామాణికాలుగా అన్పిస్తుంటుంది చింపిరయ్యకు.

ఈ రోజే బెంగుళూరు భక్షు హత్యకేసులో ప్రధాన ముద్దాయి తోడేలయ్య తీర్పు వెలువడేది. అత్యంత దారుణమైన హత్యకేసులో కరుడు కట్టిన తోడేలయ్యకు యావజ్జీవ కారాగార శిక్షకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఉదయం పేపర్లో చదివిన విషయం గుర్తుకు వచ్చింది చింపిరయ్యకు.

అదీగాక ఈ రోజు ఆ కోర్టుతీర్పు సందర్భంగా ముందు జాగ్రత్త చర్యగా అవాంఛనీయ సంఘటనలు ఏమీ చోటుచేసుకోకుండా నూటనలభై నాలుగో సెక్షను విధించారట. దాంతో అంతా నిర్మానుష్యంగా ఉంది.

తను సృష్టించిన దేవుడు తనను కరుణించడం లేదు. ఏ ఒక్కరూ వచ్చి ఒక్కపైసా కూడా విదల్చడంలేదు. చింపిరయ్యకు ఏడుపొస్తోంది. ఉదయం నుండి స్నానం లేదు. ఏపుగా గెడ్డం మాసిన చిరుగు గుడ్డల్లో చాలా వికృతంగా కన్పిస్తున్నాడు. చూసే వారికే గాదు. తన బ్రతుకు తనకే వికృతంగా తోస్తోంది.

ఒక్కసారి తన చిరుగుల సంచిలోని రంగుల మూటల్ని తడిమి చూసుకున్నాడు. వచ్చే ఆదివారంనాడు ఏడుకొండలవాణ్ణి చెరిపిపడేసి క్రీస్తు బొమ్మని వేయాలని మనసులో లీలగా అనుకున్నాడు. తన కుంచెలోనుంచి జాలువారిన చిత్రాలు తన బ్రతుకు బొమ్మని ఏమాత్రం ప్రభావితం చేయలేకపోతున్నాయి.

ఒక నికృష్ట అంకాన్ని బ్రతుకు నైజాన్ని తూటుపొడిచే బ్రతుకేచ్ఛ తన చుట్టూ ఆవహించి అతలా కుతలం చేస్తూంటే చావలేక బ్రతుకుతూ... చస్తూ బ్రతుకుతూ... అర్ధంలేని జీవితం చింపిరయ్యను అవహేళన చేసి పడేస్తూనే ఉంది.

వర్షం వస్తే రోడ్డు మీద చిల్లర దేవుళ్ళని కప్పడానికి సిద్ధం చేసుకున్న మురికి గుడ్డల్ని తలక్రింద పెట్టుకుని కళ్ళు మూసుకున్నాడు. కళ్ళు తిరుగుతున్నాయి. అస్సలు

గాలి లేకపోవడంతో పైన కన్పిస్తున్న వేపచెట్టు ఆకులు ఊపలేక తలలూపుతున్నాయి. ఆకలితో అల్లాడుతుంటే భూమి, ఆకాశం అంతా తనచుట్టూ తిరుగుతున్నట్లనిపిస్తోంది.

మరో అరగంటలో ముద్దాయిని తీసుకొస్తారంట, కోర్టు తీర్పు తర్వాత అతగాడెక్కడికో...! తోడేలయ్య గురించి కథలు కథలుగా అక్కడి వారు చెప్పుకుంటున్న మాటలు చింపిరయ్య చెవిన పడుతూనే ఉన్నాయి.

అన్యాయాలు...అరాచకాల ద్వారా తోడేలయ్య సంపాదించిన ఆస్తిపాస్తులు... రాజకీయ నాయకుల్ని అడ్డుపెట్టుకొని చేస్తున్న దురాగతాలు...భూకబ్జాలు...సెటిల్ మెంట్లలో తనకు ఎదురు వచ్చినవారిని చంపడానికైనా వెనకాడకపోవడం వంటివి అన్నీ వింతగా చెప్పుకుంటున్నారు. అందులో భాగంగా ఒక ప్రాపర్టీ సెటిల్‌మెంటు కేసులో తనకు ఎదురు వచ్చాడని బెంగుళూరు భక్షు అనే వ్యక్తిని కిరాయి మూకలతో అతి కిరాతకంగా హత్య చేయించాడట.

ఆకేసు చాలా సంవత్సరాలు కోర్టులో నడిచి అనేక వాదోపవాదాల మధ్య ఈరోజు ఫైనల్ జడ్జిమెంట్‌కి వచ్చింది. పోలీసు బలగాలు...మీడియా ప్రతినిధులు తోడేలయ్యకు మద్దతుదారులు... వ్యతిరేక వర్గాలు...వివిధ రాజకీయ నాయకులు అందరూ న్యాయమూర్తి ఇచ్చే తీర్పుకోసం అక్కడికి చేరిపోవడంతో కోర్టు ఆవరణంతా చాలా సందడిగా ఉంది.

ఆ సందళ్లు, హడావిడులు అన్నీ చింపిరయ్యకు అప్రస్తుతాలే. తను తన దుర్భరమైన జీవితం... ఈరోజు కడుపు ఎలా నిండుతుందా? ఆకలి బాధెలా తీరుతుందా? రేపటి రోజుకి ఎలా సమాయత్తమవ్వాలా అన్న ధోరణి తప్ప ప్రపంచంలోని ఎలాంటి విషయాలు తనకు అఖ్కరలేదు. తను గీసిన బొమ్మ, తన సంపాదన, ఆ బొమ్మ మీద నాలుగు రూపాయల వర్షం కురిస్తే చాలు తనకు రోజు గడిచి పోతుంది.

తన కడుపు ఆకలి కోసం ఏవేవో పగటికలలు కంటూనే ఉన్నాడు. ఎవరో వచ్చి కాసుల వర్షం కురిపించినట్టు, దానితో తన దరిద్రమంతా తీరిపోయి సుష్టుగా

కడుపారా భోజనం చేసినట్టు... అంతటి నిరాశలోనూ నవ్వు వచ్చింది. కళ్ళు తెరిచి మరోసారి చూసుకున్నాడు. ఎక్కడా పైసా పడిన జాడలేదు.

ముందు పోలీసు వ్యాను హారను కొట్టుకుంటూ ముందుకు దూసుకు పోతోంది. తరువాత వ్యాను దానిని అనుసరిస్తోంది. అలా వేగంగా సాగిపోతూ అది అక్కడి కొచ్చేసరికి క్షణకాలం హఠాత్తుగా ఆగిపోయింది. బహుశా దానిలోని మనుషులు ఆపమనికోరి ఉండొచ్చు వెనక డోరు తీసుకొని తుపాకులు పట్టుకున్న ఇద్దరు కానిస్టేబుళ్ళు క్రిందకు దిగారు. ఆ తర్వాత మరో వ్యక్తి దిగాడు.

పరికించి చూస్తున్న చింపిరయ్య ఆ తర్వాత దిగిన వ్యక్తిని తోడేలయ్యగా పోల్చుకున్నాడు. అవును పేపర్లో తను చూసిన తోడేలయ్య ఫోటో అచ్చం ఆ మనిషిలాగే ఉంది.

మనిషి మహానీటుగా...గెడ్డం గీసుకొని, తలకు నల్లరంగు వేసుకొని, కళ్ళకు ఖరీదైన గ్లాసులు పెట్టుకొని, తెల్లని ఇస్త్రీ బట్టలు కట్టుకొని చాలా పరిశుభ్రంగా కన్పిస్తున్నాడు. ఎందుకో తనను తాను పరికించి చూసుకున్నాడు చింపిరయ్య.

పైకి ఎంతో హుందాగా పెద్దమనిషిగా కన్పించే వ్యక్తుల అంతరంగాలు ఎంతటి క్రూరాతిక్రూరంగా ఉంటాయో...కానీ తనలాంటి శాపగ్రస్త జీవితాలు... నిట్టూర్చడం తప్ప ఏమీ చేయలేని అచేతన బ్రతుకు తనది.

ఆ రోడ్డుమీది చిల్లర దేవుణ్ణి అలానే చూస్తుండిపోయాడు తోడేలయ్య. అతగాడిని చూస్తూంటే ఆ ముఖంలో ఏదో భక్తి భావన కన్పిస్తోంది. రెండు చేతులా ఆ ఏడుకొండల స్వామికి నమస్కరిస్తున్నాడు. కళ్ళు మూసుకొని మరీ ప్రార్థిస్తున్నాడు. బహుశా ఈ కేసులో తీర్పు తనకు అనుకూలంగా వచ్చి విముక్తుడనయితే ఇక్కడే నీకు గుడికట్టిస్తా నన్న వేడికోలు అయినా అయి ఉండొచ్చు...చాలా సేపు నమస్కరిస్తూ అలానే ఉండిపోయాడు తోడేలయ్య.

'చాలు ఇక. జడ్జిగారు వచ్చేటయమవుతోంది. త్వరగా కోర్టుకు చేరుకోవాలి!" బాధ్యత వహిస్తున్న పోలీసాఫీసరు హెచ్చరిస్తుంటే కొంచెం ముందుకు కదిలాడు.

తెచ్చుకున్న భక్తి భావనతో తోడేలయ్య ఆ స్వామి కాళ్ళకు మ్రొక్కుతున్నాడు. చేతులను తాకి నమస్కరిస్తున్నాడు. ముఖాన్ని స్పృశించి మరీ వేడుకుంటున్నాడు.

జేబులో చేయిపెట్టాడు. ఓ పచ్చనోటు, మరింత చిల్లర...ఎంతో లెక్కపెట్టలేదు. అంతా ఆ బొమ్మమీద పోసి, మరోసారి నమస్కరించి ముందుకు సాగిపోయాడు. పోలీసువ్యాన్లు ముందుకు దూసుకుపోయాయి. అందులోని తోడేలయ్య కూడా ముందుకు కదిలిపోయాడు.

చింపిరయ్యకు ప్రాణం లేచి వచ్చినట్లయింది. చటుక్కున రోడ్డు మీదకు కదిలాడు. చాలా ఆనందంగా ఉంది. వెయ్యి రూపాయల నోటు రెపరెపలాడుతోంది. క్రొత్తగా ఉంది. దానికి తోడు చిల్లర నాణాలు అన్నీ ఐదేసి రూపాయలు. సంతోషంతో ఉక్కిరి బిక్కిరవుతున్నాడు. ఆనందంతో వాటినన్నింటినీ దోసిట్లోకి తీసుకున్నాడు. అవును...తన దోసిలి చాలా నిండుగా అగుపిస్తోంది.

అసలు తన జీవితంలో వెయ్యిరూపాయల కాగితాన్ని ఎప్పుడూ చూసి ఉండడు తాను. దానికి తోడు ఐదురూపాయల బిళ్ళలు మండుటెండలో మిల మిలా మెరిసి తన ఆకలికి భరోసా ఇస్తున్నాయి.

చింపిరయ్య ఆకలితో బిక్కచచ్చిపోతున్నాడు. కాళ్ళు చేతులు కొంకర్లు పోతున్నాయి. ఆ డబ్బు తనకు కనీసం పాతిక రోజులు ఆకలిమంటల్ని ఆర్పగల్గుతుంది.

నెమ్మదిగా చెట్టు నీడకు...ప్రక్కనే ఎప్పుడో పెట్టిన వినాయక విగ్రహం వైపుకు అడుగులు పడుతున్నాయి. తోడేలయ్య గుర్తుకు వచ్చాడు. చాలా దిగులుగా ఉంది చింపిరయ్యకు.

పైకి ఎంతో ఖరీదుగా, ఎంతో ఉన్నతంగా కన్పించిన తోడేలయ్య అంతరంగంతో తనను బేరీజు వేసుకుంటే ఎంతో జుగుప్సగా ఉంది. అవును ఈ డబ్బు తనకు కొంతకాలం ఆధారంగా ఉండగలుగుతుంది. అది ఉన్నంత కాలం ఇలా రోడ్డుమీద వచ్చేపోయేవాళ్ళకోసం ఎదురు చూడాల్సిన అవసరం ఉండదు. చక్కగా ఏ సత్రంలోనో, లేక రైల్వేస్టేషన్‌లోనో కాలక్షేపం చేయవచ్చు కానీ తన అంతరంగం, వయసు తెచ్చిన హుందాతనం ససేమిరా అంటోంది. ఆ డబ్బు తనకు ఎంతో అవసరం. అయినా ఓ

దుర్మార్గ నైజం కల్గిన వ్యక్తిద్వారా ప్రోది అయిన డబ్బు కావడంతో అది తనను అవహేళన చేస్తున్నట్టుంది.

అవును తన ఆత్మస్థైర్యంమీద తనకు అపారమైన నమ్మకముంది. ఈ రోజు అస్సలు తినడానికేమీ దొరక్కపోయినా తాను బ్రతికేయగలడు. అయినా ఈ దుర్భర జీవితం తనకేమీ కొత్తకాదు. ఎన్నో రకాలుగా ఎంతోసేపు ఆలోచించాడు. చివరకు ఒక నిర్ణయానికి వచ్చాడు.

ఊపిరి ప్రోదిచేసుకొని ఆ డబ్బుని వినాయకుడి ముందు హుండీలో గుమ్మరించేశాడు.

ఇప్పుడు ప్రాణానికి చాలా హాయిగా అన్పిస్తోంది చింపిరయ్యకి. అలా నడుం వాల్చి కళ్లు మూసుకున్నాడు. తెలియని ఆత్మసంతృప్తి వాడిని సేదదీరుస్తూనే వుంది. ఇప్పుడు కర్ఫ్యూ అలా కొనసాగుతూనే ఉంది.

తాను గీసిన బొమ్మపై భక్తులు వేసే చిల్లర నాణాలకోసం చింపిరయ్య కళ్ళు ఆశగా అలా ఎదురు చూస్తూనే ఉన్నాయి.

# 1
# ఎర్ర అట్ట డైరీలు

తెల్లటి వెన్నెల. చల్లటి గాలి. చాలా రోజుల తర్వాత నాకెందుకో అలా బయట తిరిగొస్తే బాగుండుననిపించింది. అనుకున్నదే తడవుగా బయల్దేరి మా ఇల్లు దాటి అలా వీధి చివరికి వెళ్ళానే లేదో కాస్త దూరంగా కనిపించాడు వాడు. ముందు వాడేనా కాదా అని అనుమానం కలిగింది. రోడ్డు పక్కగా వున్న చెట్టు నీడలో చీకటి చూసుకోని అక్కడ నిలబడి చూశాను. వాడు ఇంకొంచెం ముందుకు రాగానే నిర్ధారణ అయిపోయింది. వాడే..॥చారిగాడు..॥

చటుక్కున వెనక్కి తిరిగి గబగబ అడుగులు వేసుకుంటూ దాదాపు పరుగెత్తినంత పనిచేశాను. చల్లగాలి ఎటుపోయిందో తెలియదు. వెన్నెల తెల్లగా పరుచుకోని నా ఉనికిని వాడికి ఎక్కడ చూపిస్తుందో అని భయంగా వుంది. వాడు నన్ను చూడలేదనే అనుకున్నాను, చూస్తే తప్పకుండా కేకేసేవాడు కదా!

ఇంట్లోకి దూరి తలుపులు వేసేసి సోఫాలో కూలబడ్డాను.

"ఏమైంది? ఏదో ఈవినింగ్ వాక్ అంటూ వెళ్ళారుగా?" అడిగింది రాధిక. నా నుంచి ఏ సమాధానం రాకపోవటంతో మళ్ళీ తనే అంది. "శకునం బాలేదా ఏమిటి?" నవ్వుతూ అంటూనే వంటింటిలోకి వెళ్ళిపోయింది.

"దాదాపు అలాంటిదే" అన్నాను నేను నెమ్మదిగా. నా కళ్ళముందు వాడే కనపడుతున్నాడు. ఆ చారిగాడు..॥

అయినా ఈ వేళప్పుడు ఇటెందుకు వస్తున్నాడు? కొంపదీసి నన్ను కలవటానికి ఇక్కడికే వస్తున్నాడేమో? ఆ ఆలోచన రావటమేమిటి బయట గేటు చప్పుడైంది. అనుమానమే లేదు వాడే అయ్యుంటాడనుకున్నాను.

“ఇదిగో రాధా.. ఆ చారిగాడు వస్తున్నట్లున్నాడుగానీ... నేను ఇంట్లో లేనని చెప్పు...” సోఫాలోంచి దూకి పడగ్గదిలోకి వెళ్తూ అరిచాను.

“చారిగారా? ఆయనొస్తే మీరు లేరని...??” ఏదో అడగబోయింది. కానీ మధ్యలోనే ఆపేశాను నేను.

“అబ్బా... అనవసరపు ప్రశ్నలన్నీ అడక్కు... నేను చెప్పినట్లు చెప్పు. అంతే అంటూ పడగ్గదిలోకి అడుగుపెట్టాను. మరుక్షణం కాలింగ్‌బెల్ మోగింది. రాధిక వెళ్ళి తలుపు తీయటం – “మీరా... బాగున్నారా? ఆయన లేరండీ...” అంటూ చెప్పడం వినపడుతూనే వుంది. పడగ్గది తలుపు దగ్గరే నిలబడి వచ్చిన వాళ్ళు ఎవరో వినాలని ప్రయత్నం చేస్తున్నాను.

“అలాగా...సరేలేమ్మా... ఫోన్ చేస్తుంటే ఎత్తటంలేదు...సరే ఒకసారి కలిసి పోదామని వచ్చాను”....వాడే...ఆచారిగాడి గొంతే అది.

“ఆఫీసులో పని ఎక్కువైందండీ...ఫోన్ మాట్లాడే తీరికెక్కడిదీ?” చెప్పింది రాధిక.

ఫర్వాలేదు బాగానే కవర్ చేసింది అనుకున్నాను. ఆ తరువాత ఏ మాటలూ వినపడలేదు.వాడు వున్నట్లా వెళ్లిపోయినట్లా? ఒకవేళ చొరవగా వచ్చి లోపల కూర్చోనుంటే? నేను వచ్చేదాకా వుంటానని అని అక్కడే తిష్టవేసి వుంటే? చెవులు రిక్కించి వింటున్నాను.

డాడీ...॥ పిలుపు వినిపించి అదిరిపడ్డాను. అప్పటిదాకా మంచంమీద పడుకోని వున్న బంటిగాడు కాలింగ్ బెల్ చప్పుడికి లేచినట్లున్నాడు. నేను తలుపు దగ్గర చాటుగా నిలబడి ఏం చేస్తున్నానో అర్థంకాక అయోమయంగా చూస్తున్నాడు.

ఏం చేస్తున్నావు డాడీ...అంటూ అడగబోయాడు.

ఇష్షూ..ఇష్షూ... అంటూ అమాంతం మంచంమీదకి దూకి వాడి నోరు మూసేశాను. విషయం అర్థంకాక వాడు భయం భయంగా నావైపు చూశాడు.

పడగ్గది తలుపు తెరుచుకుంది. ఎదురుగా రాధిక. బంటిమీద దాదాపు పడిపోయి వాడి నోరు నొక్కేస్తున్న నన్ను విచిత్రంగా చూసింది. నేను ఇంకా విచిత్రంగా నవ్వుతూ వుండిపోయాను.

"ఏమిటిది? మీ ఫ్రెండ్ వెళ్ళిపోయాడు గానీ... ఇంక చాలించి రండి" అంటూ హాల్లోకి నడిచింది. బంటిని వదిలిపెట్టి భయపడాల్సిన పనిలేదని నచ్చచెప్పి, వాణ్ణి మళ్ళీ పడుకోపెట్టి నేనూ హాల్లోకి వచ్చాను.

"ఏమిటి సంగతి?" అన్నట్టు కళ్ళెగరేసింది రాధిక. ఏమీ లేదన్నట్టు తలాడించి కూర్చున్నాను. అంత సులభంగా వదిలిపెడుతుందా రాధిక?

"మీ ఫ్రెండ్ గానీ ఇన్సూరెన్స్ ఏజంట్ అయ్యాడా?" అంది.

"అబ్బే... లేదు లేదు..."

"అయితే మల్టీలెవల్ చెయిన్ మార్కెటింగ్ లాంటివి ఏమైనా..."

"ఊహూ..."

"మరెందుకు ఆయనొస్తే దాక్కున్నారు?"

గట్టిగా నిట్టూర్చాను. రాధికతో నిజం చెప్పాలనిపించింది. మొదలుపెట్టాను ...

చారి అని పిల్చుకునే ఆచారిగాడు నాకు మంచి స్నేహితుడే. చిన్నప్పటి క్లాస్ మేట్. తర్వాత నేను వైజాగుకి చదువుకోడానికి వెళ్ళిపోయాను. ఆ తరువాత చాలా కాలానికి మళ్ళీ గుంటూరు వచ్చి స్థిరపడ్డాము. అనుకోకుండా ఒకరోజు సాయంత్రం శంకర్ విలాస్ సెంటర్ దగ్గర కనిపించాడు. వాడే గుర్తుపట్టాడు. వాడి గుండు, వాలకం చూస్తే గుర్తుపట్టడం కాస్త కష్టమే అయ్యింది. పలకరింపులు అవీ అయ్యాక నెల క్రితం నాన్నగారు పోయార్రా అంటూ తల తడుముకున్నాడు.

"అరెరే...సారీ... తెలుగు మాష్టారు కదూ ఆయన...?" అడిగాను గుర్తుతెచ్చుకోని.

"అవును... తెలుగూ" సంస్కృతం చెప్పేవారు. పదేళ్ళనుంచి అదికూడా మానేసి జాతకాలు అవీ చెప్పడం మొదలుపెట్టాడు. ఏమాటకా మాట చెప్పుకోవాలి. మాస్టర్‌గా కన్నా జ్యోతిష్యుడిగానే బాగా సంపాదించాడు. డబ్బు...పేరు కూడా" అన్నాడు.

"అలాగా? ఆయన జాతకాలు అవీ చెప్తారని నాకెప్పుడూ చెప్పలేదే..." అన్నాను నేను, నాక్కూడా జాతకాలు వెయ్యడం చూడటం తెలుసు. ప్రావీణ్యం లేదు కానీ ప్రవేశం అయితే వుంది.

ఆ తరువాత పిచ్చాపాటి మాట్లాడుకోని, అక్కడికి దగ్గర్లోనే బ్రాడీపేటలో వున్న వాళ్ళింటికి తీసుకెళ్ళాడు. ఇంటి బయట ఓంశ్రీ జ్యోతిష్యాలయం. దైవజ్ఞః హయగ్రీవా చారి అని బోర్డు వుంది. నెలక్రితం మనిషిపోయిన దుఃఖం ఇంకా ఆ ఇంటిని అంటిపెట్టుకొని వున్నట్లు కనబడుతోంది. ఇంట్లోకి వెళ్ళగానే వాడి భార్య వచ్చి మంచినీళ్ళు ఇచ్చి వెళ్ళింది. చారి వెళ్ళి వాళ్ళమ్మని వెంటబెట్టుకొచ్చాడు.

"వీడు గుర్తున్నాడా అమ్మా? సుందరం... పోస్ట్‌మాస్టర్ గారి అబ్బాయి అంటూ గుర్తు చేశాడు. ఆమె నీరసంగా చూసింది.

"బాగున్నావా?" అంది

"బాగున్నానండీ అన్నాను." కొంత నిశ్శబ్దం తరువాత–నాకు ఇప్పుడే తెలిసిందీ... అన్నాను ఊరడింపుగా. అంతే ఆమె ఒక్కసారిగా ఏడ్చేసింది. నాకు ఏం చెయ్యాలో తెలియక ఇబ్బందిగా కదిలాను.

ఊర్కో అమ్మా... ఊర్కో... అంటూ వాడు ఆమెను లోపలికి పంపించాడు. తిరిగి వచ్చి –

పదరా...నాన్న రూములో కూర్చోని మాట్లాడుకుందాం అన్నాడు. ఇద్దరం ముందువైపువున్న గదిలోకి వెళ్ళాం.

వాళ్ళ నాన్నగారు అక్కడే జాతకాలు అవీ చెప్పేవాళ్ళని అర్థం అయ్యింది. లోపలికి అడుగుపెట్టగానే ఎదురుగా కనపడేటట్లు ఒక కుర్చీ. దాని ముందు ఒక టేబుల్, ఆ టేబుల్ మీద ఏవో పుస్తకాలు, కాగితాలు, దేవుడి బొమ్మలు వున్నాయి. ఒక మూలగా చిన్న మందిరం. అందులో ఇరుకిరుగ్గా చాలామంది దేవుళ్ళు. ఒక గోడకి మొత్తం పుస్తకాల రాకు. అందులో రకరకాల పుస్తకాలు.

ఇద్దరం ఆ గదిలో చాలాసేపు కూర్చోని పిచ్చాపాటి మాట్లాడుకున్నాం. వాడు ఎక్కువసేపు వాళ్ళ నాన్న గురించే తల్చుకొని బాధపడ్డాడు.

నాల్నాలుగుల పదహారు

చాలా పుస్తకాలు వున్నాయిరా. అన్నాను నేను అటు చూస్తూ.

అన్నీ లైబ్రరీకి ఇచ్చెయ్యమని చెప్పాడాయన. రేపో ఎల్లుండో వచ్చి తీసుకెళ్తారు... అన్నాడు

అరెరే... ముందే తెలిసివుంటే నేనే తీసుకునేవాణ్ణి...అని వెంటనే అన్నాను. కానీ, అన్ని పుస్తకాలు నా ఇంట్లో పట్టవన్న సంగతి అన్న తరువాతే గుర్తుకొచ్చింది.

వాళ్ళకు చెప్పేశాను కదా... అయినా నీకు ఏమన్నా కావాలంటే తీసుకో... అన్నాడు.

వాడు అన్నదే తడవుగా ఆ పుస్తకాల దగ్గరగా వెళ్ళి ఎగాదిగా చూశాను. చాలా వరకు జోతిష్యంకి సంబంధించినవి, వాస్తుకి సంబంధించినవీ ఉన్నాయి. ఓ ఇరవై దాకా ఆంగ్ల పుస్తకాలు, ఓ పది ఆత్మకథలు, అరడజను దాకా కథల పుస్తకాలు... అంతే. వాటన్నింటి మధ్యలో మూడు ఎర్ర అట్ట డైరీలు కనిపించాయి. అవి తీసి చూశాను.

అన్నీ చేతిరాతలో రాసున్నాయి. ఒక్కొక్క పేజీ తిప్పి చూస్తే అవి హయగ్రీవాచారి గారు రాసినట్లు అర్థం అయ్యింది. చాలా వరకు ఆయన దగ్గరకు వచ్చి జాతకం చెప్పించుకున్న వారి వివరాలు వున్నాయి. ఒక ఇరవై ఏళ్ళ వ్యక్తి ఆయన దగ్గరకు జాతకం చెప్పించుకునేందుకు వస్తే నలభై ఏళ్ళకు తీవ్ర అనారోగ్యం వచ్చే అవకాశం వుందని తెలుసుకొని దానికి తగ్గట్టుగా డబ్బులు ఇప్పటి నుంచే ఎలా మదుపు చెయ్యాలి, హెల్త్ ఇన్సూరెన్స్ ఎలాంటిది తీసుకొని జాగ్రత్తపడాలి. ఇలాంటి విషయాలు వాళ్ళకు చెప్పినట్లు రాసి వున్నాయి. జాగ్రత్తగా గమనిస్తే అన్నింటిలో ఇదే తరహా వివరాలు వున్నాయి. ఒక జాతకం ద్వారా ఒక మనిషి ఆర్థిక స్థితిగతుల్ని అంచనా వేసి ఆ జాతకునికి ఏ సమయంలో ఎంత మొత్తంలో డబ్బు అవసరం అవుతుందో లెక్కలు గట్టి, ఆ రోజుకి సరిపోయేలా డబ్బు సమకూర్చుకునేందుకు సూచనలు వున్నాయి. జ్యోతిష్యశాస్త్రానికి, ఆర్థిక శాస్త్రానికి లంకె పెట్టాడా మహానుభావుడు.

నేను ఇలా చూస్తుండగానే చారి మిగిలిన డైరీలను చూశాడు.

నాన్న ఇలా రాసి పెట్టుకున్నాడని మాక్కూడా తెలియదురా... అంటూ ఆ అక్షరాలను అపురూపంగా తడిమాడు. అమ్మకి చూపిస్తానని లోపలికి పరిగెత్తాడు.

కాస్సేపటికి లోపలినుంచి మళ్ళీ గట్టిగా ఏడుపు వినపడింది. ఆ తరువాత మరికొంత సేపటికి వాడు తిరిగి వచ్చాడు. ఈసారి వాడు కూడా ఏడ్చినట్లు వాడి కళ్ళు చెబుతున్నాయి.

చాలా విలువైన సమాచారం వుందిరా ఈ పుస్తకాలలో. నీకేమీ అభ్యంతరం లేకపోతే ఒక్క పదిరోజులు నాకిస్తావా? నేను అవసరమైనవి అన్నీ రాసుకోని మళ్ళీ ఇచ్చేస్తాను? అడిగాను నేను కాస్త మొహమాటపడుతూనే.

భలేవాడివే... దానికింత అడగాలా? నీకు ఉపయోగపడుతాయంటే తప్పకుండా తీసుకెళ్ళు అన్నాడు వాడు.

పదిరోజుల్లో ఖచ్చితంగా తెచ్చిస్తా అంటూ భరోసా ఇచ్చాను వచ్చేముందు

సర్లేరా అన్నాడు వాడు.

అంతవరకు అంతా బాగానే వుంది. ఆ తరువాతే అసలు సమస్య వచ్చిపడింది. పదిరోజులు కాదు కదా నెల రోజులైనా ఆ పుస్తకాలను తెరిచే అవకాశమే రాలేదు నాకు ఆ తరువాత ఇల్లు మారాము. మారిన కొత్తింట్లో సామాన్లు సర్దుకోవటం వగైరా పనులతో అదో హడావిడి. ఈ హడావిడిలో పడి ఆ పుస్తకాల సంగతే మర్చిపోయాను. నా పుస్తకాలు సర్దుకునేటప్పుడు కూడా ఆ పుస్తకాలు లేవన్న సంగతి గమనించలేదు.

ఇక ఆ తరువాత ఇంకేముంది. కంగారు మొదలైంది. మొత్తం వెతికాను. ఇంట్లో ప్రతిమూలా చూశాను. ఎక్కడా కనపడలేదు.

పుస్తకాలు కనపడటం లేదని నిర్ధారణకి వచ్చాక ఖంగారు స్థానే భయం మొదలైంది. చారి ఏమంటాడో అన్న భయం. చనిపోయిన తండ్రి జ్ఞాపకాలు కనపడకుండా పోయాయంటే చారి వూరుకుంటాడా? అన్న భయంతో. దాంతో భయం కాస్తా పశ్చాత్తాపంగా మారింది.

వాడు నా అజాగ్రత్తని తిట్టచ్చు, కోప్పడచ్చు. గొడవ పడచ్చు. మామధ్య ఇప్పటిదాకా ఉన్న స్నేహమే లేకుండా పోవచ్చు. ఈ ఆలోచనలతో సతమతమై పోయాను. రెండ్రోజులు తిండి సయించలేదు. వాడిని కలిసేందుకు ధైర్యం కలగలేదు. ఇక అప్పటి నుంచీ వాడుండే బ్రాడీపేట వైపు వెళ్ళడం మానేశాను. వాడి ఫోన్ ఎత్తడం మానేశాను. ఎలాగైనా సరే వాడికి కనపడకూడదన్న ప్రయత్నం మొదలు పెట్టాను. తప్పించుకు తిరుగుతున్నాను.

...

ఇదీ జరిగింది చెప్పాను రాధికతో.

బాగానే వుంది... పుస్తకాలు పోయాయి నిజమే... అలాగని ఎంతకాలం ఇలా తప్పించుకు తిరుగుతారు? అంది. ఏం చెయ్యమంటావు చెప్పు... గిల్టీ ఫీలింగ్... అసలు నేను వాడింటికి ఎందుకు వెళ్ళాల్సిరావాలి? పెద్ద చదివేవాడిలాగా ఆ పుస్తకాలు ఎందుకు తీసుకోవాలి? సరిగ్గా అవే కనపడకుండా ఎందుకు పోవాలి? తల పట్టుకొని అన్నాను.

మీరు అనవసరంగా ఫీల్ అవుతున్నట్టున్నారు... అని ఊరుకుంది రాధిక.

ఆమెకి ఏం అర్థం అవుతుంది నా బాధ? పుస్తకాలంటే నాకు ప్రాణం. ఎవరికైనా ఇవ్వాల్సి వస్తే నా ప్రాణం గిలగిల లాడుతుంది. అలాంటిది చారిగాడు అడగ్గానే దానికేం తీసుకోరా అన్నాడు. ఎంత నమ్మకంగా ఇచ్చాడు? వాడు అంత నమ్మకంతో ఇచ్చినప్పుడు వాటి జాగ్రత్తగా చూసుకోని, భద్రంగా తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత నాపైన లేదూ? అలాంటిది ఇప్పుడు ఆ పుస్తకాలు పోయాయంటే అది తప్పే కదా!

సరే నా సంగతి పక్కన పెట్టండి. వాళ్ళ నాన్నగారు ఎంతో కష్టపడి సేకరించి రాసుకున్న విషయాలు. చారిగాడికి అపురూపంగా మిగిలిన జ్ఞాపకాలు. అవి నేను వాడికి కాకుండా చేశానంటే వాడెంత బాధపడతాడు? నాతోవున్న స్నేహం కారణంగా ఏమీ అనకపోవచ్చుగాక. కానీ నన్ను పురుగును చూసినట్టు చూస్తే భరించగలనా? చారిగాడి అమ్మ... ఆమె ఏమంటుందో? జాగ్రత్తగా వుండాల్సింది బాబూ...అని ఒక్క మాట అంటే చాలదూ. తప్పుచేసిన ముద్దాయిలాగా ఆమె ముందు నిలబడగలనా?

పోనీ అవన్నీ పక్కనపెట్టండి. నాకు నేను సర్దిచెప్పుకుంటాను. మా స్నేహాన్ని అడ్డంపెట్టుకుంటే ఆ చారిగాడు నన్ను క్షమిస్తాడనే అనుకుందాం. కానీ ఆ సమాచారం ఏళ్ళ తరబడి ఎన్నో పుస్తకాలు మధించి ఆయన తయారుచేసుకున్న నోట్సు. బహుశా ఒక పుస్తకంగా వేయాలని ఆయన ఆలోచన అయ్యింటుంది. అలాంటి విలువైన సమాచారం పోగొట్టానే...। దానికైనా బాధ్యత వహించద్దూ...। ఇవన్నీ రాధికకి చెప్పినా అర్థం కావు.

ఏదో పాపం చేసినవాడిలా బాధపడ్డాను. ఏదో శాపం తగిలినవాడిలా నిరాశ పడ్డాను. చారిని తల్చుకుంటేనే ఖంగారు, భయం, బాధ... ముఖ్యంగా పశ్చాత్తాపం. అది అనుభవించాలే కానీ మాటల్లో చెప్పలేని భావన. ఎవరో చొక్కా పట్టుకొని నా చెంపలు రెండూ ఎడాపెడా వాయించేస్తున్నట్టు. నన్ను అతలాకుతలం చేసేసిన బాధ. అలాగే కొంతకాలం గడిచింది.

అన్ని రోజులు మనం అనుకున్నట్టు వుండవుగా! వారం పది రోజుల తరువాత ఓ రోజు ఉదయంపూట అనుకోని పరిస్థితిలో వాడికి దొరికిపోయాను. కూరగాయల మార్కెట్‌లో కావాల్సినవి కొనుక్కొని బయటికి వచ్చి రోడ్డు ప్రక్కనే వున్న షాపులో అల్లం టీ చెప్పాను. ఇంతలో నా భుజం మీద చెయ్యివేసి బలంగా వెనక్కి తిప్పాడు వాడు.

మొత్తానికి దొరికావురా...అన్నాడు.

హతోస్మి. వాడే... చారిగాడు. ఎవరికైతే నా ముఖం కనిపించకూడదని తప్పించుకొని తిరుగుతున్నానో వాడి దగ్గర తప్పించుకోలేని విధంగా దొరికిపోయాను. వాడివైపు చూశాను. వాడి ముఖం స్థానంలో పుస్తకాలు కనిపిస్తున్నాయి. ఎర్ర అట్ట డైరీలు. గిర గిరా తిరుగుతూ కనిపిస్తున్నాయి.

ఉన్నట్టుండి అక్కడి నుంచి పరుగెత్తి పారిపోతే? అనిపించింది. మళ్ళీ బాగుండదని వూరుకున్నాను. అసలా అవకాశం లేకుండా అడ్డంగా నిలబడ్డాడు వాడు.

ఏమైపోయావురా ఇంతకాలం? ఒక ఫోన్ లేదు, మాటలేదు? నేను చేస్తే పలకవు, వస్తే ఇంట్లో వుండవు...వాడిపాటికి వాడు ఏదో అడుగుతున్నాడు. నా

దగ్గర సమాధానం లేదు. వాడు అడగబోయే ప్రశ్నకి నా దగ్గర సమాధానం లేదు. నా మనసు చుట్టూ కందిరీగల్లా ఎర్ర అట్ట డైరీలే ముసురుకున్నాయి.

ఏంట్రా ఏమడిగినా మాట్లాడవు? అన్నాడు వాడు.

ఏం మాట్లాడగలను? కులాసాలు అయిపోయాక వాడు ఎలాగూ అడగక మానడు. నాకు చెప్పకా తప్పదు. తప్పుచేసిన తరువాత చెప్పుకోడానికి భయమెందుకు అనుకున్నాను. గట్టిగా ఊపిరినీ, ధైర్యాన్ని పీల్చుకొని నోరు విప్పాను.

అరేయ్ చారి... నన్ను నువ్వు క్షమించాలిరా... అన్నాను.

అదేంట్రా? అలాగంటావు? ఆశ్చర్యపోయాడు వాడు.

నేను ఒక తప్పు చేశానురా... మీ నాన్నగారి పుస్తకాలు ఎక్కడో పోగొట్టాను... పూర్తిగా నా అజాగ్రత్తే కారణం...దీనికి నువ్వు ఏ శిక్ష వేసినా సరే... నాకు తెలుసు అవి నీకు ఎంత ముఖ్యమైనవో... ఏదేదో సంబంధం లేకుండా మాట్లాడేస్తున్నాను.

రేయ్...ఏంట్రా... ఏ పుస్తకాల సంగతి నువ్వు చెప్పేది? అన్నాడు వాడు. నేను తలెత్తి ఆశ్చర్యంగా చూశాను.

అదేంట్రా... మీ నాన్నగారు రాసి పెట్టుకున్నవి... ఎర్ర అట్ట డైరీలు... నాకు ఇచ్చావు కదా?

ఓహ్...అవా...నాకసలు గుర్తే లేదు...సరే పోతే పొయ్యాయిలే...అని వాడంటుంటే నాకు ఆశ్చర్యంతోపాటు కోపం కూడా వచ్చింది.

అదేంటీ చారీ అలాగంటావు... ఎంత విలువైన సమాచారం వుందో తెలుసా అందులో...

ఏమోరా... నాకు ఆ జాతకాలు అవీ అర్థంకావు. ఇంక ఆయన రాసుకున్నవి నాకేం వుపయోగపడతాయి.

చాలా దారుణంగా మాట్లాడుతున్నావు... కనీసం మీ నాన్న చేతి రాత కోసమైనా అవి విలువైనవి అనిపించలేదా...

చేతిరాత...ఎందుకూ...వున్నాయిగా ఆయనగారు స్వయంగా రాసుకున్న దస్తావేజులు, వీలునామా... ఛస్తున్నాం వాటి సంగతులు తేలక... అన్నట్లు వీలునామా అంటే జ్ఞాపకం వచ్చింది... నీకు తెలిసిన మంచి లాయర్ వుంటే చెప్పరా...అసలు అందుకే నేను నీకోసం వెతుకుతున్నాను...వాడేదో చెప్తూనే వున్నాడు. నేను మాత్రం వినడం మానేశాను.

అలాగే నిలబడిపోయాను. అన్ని రోజులు పడ్డ ఆదుర్దా మొత్తాన్ని ఆవేదన లాంటిదేదో కమ్మేసినట్లైంది.

వాడు నాకోసం ఫోన్లు చేసింది, ఇంటికి వచ్చింది వాళ్ళ నాన్న సముపార్జించిన జ్ఞానమనే ఆస్థికోసం కాదా...? అంతేలే చలం ఇల్లు పాడుబడితే ఎవరికి పట్టింది? గాంధీ వస్తువులు వేలం పాటలు వేస్తే ఏ వారసుడికి నొప్పి పుట్టింది? ఆస్థికి వారసులు వేరే, ఆత్మకి వారసులు వేరే...।

ఏరా ఏమంటావ్? కదిలించాడు వాడు.

మళ్ళీ కలుస్తారా అని ఆటో ఎక్కేశాను.

ఆ తరువాత మరో మూడు రోజులకి అనుకోకుండా బంటిగాడి బొమ్మల బాక్స్‌లో ఎర్ర అట్ట డైరీలు కనపడ్డా, ఆ విషయం చారికి చెప్పలేదు. వాడు అడగనూ లేదు. అయితే ఇప్పటికి కూడా వాణ్ణి కలవకుండా వుండటానికే ప్రయత్నిస్తున్నాను.

# 2
# యశోదాకృష్ణ

నిజం పత్రిక పెట్టిన తరువాత అత్యంత సంచలనమైన వార్త ఇది అన్నారు

ఇంతపెద్ద మిస్టరీని ఒక్కడే ఛేదించడం చాలా గొప్ప విషయం అన్నారు.

నేను ఇచ్చిన టీ పార్టీలో ఒలికిన పొగడ్తలివి. గత నాలుగేళ్ళుగా జరుగుతున్న పసిపిల్లల అపహరణ కేసులు మొత్తం ఒకటే రాకెట్ అని నేను వ్రాసిన వార్త అదే రోజు పేపర్లో రావటం ఆ పార్టీ సందర్భం. అలా ఒక ముఠా చిన్నపిల్లల్ని ఎత్తుకెళ్ళి వేరేచోట అమ్మేస్తున్నారనేది నేను కనిపెట్టిన నిజం.

ఆ తరువాత నన్ను మాట్లాడమన్నారు.

నిజంగా చెప్పాలంటే పత్రిక పెట్టిన తరువాత ఇదే గొప్ప వార్తోకాదో నాకు తెలియదు కానీ, నా పాత్రికేయ వృత్తిలో ఇదే అన్నింటికన్నా పెద్ద కేసు. ఇక మిస్టరీ అంటారా, చిన్నదో పెద్దదో నాకు చేతనైనంతలో ఎప్పటికప్పుడు కొత్త విషయాలు పరిశోధించి వ్రాస్తూనే వున్నాను. అయితే మీరు అన్నట్టు ఒంటరిగా మాత్రం కాదు. ప్రత్యేకించి ఈ కేసు విషయంలో చాలామంది సహకరించారు. ముఖ్యంగా పోలీసులు, అధికారులు, మన యాజమాన్యం...మరీ ముఖ్యంగా నా మిత్రుడు ఎస్.పీ. రాఘవ... వాళ్ళందరికీ, మీరందరికి థాంక్స్ చెప్పి కూర్చున్నాను నేను.

నేను తాగాల్సిన టీ చల్లారిపోయింది. మరో నిమిషంలో అందరూ చప్పట్లు కొట్టి లేచి వెళ్ళిపోయారు. విజయం ఎప్పుడూ ఒంటరిదే అని ఎవరో అన్నట్టు క్యాంటీన్‌లో ఒక్కడినే మిగిలాను. మరో టీ చెప్పి తాగబోతుంటే ఎస్.పీ రాఘవ ఫోన్ చేశాడు. ఉపోద్ఘాతం లేకుండా నువ్వు త్వరగా రావాలి...అన్నాడు.

ఆఫీసు అవ్వగానే...అంటుంటే కాదు ఇప్పుడే!! అన్నాడు

నిఘంటువులో మితభాషి అంటే అర్థం బదులు వీడి పేరు పెట్టచ్చు అనుకుంటూ బయలుదేరాను. వాడి ఆఫీసుకి వెళ్ళగానే పద అంటూ నన్ను దాదాపు బయటికి లాక్కొచ్చినంత పనిచేశాడు. బయట జీపు సిద్ధంగా వుంది. స్టేషన్ వరండాలో కొంచెం అవతలగా వున్న ఇనప కుర్చీలలో ఒక ముస్లిం జంట కూర్చోని వున్నారు. అతని వయసు నలభై వుండచ్చు. ఆమెకి ముప్పై దాకా వుంటాయి. అతని వడిలో ఐదారు సంవత్సరాల పిల్లాడు కూర్చొని వున్నాడు. ఆమె చిన్నగా ఏడుస్తోంది, అతను వోదారుస్తున్నాడు. ఆ పిల్లాడు బిక్క ముఖంతో ఇద్దరినీ చూస్తూ వున్నాడు.

ఎవర్రా వాళ్ళు అడిగాను రాఘవని.

చెప్తాను... బండి ఎక్కు... అన్నాడు జీపుని చూపిస్తూ

ఇద్దరం జీపు ఎక్కగానే డ్రైవర్‌కి ఎక్కడికి వెళ్ళాలో చెప్పాడు రాఘవ. ఆ తరువాత నా వైపు తిరిగి అన్నాడు– ఆ ముఠా అమ్మేసిన పిల్లల్లో ఒకడు –షహజాద్. ఆ ఇద్దరూ ఖాసింపీరా, మెహందీ... నాలుగేళ్ళ క్రితం ఆ పిల్లాణ్ణి కొనుక్కున్నారు. ఇప్పుడు అసలు తల్లిదండ్రులు వస్తే పిల్లాణ్ణి తీసుకెళ్తారని ఏడుస్తున్నారు.

నాకు ఏం సమాధానం చెప్పాలో అర్థంకాలేదు. గేటుదాటుతున్న కారు అద్దంలో వెనకవున్న ఆ ఇద్దరూ కనిపిస్తున్నారు. ఖాసిం చేతులు పైకి చూపించి ఏదో చెప్తున్నాడు. బహుశా దేవుడు మీద భారం అంటున్నాడో లేక దేవుణ్ణి ప్రార్థిస్తున్నాడో అదీ కాకపోతే నిందిస్తున్నాడేమో.

ఒక్కసారి నాకు షాక్ కొట్టినట్లైంది. ఎంత చిత్రమైన పరిస్థితి...? ఈ కేసు పరిష్కరించి ఎంతో మంది పిల్లల్ని వాళ్ళ కుటుంబాలతో కలుపుతున్నానని అనుకున్నాను కానీ, అన్ని కుటుంబాలకి బిడ్డని దూరం చేస్తున్నానని అనుకోలేదు. ఆ ఆలోచన ఆ క్షణమే కలిగింది. ఆ జంటని చూస్తే జాలేస్తోంది. ఈ నాలుగేళ్ళు ఆ పసివాడినీ, వాడితోపాటు వాడిమీద ఆశల్నీ పెంచుకొని వుంటారు. అలాంటప్పుడు ఆ దేవుణ్ణి వాళ్ళు నిందించినా తప్పేముంది అనిపించింది. అసలు దీనికి అంతా కారణమైన నాకు కూడా అందులో భాగముంటుందేమో అని అనుమానం వచ్చింది...॥

ఏంట్రా ఆలోచిస్తున్నావు...అడిగాడు రాఘవ.

ఏంలేదు. పాపం ఆమెను చూస్తుంటే జాలేస్తోంది... పిల్లాణ్ణి కొనుక్కొని లీగల్‌గా తల్లి కాలేదుకదా... అది వాళ్ళకు అర్థం కావటంలేదు... చాలా సాధారణంగా తేల్చేశాడు వాడు. స్వతహాగా మితభాషి కావడం వల్లనో లేక వాడి ఉద్యోగంతో వచ్చిన కాఠిన్యం వల్లనో వాడు అలా మాట్లాడాడనిపించింది.

ఎలా అర్థం అవుతుందిరా... ఇన్నేళ్ళు పెంచిన ప్రేమ అంతా వున్నట్టుండి నీ చట్టం వచ్చి ఎత్తుకుపోతుందా? అడిగాను నేను ఆవేశంగా. వాడు గట్టిగా నిట్టూర్చాడు. కొంచెంసేపు ఇద్దరం మాట్లాడలేదు.

ఎక్కడికి తీసుకెళ్తున్నావు? అడిగాను.

అదే ఆ పిల్లాడి అసలు తల్లి తండ్రి దగ్గరికి...అదిగో ఆ చిన్న వీధి వుందే అక్కడే ఎక్కడో వుంటారు... అని డ్రైవర్‌తో శివయ్య ఇల్లు ఎక్కడో కనుక్కో అన్నాడు. నాకు మరోషాక్.

...

మీ పిల్లడు దొరికాడు అని చెప్పడం సులభం. ఆ తల్లితండ్రులకి సంతోషం కూడా. కానీ మీ పిల్లాడు మీ పిల్లాడిలా దొరకలేదు అని చెప్పాలి. సంవత్సరం పిల్లాడు అయిదేళ్ళవాడయ్యాడు. హిందువు ముస్లిం అయ్యాడు. తల్లిని తండ్రిని గుర్తుపట్టడం అటుంచి, కనీసం అమ్మా, నాన్నా అని పిలుస్తాడని నమ్మకంలేదు. మొదటిసారి అమ్మా నాన్న అని పిలిచింది వీళ్ళని కానప్పుడు ఇప్పుడు కొత్తగా పిలుస్తాడనుకునే అవకాశమే లేదు కదా.

శివయ్య, వెంకమ్మ ఇద్దరు చేతులు కట్టుకొని, గొంతుకు కూర్చున్నారు. వాళ్ళ పక్కనే రెండేళ్ళ పిల్లాడు ఆడుకుంటున్నాడు. చూరుకి కట్టిన వుయ్యాలలో పసిపిల్ల నిద్రపోతోంది. చిన్న గుడిసెలాంటి ఇల్లు అది. బయట శివయ్య తొక్కే రిక్షా, నాలుగు గిన్నెలు, మనిషికి రెండు జతలు మినహాయించి వేరే ఏ ఆస్థి కనపడట్లేదు.

రాఘవ నావైపు చూశాడు. ఆ చూపుతో వాళ్ళకి ఆ విషయం చెప్పాల్సిన బాధ్యత నామీద పడేశాడు.

నేనేదైనా తప్పు సేసానా బాబూ...అన్నాడు శివయ్య భయం భయంగా. కనీసం పోలీస్ స్టేషన్ ముఖంకూడా చూడని వాళ్ళకి పోలీసులు వెతుక్కుంటూ రావడం ఆశ్చర్యమే కాదు అనుమానం కూడా. "లేదు శివయ్యా... నువ్వేం చెయ్యలేదు...నీకు ఒక శుభవార్త చెప్పాలని వచ్చాము...నీ బిడ్డ దొరికాడు..."అన్నాను నేను. వాళ్ళు ఆ మాటకి ఎంత సంతోషంగా స్పందిస్తారో నేను వూహించాను. కానీ అందుకు పూర్తి వ్యతిరేకంగా వుంది వాళ్ళ ప్రవర్తన. ఇద్దరూ ముఖముఖాలు చూసుకున్నారు. శివయ్య ఏదో చప్పరిస్తున్నట్లు చప్పుడు చేశాడు.

ఎవరు బాబూ... మా కిష్టయ్యా? అన్నాడు. ఏమని చెప్పను? అవునని చెప్పనా? లేకపోతే ఇప్పుడు వాడిపేరు కిష్టయ్యకాదు షహజాద్ అని చెప్పనా?

అవును అన్నాడు రాఘవ నా బాధ్యత తప్పిస్తూ, స్టేషన్‌లో వున్నాడు... వచ్చి మీరు గుర్తుపడితే ఇంటికి పంపిస్తాం పూర్తి చేశాడు వాడు.

మళ్ళీ ఇద్దరు ముఖాముఖాలు చూసుకున్నారు. వెంకమ్మ కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి.

ఏడ దొరికాడయ్యా... నా బిడ్డ అంది గొంతు పూడుకుపోతుండగా.

మెహదీపట్నంలో...స్టేషన్‌కి రండి... అంతా వివరంగా చెప్తాము. అంటూ లేచాడు రాఘవ.

తన పిల్లాడు మెహదీపట్నం దాకా ఎలా వెళ్ళాడు? ఎందుకు వెళ్ళాడు? అసలు ఎలా వున్నాడు? ఇలాంటి ప్రశ్నలు ఏమైనా అడుగుతారేమో అని నేను రెండు క్షణాలు ఎదురుచూశాను.

మేము రిచ్చాలో వస్తాంలే బాబూ... మీరెళ్లండి అన్నాడు శివయ్య

మేమిద్దరం బయటపడ్డాం...

...

మేము ఇద్దరం స్టేషన్ చేరుకునే సరికి ఖాసిం లేదు. బహుశా తినడానికి ఏమైనా తీసుకురావడానికి వెళ్ళాడేమో అనుకున్నాను. ఆమె ఇంకా ఏడుస్తూనే వుంది.

చూడమ్మా నీ బాధ నాకు అర్థమైంది. కానీ కొనుక్కున్న పిల్లలు చట్టరీత్యా వారసులు కారు... చెప్పాను ఆమెను వోదార్చే ప్రయత్నంలో. ఆ సంగతి నాకు కూడా తెలుసు సారు... ఏం జేస్తాం... ఎనిమిది సంవత్సరాలు పిల్లలు పుట్టకపోతుంటే ఎన్నో దర్గాలు తిరిగినం. ఏవేవో పీర్లకి, చెట్లకి మొక్కినాం... చివరికి డబ్బులతో అయినా అమ్మని ఐతా అని అనుకుంటే... నా ఖర్మ ఇట్లగైతుందని తెలియకపాయ... ఇన్నేళ్ళబట్టి నా ప్రాణం లెక్క చూసుకుంటి బిడ్డని... ఇప్పుడు తెచ్చి ఇంకో అమ్మకి ఇయ్యాలంటే ఎట్లగో అయితంది... అంది ఇంకా ఏడుస్తూ.

ఆమె సరిగ్గా అలాగే అంటుందని నాకు ముందే తెలుసు. అయినా అడిగాను. ఆమె చెప్పింది విన్నాను. ఇక అంతకన్న మాట్లాడటానికి ఏం లేదనిపించింది నాకు. మరికొంచెం సేపటికి ఖాసిం కూడా వచ్చాడు.

షహజాద్‌ని అల్లా ఇచ్చిన తోఫా అనుకొని జూసుకుంటున్నా సారు... గిట్ల మాకు దూరమైతాడని అనుకోలేదు అన్నాడు పిల్లాడి తల నిమురుతూ. నిజమే. షహజాద్ అంటే రాకుమారుడు అని అర్థం. ఆ పేరు పెట్టడమే కాదు, ఆ పిల్లాణ్ణి పెంచడంలో కూడా అదే ప్రేమ చూపించినట్లు కనిపిస్తోంది.

మీ దగ్గరకి రాకముందు, ఈ పిల్లాడు ఒక హిందువు తెలుసా? అడిగాను వాళ్ళని. ఖాసిం అతని భార్యవైపు చూశాడు. ఆమె ముఖంలోనూ ఆశ్చర్యం.

ఆ సంగతి మాకు దెల్వదు సారు... మాతోని వున్నడు, మా బిడ్డే అనుకున్నాం. మా లెక్కనే పెంచినం...రోజు వాళ్ళ తాతతో నమాజుకి పోతాడు. సుర్మా పెడతాడు. రంజాన్‌కి రోజా చేస్తాడు. హలీము తింటాడు. వీడు మా బిడ్డే సారు... అన్నాడు ఖాసిం.

నేను ఇంక ఎక్కువగా రెట్టించదల్చుకోలేదు. తెలుసుకున్న కొద్దీ కేసు మరింత జటిలంగా తయారౌతోంది. ఇప్పుడు ఈ పిల్లాడిది ఏ కులం అని చెప్పగలం? ఈ జంట తల్లిదండ్రుల పెంపకంలో పెరిగిన ముస్లిం అనాలా లేక కేవలం జన్మతః హిందూ కాబట్టి హిందూ అనాలా?

ఆ పిల్లాణ్ణి చూశాను. కొంచెం రంగు తక్కువైనా చక్కనైన ముఖం. తలపైన చిన్న టోపీ పెట్టాడు. కళ్ళకి సుర్మా, తెల్లటి బట్టలు, చూడగానే ముస్లింలా వున్నాడు. ఒక పేరు షహజాద్, ఒకపేరు కిష్టయ్య...॥ తెల్లటి కుర్తా వేసుకున్న కిష్టయ్య సరిగ్గా ఆ శ్రీకృష్ణుడి లాగే ఇప్పుడు ఈ పిల్లాడు కూడా పెంచిన యశోదని వదిలి దేవకి వసుదేవుల్ని చేరాల్సిందేనా? ఈ తల్లికి పుత్ర శోకం తప్పదా?

వెనుకగా శియ్య గొంతు వినపడితే వెనక్కి తిరిగాను. భుజంపైన కండువాను సర్దుకుంటూ కానిస్టేబుల్‌తో ఏదో మాట్లాడుతున్నాడు. రాఘవ బయటికి వచ్చి అతని భుజంమీద చెయ్యేసి మేము వున్నవైపు తీసుకొస్తున్నాడు. అతని ఒక్కొక్క అడుగు దగ్గరౌతుంటే మెహందీ ఏడుపు పెరుగుతోంది.

మా దగ్గరకి రాగానే శివయ్య పిల్లాడి వంక అనుమానంగా చూశాడు– ఈ అబ్బాయేనా? అన్నాడు నమ్మలేనట్లు. మెహందీ చేతులు ఆ పిల్లాడి చేతిమీద బిగుసుకున్నాయి.

అవును, ఈ అబ్బాయే... అసలు పేరు కిష్టయ్య. ఇప్పుడు షహజాద్... చెప్పాడు రాఘవ.

శివయ్య ఆ ముస్లిం జంటవైపు చూశాడు. ఈ పిల్లాడు మీ అబ్బాయి కాదా? అడిగాడు.

హాఁ...మేరా బేటా హై... నా కొడుకే... అంటోంది. ఖాసిం అడ్డుకున్నాడు–

షహజాద్ మాకు పుట్టలేదు భాయ్...నాలుగేళ్ళ క్రితం మహబూబ్ అనేవాడి దగ్గర పైసలిచ్చి కొనుక్కున్నాం... మా బిడ్డ కాకపోయినా మా బిడ్డ లెక్కనే పెంచినాం భాయ్. ఏం తక్కువ చెయ్యలేదు. కాకపోతే మా ఆచారం ప్రకారం పెంచినాం... అన్నాడు ఖాసిం. శివయ్య కాస్సేపు మౌనంగా వున్నాడు. తర్వాత పిల్లాడికి దగ్గరగా వెళ్ళి తలమీద, చెంపలమీద నిమిరాడు. రాఘవవైపు తిరిగాడు.

లేదు సార్...వీడు నా కొడుకుకాదు...అన్నాడు. బాంబుపడ్డట్లైంది అక్కడ. అందరూ నిశ్శబ్ధంగా శివయ్యవైపే చూస్తున్నారు.

నిజం చెప్పు...మాకు మహబూబ్ చెప్పిన వివరాల ప్రకారం ఈ పిల్లాడు మీ కిట్టయ్యే...కావాలంటే పుట్టుమచ్చలు ఏవైనా వుంటే చూసుకో...రాఘవ కాస్త కటువుగా అన్నాడు.

లేదుసార్... వీడు నా కొడుకు కాదు...వాళ్ళకే ఇచ్చేయండి... అంటూ వెనక్కి తిరిగాడు. ముస్లింలు పెంచారని వాడి పిల్లాడినే కాదంటున్నాడు... ఎలా తీసుకెళ్ళడో నేనూ చూస్తాను. రేపే డి.యన్.ఏ. పరీక్షలు చేయించి...గట్టిగా అరుస్తున్నాడు రాఘవ. నేను శివయ్య వెనకాలే పరుగెత్తాను. దాదాపు గేటు దగ్గర దొరికాడు.

ఆ పిల్లాడు కిష్టయ్యే అని ఆధారాలు వున్నాయి... నువ్వు కాదన్న మాత్రాన నీ పిల్లాడు కాకుండా పోడు... రేపు రక్త పరీక్ష, డీ.ఎన్.ఏ పరీక్ష చేస్తే అన్నీ బయటపడతాయి... అంటున్నాను ఆవేశంగా.

ఆ పనిమాత్రం చెయ్యద్దు బాబూ... ఆ బిడ్డని పోనీ... ఆడు మాకు వద్దని చెప్తున్నాను కదా?

కేవలం ముస్లిం పిల్లాడిగా మారాడని కాదనడం నేరం... ఆ విషయం అర్థం అవుతోందా నీకు? నీ భార్యని తీసుకొస్తే ఆమె చెప్పేది అసలు నిజం... అన్నాను.

వెంకమ్మా ఇట్టా చెప్పమంది బాబూ... ఆడు ముస్లిం పిల్లాడా కాదా అని కాదు... ఎక్కడైనా ఆడు సుఖంగా వుండాడు... మా దగ్గరకొస్తే ఏముంది? ఆడు ఎప్పుడో సచ్చిపోయాడని నమ్మి బతుకుతున్నాం. ఇంక ఇద్దరు పిల్లలు నాకు... ఈడ్ని తీసుకెళ్ళినా ఆళ్ళు పెంచినంత గొప్పగా పెంచలేను...ఆళ్ళు బాగానే చూత్తన్నారు కదా... ఆణ్ణి అక్కడే వుండనీయండి... మీకు దణ్ణం పెడతా అన్నాడు శివయ్య ఆపిల్లాడి వంక చూస్తూ, నేనూ అటు తిరిగాను.

ఖాసిం, మెహందీ కిష్టయ్యని ముద్దుల్లో ముంచేస్తున్నారు.

# 3
# తప్పిపోయిన సూర్యుడు

అప్పటికే మూడు రోజుల ముసురు. ఎప్పుడు ఆగుతుందో, ఎప్పుడు కురుస్తుందో కనిపెట్టలేని కాలం. అలాంటి ఓ వర్షాకాలం సాయంత్రం వూర్లోకి వచ్చాడు సూర్యనారాయణరావు. పేరు గుర్తుంచుకోవాల్సినంత ప్రాధాన్యత లేని ఓ లాడ్జిలో మకాం. ఏసీ సూట్లకి అలవాటు పడ్డ శరీరం కాబట్టి అంతటి వర్షాకాలంలోనూ కూలర్ పెట్టించుకున్నాడు. దాని చప్పుడూ, బయట వర్షం చప్పుడు కలిసి దరువులా అనిపిస్తోందతనికి. వచ్చినప్పటి నుంచి కిటికీ పక్కనే కుర్చీలో కూర్చొని కిటికీ అద్దం మీద పడి జారిపోతున్న వర్షపుచుక్కల్ని చూస్తూ వున్నాడు. రాత్రి పదైందో, పన్నెండైందో తెలియదు. గోడకి గడియారం లేదు. వున్నా టైం తెలుసుకునే ఉద్దేశ్యం అతనికి లేదు. ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురు చూస్తున్నాడు. ఒక ఉషస్సు కోసం జాగారం చేస్తున్నాడతను.

తెల్లవారితే తన బతుకులోకి వెలుగొస్తుందని అతని నమ్మకం. పాతికేళ్ళుగా చూడని కొడుకుని చూడాలని ఆరాటం. ఆ కొడుకు తనని తండ్రిగా అంగీకరిస్తాడో లేదో అని భయం. వెరశి అతనికీ నిద్రకీ ఆమడ దూరం పెరిగింది.

అరవై ఏళ్ళ జీవితంలో అర్ధ భాగం అదే వూర్లో గడిపాడతను. ఆ అర్ధం భాగం ఏ మాత్రం అర్థం పర్థం లేనిదని అతని అభిప్రాయం. పుట్టిన దగ్గర్నుంచీ పుట్టెడు దుఃఖాన్ని దగ్గర్నుంచి చూశాడు. పాపం అనేవాళ్ళనీ చూశాడు. పాపం చేసేవాళ్ళనీ చూశాడు. తండ్రి వ్యసనాలను భరించలేక ఉరిపోసుకున్న తల్లిని చూశాడు. భార్య చచ్చిపోయిందన్న సాకుతో కనపడ్డ ఆడదాన్నల్లా కామించిన తండ్రిని చూశాడు.

## నాల్నాలుగుల పదహారు

ఒక శివరాత్రి మర్నాడు జరిగినది అతనికి బాగా గుర్తు. తండ్రితో కోటప్ప కొండ జాతరకి వెళ్ళి తిరిగి వస్తున్నాడు. దారిలో ఏదో పల్లెటూరు. ఇక్కడ్నుంచి లారీలో పోదామని తండ్రి చెప్తే తలూపాడు, టీ కొట్టు చావిట్లో ముడుక్కొని కూర్చున్నాడు. తెల్లవారిందాకా తండ్రి టీ కొట్టు వెనక ఎవరో అమ్మాయితో వున్నాడని మాత్రం తెలిసింది. ఏం చేస్తున్నాడో తెలియదు. కానీ తప్పు చేస్తున్నాడని తెలుసు. ఎముకలు కొరికే చలిలో గడగడ వణుకుతున్నప్పుడు ఏడేళ్ళ వయసులో తండ్రిని మొదటిసారి అసహ్యించుకున్నాడు. పదేళ్ళకు అలాంటి విషయాలకు అలవాటుపడి పోయాడు. ఇరవై ఏళ్ళకు అది తండ్రి అవసరం కాబోలు అని అనుకున్నాడు. పాతికేళ్ళకు అదే అడుగుల్లో అతనూ నడిచాడు. అతని అడుగుల కింద నలిగిన అమ్మాయి పేరు మల్లి. మల్లి గుర్తుకురాగానే ఎవరో కవ్వంతో చిలికినట్లైంది సూర్యనారాయణ రావుకి. ఖరీదైన సిగరెట్ ఒకటి తీసి వెలిగించుకున్నాడు. బలవంతంగా మల్లి ఆలోచనలు పక్కకి నెట్టి అతని జీవితంలో రెండో సగం గురించి తలుచుకున్నాడు.

మంచో చెడో, తండ్రి వల్ల సూర్యం జీవితంలో రెండు ముఖ్యమైనవి జరిగాయి. ఒకటి తండ్రి ద్వారా సంక్రమించిన అలవాటు అయితే రెండోది తండ్రి పేదరికం కారణంగా పుట్టుకొచ్చిన కసి. అది అలాంటి ఇలాంటి కసి కాదు. కొండల్ని పిండి చెయ్యగలిగిన కసి. ఒక ఉప్పెనలా లేచి సూర్యాన్ని కబళించి సూర్యనారాయణ రావుగా తయారుచేసింది. చిన్నచిన్న ఉద్యోగాలు చేశాడు. చిన్నచిన్న వ్యాపారాలు చేశాడు. పెద్దవాడయ్యాడు. పెద్దపెద్ద సంస్థలకు అధిపతి అయ్యాడు. పగలూ రాత్రి తెలియని అలాంటి పరుగు మధ్యలో సంధ్యారాగంలా కలిసింది మల్లి. మల్లి పేరుకు తగ్గ పిల్ల. విరిసీవిరియని జాజిమల్లి. ఎర్రటి ఎండా కాలం మల్లెలకాలం మంచినీళ్ళ బావి దగ్గర కలిసింది. ఉరుకుల పరుగులలో అలసిపోయిన అతని శరీరదాహాన్ని తీర్చింది. అతడు ఆమెని గుక్కెడు నీళ్ళు ఇచ్చే నీటి చెలమ అనుకున్నాడు. ఆమె మాత్రం నదీ ప్రవాహమై అతనిలో కలిసిపోవాలనుకుంది. అవసరం తీరాక అవతలికి నెట్టాడు. తను ఎక్కుతున్న మెట్లకి అడ్డం రావద్దని పక్కన పెట్టాడు. మల్లి ఏడవలేదు. మళ్ళీ అడగలేదు. తొమ్మిది నెలల కష్టాన్ని ఆశ అనే వారధితో దాటేసింది. పిల్లాడు పుట్టాడు. అప్పటికే పెద్ద పారిశ్రామికవేత్త కూతురితో పెళ్ళి ప్రయత్నాలు సాగుతున్నాయి. పెళ్ళే

కాని వాడు పిల్లాణ్ణి ఎలా ఒప్పుకుంటాడు? పైగా పిల్లాణ్ణి కన్న తల్లిని పెళ్ళి చేసుకునేందుకు సిద్ధంగా లేనప్పుడు కనీసం చూడటానికి కూడా ఇష్టపడలేదు.

వాడు నీ కొడుకు... నీ రక్తం... అని మల్లి అన్నప్పుడు మాత్రం దగ్గరకు వెళ్ళబోయాడు. అటు వేసే ప్రతి అడుగు అతని ఎదుగుదలను అణగదొక్కుతుందని అనుకున్నాడు. మెళ్ళో ఉన్న బంగారు గొలుసు తీసి ఆమెచేతికి ఇచ్చాడు. ఒక్క క్షణంపాటు కలిగిన ప్రేమ అది అని అతననుకున్నాడు. అతని పేరు బయటపెట్టకుండా వుండేందుకు ఇచ్చిన లంచమని ఆమె అనుకుంది.

వాడి బాగోగులు చూస్తాను... డబ్బు పంపుతుంటాను అన్నాడు. ఆ మాటలు వినకుండానే వెళ్ళిపోయింది మల్లి. మళ్ళీ కనపడలేదు.

ఇప్పుడు మల్లి సంగతి చెప్పగలిగినవాడు ఒక్కడే వున్నాడు. ఆమెకు వరసకి బావ అయిన శ్రీపతి. అతన్ని కలిసి తన కొడుకు వివరాలు తెలుసుకోవాలని అతని ఆలోచన. చీకట్లు తప్పుకున్న ఆకాశాన్ని కడిగేస్తూ సన్నటి వాన కురుస్తోంది.

సూర్యనారాయణరావు ఎదురు చూసిన క్షణం మరింకెంతో దూరంలో లేదు. అతను తయారై బయటపడేసరికి మసకేసిన మబ్బులు కొంచెం తెరిపినిచ్చాయి.

శ్రీపతి కోసం వూరంతా వెతికాడు. అతని ఇల్లు తెలుసుకునేసరికి మధ్యాహ్నం అయ్యింది కానీ, శ్రీపతి లేడు.

ఊరెళ్ళారండీ... చెప్పిందతని భార్య. మీరు ఎవరని చెప్పమన్నారు? అడిగింది.

ఏం సమాధానం చెప్తాడు? సూర్యనారాయణ రావు కొద్దిసేపు తటపటాయించాడు.

చిన్నప్పటి స్నేహితుణ్ణి... ఎప్పుడో ముప్పై ఏళ్ళ క్రితం... అబద్ధాలాడటం అతనికి వ్యాపారంలో అబ్బిన కళ. వెళ్ళబోతూ మళ్ళీ అగాడు.

వాడి మరదలు ఒకమ్మాయి వుండాలి...మల్లి అనీ...

అయ్యో మీకు తెలియదా?... ఆమె చెప్పబోయేది ముందే తెలిసిపోయిందతనికి. వినకూడదంటే మాత్రం చెవులకు వినపడకుండా వుంటుందా? చనిపోయింది.

ఎంతకాలం అయ్యింది?

పదేళ్ళపైనే...

బాధపడాలా? పశ్చాత్తాపపడాలా?

ఆమె కొడుకు...?

భాస్కర్... మూడు వీధుల అవతల... కుడి వైపు రెండో ఇల్లు... ఇంటి ముందు జాజిమల్లె చెట్టు... చెప్పిందావిడ.

సూర్యనారాయణరావు అక్కడి నుంచి కదిలాడు.

పదేళ్ళు...పదేళ్ళు... అనుకున్నాడు మనసులోనే. అవే పదేళ్ళలో అన్నీ జరిగాయి. తన సంసారంలో తుఫాను రేగింది ఆ కాలంలోనే. పిల్లలు పుట్టలేదని జయంతి బాధపడేది. వారసులు పుట్టలేదని అతను బాధపడేవాడు. ఆమె బాధకి పర్యవసానం ఆత్మహత్య అయితే. అతనికి బాధకి పర్యవసానం నిద్రలేమి, నిట్టూర్పులు అన్నింటినీ మించిన నిన్నటి జ్ఞాపకం...మల్లి. మల్లి కొడుకు! మల్లికి పుట్టినవాడు తనవాడు కాడూ. తన రక్తం కాదూ.

అడపాదడపా చినుకులు పడుతున్నాయి. నడకలో వేగం పెంచలేని అశక్తుడై వున్నాడు సూర్యనారాయణరావు. ఏం చేస్తాడు. వయసు భారం మొత్తం మోకాళ్ళమీద వచ్చిపడింది. అయినా నడుస్తూనే వున్నాడు. మల్లెపందిరి కనిపించేంతవరకు.

ఎన్ని వ్యాపారాలు చేసి ఏం లాభం? ఎన్ని కార్పొరేట్ మీటింగులలో మాట్లాడి ఏం లాభం? ఆ ఇంట్లోకి అడుగుపెట్టడం అటుంచి, తొంగి చూడటానికే భయపడ్డాడతను. చినుకులు పెద్దవై తడుస్తున్నా, పూలు లేని మల్లెపందిరి చూస్తూ నిలబడిపోయాడు.

భాస్కర్‌కి తన తండ్రి ఎవరో తెలిసేవుంటుందా? మల్లి చెప్పేవుంటుందా? చచ్చిపోయాడని చెప్పి వుంటుందా? వర్షంకన్నా మనసులో ప్రశ్నలే అతన్ని ఎక్కువగా తడిపేస్తున్నాయి. సాయంత్రం దాటిన చీకట్లు కమ్ముకుంటున్నాయి.

ఎవరదీ? వినిపించిందో గొంతు. ఆ వెనకే ఎవరో పాతికేళ్ళ యువతి వర్షానికి తలపై చేతిని పెట్టుకొని వచ్చింది.

ఎవరంటే పలకరేం? కొంత ఖంగారు, కొంత భయం ఆమె గొంతులో

కోడలేమో...అనుకున్నాడు. మరింత ఖంగారు, మరింత భయం అతని గుండెలో.

ఏం లేదమ్మా... ఇక్కడ నా వస్తువు ఒకటి పోయింది వెతుక్కుంటున్నాను... చెప్పాడతను. వెతుక్కుంటున్నమాట నిజమే అయితే అది వస్తువు కాదని అతనికీ తెలుసు.

అయ్యో..వర్షం పడుతోంది కదండీ...పోనీ లోపలికి రండి...ఆహ్వానించిందామె.

పర్లేదమ్మా...దొరుకుతుందని నమ్మకం కూడా లేదు...నిరాశ అతని గొంతులో...

పోనీ... ఏం పోయిందో చెప్పండి. పిల్లాడికి చెబితే వెతికి పెడతాడు...

ఆమె వెనుకగా గుమ్మం దగ్గర నిలబడి వున్నాడు ఆరేళ్ళ పిల్లాడు.

అది చెప్పేది కాదు తల్లీ...కానీ విలువైనది...అన్నాడతను

అరెరె...ఈయనకూడా లేరే...ముందు లోపలికి రండి. వర్షం తగ్గాక వెతుకుదురుగానీ...అందామె. వద్దమ్మా... నేను అనవసరంగా వెతుకుతున్నాను... పోయింది ఇక్కడ కాదేమో... అంటూ వెనక్కితిరిగాడు. ఒక మెరుపు మెరిసింది. ఆమె అలాగే కొద్దిసేపు చూస్తూ నిలబడిపోయింది.

లాడ్జికి చేరేసరికి పూర్తిగా తడిసిపోయాడు సూర్యనారాయణరావు. తడి బట్టలతోనే మంచంమీద వాలాడు.

కనపడ్డది కోడలే అని మనసు చెప్తోంది. కొడుకుని చూడలేకపోయానన్న బాధకన్నా మనవణ్ణి చూశానన్న ఆనందం వుంది. సుఖంగా వున్న కుటుంబాన్ని కష్టపెట్టకుండా వచ్చేసినందుకు సంతోషంగా వుంది. ఒంటరితనం మళ్ళీ మొదలైందని కలతగా వుంది. అలాగే నిద్రపోయాడు.

తెల్లవారుతుండగా ఎవరో తలుపు తట్టిన చప్పుడు. చప్పున మెలుకువ వచ్చింది తలుపు తీశాడు.

అదే ముఖం... గత కొంతకాలంగా పగలూ రాత్రి కళ్ళముందు కనిపిస్తున్న మల్లి ముఖం. అవును మల్లే...!! కాదు కాదు...మల్లి పోలికలున్న వాడు...వాడే... తన కొడుకు భాస్కర్...!! ఇంకా వెతికితే ఆ ముఖంలో తన పోలికలు వుంటాయని అనిపించిందతనికి. అయినా వెతకలేదు. ఆ ముఖంలో మల్లి కనపడటంలోనే ఆనందం వుంది.

నమస్కారమండీ...అన్నాడతను.

లోపలికిరా బాబూ...పిలిచాడు. అతను లోపలికి వచ్చాడు. కానీ కూర్చోలేదు. సూర్యనారాయణరావు చూపు మరల్చలేదు.

రాత్రి మా ఇంటివైపు వచ్చారట కదా... సీత చెప్పింది... అడిగాడతను. తలూపాడు సూర్యనారాయణరావు. ఒక్కసారి భాస్కర్ నాన్నా అంటాడేమో అని గుండె ఆత్రంగా ఎదురుచూస్తోంది. ఆ ఒక్కమాట అతను అంటే తన సమస్త వ్యాపార సామ్రాజ్యాన్ని వదిలేయడానికైనా సిద్ధంగా వున్నాడు. కొడుకు ఒప్పుకోవాలేగానీ వాళ్ళందరినీ తన కుటుంబంగా చేసుకోడానికి తహతహలాడుతున్నాడు. కానీ భాస్కర్ ఆ ఒక్కమాట అనలేదు. కొద్దిసేపు సూర్యనారాయణరావు ముఖంలోకి చూస్తూ వుండి పోయాడు.

మీ వస్తువేదో పోయిందని చెప్పారట... అది దొరికింది. మీకు ఇచ్చి వెళ్దామని వచ్చాను...అంటూ ఒక కాగితపు పొట్లం అతని చేతిలో పెట్టి గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడతను.

సూర్యనారాయణరావు చేతిలో చూసుకున్నాడు. వణుకుతున్న చేతులతో కాగితం మడతలు విప్పి చూశాడు....

బంగారు గొలుసు...!

ఆ రోజు ఒకరు బాధ్యత అనీ, మరొకరు లంచమనీ అనుకున్న దండ. ఒక్కసారిగా నిస్సత్తువ ఆవహించి మంచంమీద కూలబడిపోయాడతను.

భాస్కర్ వడివడిగా అడుగులేసుకుంటూ లాడ్జిదాటి వెళ్ళిపోయాడు. బయట మబ్బులు తొలగి సూర్యుడు బయటికి వస్తున్నాడు.

# 4
# రామా కనవేమిరా...?

“రేయ్...! వెంకటేసు... ఆ పక్కన పందిరి ఒక్కరవ్వ వొరిగింది చూడరా... ఏం తేడాలు రాకూడదు... ఏంటి ఇంటున్నావా? అది సరిచెయ్యి.“పురమాయించాను నేను.

వెంకటేసు కూలివాళ్ళకి పని పురమాయించి కూర్చున్నాడు.

“ఏరా వయసైపోయిందా అప్పుడే వగరుస్తున్నావు?” అడిగాను నేను హాస్యానికి.

“అయిపోక ఇంకా వుంటదా అయ్యగోరూ... వూహ దెలిసినకాడ నించి ఇక్కడ రామనవమికి పందిరేస్తున్నా... వయసులో వున్నప్పుడు అన్ని పందిర్లూ నేనే ఏసేవాణ్ణి మీకు తెల్వదూ...? కుంటెద్దు రెడ్డిగారింటిముందు, చిలకలవీధిలో, కరణం రామ సుబ్బయ్య గారింటిముందు, మాలపల్లెకెళ్ళే వంపుదగ్గర”

“అవున్లేరా అప్పటి రోజులవి. ఆ భోగం... ఆ దర్పం ఇప్పుడేవి? మనకీలేవు, ఆ రామయ్యకీ లేవు” అన్నాను.

“పోనిలేండి బాబు సొత్తరం పోనీకుండా మీరన్నా జరిపిస్తున్నారు...” అన్నాడు వాడు దణ్ణం పెడుతూ

నేను ముందుకు నడిచాను. అదే పందిట్లో జరిగిన శ్రీరామ నవమి వుత్సవాలు, రేడియో ఆర్టిస్టుల కచేరీలు ఒక కమ్మటి జ్ఞాపకంగానే మిగిలిపోయింది. కల్యాణ వేదిక దగ్గర శ్రీరామ పట్టాభిషేకం పటం పడి వుంది. ఏమిటో... ఈ రోజు అక్కడక్కడ చేస్తున్నారు కానీ అందులో నిబద్ధత కనపడట్లేదు. ఏదో మొక్కుబడిగా చెయ్యాలంటే చెయ్యాలంటుంది. రాముడి పటం తీసి నిలబెట్టి అప్రయత్నంగా చేతులో జోడించాను.

"రామయ్య తండ్రీ... ఏమిటయ్యా ఇది. నీకు పూజలు చెయ్యటానికి ఎందుకు అల్లల్లాడుతున్నారు? వీరికి ఇలాంటి బుద్ధి ఎందుకు పుట్టించావయ్యా?" అనుకున్నాను మనసులో.

"స్వామీ..." వెనక నించి వినపడింది. నేను అటు తిరగగానే–"నమస్కారం స్వామీ..." అంటూ ముందుకు వంగి నమస్కరించాడతను. మాసిపోయిన బట్టలతో బికారిలా ఉన్నాడతను. ఎంత దాచినా అతని గుడ్డలపైన ఉన్న చిరుగులు నా కంట పడుతూనే ఉన్నాయి. అతని మాటలు మాత్రం స్వచ్ఛంగా వున్నాయి.

"ఏమిటి?" అన్నాను నేను చిరాకుగా...!

"అయ్యా..." కొద్దిగా ఆగాడతను. క్షణకాలపు సంశయానంతరం మళ్ళీ అందుకున్నాడు–"అయ్యా... శ్రీరామనవమికి పందిట్లో ఏదైనా హరికథ చెప్దామని వచ్చాను..." అన్నాడతను. నేనతన్ని పైనించి కిందకి తేరిపార చూసాను. నా చూపుల్లోని అర్థం కనిపెట్టినట్టున్నాడు. మళ్ళీ అన్నాడు...

"నేనిదివరకే అనేకచోట్ల హరికథలు చెప్పివున్నాను స్వామీ... హరికథా విద్వాన్ విశ్వనాధ శాస్త్రిగారి సంతానాన్ని...మీ పందిట్లో ఒక్క పూట కథ చెప్పే అవకాశం ఇప్పించండి స్వామీ...బీద బ్రాహ్మణ్ణి" అన్నాడతను. చివరి మాట అంటున్నప్పుడు అతను నేల చూపులు చూసాడు.

"లేదండీ! మేమిక్కడ హరికథలేమీ చెప్పించబోవటంలేదు...మీకు తెలియని దేముంది? ఇప్పుడు హరికథలు అవీ ఎవరు వింటారు?"

"ఎందుకు వినరు స్వామీ. చక్కటి కథా, శ్రావ్యంగా పాడితే... మీకు తెలియదా శిశుర్వేత్తి పశుర్వేత్తి అనీ..."

"లేదండీ...అలాంటి ఆలోచనే లేదంటున్నాగా...పోనీ మీకేదైనా ధన సహాయం..." అంటూ చొక్కా జేబులో చెయ్యిపెట్టబోయాను.

"అయ్యో వద్దు స్వామీ...! అలాంటివి తీసుకునేవాడినే అయితే ఆకలితో ఉన్న నా పిల్లల కోసం ఉపాదానానికే వెళ్ళేవాడిని. ఏదో శ్రీరాముడి మీద భారం వేసి కళనే నమ్ముకున్నాను..."అన్నాడతను.

అతని కళ్ళలో ఆశ...మనసులో వైరాగ్యం. నా చేతుల్లో ఏముందని...?

"అయ్యా...మీ దగ్గర దాచిపెట్టి ప్రయోజనం లేదు. ఈ వ్యవహారమంతా నా కొడుకు చూసుకుంటున్నాడు. నా హయాము అయిపోయింది. ఇప్పుడు నేను ఉత్త ఉత్సవ విగ్రహాన్నే. రేపు మీరు మా ఇంటికి వస్తే వాడితో మాట్లాడవచ్చు" అన్నాను నేను.

"సరేనండీ...రేపు సాయంత్రం వస్తాను. ఈలోగా మీ అబ్బాయికి ఒక మాట చెప్పివుంచండి... మీ మేలు ఈ జన్మలో మరువలేను..." అంటూ నమస్కరించాడు. నాకు తెలుసు అది వ్యథా ప్రయత్నమని అయినా పైకి మాత్రం –

"అలాగేనండీ..." అంటూ "ఇంతకీ ఏ వూరండీ మీది?" అడిగాను.

"పక్కనే వున్న గ్రామం స్వామీ... నా భార్యా బిడ్డలు అక్కడే వున్నారు. నేను మాత్రం ఆ పందిరంత ఆశతో ఇలా పందిళ్ళు వెతుక్కుంటూ వచ్చాను..." అన్నాడతను విషాదంగా నవ్వుతూ.

నేనూ బలవంతంగా చిన్న నవ్వు మాత్రం నవ్వగలిగాను.

...

"లేదండీ హరికథలు అవీ ఏవీ పెట్టించట్లేదు... పందిరుండేది మూడురోజులే... మూడు రోజులు మూడు సినిమాలుంటాయి.అంతే" అన్నాడు నా కొడుకు.

"పోనీ ఒక్కరోజు నాకు కేటాయించండి స్వామీ... మీకు సినిమాకయ్యే ఖర్చులో సగమిప్పించండి... తీసుకుంటాను...కాదనకండి" అంటూ ప్రాధేయపడ్డాడతను.

"చూడండీ...రామనవమికి పందిరెయ్యడం మా కుటుంబంలో ఆనవాయతీ. మీకు చెప్పకూడదు కానీ నాకు మటుకు ఇదొక వ్యర్థ ప్రయాస. వీలైతే ఏదైనా రాజకీయ ప్రయోజనమన్నా వస్తుందేమో అని ఆశ. అంతేకాని ఈ పందిరి వెయ్యటం రామభక్తీ కాదు... కళా పోషణా కాదు...అర్థమైందా" అన్నాడు వాడు.

పేరు రఘురాముడైనా రామభక్తి లేని వాడి మీద కోప్పడాలో, కొడుకు ముందు నోరెత్తలేని నా పెద్దరికానికి జాలి పడాలో నాకే అర్థం కాలేదు.

"అయ్యా పండగ నిర్వహించడంలో మీ ప్రయోజనాలు మీకుంటాయి. నేను అడిగేదల్లా ఒక్క గంట అవకాశం, దూరం నుంచి వచ్చాను...వట్టి చేతుల్తో ఇంటికెలా వెళ్ళగలను? ఇంట్లో పసి పిల్లలు పస్తులున్నారు నాయనా" అంటూ రఘురాముడి పాదాల దగ్గర మోకరిల్లాడు.

ఒక కళాకారుడు, పెద్దవాడు అందునా బ్రాహ్మడు వాడి కాళ్ళు పట్టుకొని ప్రాధేయపడుతుంటే నాకు నోరు తెరిచి నా కొడుకుని తిట్టిపోయాలని వుంది. కానీ నామీద కోపంతో వచ్చినతన్ని తన్ని తరిమేస్తాడేమోనని భయంవేసి ఆగిపోయాను.

"ఏమయ్యా చచ్చేందుకు సిద్ధంగా వున్నావు. ఇంకా నువ్వు హరికథలు చెప్పగలననే అనుకుంటున్నావా? గొంతు పెగల్చుకొని పాటలు పద్యాలు పాడగలవా?" అన్నాడు వాడు నిలబడే.

అతను చివ్వున తలెత్తాడు. వాడి గొంతులో వినిపించిన వ్యంగ్యం అతనిలో పౌరుషాన్ని నిద్రలేపినట్లుందతని చూపు. గొంతు సర్దుకున్నాడు. అతనింకా రఘురాముడి పాదాల దగ్గరే వున్నాడు.

"పాడతాను స్వామీ...వినండి" అంటూ అందుకున్నాడు.

"శ్రీ రాఘవం...దశరథాత్మజ మప్రమేయం..."

నిజంగానే ఎంతో శ్రావ్యంగా వుందా గొంతు... విస్మయంగా అతనివైపు చూసాను. తన కళని, ప్రజ్ఞని అవమానించారన్న కసి అతని కళ్ళలో ప్రతిఫలిస్తోంది.

"సీతా పతిం రఘు కులాన్వయ రత్న దీపం"

అందరం రెప్పార్పకుండా అతనివైపే చూస్తున్నాము.

"ఆజాను బాహుం అరవింద దళాయతక్షం రామం...నిశాచర వినాశకరం ...నమామీ"

కథ మొదలైంది. కాళ్ళు గజ్జెలు లేవు, అయినా మోగుతున్నాయి... చేతిలో చిటికెలు లేవు కాని అవి పలుకుతున్నాయి. అతను రాముడై నడిచాడు...లక్ష్మణుడై నిలిచాడు...అంతలో సీతయై సిగ్గుపడ్డాడు, శివధనుస్సై వంగాడు, రాముడై విరిచాడు,

పూలమాలై వొదిగాడు...అంతలో జనకుడై దీవించాడు, విశ్వామిత్రుడై ఆశీర్వదించాడు. పరశురాముడై వుగ్రరూపం దాల్చాడు...ఆ క్షణం మా ఇంటి ముంగిట్లో సీతాకల్యాణం వైభవంగా జరిగింది. తలంబ్రాలు జల జలా రాలాయి...

మేమంతా నిశ్చేష్టులమై చూస్తుండిపోయాము...ఎవరితను? గత జన్మలో వాల్మీకా? శబరి మరో రూపమా? లేక లవకుశులు ఏకమై ఇలా వచ్చారా? రామాయణ ఘట్టాలు కళ్ళముందు కదులుతుంటే నా కళ్ళనుంచి జారిన కన్నీరు చెంపలపైనుండి కారుతోంది. సీతమ్మను అత్తవారింటికి పంపుతున్న జనకుడై పాడుతూ, పాడుతూ కదిలిపోయాడు. తన కూతురిని ఇలా అత్తారింటికి పంపే రోజు రావటంలేదని గుర్తుకొచ్చిందేమో... భోరున విలపించాడు...వెక్కి వెక్కి ఏడ్చాడు. అక్కడే కూలబడ్డాడు. మావాడు కొంచెం కదిలి వెనక్కి రెండడుగులేసి ఆయన భుజం మీద చెయ్యి వేశాడు. ఆయన లేచాడు...పెదాలు ఇంకా అస్పష్టంగా పలుకుతున్నాయి...కన్నీళ్ళు వర్షిస్తున్నాయి...ఏదో పరధ్యానంలో వున్నట్టు అక్కడినించి కదిలాడు.

"మాస్టారూ...పోనీ దశమినాడు వస్తారా? ఇదిగో మిమ్మల్నే..." అంటున్నాడు వాడు.

అతను వెనక్కి తిరిగలేదు...అతని గొంతులో పాట మాత్రం వినిపిస్తూనే వుంది.

"రామా కనవేమిరా... శ్రీరఘురామ కనవేమిరా..."

# "Naalnaalugula Padahaaru"
# Collection Of Telugu Short Stories



**కన్నెగంటి అనసూయ**

తెలుగు కథా సాహిత్యంలో చిరపరిచిత స్వరం కన్నెగంటి అనసూయది. లైబ్రేరియన్‌గా, లెక్చరర్‌గా, డిజైనర్‌గా పనిచేసి ప్రస్తుతం స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా సమాజ సేవ చేస్తున్నారు. ఈ క్రమంలో ఎదురైన అనుభవాలను పరిశీలనలను కథలుగా మలచి వివిధ పత్రికలలో సుమారు వందకు పైగా ప్రచురించారు. **జీవనశిల్పం, పొడిచేపొద్దు** పేర్లతో రెండు కథా సంకలనాలు, ఒక బాలల కథల సంకలనం వెలువరించారు. మరో కథాసంకలనం, కవితా సంకలనం, ఒక నవల ప్రచురణలో వున్నాయి.



**సమ్మెట ఉమాదేవి**

అటు ఉపాధ్యాయ వృత్తిని ఇటు సాహితీ ప్రవృత్తిని సామాజిక బాధ్యతలా భావించే సమ్మెట ఉమాదేవి రచయిత్రిగా పాఠకలోకానికి సుపరిచితం. సుమారు డెబ్భైకి పైగా కథలు వ్రాసి అందులో అనేక కథలకు బహుమతులు అందుకున్నారు.బాల సాహిత్యంలో విశేషంగా కృషి చేస్తున్నారు. వీరి తొలి కథా సంకలనం **అమ్మకథలు** పలువురు ప్రముఖుల ప్రశంసలందుకున్నది. వ్యాఖ్యాతగా వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్‌గా పనిచేసిన అనుభవంతో ఇప్పుడు కథలకు స్వరరూపం ఇవ్వాలని ప్రయత్నం చేస్తున్నారు.



**వడలి రాధాకృష్ణ**

దాదాపు మూడు దశాబ్దాల సాహితీ యాత్రలో మూడు వందల యాభై పైచిలుకు కథలు వ్రాసిన అపార అనుభవం వడలి రాధాకృష్ణగారిది. ఆరు కథా సంపుటాలు వెలువరించారు. రెండు పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. నాగభైరవ స్ఫూర్తి పురస్కారం, ఆంధ్ర సారస్వత సమితి పురస్కారం వంటి ఎన్నో అవార్డులు అందుకున్నారు. సమాజం పట్ల వున్న ఆరాధనని, అదే సమాజంలోని లోటుపాట్లని చూసినప్పుడు కలిగిన ఆక్రోశాన్నీ సాహితీ రూపంలో అందిస్తున్న రాధాకృష్ణ గారు ప్రస్తుతం ITC సంస్థలో సీనియర్ మేనేజర్‌గా పని చేస్తున్నారు.



**అరిపిరాల సత్యప్రసాద్**

ఆంగ్ల మాధ్యమంలో చదువులు, కార్పొరేట్ ఉద్యోగం వీటి మధ్యలో చెరగని తెలుగు భాషాభిమానం. ఇది స్థూలంగా అరిపిరాల సత్యప్రసాద్. ముప్పై ఐదేళ్ళ వయసులో పద్దెనిమిదేళ్ళ సాహితీ సేవ. దాదాపు ఎనభై కథలు, సినిమా వ్యాసాలు, సినిమా రచన ఇది వీరి రచనానుభవం. కేవలం తెలుగు భాష మీద వున్న మమకారమే రాయిస్తోందని ప్రకటించుకునే సత్యప్రసాద్, **ఊహాచిత్రం** అనే తొలి కథల సంపుటిని వెలువరించారు.

మిత్ర
ప్రచురణలు